
'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 222

గురువారం 2-11-2023



పోరాటమే ఆమె జెండా

అమెరికాలో పుట్టి పెరిగింది సుధా భరద్వాజ్. కార్మికులు, గిరిజన మహిళల వెతలు తెలుసుకొని అమెరికన్ పౌరసత్వాన్ని వదులుకుని న్యాయవాద వృత్తిని చేపట్టింది. సాధారణ జీవనం నుంచి సామాజిక కార్యకర్తగా బలహీనులకు న్యాయం చేయడానికి సమస్యలపై పోరాడుతూనే ఉంది.

-IIలో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

సాక్షి
ఫ్యామిలీ
II
హైదరాబాద్
గురువారం ॥ 2-11-2023



సుధా భరద్వాజ్

అమెరికాలో పుట్టి పెరిగింది సుధా భరద్వాజ్ అమ్మతో పాటు స్వదేశానికి వచ్చి కాన్పూర్ ఐఐటీలో చదువు పూర్తి చేసింది. కార్మికులు, గిరిజన మహిళల వెతలు తెలుసుకొని అమెరికన్ పౌరసత్వాన్ని వదులుకుని న్యాయవాద వృత్తిని చేపట్టింది. మహిళా ఖైదీల సమస్యలపై పోరాడింది. సాధారణ జీవనం నుంచి సామాజిక కార్యకర్తగా బలహీనులకు న్యాయం చేయడానికి సమస్యలపై పోరాడుతూనే ఉంది. సుధా భరద్వాజ్ జీవితం తెలుసుకుంటే స్త్రీ శక్తి మరో కోణంలో పరిచయం అవకుండా ఉండదు. ఈ విషయాలను ఆమె ప్రస్తావిస్తూ...

పోరాటమే ఆమె జెండా

సుధా భరద్వాజ్ అలుపెరుగని ప్రయాణం

అరవై ఏళ్ల క్రితం నవంబర్ 1న అమెరికాలో పుట్టాను. అమ్మానాన్నలు ఇద్దరూ పేరొందిన ఆర్థిక వేత్తలు. సామాజికంగానూ చాలా చురుకుగా ఉండేవారు. నేను పుట్టిన ఏడాదికి వారిద్దరూ భారతదేశం వచ్చారు. నాకు నాలుగేళ్ల వయసులో అమ్మానాన్నలు విడిపోయారు. అమ్మ ఒంటరిగా ఉంటూ నన్ను పెంచి, పెద్దచేసింది. అమ్మకు కేంబ్రిడ్జ్ యూనివర్శిటీ ఫెలోషిప్ రావడంతో విదేశాలకు వెళ్లిపోయాం. ఆ తర్వాత కొన్నేళ్లకు రాజస్థాన్‌లోని జెఎన్‌యూలో టీచింగ్ చేయడానికి అమ్మ స్వదేశానికి వచ్చింది. అలా అమ్మతోపాటు నేనూ వచ్చేశాను. 'సెంటర్ ఫర్ ఎకనామిక్ స్టడీస్ అండ్ ప్లానింగ్'ని స్థాపించడంలో ఆమె ముఖ్యమైన పాత్ర పోషించింది. గొప్ప గొప్ప ఆర్థిక వేత్తలతో కలిసి భారత ఆర్థిక వ్యవస్థపై లోతయిన అధ్యయనాలు చేసింది. జేఎన్‌యులో చదువుతో పాటు సామాజిక రాజకీయ అంశాలపై కూడా విద్యార్థులు చురుకుగా ఉండేవారు. నేను అలాంటి వాతావరణంలో పెరిగాను. సాహిత్య, సామాజిక కార్యక్రమాలంటే ఇష్టంగా ఉండేది. గణితంలో కూడా మంచి ఆసక్తి ఉండటంతో ఐఐటీ కాన్పూర్‌లో అడ్మిషన్ తీసుకున్నాను.

■ చదువుతూ కూలీలతో..

ఐఐటీలో కొంతమంది విద్యార్థులతో ఒక చిన్న రీసెర్చ్ టీమ్ ఏర్పడింది. కోర్సుతో పాటు పబ్లిక్ సెక్టార్, సైన్స్ అండ్ టెక్నాలజీ వరకు చదివే వాళ్లం. సామాజిక సమస్యలనూ చర్చించేవాళ్లం. అప్పుడే ప్రజా సంక్షేమానికి కృషి చేస్తేనే నా చదువుకు సార్థకత అనుకునేదానిని. కొంతమంది తోటివిద్యార్థులతో కలిసి కూలీల మధ్య పని చేయడం ప్రారంభించాం. ఓసారి ఉన్నావ్‌లోని ఓ ఫ్యాక్టరీలో కార్మికులపై పోలీసులు కాల్పులు జరిపిన ఘటన చోటుచేసుకుంది. మా టీమ్‌తో కలిసి నిజనిర్ధారణ కోసం వెళ్లాం. కష్టపడి పనిచేసే వారితో అనుబంధం అలా మొదలైంది. అక్కడ కార్మికులతో కలిసి వారి పాటలు, సంగీతం ఆస్వాదించేదాన్ని. కాన్పురియా యాసలో మాట్లాడటం, పాడడం అంటే చాలా ఇష్టం ఉండేది. ఆ విధంగా కార్మికుల ఉద్యమంతో చాలా ప్రభావితమయ్యాను. 1982లో ఆసియా క్రీడలు జరగడానికి ముందు ఢిల్లీలో ఫ్లై ఓవర్లు, స్టేడియం నిర్మిస్తున్నారు. ఈ పనులకోసం ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లోని మారుమూల ప్రాంతాల నుంచి పేద కూలీలను రప్పించి, వారిని శిబిరాల్లో ఉంచారు. అయితే, వారు తమ ఇంటికి వెళ్ళడానికి టికెట్లు కూడా కొనలేని విధంగా చాలా తక్కువ కూలీ ఇచ్చేవారు. నాకెందుకో వారిని క్యాంపులో బంధించినట్లు అనిపించింది. ఆ తర్వాత 1984లో సిక్కుల ఊచకోత, భోపాల్ గ్యాస్ విషాదం దిగ్భ్రాంతికి గురిచేశాయి. సమాజంలో మార్పు తీసుకు రావాలనే సంకల్పం అప్పుడే నా మనసులో బలంగా మారింది.

■ నా దేశం కోసం అమెరికా పౌరసత్వం వదులుకున్నా

నాకు 21 ఏళ్లు వచ్చినప్పుడు, నేను పుట్టుకతో పొందిన అమెరికన్ పౌరసత్వాన్ని వదులుకోవాలని అమ్మతో కలిసి అమెరికన్ ఎంబసీకి వెళ్లాను. నేను పౌరసత్వాన్ని వదులుకుంటున్నానని చెబితే ఆశ్చర్యపోయారు. అందుకు తగిన ఫారమ్ కోసం వెతికితే, దొరకలేదు. 'వారం తర్వాత రండి. ఈ నిర్ణయం తీసుకునేముందు మీ ఇంట్లో ఎవరినైనా అడిగారా...?' వంటి ప్రశ్నలు వేశారు. అంటే ఇంట్లో మగవారికి తెలియకుండా అమెరికన్ పౌరసత్వాన్ని వదులుకోవడానికి వచ్చామని వారు అనుకున్నారు. యుఎస్ పౌరసత్వాన్ని వదులుకున్న తర్వాత, హోం మంత్రిత్వ శాఖలో భారతీయ పౌరసత్వం కోసం దరఖాస్తు చేశాను.



■ కార్మిక ఉద్యమాల్లో భాగంగా..

మరోవైపు దేశంలో అలజడి కొనసాగుతోంది. మిల్లు కార్మికుల ఉద్యమాలు ఊపందుకున్నాయి. ఈ ఉద్యమాల్లోనే అద్భుతమైన కార్మిక నాయకుడు శంకర్ గుహ నియోగి పేరు మొదటి సారిగా తెలిసింది. 'ఛత్తీస్‌గఢ్ ముక్తి మోర్చా' ద్వారా కార్మికుల ఆర్థిక అవసరాలను పెంచడంతోపాటు, వారికోసం పాఠశాలలు, ఆసుపత్రులను నడుపుతూ వారి మధ్య ఉంటూ వ్యసనాల నుండి బయటపడటానికి సహాయం చేస్తున్నాడు. జాతీయ భద్రతాచట్టం కింద అతణ్ణి అరెస్టు చేసినప్పుడు, అతని విడుదల కోసం విద్యార్థులుగా మేం పోరాడాం. విడుదలైన తర్వాత ఆయనను కలిశాం. 1986 నాటికి, నేను 'ఛత్తీస్‌గఢ్ ముక్తి మోర్చా'తో పనిచేయాలని నిర్ణయించుకున్నాను. భిలాయ్ సమీపంలోని రాజహారా గనులలో పని చేసే పిల్లలకు చదువు నేర్పించడం ప్రారంభించాను. కొంతకాలం తర్వాత, భిలాయ్‌లో కార్మిక చట్టాలను అమలు చేయడానికి భీకర పోరాటం ప్రారంభమైంది. 16 పెద్ద కంపెనీలు 4,200 మంది కార్మికులను తొలగించాయి. కార్మికులను తిరిగి పనిలో చేర్చడానికి ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు జరిగాయి. కొంతమంది కార్మికులు చనిపోయారు. వారి కుటుంబాలతో కలిసి ఎండ వానలు లెక్కచేయకుండా గడిపాం.

■ న్యాయం కోసం పోరాటం ...

కార్మికుల అభ్యర్థన మేరకు, నేను 2000 సంవత్సరంలో నా న్యాయవిద్యను పూర్తి చేసి వారి కోసం న్యాయపోరాటం ప్రారంభించాను. కూలీలు, గిరిజనులు, మహిళలు అనే తేడా లేకుండా వారి కోసం చేసిన చట్టాలు సక్రమంగా అమలు కాకపోవడం చూశాను. నిరసన తెలిపితే వారిపై కేసులు పెడతారు. ఆ తర్వాత కొంత మంది తోటి లాయర్లతో కలిసి జన్-హిత్ పేరుతో గ్రూప్‌ని ప్రారంభించాను. ఆ తర్వాత భూసేకరణ, అటవీ హక్కులు, పర్యావరణ సంబంధిత సమస్యలకు సంబంధించిన అనేక కేసులను వాదించడం ప్రారంభించాం. కేసులన్నీ కార్పొరేట్ల పైనే ఉన్నాయి. అప్పటికి చాలామంది శత్రువులను కూడగట్టుకున్నానని గ్రహించాను. కానీ, ఏ మాత్రం భయపడకుండా బలహీనుల కోసం నా గొంతు పెంచుతూనే ఉన్నాను.

■ ఆశ సన్నగిల్లిన సందర్భాలు..

2006లో దంతెవాడలో ఐదుగురు మహిళలపై సామూహిక అత్యాచారం జరిగిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. ఆ మహిళల కేసుపై పోరాడేందుకు న్యాయవాది ఎవరూ సిద్ధంగా లేరు, నేను నా సహోద్యోగులతో కలిసి వారికి న్యాయం చేసే బాధ్యతను తీసుకున్నాను. బాధితుల వాంగ్మూలం నమోదు చేసేందుకు దంతెవాడకు 150 కి.మీ దూరంలోని కొంటకు వెళ్లాల్సి వచ్చింది. ఛత్తీస్‌గఢ్ భాషలో, కొంట అంటే మూల అని అర్థం, ఆ ప్రదేశం నిజానికి ఛత్తీస్‌గఢ్‌లోని ఒక మూల. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ ప్రారంభమవుతుంది. జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ప్యూన్ సైకిల్‌పై ఎక్కి వస్తారంటే అక్కడి పరిస్థితిని అంచనా వేయవచ్చు. బాధితులు గోండీ భాషలో తమ బాధలను వివరిస్తుంటే అక్కడ ఉన్న ప్యూన్ అనువాదకుడిగా మారాడు. అప్పుడే అత్యాచారం కేసు నమోదు చేశారు. ఆ తర్వాత కేసు దంతెవాడకు బదిలీ అయింది. ఆ తర్వాత మహిళలపై ఒత్తిడి తెచ్చి కేసులు ఒక్కొక్కటిగా వెనక్కి తీసుకునేలా చేశారు. అప్పుడు న్యాయంపై ఆశ చచ్చిపోయిందనిపించింది.

■ గర్భస్రావం తర్వాత దత్తత కుమార్తె

రాజహారలో ఉన్నప్పుడు 8 నెలల గర్భిణిని. ఆ రోజు చాలా వర్షం, మెరుపులు, కడుపు నొప్పితో బాధపడుతున్నాను. మా యూనియన్ చెందిన షాహీద్ హాస్పిటల్ కి నడుచుకుంటూ వెళుతుండగా రక్తం కారుతున్నట్లు అనిపించింది. ఎలాగోలా ఆసుపత్రికి చేరుకుని అపస్మారక స్థితికి చేరుకోవడంతో ఆపరేషన్ అయింది. స్పృహ వచ్చాక గర్భస్రావం అయిందని తెలిసింది. ఈ ప్రమాదం జరిగిన తర్వాత, మళ్లీ గర్భం ప్రమాదకరమనుకున్నాను. అందుకే ఒకమ్మాయిని దత్తత తీసుకున్నాను. కూతురు డిగ్రీ చదువు కోసం డబ్బు సంపాదించాలనే ఉద్దేశ్యంతో ఢిల్లీకి వచ్చి 58 ఏళ్ల వయసులో నేషనల్ లా యూనివర్సిటీలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా తొలిసారి రెగ్యులర్ ఉద్యోగంలో చేరాను. ఏడాది సాఫీగానే గడిచింది. కానీ, ఉద్యమకారిణిగా నన్ను అరెస్టు చేసి జైలుకు పంపారు. చాలా పోరాటం తర్వాత తను గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది. జైలులో ఉన్నప్పుడు కూతురిని కలవాలని చాలా తపించేదాన్ని. నెలకు ఒకసారి ఉత్తరానికి సమాధానం వచ్చేది. కలవడానికి వీలయ్యేది కాదు. జైలులో ఉన్న మూడేళ్లు మహిళా ఖైదీల సమస్యలను వింటూ, వారి కోసం వర్క్ చేశాను. సామాజిక కార్యకర్తలకు వ్యక్తిగత జీవితం లేదన్నది నిజం. వారు ఇంటికీ, సామాజిక జీవితానికీ మధ్య సమన్వయం చేసుకోలేరు. దీపం కింద చీకటి అనే సామెత నిజం అవుతుంది. ముఖ్యంగా మహిళా సామాజిక కార్యకర్తలు మరిన్ని సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. నా జైలు డైరీ 'ఫ్రం ఫాన్సీ యార్డ్'లో నేను అలాంటి చాలామంది మహిళల కథలను పంచుకున్నాను. సమాజంలోని ఈ దురాచారాలకు వ్యతిరేకంగా నేను ఎప్పుడూ పోరాడుతూనే ఉన్నాను'' అని వివరిస్తారు ఈ సామాజిక కార్యకర్త.

కిచెన్‌టిప్స్

మిరియాలు, ముద్దకర్పూరాలను సమపాళల్లో తీసుకుని పొడిచేయాలి. ఈ మిశ్రమంలో కొద్దిగా టూత్‌పేస్టు, కొద్దిగా ఫేస్‌పౌడర్ వేసి కలపాలి. చివరిగా నాలుగు వెల్లుల్లి గర్భాలను మెత్తగా నూరి అందులో కలపాలి. ఈ మిశ్రమాన్ని బొద్దింకలు తిరిగే ప్రాంతాల్లో రాస్తే బొద్దింకలు లోపలికి రావు. చూద్దామన్నా ఇంట్లో ఎక్కడా కనిపించవు.





వంటింట్లో వాడే టవల్స్, మసిబట్టలు జిడ్డుపట్టి ఒక పట్టాన వదలవు. వీటిని ఉతకడానికి పెద్దగా శ్రమపడనక్కర్లేదు. వేడినీటిలో కాస్తంత షాంపు కలపాలి. ఈ నీటిలో జిడ్డుపట్టిన టవల్‌ను నానబెట్టాలి. 20 నిమిషాల తరువాత బ్రష్‌తో రుద్దుతూ ఉతికితే జిడ్డు, దుర్వాసన పోయి టవల్ శుభ్రంగా మారుతుంది. వారానికి ఒకసారి కిచెన్ టవల్స్‌ను ఇలా ఉతికితే జిడ్డుగా అనిపించవు.

బ్యూటిప్స్



రెండు టీస్పూన్ల కొబ్బరి నూనెలో టీ స్పూను పసుపు, టేబుల్ స్పూను పెరుగు, టేబుల్ స్పూను శనగపిండి, రెండు టీస్పూన్ల టొమాటో రసం, రెండు టీస్పూన్ల నిమ్మరసం వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖం, మెడ, చేతులకు రాసి ఐదుని మిషాలు రుద్దాలి. తరువాత నీటితో కడిగితే ట్యాన్ మొత్తం పోతుంది.



స్ట్రెయిట్‌గా... సిల్కీగా...

గ్లాసు నీటిలో రెండు టీస్పూన్ల అవిసె గింజలు, రెండు టీ స్పూన్ల బియ్యప్పిండి వేసి పదిని మిషాలు మరిగించాలి. తరువాత వడగట్టి...పేస్టులాంటి పదార్థాన్ని తీసుకోవాలి. దీనిలో టేబుల్ స్పూను కొబ్బరి నూనె వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని మాడు నుంచి చివర్లవరకు పట్టించాలి. గంట తరువాత కడిగేయాలి. ఈ ప్యాక్ జుట్టుని స్ట్రెయిట్‌గా, సిల్కీగా మారుస్తుంది.

విశేషం

ఆనాటి మహానగరాలు మన చెంతకు వచ్చేలా..

మన పార్వతీశం... అదేనండీ బారిష్టర్ పార్వతీశం మొగల్తూరు నుంచి ఇంగ్లాండ్‌కు వెళతాడు.

ఆ కాలంలో మొగల్తూరు ఎలా ఉండేదో?

మహీధర సాహిత్యంలో ముంగండ అగ్రహారం నిండుగా కనిపిస్తుంది. అప్పటి అగ్రహారం జనాభా ఎంత? అచార, వ్యవహారాలు ఏమిటి?

మన తెలుగు సాహిత్యం అనే కాదు భారతీయ సాహిత్యంలో ఎన్నో పట్టణాలు, ఊళ్లు కనిపిస్తాయి. సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక కోణంలో వాటి గురించి డేటా బేస్ తయారు చేస్తే ఎలా ఉంటుంది?

'బ్రహ్మాండంగా ఉంటుంది' అనే భావనతో 'ది సిటీస్ ఇన్ ఫిక్షన్' అనే ప్రాజెక్ట్‌ను చేపట్టారు దివ్య రవీంద్రనాథ్, అపూర్వ సైనీ...

ప్రయాణాలలో సాహిత్య ప్రయాణాలు వేరు. వీసాలతో పని లేకుండా ప్రపంచంలోని ఏ నగరానికైనా రెక్కలు కట్టుకొని ఎగిరిపోవచ్చు. భారతీయ సాహిత్యంలో కాల్పనిక నగరాలతో పాటు వాస్తవిక నగరాలు ఎన్నో ఉన్నాయి. సాహిత్యం అనే రెక్కలతో ఎన్నో కథల్లో ఎన్నో నగరాలకు ఎగురుకుంటూ వెళ్లిపోవచ్చు.

ఒక పుస్తకంలో ఒక నగరం ఒకే కోణంలో కనిపించవచ్చు. అలాంటి నగరాల గురించి అన్ని కోణాలలో దర్శించగలిగే సమాచార నిధిని నిర్మించడానికి నడుం కట్టారు దివ్య రవీంద్రనాథ్, అపూర్వ సైనీ.

రచయితలు, పాఠకులు, పరిశోధకులు, విద్యావేత్తలకు ఉపకరించే సమాచారం 'ది సిటీస్ ఇన్ ఫిక్షన్' లో ఉంటుంది.

దక్షిణ ఆసియా కేంద్రంగా ఈ ప్రాజెక్ట్ చేపట్టారు. దీనిలో భాగంగా మొదట మన దేశాన్ని ఎంచుకున్నారు.

పుస్తకంలో ఒక నగరాన్ని ఎలా వర్ణించారు అనేదానితో పాటు ఆ నగరానికి సంబంధించి అప్పటి జనాభా, అరుదైన జ్ఞాపకాలు, సామాజిక, ఆర్థిక, రాజకీయ, అర్బన్ ప్లానింగ్, పర్యావరణం... ఇలా సవివరమైన సమాచారం ఉంటుంది.

ముఖ్యంగా ఈ తరం విద్యార్థులు ఆనాటి నగరాలను వివిధ కోణాలలో చూడవచ్చు.

'కాల్పనిక సాహిత్యం అంటే ఎంతో ఇష్టం. ఎన్నో పుస్తకాలు చదివాను. సాహిత్యంలో ఉండే నగరాలపై ఆసక్తి ఉండేది. అమృత మహలే రాసిన మిల్క్ టీత్‌లో హౌసింగ్ నుంచి రియల్ ఎస్టేట్ వరకు తొంభైల నాటి ముంబై కనిపిస్తుంది. ఇలా చెబుతూ పోతే నగరాల చుట్టూ అల్లుకున్న ఎంతో సాహిత్యం ఉంది' అంటున్న దివ్య రవీంద్రనాథ్ బెంగళూరులోని 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ సెటిల్‌మెంట్స్'లో పరిశోధకురాలు.

'ఫలాన పుస్తకాలు మాత్రమే అని పరిమితి లేదు. అన్ని రకాల పుస్తకాలను మా ప్రాజెక్ట్‌లోకి తీసుకున్నాం. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా ఎన్నో లైబ్రరీలు, బుక్‌స్టోర్స్‌కు వెళ్లాను. అదొక మహాసముద్రం అనిపించింది' అంటున్న అపూర్వ సైనీ దిల్లీ యూనివర్శిటీలో చదువుకుంది. ఆమె రైటర్, ఎడిటర్, ట్రాన్స్‌లేటర్.

ప్రాజెక్ట్ మొదలు కాగానే దక్షిణ ఆసియా నలుమూలల నుంచి సలహాలు, సూచనలు వస్తున్నాయి. ఈ ఆన్‌లైన్ ఆర్కైవ్ ప్రాజెక్ట్‌కు ఎవరైనా తమ వంతు సహకారం అందించవచ్చు.


అపూర్వ సైనీ, దివ్య రవీంద్రనాథ్

డీజేవాలీ దీదీ

డిస్కోనైట్ అయినా, పెళ్లి బరాత్, దావత్ ఏదైనా డీజే మోత మోగి పోవాల్సిందే. నచ్చిన పాటను అడిగి మరీ పెట్టించుకుని స్టెప్పులతో ఊగిపోతుంది నేటి యువతరం. వెరైటీగా మిరుమిట్లు గొలిపే డ్రెస్ వేసుకుని, ఉత్సాహం నింపే పాటలను పెడుతూ ఊగిపోతుంటాడు డీజే. అబ్బాయిలు మాత్రమే డీజేగా కనిపిస్తుంటారు. కానీ డీజేవాలి దీదీ పురుషులకు ఏ మాత్రం తగ్గకుండా డీజేను దంచి కొడుతోంది. తన రీమిక్స్ బీట్స్‌తో మ్యూజిక్ లవర్స్‌ను ఉర్రూతలూగిస్తూ, సరికొత్త బాటలో నడిచేందుకు నేటి యువతరానికి మార్గం చూపుతోంది డీజే రింక్.




స్నేహల్ షా

డీజే రింక్ మరెవరో కాదు 38 ఏళ్ల స్నేహల్ షా. గుజరాత్‌లో పుట్టినప్పటికీ ముంబైలో పెరిగింది. షాకు సంగీతం అంటే ఎంతో ఇష్టం. బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో డిగ్రీ పూర్తయ్యాక... కామర్స్‌లో పీజీ చేసింది. మార్కెటింగ్ కంపెనీలో చేరింది. ఉద్యోగం చేస్తున్నప్పటికీ స్నేహల్ మనసంతా సంగీతంపైనే ఉండేది. దీంతో.. మంచి మంచి పాటలను వినడం, వాటన్నింటినీ తన మ్యూజిక్ ఇన్‌స్ట్రుమెంట్స్‌లో భద్రపరుచుకోవడం అలవాటుగా మార్చుకుంది. ఇలా స్నేహల్ కలెక్ట్ చేసిన వాటిలో బాలీవుడ్ పాటలు కోకొల్లలు. సంగీతంపై ఉన్న మక్కువతో సౌండ్ ఇంజినీరింగ్ డిప్లొమా కూడా చేసింది.

డీజే రింక్‌గా...

ఒకసారి స్నేహల్ పార్టీకి వెళ్లింది. అక్కడ ఎంతో ఉత్సాహమైన డీజే పాటలు వస్తున్నాయి. తనకిష్టమైన పాటను ప్లేచేయమని డీజేను అడిగింది. అందుకు ఆ డీజే ప్లేచేయడం కుదరదు అన్నాడు. దీంతో తనే ప్లే చేసుకుంటాను అని అడిగి పాటను ప్లే చేసింది. అప్పటి నుంచి తను కూడా డీజేగా మారాలనుకుని.. ప్రముఖ డీజే జో అజెరెడో, డీజే సుకేతు దగ్గర డీజే శిక్షణ తీసుకుంది. నైపుణ్యాలన్నింటిని ఔపోసన పట్టాక 2015లో డీజే రింక్‌గా మారింది. వివిధ రకాల క్లబ్స్‌లో పని చేస్తూ 'డీజేయింగ్' సంబంధించిన అప్‌డేటెడ్ టెక్నాలజీ గురించి తెలుసుకునేది. స్నేహల్ ఇష్టాన్ని తల్లిదండ్రులు వెన్నంటి ఉండి ప్రోత్సహించేవారు. తల్లిదండ్రులు ముద్దుగా పిలుచుకునే 'రింకు' పేరునే ... డీజే రింక్‌గా మార్చుకుని డీజే ప్రపంచంలోకి అడుగుపెట్టింది.

పదమూడులో పాపులర్...

డీజే రింక్ ఈడీఎమ్ ''ఎలక్ట్రానిక్ డ్యాన్స్ మ్యూజిక్''లో కష్టపడి నైపుణ్యం సాధించింది. ముఖ్యంగా హిప్ హాప్, బాంగ్రా పాటలను ప్లేచేయడంలో అందె వేసిన చెయ్యిగా పేరుగాంచింది. పండుగల్లో రీమిక్స్ చేసిన పాటలను కూడా ప్లే చేసేది. అవి అందరినీ ఆకర్షిస్తుండడంతో డీజే రింక్ 2013లో బాగా పాపులర్ అయ్యింది. దీంతో భారతదేశంలో బాలీవుడ్ పాటలను మిక్స్ చేసే తొలి మహిళా డేజేగాను, ఇండియాలోని టాప్ -22 డీజేలలో ఒకటిగా నిలిచింది. పురుషుల ఆధిపత్యం కొనసాగే డిజే సౌండ్స్‌లో రింక్ ఏమాత్రం భయపడలేదు. ప్రారంభంలో పురుష డీజేలతో కలిసి పనిచేయడం కష్టం అయినప్పటికీ.. తనని తాను నిరూపించుకుని తన కలను నిజం చేసుకుంది.

అందర్నీ బీట్ చేస్తూ...

మంచి మంచి బీట్స్‌ను అందిస్తూ తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపుతో పాటు అనేక రికార్డులను బద్దలు కొడుతోంది స్నేహల్ షా. మల్టీటాలెంటెడ్ సింగర్, రీమిక్సర్, పెర్‌ఫార్మర్‌గా అనేక ప్రశంసలు అందుకుంటోంది. సోనీ మ్యాక్స్ ఐపీఎల్ సీజన్ -6లో పాల్గొన్న ఒక్కగానొక్క మహిళా డీజే రింక్ కావడం విశేషం. గత పదేళ్లుగా ప్రపంచంలోని డీజేలతో పోటీ పడుతూ టాప్-100 జాబితాలో ఇండియా తరపున తనకంటూ స్థానం కల్పించుకుంది. 2023 సంవత్సరానికి గాను ఏషియా టాప్-50 డిజేల జాబితాలో ఐదో స్థానంలో నిలిచింది రింక్. అంతేగాక ఇటీవల 'బెస్ట్ వెడ్డింగ్ డీజే' అవార్డును అందుకుంది.

శ్రావ్యమైన బీట్స్‌తో సాగిపోతున్న డిజే రింక్ ఎంతోమంది మహిళలు, అమ్మాయిలకు ఆదర్శంగా నిలుస్తోంది. అనాదిగా వస్తోన్న పద్ధతులను దాటుకుని తమని తాము నిరూపించుకోవచ్చని తన బీట్స్‌తో చక్కగా వినిపిస్తోంది. ఇప్పటిదాక రెండు వేల బాలీవుడ్ పాటలను రీమిక్స్ చేసింది. డిజే స్కూల్ నడుపుతూ మరింతమంది డీజేలను తయారు చేస్తోంది. "డీజే రింక్స్ సౌండ్ ఫ్యాక్టరీ" పేరిట యూ ట్యూబ్ ఛానల్ నడుపుతోంది. అమృతారావ్, జాన్ అబ్రహమ్, కరణ్ గ్రోవర్, ఇలియానా డిక్రూజ్ వంటి బాలీవుడ్ సెలబ్రెటీలతో స్టేజ్ పంచుకుంది."ద వే యూ లైక్ మి" పేరిట రింక్ విడుదల చేసిన తొలి ఆల్బమ్‌కు మంచి ఆదరణ లభించి, బాగా పాపులర్ అయ్యింది.

సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 222

గురువారం 2-11-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'



కివీస్ నెత్తిన సఫారీ పిడుగు!

190 పరుగులతో ఓడిన న్యూజిలాండ్. డసెన్, డికాక్ సెంచరీలు -14లో



బ్రహ్మోస్ క్షిపణి పరీక్ష సక్సెస్

క్షిపణి నిర్దేశించిన పరామితులను అందుకుందన్న నేవీ -6లో

న్యూస్‌రీల్

ఏపీలో ఉద్యోగాలు వచ్చేశాయ్!



ప్రభుత్వ శాఖల్లో పోస్టుల భర్తీకి ఈ నెలలో వరుసగా నోటిఫికేషన్లు జారీ చేయనున్నట్లు ఏపీపీఎస్సీ చైర్మన్ గౌతమ్ సవాంగ్ వెల్లడించారు. వీటిల్లో 900 వరకు గ్రూప్‌–2, వందకుపైగా గ్రూప్‌–1 పోస్టులున్నాయి.

- వివరాలు 12లో▶

చినుకు చుక్క రాలలేదు!



నైరుతి సీజన్ సెప్టెంబర్‌తో ముగిసినప్పటికీ.. రుతుపవనాల నిష్క్రమణ సమయమైన అక్టోబర్‌లో వర్షాల నమోదుకు బాగానే అవకాశాలుంటాయి. కానీ అక్టోబర్‌లో మాత్రం తీవ్ర వర్షాభావం నెలకొంది.

- వివరాలు 13లో▶

రాములమ్మ దారెటు ?



బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యురాలు విజయశాంతి ప్రస్తుతం ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది రాజకీయవర్గాల్లో చర్చనీయాంశమవుతోంది. తాను ఈ సారి అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలబడడం లేదని సాక్షికి పంపిన వాట్సాప్ మెసేజ్‌లో ఆమె స్పష్టంచేశారు.

- వివరాలు 13లో▶

మరాఠా రిజర్వేషన్లకు ఓకే



విద్యా సంస్థలు, ఉద్యోగాల్లో మరాఠాలకు రిజర్వేషన్లు ఇవ్వడానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ప్రకటించారు. రిజర్వేషన్ల అంశంపై మరాఠా ప్రజలంతా సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేశారు.

- వివరాలు 6లో▶

ఇదండీ సంగతి



.. మన పొత్తయితే.. పక్కానే కదా!



సీఎం కేసీఆర్ రాజశ్యామల యాగం

- ఎర్రవల్లిలోని ఫామ్‌హౌజ్‌లో అంకురార్పణ..
- విశాఖ శారదా పీఠాధిపతుల ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహణ

- వివరాలు 2లో▶

సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని తమ ఫామ్‌హౌజ్‌లో విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సమక్షంలో నిర్వహించిన రాజశ్యామల యాగంలో సీఎం కేసీఆర్ దంపతులు.

మీరే గెలిపించాలి

బీఆర్ఎస్‌ను అధికారంలో కొనసాగించే బాధ్యతను దళితజాతి తీసుకోవాలి

సత్తుపల్లి, ఇల్లెందు ప్రజా ఆశీర్వాద సభల్లో బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్

- ఓట్ల కోసం దళితబంధు తెచ్చిన అనడం మూర్ఖత్వం
- ఎన్నికల కోసమే అయితే మొదటి టర్మ్ చివరిలోనే తెచ్చేవాళ్లం
- పద్ధతిగా అమలు చేసేందుకే రెండోసారి గెలిచాక పథకం తెచ్చాం
- విపక్ష నేత భట్టి నియోజకవర్గంలోని చింతకాని మండలంలోనూ వందశాతం అమలు చేశాం..
- మూడు రంగుల జెండా, ఎర్ర జెండా, పచ్చ జెండాల వాళ్లవి అనవసర పెడబొబ్బలు
- మోదీ సొంత రాష్ట్రం గుజరాత్‌లో దళితులపై దాడులు జరుగుతున్నాయి
- కాంగ్రెస్ గెలిస్తే వచ్చేది దళారులు, పైరవీకారుల రాజ్యమే..
- ప్రజలు అన్నీ ఆలోచించి ఓటు వేయాలన్న ముఖ్యమంత్రి



మేం స్వార్థంగా ఆలోచించలేదు..

దళిత బంధు మొదలుపెట్టాక హుజూరాబాద్ నియోజకవర్గంలో వంద శాతం అమలు చేశాం. ఆ తర్వాత ప్రతిపక్ష నేత భట్టి విక్రమార్క నియోజకవర్గంలోని చింతకాని మండలంలో వంద శాతం కుటుంబాలకు ఇచ్చాం. ఈ పథకం కావాలని మాకు మల్లు భట్టి విక్రమార్క దరఖాస్తు ఇవ్వలేదు. స్వార్థంగా మేం ఆలోచించలేదు. ప్రతిపక్ష నేత ఉన్న నియోజకవర్గంలోనూ అమలుచేశాం. మా నిజాయితీకి ఇది గీటురాయి. ఇవాళ పెడబొబ్బలు పెడుతున్న మూడు రంగుల జెండాలు, ఎర్ర జెండాలు, పచ్చ జెండాలు దళితులకు ఏం చేశాయి? అరచేతికి బెల్లం పెడతా.. చక్కెర గోలీలిస్తా.. చాక్లెట్లు ఇస్తా.. అన్నట్టుగా ఎప్పటికప్పుడు ఎన్నికల ముందు బులిపించి, మురిపించి దశాబ్దాల తరబడి ఓటుబ్యాంక్‌గా వాడుకున్నారు.

సాక్షి ప్రతినిధి, ఖమ్మం/సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: రాష్ట్ర ఆదాయం పెరుగుతుంటే.. ప్రజాసంక్షేమ కార్యక్రమాలు పెంచుకుంటూ వెళ్తున్నామని, అందులో భాగంగా వచ్చిందే దళితబంధు అని బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు చెప్పారు. దళితుల ఓట్ల కోసమే ఈ పథకం తెచ్చామని కొందరు విమర్శిస్తుండటం సరికాదని.. అలాంటి చిల్లర రాజకీయాలు తాము చేయబోమని స్పష్టం చేశారు. అలా చేసే వాళ్లమే అయితే మొదటి టర్మ్ చివరిలో పెట్టేవాళ్లమని.. కానీ పక్కా ప్రణాళికతో, పద్ధతిగా అమలు చేసేందుకు రెండోసారి గెలిచాక ఈ కార్యక్రమం మొదలుపెట్టాలని నిర్ణయం తీసుకున్నామని వివరించారు. అండగా నిలిచిన బీఆర్ఎస్‌ను అధికారంలో కొనసాగించే బాధ్యతను దళిత జాతి తీసుకోవాలని పిలుపునిచ్చారు. బుధవారం ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గం కల్లూరులో, భద్రాద్రి జిల్లా

మిగతా 2వ పేజీలో ▶

అధికారంలోకి రాగానే ఓబీసీ గణన

కల్వకుర్తి సభ, జడ్చర్ల, షాద్‌నగర్ కార్నర్ మీటింగుల్లో రాహుల్

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఓబీసీలకు తగిన ప్రాధాన్యత లేదు
- ఓబీసీలకు శక్తి ఇవ్వడానికి బీజేపీ, బీఆర్ఎస్‌లు ఇష్టపడవు
- బీజేపీ దేశంలో విద్వేషాన్ని పెంచితే, నేను ప్రేమ, ఆప్యాయతను పెంచాను
- తెలంగాణలో కేసీఆర్‌కు బైబై ఖాయమన్న కాంగ్రెస్ అగ్రనేత
- కల్వకుర్తిలో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి పరామర్శ
- నేడు భూపాలపల్లి జిల్లాలో పర్యటన..

నేడు మేడిగడ్డకు రాహుల్

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్ / సాక్షి, నాగర్‌కర్నూల్/కల్వకుర్తి/ సాక్షి, రంగారెడ్డి జిల్లా: తెలంగాణలో, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఓబీసీ జనగణన చేపడతామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చెప్పారు. దేశంలో 50 శాతానికి పైగా ఉన్న ఓబీసీలు దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్నారని తెలిపారు. అయితే దేశంలో ఎంతమంది ఓబీసీలు, దళితులు, గిరిజనులు, ఆదివాసీలు ఉన్నారో ఎవరూ చెప్పలేని పరిస్థితి ఉందన్నారు. బీజేపీ పాలనలో దేశాన్ని నడిపించేది లోక్‌సభ, రాజ్యసభలోని ఎంపీలు కాదని, కేవలం 90 మంది అధికారుల చేతుల్లోనే ఈ ప్రభుత్వం ఉందని చెప్పారు. వీరిలో ముగ్గురు మాత్రమే ఓబీసీలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఓబీసీ అధికారులకు తగిన ప్రాధాన్యత లేదని.. ఓబీసీలకు శక్తి ఇవ్వడానికి బీజేపీ, బీఆర్ఎస్ ఇష్టపడవంటూ

మిగతా 5వ పేజీలో ▶



బుధవారం జడ్చర్లలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న రాహుల్ గాంధీ. చిత్రంలో రేవంత్, భట్టి, ఉత్తమ్, మాణిక్‌రావ్ ఠాక్రే, వంశీచంద్

కాంగ్రెస్‌లోకి వివేక్

వివేక్, ఆయన కుమారుడు వంశీకృష్ణలకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన రాహుల్

- బరువైన హృదయంతో బీజేపీకి రాజీనామా చేస్తున్నా: వివేక్
- కేసీఆర్ కుటుంబ, రాక్షస పాలన అంతమే లక్ష్యంగా కాంగ్రెస్‌లో చేరానని వెల్లడి
- వివేక్ కుటుంబం చేరికతో కాంగ్రెస్‌కు వెయ్యి ఏనుగుల బలం: రేవంత్‌రెడ్డి

5లో



సంచలనం కోసమే ఎంపీపై హత్యాయత్నం

- ప్రాథమిక విచారణలో నిందితుడి వెల్లడి.. 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించిన కోర్టు 2లో
- వివరాలు వెల్లడించిన సిద్దిపేట సీపీ శ్వేత



ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్, ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నుంచి వైఎస్సార్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ పురస్కారం అందుకుంటున్న కరణం మల్లీశ్వరి

అసామాన్యులకు సత్కారం

గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్ విజయమ్మ చేతుల మీదుగా వైఎస్సార్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుల ప్రదానం 12లో

ఢిల్లీ దొరలకు, తెలంగాణ ప్రజలకు యుద్ధం



- ఇందులో తెలంగాణ ప్రజలదే విజయం
- భిక్కనూరు, దోమకొండ సభల్లో మంత్రి కేటీఆర్
- తెలంగాణను నాటి నుంచి నేటి దాకా కాంగ్రెస్ దొరలే వంచించారు.. చివరకు వీపు మోత మోగిస్తారని తెలంగాణ ఇచ్చారే తప్ప ప్రేమతో కాదు
- గుజరాత్ దొంగ పైసలు బీజేపీ వాళ్లకు వస్తున్నయి.. వాళ్లిచ్చేవి తీసుకోండి.. కారు గుర్తుకు ఓటెయ్యండి

- వివరాలు 2లో▶



మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్

రాజస్తాన్‌లో బీజేపీకి ఆధిక్యం

టైమ్స్ నౌ– ఈటీజీ సర్వేలో వెల్లడి

తెలంగాణలో బీఆర్ఎస్‌కు మొగ్గు

ఐదు రాష్ట్రాల ఎన్నికలకు ముందు టైమ్స్ నౌ చానల్‌– ఈటీజీ రీసెర్చ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఒపీనియన్ పోల్‌లో మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో కాంగ్రెస్‌కే ఆధిక్యం ఉన్నట్లు వెల్లడైంది. మధ్యప్రదేశ్‌లో పోటాపోటీ ఉన్నప్పటికీ కాంగ్రెస్‌కు స్వల్ప మొగ్గు కనపడుతోంది. తెలంగాణలో అధికార భారత రాష్ట్ర సమితికే మొగ్గు కనపడుతోందని సర్వే పేర్కొంది.

- వివరాలు 6లో▶




సత్తుపల్లి, మొట్లగూడెంలో బుధవారం జరిగిన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు



పూజలో పాల్గొన్న సీఎం కేసీఆర్ దంపతులు. చిత్రంలో స్వరూపానందేంద్ర స్వామి, రుత్వికులు

క్లుప్తంగా...

కేసీఆర్‌కు హ్యాట్రిక్ ఖాయం

పిట్టల రవీందర్, పల్లె రవికుమార్, దూదిమెట్ల



సాక్షి, హైదరాబాద్: ప్రజల కోసం సీఎం కేసీఆర్ ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేశారని, బీఆర్ఎస్ పార్టీ మూడోసారి విజయం సాధిస్తుందని వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు ధీమా వ్యక్తం చేశారు. బుధవారం హైదరాబాద్‌లో ఫిషరీస్ ఫెడరేషన్, కల్లుగీత కార్పొరేషన్, గొర్రెల, మేకల అభివృద్ధి సంస్థల చైర్మన్లు పిట్టల రవీందర్ ముదిరాజ్, పల్లె రవికుమార్‌గౌడ్, దూదిమెట్ల బాలరాజు యాదవ్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎన్నికల్లో రూపొందించాల్సిన అంశాలపై చర్చించారు. రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటించాలని, ప్రభుత్వం ఇచ్చిన సంక్షేమ, అభివృద్ధి ఫలాలను ప్రజలకు వివరించాలని సూచించారు. అనేక రంగాల్లో తెలంగాణ దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని చైర్మన్లు పేర్కొన్నారు.

'30న కర్బన ఉద్గారాలపై దుబాయ్‌లో భేటీ'

సాక్షి, హైదరాబాద్: సీవోపీ–ఐపీసీసీ (కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్–ఇంటర్ గవర్నమెంటల్ ప్యానెల్ ఆన్ క్లైమేట్ చేంజ్)కి సంబంధించి ముఖ్యమైన కాన్ఫరెన్స్ ఈనెల 30న దుబాయ్‌లో జరగనుందని పర్యావరణ వేత్త పురుషోత్తంరెడ్డి వెల్లడించారు. డిసెంబర్ 1 నుంచి 12 దాకా యావత్ ప్రపంచం వాతావరణంలో చోటుచేసుకుంటున్న పెనుమార్పులపై ఈ కాన్ఫరెన్స్‌లో చర్చించనున్నట్లు తెలిపారు. 2015లో జరిగిన 'ప్యారిస్ అగ్రిమెంట్'ఈ అంతర్జాతీయ భేటీ సందర్భంగా సమీక్షకు రానుందని పేర్కొన్నారు. అప్పుడు అమెరికా, భారత్‌తో సహా అన్ని దేశాలు చేసిన వాగ్దానాలేంటి? వాటిపై ఏ మేరకు ముందుకు వెళ్లగలిగారు? సాధించిన పురోగతిపై అన్ని దేశాలు స్వచ్ఛంద ప్రకటన చేయనున్నాయన్నారు. కర్బన ఉద్గారాలపై నియంత్రణ, కార్బన్ ఫుట్ ప్రింట్‌ను ఏ మేరకు తగ్గించారు? వాస్తవంగా సాధించిన ఫలితాలేంటో వెల్లడి చేయాల్సి ఉంటుందని పురుషోత్తంరెడ్డి వివరించారు.

వచ్చేనెలలో 'యశ్వంత్‌రావ్ కేల్కర్ యువ పురస్కారం'

సాక్షి, హైదరాబాద్: సేవ, పర్యావరణ, విద్యా రంగాల్లో అత్యుత్తమ సహకారం అందించిన వారికి 'యశ్వంత్‌రావ్ కేల్కర్ యువ పురస్కారం'ప్రదానం చేయనున్నట్లు ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ వెల్లడించారు. డిసెంబర్‌లో 7 నుంచి 10వ తేదీ వరకు జరిగే ఏబీవీపీ జాతీయ మహాసభల్లో ఈ పురస్కారాలు అందిస్తారని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. యశ్వంత్‌రావు కేల్కర్ యువ పురస్కారం కింద రూ.ఒక లక్షల నగదు, జ్ఞాపికను అందజేస్తారన్నారు.

కరీంనగర్ కలెక్టర్ ల్యాప్‌టాప్ చోరీ

కరీంనగర్ క్రైం: కరీంనగర్ కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ల్యాప్‌టాప్ చోరీ జరిగినట్లు కరీంనగర్ వన్‌టౌన్ సీఐ రవికుమార్ తెలిపారు. గత నెల 29న కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఇటీవల బదిలీ అయిన కలెక్టర్ బి.గోపికి సంబంధించిన ల్యాప్‌టాప్, డిజిటల్ కీ, పెన్‌డ్రైవ్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతోపాటు ఒక బ్యాగును గుర్తు తెలియని వ్యక్తి చోరీ చేశాడు. గత నెల 30న గోపి హైదరాబాద్ వెళ్లే సమయంలో పరిశీలించగా.. తన వస్తువులు కనిపించలేదు. కలెక్టరేట్ సిబ్బంది సీసీ టీవీ ఫుటేజీ పరిశీలించగా ఒకరు బ్యాగు పట్టుకొని వెళ్తున్నట్లు గుర్తించారు. క్యాంపు కార్యాలయంలో జరిగిన చోరీపై కార్యాలయం సూపరింటెండెంట్ రామ్మోహన్ మంగళవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

ఇథనాల్ ప్రాజెక్టును ఎత్తివేయాలి

మావోయిస్టుల డిమాండ్

సాక్షి, హైదరాబాద్/చర్ల: నారాయణపూర్ జిల్లా చిత్తనూరు వద్ద ప్రభుత్వం నిర్మించిన ఇథనాల్ పరిశ్రమను వెంటనే ఎత్తివేయాలని సీపీఐ (మావోయిస్టు) తెలంగాణ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టును తొలగించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరసనలో భాగంగా ప్రజలపై జరిగిన దాడికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. బూటకపు ఎన్నికలు బహిష్కరించాలంటూ తమ పార్టీ పిలుపునిచ్చిందని, ఛత్తీస్‌గఢ్‌లో త్వరలో జరిగే ఎన్నికల్లో అధికారులెవరూ విధులు నిర్వర్తించి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని మావోయిస్టు పార్టీ పశ్చిమ బస్తర్ డివిజన్ కమిటీ కార్యదర్శి మోహన్ బుధవారం లేఖ విడుదల చేశారు.

మీరే గెలిపించాలి..

▶ మొదటి పేజీ తరువాయి

ఇల్లెందు మండలం మొట్లగూడెంలో నిర్వహించిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్ మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''రాష్ట్రం ఏర్పడినప్పుడు ఇక్కడ కరెంటు లేదు, నీళ్లు లేవు. రెండు, మూడు నెలలు మేధోమథనం చేసి.. ఒక్కో పథకాన్ని అమలు చేసుకుంటూ సంక్షేమం, అభివృద్ధిలో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లాం. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్, నీరు, రైతుబంధు, ధరణి వంటివి తెచ్చాం. రాష్ట్ర విభజనతో మనం ఎట్లా బతుకుతామని కొందరు మాట్లాడారు. పరిపాలన వస్తదా అన్నారు. అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి అయితే తెలంగాణ చీకటి అవుతుందన్నారు. మరి ఈ రోజున మనం అందరికన్నా ముందున్నాం. హెలికాప్టర్‌లో వస్తూ కిందికి చూస్తే లక్ష్మి అమ్మవారు నేలపై నాట్యం చేసినట్టు కనిపించింది. ఒకప్పుడు అన్నమో రామచంద్రా అని అల్లాడిన నేలపై ధాన్యపు రాశులు కనిపిస్తున్నాయి.

ప్రధాని మోదీకి అహంకారం!

ప్రధాని నరేంద్ర మోదీకి అహంకారం ఉంది. ఎల్ఐసీ, రైల్వే, విమానాశ్రయాలు మొత్తం ప్రైవేటైజేషన్ అంటున్నరు. అదే పిచ్చిలో కరెంట్ రంగాన్ని కూడా ప్రైవేటైజేషన్ చేస్తామంటున్నరు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టాలన్నడు. నేను చచ్చినా పెట్టనని చెప్పిన. మన రాష్ట్రంలో ప్రభుత్వ రంగంలోనే కరెంట్ ఉంది. ఏడాదికి రూ.25 వేల కోట్లు భారం పడినా నష్టం భరించామే కానీ రైతుల మోటార్లకు మీటర్లు పెట్టలేదు.

విచక్షణతో ప్రజలు ఓటేయాలి..

ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌తోపాటు కాంగ్రెస్, బీజేపీ, ఎల్లయ్య, పుల్లయ్య బరిలో ఉంటారు. వ్యక్తులతో పాటు వారి చరిత్ర ఏమిటి? వారి కార్యదక్షత ఏమిటి? అనుభవం ఏమిటనేది ప్రజలు చూడాలి. వారిని గెలిపించడం ద్వారా తమ నియోజకవర్గానికి ఏం జరుగుతుందనేది చూడాలి. అలాంటి వ్యక్తుల వెనుక ఏ పార్టీ ఉంది, ఆ పార్టీ చరిత్ర, వైఖరి, దృక్పథం ఏమిటనేది ప్రజలు గమనించాలి. ఎవరో చెప్పారని, మా కులం వాడు నిల్చున్నాడని ఓటు వేయడం సరికాదు. ఒక కులాన్ని ద్వేషించడం కూడా సరికాదు. కూరగాయలు కొనేప్పుడే కాదు.. కుండనో, కూజానో కొనేప్పుడు కూడా చేతితో తడిమి చూసి మంచిదా, కాదా అని పరిశీలిస్తాం. అలాంటిది మీ జీవితాలను మార్చే ఓటు హక్కును వినియోగించుకునే అంశంలో మరింతగా ఆలోచన చేయాలి.

దళితబంధును పుట్టించిందే కేసీఆర్..

దేశంలో దళితబంధు పథకాన్ని పుట్టించిన మొగోడు కేసీఆర్. కేసీఆర్ రాక ముందు ఇలాంటి పథకం ఉందా? ఈ పథకం పెట్టాలని నన్ను ఎవరూ అడగలేదు. అది పెట్టినప్పుడు ఎన్నికలు లేవు. దేశానికి 70 ఏళ్ల కింద స్వాతంత్ర్యం వస్తే.. ఇప్పటికీ దళితుల పరిస్థితి బాగోలేదు. వివక్షకు, అణచివేతకు గురవుతున్నారు. భారత సమాజం సిగ్గుతో తలదించుకోవాల్సిన అంశం. జాషువా వంటి మహాకవి కూడా బాధపడి, గాయపడి దళితుల గురించి కావ్యాలు రాశారు. ఉత్తర భారతంలో రోజూ దళితుల మీద దాడులు జరుగుతున్నాయి. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, బిహార్, రాజస్తాన్, ప్రధాని సొంత రాష్ట్రం గుజరాత్‌లో కూడా ఈ దాడులు భయంకరంగా ఉన్నాయి. ఇలాంటివెన్నో ఆలోచన చేసి నేను సిద్దిపేట ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే దళిత చైతన్యజ్యోతి అనే కార్యక్రమం పెట్టుకున్నా.. దాని నుంచి పుట్టిందే దళితబంధు.

బీఆర్ఎస్‌ను అధికారంలో కొనసాగించాలి

సత్తుపల్లి నియోజకవర్గాన్ని దళితబంధు కింద తీసుకున్న కొద్దిరోజుల తర్వాత ఎన్నికల కోడ్ వచ్చింది. కొందరు దుర్మార్గులు దళితబంధు లాంటి పథకాలను ఆపాలని ఫిర్యాదులు ఇచ్చారు. మిషన్ భగీరథ, రైతు బంధు, దళితబంధు పథకాలు ఎన్నికల కోసం పెట్టామా? మొత్తం తెలంగాణ దళిత సమాజానికి అప్పీల్ చేస్తున్నా. మీ కోసం మంచి చేసిన, మిమ్మల్ని జాగృత పరిచే, మీ వికాసాన్ని మనసు నిండా కోరుకునే కేసీఆర్ లాంటి నాయకుడ్ని పోగొట్టుకోవద్దని మనవి చేస్తున్నా. బీఆర్ఎస్‌ను అధికారంలో కొనసాగించే బాధ్యతను దళిత జాతి తీసుకోవాలని కోరుతున్నాను.

పైరవీకారుల రాజ్యం వస్తుంది

రాహుల్ గాంధీకి ఎద్దు లేదు, ఎవుసం ఎరుకలేదు. ఎవరో సన్నాసి రాసిస్తే అజ్ఞానంతో మాట్లాడుతున్నాడు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణిని తీసేస్తామంటున్నాడు. మళ్లీ వీఆర్వోలు, పహాణీ నకళ్లు, ఎమ్మార్వో కార్యాలయం, మళ్లీ వ్యవసాయ కార్యాలయం చుట్టూ రైతులు తిరగాలా? కాంగ్రెస్‌కు ఓటేస్తే దళారుల రాజ్యం, పైరవీకారుల రాజ్యం వస్తుంది. మీ భూమి మీద పెత్తనం ప్రభుత్వానికి వస్తుంది. అదే బీఆర్ఎస్‌కు ఓటేస్తే మీ భూమి మీద పెత్తనం మీకే ఉంటుంది. తెలంగాణ ప్రజలే బీఆర్ఎస్ పార్టీకి బాసులు. అదే కాంగ్రెస్ పార్టీ ఏం చేయాలన్నా ఢిల్లీ వైపు చూడాలి. వాళ్ల స్విచ్ అక్కడే ఉంటుంది. ఇంతకు ముందు అరవై ఏళ్లు రాష్ట్రాన్ని పాలించి ప్రజలను వారి ఖర్మానికి వదిలేసింది. ఇప్పుడు మళ్లీ మోసం చేసేందుకు వస్తోంది..'' అని కేసీఆర్ పేర్కొన్నారు. ఈ సభల్లో మంత్రులు పువ్వాడ అజయ్, సత్యవతి రాథోడ్, ఎంపీలు నామా నాగేశ్వరరావు, బండి పార్థసారథిరెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, మాలోతు కవిత, ఎమ్మెల్సీలు తాతా మధు, మధుసూదనాచారి, రఘోత్తమరెడ్డి, ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వరరావు, రేగా కాంతారావు, మెచ్చా నాగేశ్వరరావు, రాములునాయక్ తదితరులు పాల్గొన్నారు.

నాకు కూడా అంత అహంకారం లేదు

ఇటీవల బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావులను ఉద్దేశించి సీఎం కేసీఆర్ ఘాటుగా విమర్శలు చేశారు.''ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఒకరిద్దరు దుర్మార్గులు ఉన్నారు. ఒకరు బీఆర్ఎస్ నుంచి నిలబడిన వారిని అసెంబ్లీ గేటు తొక్కనివ్వమని అంటున్నారు. తెలంగాణ తెచ్చి, సీఎంగా ఇన్ని పనులు చేసిన నేను కూడా అంత అహంకారంగా రానివ్వ, లేవనివ్వ, వాడిని కూర్చోనివ్వ అని మాట్లాడలేదు. నాలుగు పైసలు జేబులోకి రాగానే ఇంత అహంకారమా? ఖమ్మం జిల్లా దీన్ని సహిస్తదా? ఈ డబ్బు రాజకీయాలు, అహంకార రాజకీయాలు ఇంకా ఎన్ని రోజులు?'' అని మండిపడ్డారు.

సీఎం కేసీఆర్ రాజశ్యామల యాగం

- ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌లో అంకురార్పణ
- సంకల్పం చెప్పి ప్రారంభించిన కేసీఆర్ దంపతులు
- విశాఖ శారదా పీఠాధిపతుల ఆధ్వర్యంలో రెండ్రోజులు నిర్వహణ
- కేసీఆర్ కుటుంబంతోపాటు యావత్ రాష్ట్రానికి ఇది ఆశీర్వాదమన్న పీఠాధిపతి స్వరూపానందేంద్రస్వామి

మర్కూక్ (గజ్వేల్): బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లిలోని తమ ఫామ్‌హౌస్‌లో బుధవారం రాజశ్యామల యాగాన్ని నిర్వహించారు. ఉదయం విశాఖ శారదా పీఠాధిపతులు స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్ర స్వాముల ఆధ్వర్యంలో యాగానికి అంకురార్పణ చేయగా.. సీఎం కేసీఆర్ దంపతులు యాగ సంకల్పం చెప్పి పండితులకు దీక్షా వస్త్రాలను ప్రదానం చేశారు. తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 170 మంది రుత్విక్కులు ఈ యాగంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వరూపానందేంద్ర స్వామి మాట్లాడుతూ.. రుద్ర, చండీ, నవదుర్గ హోమాలు అన్నిచోట్లా జరుగుతాయని రాజశ్యామల యాగం విశిష్టమైనదని తెలిపారు. రాజులతోపాటు సామాన్యులను అనుగ్రహించే మహాశక్తివంతమైన రాజశ్యామల యాగం కఠినమైన బీజాక్షరాలతో కూడినదని.. సీఎం కేసీఆర్ కుటుంబానికే కాకుండా యావత్ రాష్ట్రానికి ఇది ఆశీర్వాదం వంటిదని వివరించారు.

శాస్త్రోక్తంగా అంకురార్పణ చేసి..

తెలుగు రాష్ట్రాల సర్వతోముఖాభివృద్ధి కోరుకుంటూ సీఎం కేసీఆర్ తలపెట్టిన ఈ యాగానికి రాజశ్యామల సహిత సుబ్రహ్మణ్యేశ్వర యాగంగా నామకరణం చేసినట్టు రుత్విక్కులు తెలిపారు. ఫామ్‌హౌస్‌లో శాస్త్రోక్తంగా ప్రారంభమైన యాగం రెండు రోజుల పాటు జరగనుంది. తొలి రోజున ఉదయం గోపూజ అనంతరం కేసీఆర్ దంపతులు యాగశాల ప్రవేశం చేశారు. గణపతిపూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రసనతో అంకురార్పణ చేశారు. అనంతరం పీఠాధిపతి స్వరూపానందేంద్ర స్వామికి కేసీఆర్ దంపతులు సాష్టాంగ నమస్కారం చేసి.. గురు ఆజ్ఞ తీసుకొని యాగాన్ని ప్రారంభించారు. రుత్విక్కులు కేసీఆర్ దంపతులతో యాగ సంకల్పం చెప్పించారు. ఈ సందర్భంగా అమ్మవారిని నవదుర్గ అవతారంలో ప్రత్యేకంగా అలంకరించారు. ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ యాగం నిర్విఘ్నంగా కొనసాగాలని ముక్కోటి దేవతలను ప్రార్థిస్తూ అస్త్రరాజార్చన, కర్కరీయ స్థాపన నిర్వహించారు. అఖండ స్థాపన అనంతరం యాగశాలలో అగ్నిని ప్రతిష్ఠించారు.

రైతులు బిచ్చగాళ్లలా కనిపిస్తున్నారా?

కాంగ్రెస్‌పై మంత్రి నిరంజన్‌రెడ్డి విమర్శ



సాక్షి, హైదరాబాద్: రైతుబంధు, రైతుబీమా ప్రపంచంలోనే అత్యుత్తమ పథకాలుగా అంతర్జాతీయ సంస్థలు ప్రశంసిస్తుండగా, కాంగ్రెస్ నేతలు మాత్రం ఈ పథకాలను దుబారా అంటూ వ్యాఖ్యలు చేస్తున్నారని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుబంధు భిక్ష అంటున్న కాంగ్రెస్ పార్టీకి, రైతులు భిక్షగాళ్లలా కనిపిస్తున్నారా అని ప్రశ్నించారు. బుధవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ పాలనలో బ్యాంకు అప్పుల వసూలుకు రైతుల ఇంటి తలుపులు తీసుకెళ్లిన ఘటనలు ఉండేవని, కానీ కేసీఆర్ ప్రభుత్వం మాత్రం రైతుబంధు ద్వారా 11 విడతల్లో రూ.72,815 కోట్లు రైతుల ఖాతాలో జమ చేసిందని వెల్లడించారు. కొల్లాపూర్ సభలో కాంగ్రెస్ నేతలు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ.. పాలమూరు ద్వారా కృష్ణా జలాలను ఎత్తిపోసి రైతుల పొలాలకు అందిస్తున్న ఘనత బీఆర్ఎస్ సర్కారుకే దక్కుతుందన్నారు. ధాన్యం కొనుగోలు, మిషన్ కాకతీయ ద్వారా చెరువుల పునరుద్ధరణ, సాగునీటి శిస్తురద్దు, వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్తు, రుణ మాఫీ ద్వారా రైతులకు బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. నకిలీ విత్తనాలను అరికట్టడం ద్వారా విత్తన రంగంలో దేశానికే ఆదర్శంగా నిలిచామని చెప్పారు. తలసరి ఆదాయంలో తెలంగాణ దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో ఉందన్నారు. నిందలు, వ్యక్తిగత విమర్శలతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాదన్నారు. రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను తెలంగాణ ప్రజలను పట్టించుకోరన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రెడ్డి, సాట్స్ మాజీ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీసీలను మోసం చేస్తోంది..

కాంగ్రెస్‌పై పొన్నాల ఫైర్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో అధిక సంఖ్యలో ఉన్న బీసీల మద్దతు పొందడంలో కాంగ్రెస్ పార్టీ విఫలమైందని, ఆ పార్టీ కేవలం ఒక వర్గానికి చెందిన పార్టీగానే మిగిలిపోయిందని బీఆర్ఎస్ నేత పొన్నాల లక్ష్మయ్య విమర్శించారు. సర్వేలను అడ్డుపెట్టుకుని కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తోందన్నారు. పార్టీ నేతలు దాసోజు శ్రవణ్, ఎర్ర శేఖర్, నందికంటి శ్రీధర్‌తో కలిసి పొన్నాల లక్ష్మయ్య బుధవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో బీసీ నేతలు అవమానాలకు గురవుతున్నారన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్‌గాంధీ టికెట్ల కేటాయింపులో బీసీలకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పినా చివరకు అడ్డగోలుగా మోసం చేశారని విమర్శించారు. బీసీ నేతలు టికెట్లు ఆశిస్తున్న స్థానాల్లో ఇతరులకు టికెట్లు ఇచ్చారన్నారు.

40 టికెట్లను అమ్ముకున్నారు

కాంగ్రెస్ నేతలు ఉదయ్‌పూర్ డిక్లరేషన్‌ను తుంగలో తొక్కి కొత్తగా చేరిన వారికి 40 టికెట్లు అమ్ముకున్నారని పొన్నాల ఆరోపించారు. బీసీ డిక్లరేషన్, బీసీ గర్జన ఏమైందని నిలదీశారు. బీసీలకు ఇవ్వాల్సిన టికెట్లను అమ్ముకున్న కాంగ్రెస్ నేతలు బీసీల ప్రయోజనాల కోసం ఎలా పనిచేస్తారని ప్రశ్నించారు. చంద్రబాబు అనుచరులు రేవంత్‌తో సహా అందరూ కాంగ్రెస్‌లో చేరారని, కోమటిరెడ్డి సోదరులు, రేవంత్‌పై వచ్చిన ఆరోపణలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఎన్నడూ 50 శాతానికి పైగా స్థానాల్లో గెలవలేదని, కాంగ్రెస్ ప్రజా మద్దతు కోల్పోయిందని అన్నారు.

సంచలనం కోసమే ఎంపీపై హత్యాయత్నం

- ప్రాథమిక విచారణలో నిందితుడు వెల్లడి
- నిందితుడికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్
- వివరాలు వెల్లడించిన సిద్దిపేట సీపీ శ్వేత



సిద్దిపేటకమాన్: సంచలనం సృష్టించడం కోసమే దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై హత్యాయత్నానికి పాల్పడినట్లు నిందితుడు తమ ప్రాథమిక విచారణలో అంగీకరించాడని సిద్దిపేట పోలీసు కమిషనర్ శ్వేత బుధవారం తెలిపారు. ఎంపీపై దాడి ఘటనకు సంబంధించి గ్రామానికి చెందిన నర్సింహులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీపీ తెలిపారు. నిందితుడు వివిధ ఆన్‌లైన్ చానళ్లలో పనిచేస్తున్నట్లు తెలిసిందని, విలేకరిని అని చెప్పుకుంటూ బెదిరించి వారి వద్ద నుంచి డబ్బులు వసూలు చేసేవాడన్నారు. ఎంపీపై దాడి చేయాలనే ఉద్దేశంతో వారం రోజుల క్రితం దుబ్బాక మార్కెట్‌లో నిందితుడు కత్తిని కొనుగోలు చేశాడన్నారు. ఎంపీ ఏయే గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారనే విషయమై సోషల్ మీడియా ద్వారా సోమవారం సూరంపల్లి గ్రామానికి వస్తున్నట్లు తెలుసుకున్నాడని చెప్పారు. ఈ క్రమంలో దాడికి పాల్పడినట్లు తెలిపారు. నిందితుడు దాడి చేయడానికి ఎవరైనా ప్రోత్సహించారా? ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా?.. అనే కోణాల్లో విచారణ జరిపి వివరాలు వెల్లడిస్తామన్నా రు. ఆస్పత్రిలో చికిత్స అనంతరం డిశ్చార్జి కావడంతో నిందితుడిని అదుపులోకి తీసు కున్నామని, బుధవారం అరెస్ట్ చేసి గజ్వేల్ కోర్టులో హాజరుపర్చగా 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు తెలిపారు.

15న మాజీ సర్పంచ్‌ల చలో హైదరాబాద్

పంజగుట్ట (హైదరాబాద్): మాజీ సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలపై అన్ని పార్టీలు స్పందించి పరిష్కరిస్తామని హామీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15న చలో హైదరాబాద్ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ మాజీ సర్పంచ్‌ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బొడ్డు దేవయ్య, వ్యవస్థాపక అధ్యక్షులు సొదాని భూమన్న యాదవ్‌లు తెలిపారు. బుధవారం సోమాజిగూడలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, ఎంతోమంది మాజీ సర్పంచులు వారి సొంత ఆస్తులు గ్రామాభివృద్ధికి ఖర్చుచేశారని చెప్పారు. మాజీ సర్పంచులకు ప్రతీనెల 10 వేల పింఛన్ ఇవ్వాలని, ఉచిత బస్‌పాస్, హెల్త్‌కార్డులు, ఇల్లు లేని మాజీ సర్పంచులకు ఒక గుంట భూమి, నిర్మాణానికి 10 లక్షలు ఇవ్వాలని కోరారు. ఏ పార్టీ తమ డిమాండ్లను నెరవేరుస్తామ ని హామీనిస్తుందో వారికే మా మద్దతు అన్నారు.

ఢిల్లీ దొరలకు తెలంగాణ ప్రజలకు యుద్ధం

- ఇందులో తెలంగాణదే విజయం
- భిక్కనూరు, దోమకొండ సభల్లో మంత్రి కేటీఆర్
- తెలంగాణను నాటి నుంచి నేటి దాకా కాంగ్రెస్ దొరలే వంచించారు
- బీజేపీ వాళ్లిచ్చేవి తీసుకోండి.. కారు గుర్తుకు ఓటెయ్యండి



కేసీఆర్ నామినేషన్ కోసం కేటీఆర్‌కు రూ.50 వేల చెక్కును అందజేస్తున్న కోనాపూర్ గ్రామస్తులు

సాక్షి, కామారెడ్డి: 'ఇది దొరలకు, తెలంగాణ ప్రజలకు మధ్యన యుద్ధం అని రాహుల్‌గాంధీ అంటుండు. రాహుల్ సవాల్‌ను స్వీకరిస్తున్నం. ఈ యుద్ధం ఢిల్లీ దొరలకు, తెలంగాణ ప్రజలకు మధ్యనే. ఇందులో తెలంగాణ ప్రజలదే విజయం..'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ అన్నారు. కామారెడ్డి జిల్లాలోని భిక్కనూరు, దోమకొండ మండల కేంద్రాల్లో బుధవారం నిర్వహించిన ఎన్నికల ప్రచార సభల్లో కేటీఆర్ మాట్లాడారు. 'తెలంగాణ ప్రజలను నాటి నుంచి నేటి దాకా కాంగ్రెస్ దొరలే వంచనకు గురిచేశారు. 1952లో తెలంగాణను ఆంధ్రలో కలపొద్దని మనోళ్లు కొట్లాడితే, రాహుల్‌గాంధీ ముత్తాత నెహ్రూ ఉద్యమాన్ని అణచివేయడంలో భాగంగా ఐదుగురిని పొట్టన పెట్టుకున్నాడు. 1956లో 'అమాయకపు అమ్మాయి తెలంగాణకు గడసరి అబ్బాయి ఆంధ్రతో బలవంతపు పెళ్లి'అని నెహ్రూ ఆనాడే చెప్పారు. అప్పుడే తెలంగాణను ప్రత్యేక రాష్ట్రంగా గుర్తించాలని ఎన్నో ఉద్యమాలు నడిచాయి. 1968లో తెలంగాణ కోసం పెద్ద ఎత్తున విద్యార్థులు ఉద్యమం లేవదీస్తే, రాహుల్‌గాంధీ నాయనమ్మ ఇందిరాగాంధీ 370 మందిని కాల్చి చంపిన చరిత్రను తెలంగాణ సమాజం మరిచిపోలేదు. 1971లో తెలంగాణ ప్రజలంతా రాష్ట్రం కోసం 11 మంది ఎంపీలను గెలిపించి ఢిల్లీకి పంపితే ఆరు సూత్రాల పథకం అంటూ ఆగం జేసి ఎంపీలను గొర్రెలను లాక్కున్నట్టు లాక్కున్న చరిత్ర కూడా ఇందిరదే. చివరకు దేశంలో ఎమర్జెన్సీ విధించింది కూడా కాంగ్రెస్ పార్టీ, ఇందిరాగాంధీయే. ప్రత్యేక రాష్ట్రం కోసం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ సమాజం పోరాటం చేస్తుంటే, 2004లో రాష్ట్రం ఇస్తామన్న హామీతో పొత్తు కుదుర్చుకుని అధికారం చేపట్టిన తర్వాత.. రాహుల్ తల్లి సోనియా గాంధీ మాట తప్పి ఉద్యమాన్ని నీరుగార్చే ప్రయత్నం చేశారు. 2004 నుంచి 2014 దాకా రాష్ట్ర ఉద్యమాలను అణచివేసి, వందలాది మంది యువతను బలితీసుకున్న బలిదేవత సోనియాగాంధీ. చివరకు రాష్ట్రం ఇయ్యకపోతే తెలంగాణ ప్రజలు ఊకోరు, వీపు మోత మోగిస్తరని భయపడి రాష్ట్రం ఇచ్చారే తప్ప ప్రేమతో కాదు..'అని కేటీఆర్ చెప్పారు.

ప్రజలే విజయం సాధిస్తారు..

'ఢిల్లీలో మరో దొర నరేంద్ర మోదీతోనూ కొట్లాడుతున్నం. తెలంగాణ రాష్ట్రానికి ఎలాంటి మేలు చేయకపోగా, అన్నింటా అడ్డంకులు సృష్టిస్తున్న బీజేపీతో పోరాటం కొనసాగిస్తూనే ఉన్నాం. గుజరాత్ దొంగ పైసలు బీజేపీ వాళ్లకు వస్తున్నయి. ఆ పైసలతోనే సలాకలు, సిమెంటు ఇస్తున్నరు. అవన్నీ మన పైసలే.. తీసుకోండ్రి.. ఓటు మాత్రం కారుకు వెయ్యండ్రి..'అని కేటీఆర్ ప్రజలను కోరారు.

రేవంత్‌రెడ్డిని గంప కింద కమ్ముడే..

'తెలంగాణ ఉద్యమకారుల మీద తుపాకీ ఎక్కుపెట్టిన రైఫిల్‌రెడ్డి (రేవంత్‌రెడ్డి) కొడంగల్‌కు వస్తవా లేకుంటే తననే కామారెడ్డికి రమ్మంటవా అని కేసీఆర్‌ను సవాల్ చేస్తున్నడు. తెలంగాణ ద్రోహులకు ఓటుతో గుణపాఠం చెప్పేందుకు కామారెడ్డి ప్రజలు రెడీగా ఉన్నారు. గంప గోవర్ధన్ పలుమార్లు షబ్బీర్ అలీని గంప కింద కమ్మిండు. ఇప్పుడు రేవంత్‌రెడ్డిని కూడా గంప కింద కమ్ముడే. కాంగ్రెస్ వస్తే నాలుగు వేల పింఛన్ ఇస్తదంటే ఎవరు నమ్ముతరు. 55 ఏళ్ల అధికారం ఇస్తే రూ.200 పింఛన్ ఇచ్చేందుకే మనసు రాలేదు. అసుంటోళ్లు ఇప్పుడు నాలుగువేలు ఇస్తరంట. కానీ కేసీఆర్ రెండు వేల పింఛన్‌ను ఐదు వేలకు చేస్తా అంటుండు. అందుకే అవ్వ, తాతలు కేసీఆర్ పెద్దకొడుకని మూడోసారి గెలిపించేందుకు తయారుగ ఉన్నరు..'అని కేటీఆర్ చెప్పారు.

కేసీఆర్ నామినేషన్ కోసం రూ.50 వేలు

కామారెడ్డి నుంచి ఎన్నికల బరిలో నిలుస్తున్న కేసీఆర్ నామినేషన్ ఖర్చుల కోసం కేసీఆర్ అమ్మ పుట్టిన ఊరు కోనాపూర్ గ్రామస్తులు సర్పంచ్ చెప్యాల నర్సవ్వ ఆధ్వర్యంలో రూ.50 వేలను మంత్రి కేటీఆర్‌కు అందించారు. ఊరంతా ఏకపక్షంగా ఓట్లు వేసి గెలిపిస్తామని చెప్పారు. సభల్లో ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గంప గోవర్దన్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్ వాహనం తనిఖీ



కేటీఆర్ వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎన్నికల సిబ్బంది

మనోహరాబాద్ (తూప్రాన్): మంత్రి కేటీఆర్ వాహనాన్ని బుధవారం పోలీసులు తనిఖీ చేశారు. ఎన్నికల నేపథ్యంలో కామారెడ్డి జిల్లాలో ప్రచారానికి వెళ్తున్న మంత్రి కేటీఆర్ కారును మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కాళ్లకల్ శివారులో చెక్ పోస్టు వద్ద ఎన్నికల అధికారులు చెక్ చేశారు.

నాడు కాంగ్రెస్.. నేడు బీజేపీ దొరలతో పోరాటం: కేటీఆర్

బీఆర్ఎస్‌లో చేరిన గొట్టిముక్కల వెంగళరావు



గొట్టిముక్కలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: నాడు కాంగ్రెస్ దొరలతో నేడు బీజేపీ దొరలతో తెలంగాణ తరపున పోరాడుతున్నామని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు మంత్రి కె.తారకరామారావు అన్నారు. తెలంగాణ అసెంబ్లీకి జరుగుతున్న ఎన్నికలను ఢిల్లీ దొరలకు, తెలంగాణ ప్రజలకు మధ్యపోటీగా అభివర్ణించారు. ఢిల్లీ అహంకారానికి ఎన్నటికీ తెలంగాణ తలవంచదు, దించదన్నారు. కాంగ్రెస్ పార్టీ నేత గొట్టిముక్కల వెంగళరావు బుధవారం తెలంగాణభవన్‌లో బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా ఆయనకు కేటీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీపై తీవ్ర విమర్శలు చేశారు. దొరల తెలంగాణకు, ప్రజల తెలంగాణ పోటీ అని రాహుల్ గాంధీ అంటున్నారని, ఢిల్లీ దొరలతో ఎప్పటి నుంచో తెలంగాణ ప్రజలకు వైరం ఉందని బదులిచ్చారు. రాహుల్ తాత నెహ్రూ తెలంగాణను బలవంతంగా ఆంధ్రాలో కలిపారని.. అలా కలపడంవల్ల తెలంగాణ 56 ఏళ్లు గోసపడ్డదన్నారు. రాహుల్ గాంధీ నాయనమ్మ వల్ల వందలమంది తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేశారని, మలిదశ ఉద్యమంలో అనివార్యంగా తెలంగాణ ఇస్తామని ప్రకటన చేశారని తెలిపారు. ఓటుకు కోట్లు దొంగను పక్కన పెట్టుకొని రాహుల్ గాంధీ అవినీతి గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఎవరెవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదివే వ్యక్తి రాహుల్ గాంధీ అని అన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితరులున్నారు.


SAMSUNG
GIFT THE AWESOME
ఇప్పుడు ₹44 ₹31కి/రోజుకు సొంతం చేసుకోండి*
ఆకర్షణీయమైన డివైజ్‌లు. అద్భుతమైన ఆఫర్.
Galaxy A54 5G
₹41999 ₹33499 లేదా
ఇప్పుడు సొంతం చేసుకోండి
@ ₹63/రోజుకు
Galaxy A34 5G
₹35499 ₹25999 లేదా
ఇప్పుడు సొంతం చేసుకోండి
@ ₹49/రోజుకు
Galaxy A14 5G
₹18499 ₹13499 లేదా
ఇప్పుడు సొంతం చేసుకోండి
@ ₹31/రోజుకు
EMI ఆప్షన్‌లు - Samsung Finance+
TVS CREDIT
HDB FINANCIAL SERVICES
BAJAJ FINSERV తో
samsung.com
9870-494949కి వాట్సాప్ చేయండి
Cheil-17918/23TEL


MEGA SERVICE & EXCHANGE CARNIVAL
30 అక్టోబరు నుంచి 4 నవంబరు 2023 వరకు
మీకు అతి దగ్గరలో గల సర్వీస్ సెంటర్‌ని సందర్శించండి.
Hero GIFT
Grand Indian Festival of Trust
స్పెషల్ ఫెస్టివ్ ఆఫర్
ఎక్స్-షోరూమ్ ధర ₹81200
ఎక్స్ఛేంజ్ బోనస్ ₹3000*
IDFC FIRST Bank క్యాష్ బ్యాక్ ₹5000^
ఫెస్టివ్ ఎక్స్-షోరూమ్ ధర
₹73200
THE NEW GLAMOUR
25%# తగ్గింపు
• పెయిడ్ సర్వీస్ లేబరు
• చెయిన్ కేర్ లేబరు పైన
• పెయింటు రక్షణ ట్రీట్మెంట్ లేబరు
• జాయ్‌రైడ్‌లో చేరడం ఛార్జ్
ఫ్రీ# ఎక్స్ఛేంజ్ ఇవాల్యువేషన్
వాషింగ్ & నైట్రోజన్
• సర్వీస్ పైన 200 బోనస్ పాయింట్లు#
• అప్‌గ్రేడ్ పైన 10000 పాయింట్ల వరకు#
• అదనంగా 10% సర్వీస్ డిస్కౌంట్#
#పెయిడ్ సర్వీస్ లేబర్ పైన
Hero GoodLife
BOOK YOUR SERVICE NOW
112 MILLION MADE OF TRUST
WORLD'S NO.1
5 YEAR WARRANTY
Wheels of Trust
WT.5656.2023TEL



భౌతిక సాధనంతో వచ్చినట్టు కనబడినప్పటికీ, చేతిరాత అనేది ఒక ఆధ్యాత్మిక పరికల్పన.
– యూక్లిడ్

సాక్షి
గురువారం, 2 నవంబర్ 2023

ఈ గంటల లెక్క సరైనదేనా?!

శ్రమజీవికి జగమంతా లక్ష్మీనివాసం అని కవి వాక్కు. కాకపోతే ఎలా శ్రమించాలి? ఎంతసేపు శ్రమించాలి? ఇది మిలియన్ డాలర్ల ప్రశ్న. అందుకే కావచ్చు... వారానికి 70 గంటలు పని చేయాలంటూ ఇన్ఫోసిస్ సంస్థ సహ–వ్యవస్థాపకులు నారాయణమూర్తి తాజాగా చేసిన వ్యాఖ్య దేశవ్యాప్తంగా, ముఖ్యంగా యువతరంలో పెద్ద చర్చ రేపుతోంది. ఐటీ వృత్తినిపుణుల్ని ఉద్దేశించి ఓ పాడ్ క్యాస్ట్‌లో ఆయన వ్యక్తం చేసిన అభిప్రాయమది. రానున్న దశాబ్దాల్లో ప్రపంచవ్యాప్త మార్పులతో వచ్చిపడే డిమాండ్లను అందుకొని, భారత ఉత్పాదకతను పెంచుకోవాలంటే ఈ అధిక పని గంటల విధానం అవసరమనేది ఆయన మాట. కార్పొరేట్ దిగ్గజాలు ఆ ప్రతిపాదనను సమర్థిస్తుంటే, శ్రామికవర్గాలు ఈ సుదీర్ఘ పనిగంటల ఆలోచనను వ్యతిరేకిస్తున్నాయి. వెచ్చించిన కాలం, ఉత్పాదకత... ఈ రెంటి మధ్య సంబంధం అన్నిసార్లూ అనులోమానుపాతంలోనే ఉంటుందా అనే మౌలిక ప్రశ్న మొదలైంది.

పనిగంటలు పెంచి, ఎక్కువ పని చేయడమనే ప్రతిపాదన పట్ల పెల్లుబుకుతున్న వ్యతిరేకతకు కారణాలు లేకపోలేదు. మన దేశంలో ఇప్పటికే అధిక సంఖ్యాకులు ఎక్కువ పని చేస్తూ, తక్కువ వేతనాలు పొందుతున్నారు. ఇక, ఇంటిని చక్కబెట్టే మహిళలు, అసంఘటిత రంగ శ్రామికులు లక్షల మంది ఈ 70 గంటల లెక్కకు మించే పనిచేస్తున్నారు. జీతం బత్తెం లేని కుటుంబ స్త్రీలు, వేతనం పొందినా లెక్కల్లోకి రాని అసంఘటిత శ్రామికుల రీత్యా ఉత్పాదకతలో అది కనిపించకపోవచ్చు. 'ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కో–ఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్' (ఓఈసీడీ) గణాంకాల ప్రకారం అధిక పనిగంటల విషయంలో మొత్తం 187 దేశాల్లో మనది 136వ ర్యాంకు. భారతీయ శ్రామికులు సగటున ఏటా 1660 గంటలు పనిచేస్తూ, 2,281 డాలర్ల మేర తలసరి జీడీపీ అందిస్తున్నారు. ఇండొనేసియా, ఆస్ట్రేలియా వగైరా దాదాపు అంతే గంటల్లో అధిక తలసరి జీడీపీ సాధిస్తున్నాయి.

నిజానికి, రోజుకు గరిష్ఠంగా 8 గంటల పని మాత్రమే అనే పద్ధతిని భారతీయ కార్మిక చట్టాల్లోకి తేవడానికి ఎన్నో పోరాటాలు చేయాల్సి వచ్చింది. ఇప్పుడు వారానికి 70 గంటలు, అంటే రోజుకు 11.5 గంటలు అనే పద్ధతి తెస్తే మునుపటి పోరాటాల ఫలితమంతా గంగలో కలిసిపోతుందనే భయమూ శ్రామికుల్లో ఉంది. అదనపు జీతం, పరిహారాల ఊసెత్తకుండా కేవలం అధిక పని గంటల ప్రతిపాదన తీసుకురావడం అనేక అనుమానాలకు దారి తీస్తుంది. ఒకవేళ ఉత్పాదకత, అభివృద్ధి పెరగాలనుకుంటే... శ్రామికులు తమ ఉద్యోగంతో పాటు నచ్చిన మరో పని కూడా ఏకకాలంలో చేసుకొని అదనంగా సంపాదించుకొనేలా 'మూన్‌లైటింగ్'కు అనుమతించాలని కొందరు నిపుణుల సూచన. తద్వారా శ్రామికులకూ, దేశానికీ ఉపయోగమనేది వారి వాదన. అయితే, పలు దిగ్గజ టెక్ సంస్థల భావన తద్భిన్నంగా ఉంది. మారుతున్న శ్రామిక సంస్కృతిలో మూన్‌లైటింగ్ విడదీయరాని భాగమని కేంద్ర ఐటీ అమాత్యులంటున్నా, దాన్ని శిరోధార్యమంటున్న కార్పొరేట్ల సంఖ్య తక్కువే!

వృత్తి పట్ల అంకితభావం, అచంచలమైన శ్రద్ధ కావాల్సిందే! కానీ, పని మీద దృష్టి అనేది చివరకు ఉద్యోగ జీవితానికీ – కుటుంబ జీవితానికీ మధ్య సమతౌల్యం దెబ్బ తీయకూడదు. మనిషి పూర్తిగా డస్సిపోయే పరిస్థితి తేకూడదు. శారీరక, మానసిక సమస్యలకు కారణం కాకూడదు. ఏ పని చేసినా సంతోషంగా చేస్తే ఫరవాలేదు. ఆ పరిస్థితి అంతటా సాధ్యం కాదు. సంతోషమే సగం బలం అనే మనం అందులో వెనకబడ్డాం. ఇప్పటికే ప్రపంచ సంతోషసూచిలో మన దేశపు స్కోరు గణనీయంగా తగ్గుతోంది. దశాబ్దం క్రితం 2013లో 4,772 స్కోరుతో సంతోషసూచిలో భారత్ 111వ ర్యాంకులో ఉండేది. తీరా ఈ ఏడాది మన స్కోరు 4,036కు పడిపోయింది. మన ర్యాంకు 126కు దిగజారింది. ఈ పరిస్థితుల్లో సంతోషంగా పని చేయాలనే పద్ధతికి నీళ్ళొదిలి, మానసిక ఆరోగ్యాన్ని పణంగా పెట్టి, అధిక గంటల పనితో ఉత్పాదకత పెంచాలని భావిస్తే, మొదటికే మోసం వస్తుంది. దీర్ఘకాలంలో అది దేశానికి నష్టదాయకంగా పరిణమించే ప్రమాదం ఉంది.

నారాయణమూర్తి అన్నట్టు దేశాభివృద్ధికి మరింత శ్రమించాలనడంలో సందేహం లేదు. అయితే ఆ శ్రమను పని గంటలతో కొలవాలనుకుంటేనే చిక్కు. భారత్‌ను ఇప్పటికీ నిరుద్యోగం, తక్కువ ప్రతిఫలానికే పనిచేయాల్సి రావడం పట్టిపీడిస్తున్నాయి. స్వయం ఉపాధికి దిగుదామంటే కావాల్సిన పెట్టుబడి దొరకని పరిస్థితి. విద్య, ఆరోగ్య వసతులూ అంతంత మాత్రమే. అవ్యవస్థీకృత ఆర్థికరంగంలో వారానికి 48 గంటల పైనే పని చేస్తున్నా, వేతనాల్లో వ్యత్యాసం, ఉపాధి భద్రత లేమి లాంటి సమస్యలు సరేసరి. ఈ నేపథ్యంలో జీవన ప్రమాణాల్ని మెరుగుపరిచేలా ప్రభుత్వ విధానాలు మారాలి. పనిగంటల కన్నా మానవ సంక్షేమ మూలధనంపై దృష్టిపెట్టడం కీలకం. అప్పుడు ఉత్పాదకత పెరుగుతుంది. అందుకు పాలకులు ప్రాథమిక వ్యవస్థాగత లోపాలను సవరించడం అవసరం.

గమనిస్తే, అనేక అభివృద్ధి చెందిన దేశాల కన్నా సగటు భారతీయ శ్రామికుడు ఎక్కువ సేపు పనిచేస్తున్నా, ఉత్పాదకత తక్కువగా ఉందని గణాంకాలు సూచిస్తున్నాయి. అంటే, ఎంత నాణ్యమైన పని చేశావనేది ప్రధానం కావాలి కానీ, ఎంతసేపు గానుగెద్దులా పని చేశావనేది కాదు. గంటలకొద్దీ శ్రమను పెంచే కన్నా, నైపుణ్యాలకు పదునుపెట్టి, కొద్దిపాటి పరిశ్రమతో అధిక ఫలితం అందించే నవీన మార్గాలను అన్వేషించాలి. పారిశ్రామిక శిఖరం జేఆర్డీ టాటా మాటల్లో చెప్పాలంటే, 'భారత్ ఆర్థిక అగ్రరాజ్యం కావడం కన్నా, ఆనందమయ దేశం కావాలి.' అంచనాలు, అంతకు మించి ఒత్తిడి అంతకంతకూ అధికమవుతున్న కాలంలో అది చాలా ముఖ్యం. సంతోషం, సామర్థ్యం పెరిగితే సంపద అదే సృష్టి అవుతుంది. శ్రమజీవి ప్రతి చెమటచుక్క సిరులు పండిస్తుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, తిథి: బ.పంచమి రా.11.12 వరకు, తదుపరి షష్ఠి, నక్షత్రం: మృగశిర ఉ.6.47 వరకు, తదుపరి ఆరుద్ర, వర్జ్యం: ప.3.36 నుండి 5.18 వరకు, దుర్ముహూర్తం: ఉ.9.48 నుండి 10.34 వరకు తదుపరి ప.2.24 నుండి 3.10 వరకు, అమృత ఘడియలు: రా.9.30 నుండి 11.10 వరకు, రాహుకాలం ప.1.30 నుండి 3.00 వరకు.

సూర్యోదయం : 6.02
సూర్యాస్తమయం: 5.27
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

ప్రపంచాన్ని విభజించిన తీర్మానం

విశ్లేషణ



వివేక్ కాట్జూ

అక్టోబర్ 7 నాటి హమాస్ తీవ్రదాడి ఇజ్రాయెల్‌ను రాజకీయంగా ఒక్కటి చేసింది. అయితే అత్యధిక దేశాలు ఇజ్రాయెల్ ప్రతిదాడుల తీవ్రతను ప్రశ్నిస్తున్నాయి. హమాస్ దాడి తీవ్రవాద చర్య అని మరికొన్ని భావిస్తున్నాయి. అందుకే ఐక్యరాజ్య సమితి తీర్మానం చాలా దేశాలను వర్గాలుగా, ప్రాంతాలుగా విడదీసిందంటే అతిశయోక్తి కాదు. అలాగే ఇజ్రాయెల్‌తో అరబ్ దేశాల సంబంధాలు సాధారణ స్థితికి చేరుకున్నా... గాజా ప్రజల కష్టాలపై కనీస స్పందన కనబరచాలనే ఒత్తిడిలో తీర్మానానికి మద్దతు ప్రకటించాయి. అదే సమయంలో తీర్మానానికి మద్దతివ్వని ఏకైక దక్షిణాసియా దేశంగా ఉండటం వల్ల, ఇజ్రాయెల్‌కు సానుకూలంగా భారత్ మారిందన్న భావన అదే అరబ్ దేశాల్లో బలపడే వీలుంది. అందుకే భారత్ ఆచితూచి వ్యవహరించాలి.

అక్టోబర్ 7 నాటి హమాస్ తీవ్రదాడికి కారణమైన నిఘా వైఫల్యాలు, భద్రత లోపాలపై ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ ప్రభుత్వంపై విమర్శలు వచ్చినప్పటికీ, ఆ దేశ రాజకీయ వర్గం ప్రభుత్వం వెంట నిలిచింది. జాతీయ అత్యయిక పరిస్థితిలో రాజకీయ పక్షాలన్నీ తమ విభేదాలను పక్కనపెట్టాయి. 'అత్యవసర ఐక్యతా ప్రభుత్వ' ఏర్పాటునకు పార్లమెంటు ఆమోదం పొందే క్రమంలో నెతన్యాహూ మాట్లాడుతూ, 'హోలోకాస్ట్ తరువాత యూదు ప్రజలు ఎదుర్కొన్న అతి దుర్భర ఘటన'గా అక్టోబర్ 7ను అభివర్ణించారు. హమాస్ దాడిలో 1,400 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో సాధారణ పౌరులు, మహిళలు, పిల్లలు, వృద్ధులు ఉన్నారు. 229 మందిని హమాస్ బందీలుగా కొనిపోయింది. అయితే ఇజ్రాయెల్ చేపట్టిన ప్రతిదాడుల విషయంలో ప్రపంచ దేశాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అత్యధిక దేశాలు ఇజ్రాయెల్ ప్రతిదాడుల తీవ్రతను ప్రశ్నిస్తున్నాయి. మరోవైపు ఇజ్రాయెల్ రాజకీయ వర్గాలు హమాస్ అంతు చూడాలన్న దృఢ నిశ్చయంతో ఉన్నాయి.

బందీల పరిస్థితేమిటి?

హమాస్ దాడి జరిగిన వెంటనే, ఇజ్రాయెల్ రక్షణ దళాలు గాజాపై బాంబుల వర్షం కురిపించాయి. వైమానిక, భూతల దాడుల్లో ఇప్పటివరకూ 8,000 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇజ్రాయెల్ ఇంకో అడుగు ముందుకేసి విద్యుత్ సేవలు నిలిపి వేసింది. ఆహారం కూడా తక్కువ పరిమాణంలో గాజాలోకి వెళ్లేలా నియంత్రిస్తోంది. గాజా ఉత్తర ప్రాంతాల్లో ఉన్న ప్రజలు దక్షిణం వైపునకు పోవాలని హెచ్చరించింది. అక్టోబరు 27న ఇజ్రాయెల్ భూతల దళాలు గాజాలోకి ప్రవేశించాయి. ఒక రోజు తరువాత నెతన్యాహూ, యుద్ధంలో తరువాతి దశ ఇక మొదలవుతుందనీ, ఇది దీర్ఘకాలిక పోరు కానుందనీ ఇజ్రాయెల్ ప్రజలను హెచ్చరించారు.

బందీలను రక్షించే ప్రయత్నాలు కూడా సాగుతున్నాయని ఇజ్రాయెల్ చెబుతోంది. తమ చర్యల కారణంగా గాజాలో ప్రాణనష్టానికి భయపడి హమాస్ బందీలను విడుదల చేస్తుందనేది ఇజ్రాయెలీల ఆలోచనగా కనిపిస్తోంది. గాజా ప్రజల ఒత్తిడికి కూడా హమాస్ తలొగ్గవచ్చునని భావిస్తోంది. ఖతార్, ఈజిప్టు లాంటి దేశాలు హమాస్, ఇజ్రాయెల్ మధ్య శాంతి చర్చలు కొనసాగిస్తున్నాయి. బందీల విడుదలకు ప్రయత్నిస్తున్నాయి. అయితే హమాస్ తమకు రక్షణ కవచంగా ఉంటున్న బందీలను వదులుకునేందుకు సిద్ధంగా ఉందా అన్నది ప్రశ్న. మరోవైపు ఇజ్రాయెలీ అధికారులు కూడా అసందిగ్ధతను ఎదుర్కొంటున్నారు. బందీల కుటుంబ సభ్యులు వారిపై ఒత్తిడి తెస్తున్నారు. బందీలుగా ఉన్న పాలస్తీనీయులను వదిలితే ఇజ్రాయెలీల విడుదలపై ఆలోచిస్తామని హమాస్ షరతు విధించినట్టు తెలుస్తోంది. గతంలో ఒకే ఒక్క ఇజ్రాయెలీ సైనికుడి విడుదల కోసం ఇజ్రాయెల్



చాలామంది పాలస్తీనియన్లను వదిలిపెట్టిన విషయం ఇక్కడ ప్రస్తావనార్హం. కానీ ఇప్పుడు పరిస్థితులు వేరుగా ఉన్నాయి.

హమాస్ దాడి సమర్థనీయమే?!

పాలస్తీనాను ఇజ్రాయెల్ చాలాకాలంగా ఆక్రమించి ఉండటం, రెండు దేశాల పరిష్కారానికి సిద్ధంగా లేకపోవడం కారణంగా అక్టోబరు 7 నాటి హమాస్ దాడి అర్థం చేసుకోదగినదే అని కొన్ని అరబ్ దేశాలతోపాటు, కొన్ని ఇస్లామిక్ దేశాలు భావిస్తున్నాయి. ఇంకో అడుగు ముందుకెళ్లి ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రెస్ గత వారం భద్రతా మండలిని ఉద్దేశించి, హమాస్ దాడి శూన్యంలోంచి పుట్టుకొచ్చింది కాదని వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ సమాజంలో చాలామంది ఇజ్రాయెల్ వ్యవహారం ఎలా ఉన్నప్పటికీ హమాస్ దాడి తీవ్రవాద చర్య అనీ, సమర్థనీయం కాదనీ భావిస్తున్నారు.

ఈ అంశాలన్నీ కూడా ఇటీవలే ఐక్యరాజ్య సమితి సాధారణ సభలో జోర్డాన్ ప్రవేశపెట్టిన తీర్మానం విషయంలో స్పష్టమయ్యాయి. 'ప్రజల భద్రత, న్యాయమైన, మానవీయ బాధ్యత' కోసం ప్రవేశపెట్టిన ఈ తీర్మానానికి 121 దేశాలు మద్దతిచ్చాయి. 14 దేశాలు వ్యతిరేకించాయి. భారత్ సహా 44 దేశాలు ఓటింగ్‌కు దూరంగా ఉన్నాయి. 'మానవతావాద సంధి ఒకటి తక్షణం కుదరాలనీ, ఈ ఏర్పాటు దీర్ఘకాలం కొనసాగేదిగా ఉండాలనీ' ఈ తీర్మానం ప్రతిపాదించింది. హమాస్, ఇజ్రాయెల్ పేర్లను ప్రస్తావించలేదు. గాజా ప్రజలకు సాయం అందేలా చూడాలనడం, మానవత చట్టాల అమలు గురించి మాట్లాడటాన్ని బట్టి, ఈ తీర్మానం ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా ప్రతిపాదించినదని స్పష్టంగా అర్థమవుతుంది... గాజాలోని ఇజ్రాయెల్ బందీలు అని అర్థమయ్యేలా అక్రమంగా నిర్బంధించిన పౌరుల విడుదల అంశాన్ని ఇందులో పేర్కొన్నప్పటికీ.

ముఖ్యమైన విషయం ఏమిటంటే... అరబ్, ఇస్లామిక్ దేశాలతో పాటు రష్యా, చైనా కూడా ఇజ్రాయెల్ నిగ్రహం చూపాలనీ, ప్రస్తుతం అనుసరిస్తున్న మార్గాన్ని వదిలేయాలనీ డిమాండ్ చేయడం. తీర్మానానికి అనుకూలంగా ఓటేసిన దేశాల జాబితాలో ఐక్యరాజ్య సమితి భద్రత మండలి సభ్యదేశమైన ఫ్రాన్స్ కూడా ఉంది. తన 'నాటో' భాగస్వామి అమెరికాతో మాత్రమే కాదు, బ్రిటన్‌తోనూ ఫ్రాన్స్ విభేదించింది. అమెరికా ఈ తీర్మానాన్ని వ్యతిరేకించగా, బ్రిటన్ ఓటింగ్‌కు దూరంగా ఉంది. యూరోపియన్ యూనియన్, ఉత్తర, దక్షిణ అమెరికా, ఆఫ్రికా యూనియన్, ఏసియన్, దక్షిణాసియా దేశాలను ఈ తీర్మానం వర్గాలుగా, ప్రాంతాలుగా విడదీసిందంటే అతిశయోక్తి కాదేమో!

ఇజ్రాయెల్‌కు అమెరికా దన్ను!

ఇజ్రాయెల్‌కు అమెరికా పూర్తి దన్నుగా నిలుస్తోంది. ఎన్నికలకు ఏడాది గడువు మాత్రమే ఉన్న నేపథ్యంలో అధ్యక్షుడు బైడెన్‌ను అమెరికా యూదుల లాబీ ప్రభావితం చేయడం దీనికి కారణం కావచ్చు. అమెరికాకు చెందిన బందీలపై ఆందోళన కూడా ముఖ్యమైన కారణం కావచ్చు. ఈ కారణంగానే హమాస్‌ను తుదముట్టించాలనే ఇజ్రాయెల్ కృతనిశ్చయాన్ని అమెరికా సమర్థిస్తుండవచ్చు. దీనర్థం, అమెరికా ఇకపై కూడా తన వీటో పవర్‌తో ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో ఇజ్రాయెల్‌కు దౌత్యపరమైన సాయం కొనసాగిస్తుంది.

మరోవైపు ఇజ్రాయెల్‌తో అరబ్ దేశాల సంబంధాలు సాధారణ స్థితికి చేరుకున్నా... గాజా ప్రజల కష్టాలపై కనీస స్పందన కనబరచాలనే ఒత్తిడిలో ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా తీర్మానానికి మద్దతు ప్రకటించాల్సి వచ్చింది. అయితే ఇజ్రాయెల్‌తో ఆ దేశాలు, ముఖ్యంగా యూఏఈ, బహ్రెయిన్ , ఈజిప్టు తమ సంబంధాలను తెంచుకుంటాయా అనేది చూడాలి.

భారత్ వైఖరి

ఓటింగ్‌కు దూరంగా ఉన్న విషయంపై భారతదేశం వివరణ ఇచ్చింది. అది సరిగ్గానే ఉగ్రవాదంపై దృష్టి కేంద్రీకరించింది. నిగ్రహంగా ఉండాలని పిలుపునిచ్చింది. దౌత్యం, చర్చల ద్వారా మాత్రమే సమస్య పరిష్కారం కాగలదని స్పష్టం చేసింది. మానవతా చట్టాలను గౌరవించాలని చెబుతూనే తాను రెండు దేశాల సిద్ధాంతానికి మద్దతుగా నిలుస్తున్నట్లు స్పష్టం చేసింది. అయితే తీర్మానానికి మద్దతివ్వని ఏకైక దక్షిణాసియా దేశంగా ఉండటం వల్ల, ఇజ్రాయెల్‌కు సానుకూలంగా, పాలస్తీనియన్ల పట్ల పట్టింపు లేనిదిగా భారత్ మారిందన్న భావన అరబ్ దేశాల్లో బలపడేందుకు వీలుంది. ఇది వాస్తవం కాకపోవచ్చు. స్వీయ ప్రయోజనాల దృష్ట్యా ఇజ్రాయెల్‌తో సంబంధాలు ఉన్నప్పటికీ, వాటి విషయంలో భారత్ ఆచితూచి వ్యవహరించాలి. అరబ్ దేశాలతో కూడా మనకు అంతే భారీ ప్రయోజనాలు ఉన్నాయి.

వ్యాసకర్త విదేశీ వ్యవహారాల శాఖ మాజీ కార్యదర్శి
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

శుభాకాంక్షలు



ఎల్లరిగూ కన్నడ రాజ్యోత్సవద శుభాశయగళు (అందరికీ కర్ణాటక రాష్ట్ర అవతరణ శుభాకాంక్షలు).
– అనిల్ కుంబ్లే, క్రికెటర్

అదే మేలు



అన్ని ఇబ్బందులనూ అధిగమించి సచిన్ పైలట్, సారా అబ్దుల్లా 2004లో ప్రేమ వివాహం చేసుకున్నారు. ఆ పెళ్లికి అబ్దుల్లా కుటుంబం హాజరు కాలేదు. రెండు దశాబ్దాల తర్వాత, దంపతులు అధికారికంగా విడిపోయారు (రానున్న రాజస్థాన్ శాసన సభ ఎన్నికల కోసం సచిన్ పైలట్ సమర్పించిన అఫిడవిట్ ప్రకారం). జనాలు పెరుగుతారు, మారుతారు... సంతోషంగా ఉండనప్పుడు, సామరస్యంగా విడిపోవడమే మేలు!
– అర్నాజ్ హాథీరామ్, 'వాయిస్ ఫర్ మెన్' వ్యవస్థాపకురాలు

ఎలా సాధ్యం?



మా అమ్మ సత్తువకు ఏదీ సమానం కాదు. నవరాత్రుల్లో జన్మించిన మా పసిదాన్ని ఇరవై నాలుగ్గంటలూ కనిపెట్టుకుని ఉంటోందా... చాలినంత నిద్ర లేదు. అయినా కడ్వా చౌత్ ఉపవాసం చేయడానికి నిర్ణయించుకుంది.
– సాన్యా తల్వార్, సంపాదకురాలు

సాధించాలి!



తుళువలు మొత్తం ప్రాంతాన్ని ఏకీకృతం చేసి తుళునాడు రాష్ట్రం ఏర్పడేందుకు పనిచేయాలి. తుళు భాష గుర్తింపు గురించి కర్ణాటక నుంచి ఏదో ఆశించడం నిరర్థకం. వాళ్ల ప్రయోజనాలకు వ్యతిరేకం కాబట్టి, అదెప్పటికీ జరగదు.
– నవీన్ శెట్టి, తుళునాడు మద్దతుదారు

ఒప్పుకోవాలి



ప్రతి ఒక్కరూ గుర్తించి, అంగీకరించాల్సినది ఏమంటే – ఇజ్రాయెల్ అక్కడే ఉనికిలో ఉంటుంది; యూదులు, క్రైస్తవుల మూలాలు మన ప్రాంతంలో ఉన్నాయి తప్ప ఏ న్యూయార్క్‌లోనో, పారిస్‌లోనో లేవు. వాళ్లు మన చరిత్రలో భాగం, భవిష్యత్తులో కూడా తప్పక భాగం కావాలి.
– అలీ రషీద్ అల్ నుయిమి, యూఏఈ నాయకుడు

ఇదీ సమస్య



ఎంఆర్ఎన్ఏ టీకాలతో సమస్య ఇది: వాళ్లు ఎంఆర్ఎన్ఏను మీ కణాల్లోకి మోసుకెళ్లడానికి లిపిడ్ నానోపార్టికల్స్ (ఎల్ఎన్‌పీ)ను ఉపయోగిస్తారు. అనంతరం ఫారిన్ స్పైక్ ప్రొటీన్ ఉత్పత్తయ్యేలా ఎంఆర్ఎన్ఏ మీ కణాన్ని హైజాక్ చేస్తుంది. మీ శరీరంలోకి ఎల్ఎన్‌పీ ప్రతిచోటికీ వెళ్తుంది. గుండె, ఓవరీలతో సహా! అది విషం.
– పీటర్ ఇమాన్యుయెల్‌సేన్, కామెంటేటర్

అనుభవించాల్సిందే!



నా అపార్ట్‌మెంట్‌ను బాగు చేయాలని అనుకున్నప్పుడు – రాయి, కలప, గ్లాసు, మన్ను లాంటి సహజమైన పదార్థాలే తప్పక వాడాలని అనుకున్నాను. దీనికోసం ప్రత్యేకంగా ఒక ఆర్గానిక్ నిర్మాణ కంపెనీని మాట్లాడుకున్నాను. అలాంటి ఇంటి లోపలికి వెళ్లినప్పుడు మానసిక భావనే వేరుగా ఉంటుంది... సంపూర్ణంగా, సౌఖ్యంగా!
– అలెస్సాండ్రా బొక్కి, జర్నలిస్ట్

ఇన్ బాక్స్

ఫార్మసిస్ట్‌లు – రాజకీయ గుర్తింపు!

ఆరోగ్య సంరక్షణ రంగంలో ఔషధాల పాత్ర అందరూ ఎరిగినదే! అట్టి ఔషధాల నిపుణులు ఫార్మసిస్ట్‌లు. ప్రాణ రక్షకాలైన ఔషధాలను అందించే ఫార్మసిస్ట్‌లను ఆరోగ్య రంగం పూచికపుల్ల వలె చులకనగా చూస్తున్నది. ఫార్మసిస్ట్ కావాలంటె 'ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా' గుర్తింపు కలిగిన కాలేజీలో డిప్లొమా ఇన్ ఫార్మసీ, బాచెలర్ ఆఫ్ ఫార్మసీ లేదా డాక్టర్ ఆఫ్ ఫార్మసీ పట్టా పొంది, రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకొన వలసి ఉంటది. ఎంసెట్ వంటి ప్రవేశ పరీక్షలు దాటుకొని, కాలాన్ని వెచ్చించి, మేధను మథించి, ప్రతిభతో పట్టాలు పొందిన ఫార్మసిస్ట్‌లు నిరుద్యోగంతో బాధ పడుతున్నరు. ఉద్యోగం వచ్చినా వ్యవస్థాపరమైన అణచివేతకు గురై, ఆదరణకు నోచుకొనక కుంగిపోతున్నరు.

మెడికల్ ప్రాక్టీషనర్లు ఔషధాలు సూచిస్తే ఫార్మసిస్ట్‌ల అవసరం లేకుండానే ఏబీసీడీలు వచ్చిన ఎవరైనా వాటిని ఈయవచ్చునన్న తప్పుడు అభిప్రాయం నెలకొని ఉన్నది. కాని, ఫార్మసిస్ట్‌ల పర్యవేక్షణ లేకుండా ఔషధ సూచన, వితరణ, వినియోగంలో జరిగే అవకతవకల వలన ప్రజలకు తీవ్రనష్టం జరుగుతున్నది. ఒక్కొక్కసారి ప్రాణహాని కూడా సంభవిస్తున్నది. కనుక, వారికి మెడికల్ స్టోర్స్ ప్రారంభించుకొనటానికి ఋణసౌకర్యం కల్పించి ప్రోత్సహించాలె. 'జీవన్ ధార', 'జన ఔషధి' స్టోర్స్ కేటాయింపులు ఫార్మసిస్ట్‌లకు మాత్రమే చేయాలి. వారిని ప్రాథమిక చికిత్సకులుగ గుర్తించాలె. అన్ని బస్తీ దవాఖానలు, పల్లె దవాఖానలలో ఫార్మసిస్ట్‌లను నియమించాలె. అన్ని ఔషధ శాలలు, వాక్సిన్ స్టోర్స్, రేడియో ఫార్మస్యూటికల్ స్టోర్స్, వెటరినరి స్టోర్స్‌లలో వారిని నియమించాలి.

ప్రభుత్వాలు ఫార్మసిస్ట్‌లకు ఇస్తున్న హామీలు, ముఖ్యంగా 2018 జనవరిలో 'ఫార్మ్ డి' విద్యార్థులకు ఇచ్చిన హామీ అమలుకు నోచుకొనలేదు. అందుకే ఎన్నికల మేనిఫెస్టోలలో ఫార్మసిస్ట్‌ల అంశం చేర్చాలని ఫార్మసిస్ట్‌లు అందరూ ముక్త కంఠంతో డిమాండ్ చేస్తున్నరు.

– డాక్టర్ రాపోలు సత్యనారాయణ, వర్కింగ్ గ్రూప్ ఆన్ ప్రొఫెషనల్ డిగ్నిటీ ఆఫ్ ఫార్మసిస్ట్స్ కో–ఆర్డినేటర్

ఆకాశమే హద్దుగా ఎదుగుతున్న తెలంగాణ!

అభిప్రాయం



డా॥ వర్రె వెంకటేశ్వర్లు

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంతో దున్నే వారికి భూమి దక్కింది. బంజరు, పోరంబోకు, ప్రభుత్వ భూములు పేదల పరమయ్యాయి. 1969లో విద్యార్థులు మొదలు పెట్టిన ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం తెలంగాణకు అనేక రక్షణలు తీసుకువచ్చింది. తిరిగి 2001లో కేసీఆర్ ప్రారంభించిన ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఏకంగా రాష్ట్రాన్నే తీసుకువచ్చింది. రాష్ట్రం వస్తే ఏం వస్తుందన్న వారికి సమాధానంగా గడిచిన పదేళ్లలో అన్ని రంగాల్లో వచ్చిన గుణాత్మక మార్పుతో నేడు ఓ సరికొత్త తెలంగాణ ఆవిష్కృతమైంది.

1940 నుండి ప్రతి ఇరవై ఏళ్లకు ఒక మారు అస్తిత్వ పోరాటాలు చేస్తూ వచ్చిన తెలంగాణ స్వరాష్ట్రమై నిలిచిన తర్వాతే తెప్పరిల్లుతోంది. 2001లో 'తెలంగాణ రాష్ట్ర సమితి' అవిర్భావ సమయంలో కేసీఆర్ నిర్దేశించుకున్న ప్రతి లక్ష్యాన్నీ, ప్రతి స్వప్నాన్నీ ఒకదాని వెంట ఒకటి నెరవేర్చుతున్న వాస్తవానికి నాలుగు కోట్ల ప్రజలే సాక్ష్యంగా నిలిచారు. 2014 ఎన్నికల్లో బొటాబొటి మెజారిటీతో అధికార పగ్గాలు చేపట్టిన కేసీఆర్ పార్టీ, 2018కి వచ్చే సరికి 88 శాసనసభ స్థానాలను దక్కించుకున్న స్థాయికి ఎదిగిపోయింది.

ఆర్థిక పరిస్థితి కుదురుకున్న వెంటనే దేశంలో మరెక్కడా లేని విధంగా 'రైతుబంధు' పథకం పెట్టి తెలంగాణలో 'వ్యవసాయం దండగ' అన్న నోళ్లతో 'వ్యవసాయం పండగలా మారింది' అనిపించగలిగారు. రాష్ట్రం ఏర్పడే నాటికి వ్యవసాయంతో పాటు, పరిశ్రమలకు నిరంతర కరెంట్ కోతలు విధించిన పరిస్థితుల (7,778 మెగావాట్లు) నుండి నేడు 26,000 మెగావాట్ల ఉత్పత్తికి చేరుకుని 24 గంటలూ విద్యుత్‌ను సరఫరా చేస్తున్న రాష్ట్రంగా తెలంగాణ అవిర్భవించింది. వ్యవసాయం, పరిశ్రమలు, సర్వీస్ సెక్టార్లలో ఉత్పత్తులు పెరిగేందుకు ఇది కారణమైంది. కాళేశ్వరం మెగా ప్రాజెక్ట్‌తో పాటు 'మిషన్ కాకతీయ' కారణంగా పదేళ్ల క్రితం 62 లక్షల ఎకరాల్లో ఉన్న తరి సేద్యం నేడు కోటి ముప్పై ఐదు లక్షల ఎకరాలకు చేరి, పంజాబ్‌ను తలదన్నే స్థాయికి చేరుకుంది.




పదేళ్ల క్రితం తెలంగాణలో ఉన్న 3.23 లక్షల ఐటీ ఉద్యోగాల సంఖ్య నేడు 9.5 లక్షలకు చేరి ఐటీ ఉత్పత్తులు రూ. 2.41 లక్షల కోట్ల విలువను దాటి పోయాయి. హైదరాబాద్‌తో పాటు వరంగల్, కరీంనగర్, సిద్దిపేట, నల్లగొండ, నిజామాబాద్ జిల్లా కేంద్రాల్లోనూ ఐటీ హబ్‌లు స్థానిక యువతకు మంచి ఉపాధి కేంద్రాలుగా మారిపోయాయి. పదేళ్ల క్రితం ప్రభుత్వ రంగంలో ఐదు మెడికల్ కాలేజీలు ఉంటే నేడు వాటి సంఖ్య 29కి చేరింది. అత్యున్నత వైద్య విద్య తెలంగాణ బిడ్డలకు మరింత చేరువైంది. 'మన ఊరు మన బడి' కింద అన్ని ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చే పనులు వేగవంతమయ్యాయి. అన్ని పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం విజయవంతంగా సాగుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు శాతం పెంచి బాలబాలికలకు పౌష్టికాహారం అందించే దిశగా కేసీఆర్ 'ఉపాహార' పథకాన్ని ప్రారంభించారు.

తెలంగాణలో నగరాలు విస్తరిస్తున్నంత వేగంగా మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేయాలన్న ప్రభుత్వ నిర్ణయం ఫలితం నేడు హైదరాబాద్‌ను చూస్తే అర్థమవుతుంది. 'వ్యూహాత్మక రహదారి అభివృద్ధి' పథకం కింద 'సిగ్నల్ ఫ్రీ జంక్షన్ల' కోసం నాలుగు వేల కోట్ల రూపాయలతో నిర్మించిన ఫ్లైఓవర్లతో నేడు హైదరాబాద్ రూపు రేఖలు పూర్తిగా మారిపోయాయి. వాహన సగటు వేగం గంటకు 12 కి.మీ.లు పెరిగింది. ప్రతి రోజూ మంచినీళ్లు, పరిశుభ్రమైన వీధులు, రహదారులతో నేడు హైదరాబాద్ ప్రపంచంలో బాగా జీవించదగిన నగరాల్లో ఒకటయింది. పచ్చదనంలోనూ తెలంగాణ దేశంలోనే ఉన్నత స్థానానికి చేరింది. హైదరాబాద్ నగర స్థాయిలోనే వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ నగరాలను నిలబెట్టే పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇలా చెప్పుకుంటూ పోతే... పదేళ్లలో ఎంతో మార్పు!

వ్యాసకర్త ఉమ్మడి రాష్ట్ర మాజీ సమాచార ప్రధాన కమిషనర్ | 92465 26899

స్వీయ బందీలు

ఓ గురువుగారు శిష్యులతో తీర్థయాత్రకు బయలుదేరారు. వారి దుస్తులు, వంటసామగ్రి, ఇతర వస్తువులను ఎనిమిది గాడిదలపై వేసుకొని ముందుకు సాగుతున్నారు. చీకటి పడే సమయానికి సత్రం ఉన్న ఒక గ్రామానికి చేరారు. గాడిదలు ఎటూ పారిపోకుండా ఉండటానికి శిష్యులను వాటిని కట్టివేయమన్నారు గురువుగారు. వారు తమ దగ్గర ఉన్న ఒకే ఒక తాడుతో ఏడు గాడిదల కాళ్లను కలుపుతూ కట్టివేసి ఎనిమిదవ దాన్ని కట్టడానికి ప్రయత్నించారు. కాని, ఎంత లాగి కట్టాలనుకున్నా తాడు చాలడం లేదు. తన శిష్యులు పడుతున్న పాట్లను చూస్తున్న గురువుగారు 'ఏడు గాడిదలకు తాడు ఎలా కట్టారో అలాగే ఎనిమిదో గాడిద కాలికి కూడా తాడు కట్టినట్టు నటించండి' అని ఆదేశించారు. శిష్యులు అలాగే చేశారు. తన కాలికి కూడా తాడు కట్టారనుకున్న తలంపుతో ఎనిమిదో గాడిద మిగిలిన గాడిదలతో సహా ఉన్న చోటనే రాత్రంతా నిల్చునుంది. అనంతరం గురుశిష్యులు కబుర్లు చెప్పుకొంటూ నిద్రలోకి జారుకున్నారు. తెల్లవారింది. శిష్యులు ఏడు గాడిదల కాళ్ళకు ఉన్న కట్లను విప్పారు. అవి నడవసాగాయి. కానీ ఎనిమిదో గాడిద ఉన్న చోటనే నిల్చుని ఉంది. శిష్యులకు ఏమీ అర్థం కాలేదు. గురువు గారి వంక చూశారు. అప్పుడు ఆయన 'మీరు దాని కాలికి తాడు కడుతున్నట్టు నటించారు కదా. అలాగే ఇప్పుడు తాడుని విప్పుతున్నట్టూ నటించండి. అప్పుడే అది అక్కడి నుంచి కదులుతుంది' అన్నారు. శిష్యులు అలాగే చేశారు. మరుక్షణం గాడిద ముందుకు కదిలింది.



జ్యోతిర్మయం

గాడిదల ప్రవర్తనను అంత కచ్చితంగాఎలా ఊహించగలిగారని ఆశ్చర్యంతో అడిగారు శిష్యులు. 'మనుషులను చూస్తేనే అర్థం చేసుకోవచ్చు. చాలామంది ఏదో అడ్డుగా ఉందనుకుని ముందడుగు వేయడానికి ఆలోచిస్తూ మీనమేషాలు లెక్కిస్తుంటారు. ఎవరో వచ్చి అడ్డంకులేవీ లేవని చెప్పినప్పుడు, అలాగా అనుకుని ఎనిమిదో గాడిదలాగా ప్రవర్తిస్తారు. అది సహజం. అంతే తప్ప ఆశ్చర్యపోవడానికేమీ లేద'న్నారు గురువుగారు.

– యామిజాల జగదీశ్

క్లుప్తంగా...

నిన్న మేడిగడ్డ .. నేడు అన్నారం..

● కల్వకుంట్ల 'స్కామేశ్వరం'లో మరో మైలురాయి: రేవంత్ ట్వీట్




సాక్షి, హైదరాబాద్: అన్నారం బ్యారేజీ వద్ద నెలకొన్న పరిస్థితిపై టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి తనదైన శైలిలో ప్రభుత్వాన్ని విమర్శిస్తూ ట్వీట్ చేశారు. కల్వకుంట్ల 'స్కామేశ్వరం'లో మరో మైలురాయి అని వ్యంగ్యాస్త్రాలు సంధిస్తూ నిన్న మేడిగడ్డ.. నేడు అన్నారం అంటూ 'ఎక్స్'వేదికగా వ్యాఖ్యానించారు. అక్కడ కూలుతున్నవి బ్యారేజీలు కాదు.. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల జీవితాలు అని విమర్శించారు. 'ప్రాజెక్టు అంటే నీ ఫామ్ హౌస్‌కు ప్రహరీ గోడనుకున్నావో.. నీ మనవళ్లు ఆడుకునే ఇసుక గూళ్లు అనుకున్నావో.. రూ. లక్ష కోట్ల ప్రజల సొమ్మును మింగేసి, నాలుగుకోట్ల జనం నోట్లో మట్టిగొట్టావు'అని సీఎం కేసీఆర్‌పై ధ్వజమెత్తారు. 'వందేళ్లకు పైగా ఉండాల్సిన నిర్మాణాలు, ఇలా కండ్లముందే కొట్టుకుపోవడానికి కారణం.. మందేసి నువ్వు గీసిన ఆ పనికిమాలిన డిజైన్లు.. రూ. లక్ష కోట్ల అవినీతి'అని తీవ్రస్థాయిలో విమర్శించారు.

కాంగ్రెస్‌కు ఈర్ల కొమురయ్య రాజీనామా



పంజగుట్ట (హైదరాబాద్): టీడీపీ నుంచి వచ్చిన వారు నిజమైన కాంగ్రెస్ నేతలను గెంటేస్తున్నారని టీపీసీసీ ప్రధానకార్యదర్శి ఈర్ల కొమురయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి బీసీలను పనివాళ్లలా చూస్తున్నారని, ఆయన చర్యలవల్ల బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఇప్పటికే పార్టీకి దూరమయ్యారన్నారు. 44 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసిన తాను రేవంత్ చర్యలవల్ల పార్టీ సభ్యత్వానికి, పదవికి రాజీనామా చేస్తున్నట్లు బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన కన్నీటిపర్యంతమయ్యారు. టికెట్ కోసం 50వేలు దరఖాస్తు ఫీజు పెట్టి అసలు దరఖాస్తు చేసుకోని వారికి టికెట్లు ఇచ్చారని దీనిబదులుగా నేరుగా టికెట్ల టెండర్ పెడితే బాగుండేదన్నారు.

వేలల్లో పెనాల్టీ ఫీజు సరికాదు..: హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: 'విద్య అనేది విద్యార్థి భవిష్యత్‌ను తీర్చిదిద్దగల ఓ అద్భుత సాధనం.. అలాంటి విద్య విషయంలో పెనాల్టీ ఫీజు పేర విద్యార్థుల నుంచి వేలల్లో వసూలు చేయడం సరికాదు'అని హైకోర్టు అభిప్రాయపడింది. పెనాల్టీ లేకుండా రెగ్యులర్ పరీక్ష రుసుము మాత్రం తీసుకొని పిటిషనర్‌ను అనుమతించాలని ఉస్మానియా వర్సిటీకి ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. గతంలో సుప్రీంకోర్టు, పలు రాష్ట్రాల హైకోర్టులు కూడా ఇదే విషయాన్ని తమ తీర్పుల్లో వెల్లడించాయని పేర్కొంది. 2017-18 సంవత్సరానికి సంబంధించి బ్యాక్‌లాగ్ ఉన్న ఓ విద్యార్థిని పరీక్ష ఫీజుతో పాటు రూ.10 వేలు అపరాధ రుసుము కింద చెల్లించాలని యూనివర్సిటీ తెలిపింది. దీన్ని సవాల్ చేస్తూ కె.ప్రమోద్ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సూరేపల్లి నందా ధర్మాసనం విచారణ చేపట్టి తీర్పు వెలువరించింది. పిటిషనర్ తరఫున న్యాయవాది ఆకాశ్ బాగ్లేకర్ వాదనలు వినిపించారు. వర్సిటీ నిర్ణయాన్ని తప్పుబడుతూ పలు తీర్పులు కోర్టు దృష్టికి తెచ్చారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. పిటిషనర్ న్యాయవాది వాదనతో ఏకీభవిస్తూ, రెగ్యులర్ పరీక్ష రుసుము మాత్రమే తీసుకోవాలని వర్సిటీకి ఆదేశాలు జారీ చేశారు. ఇలా అపరాధ రుసుము విధించే నిర్ణయంపై నాలుగు వారాల్లో సుప్రీంకోర్టు తీర్పు మేరకు నిర్ణయం తీసుకోవాలని యూనివర్సిటీకి స్పష్టం చేశారు.



జడ్చర్లలో రాహుల్ కార్నర్ మీటింగ్‌కు హాజరైన జనం



షాద్‌నగర్ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న రాహుల్ గాంధీ. చిత్రంలో రేవంత్‌రెడ్డి

అధికారంలోకి రాగానే ఓబీసీ గణన

▶ మొదటి పేజీ తరువాయి

మండిపడ్డారు. దేశాన్ని నడిపించే అవకాశం ఓబీసీ, దళిత, గిరిజన, మైనార్టీలకు రాకూడదా? అని ప్రశ్నించారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో కాంగ్రెస్ విజయ భేరి బహిరంగ సభతో పాటు మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో, సాయంత్రం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగుల్లో ఆయన మాట్లాడారు.

మోదీ, కేసీఆర్‌లు ఉలిక్కిపడేలా చేశా..

'దేశంలో, రాష్ట్రాల్లో ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ విద్వేషాలను పెంచాయి. వీటికి ఎక్కడా స్థానం లేదు. అందుకే నేను ప్రేమ, ఆప్యాయతలు పెంచేలా దేశవ్యాప్తంగా భారత్ జోడో యాత్ర చేశా. ఒక బజార్‌లో నేను ప్రేమను పంచే దుకాణాన్ని తెరిచా. ప్రస్తుతం తెలంగాణలో ఎన్నికల సమరం కొనసాగుతోంది. ఓ వైపు దొరలు, కేసీఆర్, కేటీఆర్, ఆయన కుటుంబ సభ్యులు.. మరోవైపు కాంగ్రెస్ కార్యకర్తలు ఉన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు ఒకటిగా కలిసి పని చేస్తున్నాయి. ఎక్కడైనా కాంగ్రెస్ పోటీ చేస్తే అక్కడ ఎంఐఎం అభ్యర్థులు ప్రత్యక్షమవుతారు. వారికి బీజేపీ నేతలే డబ్బులు పంపుతారు. కాళేశ్వరంలో కేసీఆర్ దోచుకున్న సొమ్ము కూడా ఆయా రాష్ట్రాల్లోని అభ్యర్థులకు చేరుతోంది. విపక్ష నేతలపై సీబీఐ, ఈడీ, ఐటీ దాడులు జరుగుతాయి. సీఎం కేసీఆర్‌పై మాత్రం ఏ దాడులూ ఉండవు. ఇదెందుకో గ్రహించాలి. ప్రధాని మోదీ నన్ను రోజూ తిడుతూనే ఉంటారు. ఆయనతో యుద్ధం చేస్తున్నా. 24 గంటలు తిట్టేలా కదిలించా. నాపై 24 కేసులు పెట్టారు.. నా లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేశారు.. ప్రభుత్వం ఇచ్చిన ఇల్లు కూడా లాక్కున్నారు. అయినా నేను భయపడలేదు. యావత్ హిందుస్తాన్, తెలంగాణే నా ఇల్లు.. అవసరమైతే కోట్లాది మంది ప్రజలే నన్ను అక్కున చేర్చుకుంటారు. కేసీఆర్ కూడా ప్రతి క్షణం ఉలిక్కి పడేలా చేశా. నా పేరు వినపడితే చాలు.. నిద్రలోనూ ఉలిక్కిపడుతున్నారు..' అని రాహుల్ అన్నారు.

ఒక్క ప్రాజెక్టు కూడా సరిగ్గా కట్టలేదు

'రాష్ట్రంలో ప్రాజెక్టుల పేరుతో ఇష్టారాజ్యంగా అంచనాలు పెంచారు. లక్ష కోట్ల సొమ్మును సీఎం కేసీఆర్ పేదల జేబు నుంచి లాక్కొని కనీసం ఒక్కదానిని కూడా సరిగ్గా కట్టలేదు. కుంగిపోయిన కాళేశ్వరం బ్యారేజీ నిర్మాణాన్ని సీఎం సమీక్షించాల్సిన అవసరం ఉంది. కేసీఆర్ ఒక రాజులా పేదలపై పెత్తనం చెలాయిస్తున్నారు. మంత్రిత్వ శాఖల్లో ఎక్కువ డబ్బులు వచ్చే మద్యం, ఇసుక, భూమి వంటి వాటిని కేసీఆర్ కుటుంబ సభ్యులే చూసుకుంటున్నారు. రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబానికి తప్ప ప్రజలకు లాభం జరగలేదు. అందుకే ప్రజలంతా కేసీఆర్‌కు బైబై అంటున్నారు. కేసీఆర్ దోచిన సొమ్ము కక్కించి ప్రతి పైసా పేదల ఖాతాల్లో వేస్తాం. నేను ప్రధాని మోదీలా కాదు. ఆయనలా మాట తప్పను. ఇచ్చిన మాట ప్రకారం హామీలన్నీ నెరవేరుస్తాం..' అని చెప్పారు.

ప్రతి ఎకరా తిరిగి పేదలకు పంచుతాం..

'భూ రికార్డుల ప్రక్షాళన పేరుతో తీసుకొచ్చిన ధరణి సాంకేతిక పరిజ్ఞానం సాయంతో కేసీఆర్ కుటుంబం, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు లక్ష ఎకరాలు మాయం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి ఎకరాను తిరిగి స్వాధీనం చేసుకుంటాం. ఆ భూములను మళ్లీ పేదలకు పంచి పెడతాం. పేదలకు ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం కూడా అందజేస్తాం..' అని హామీ ఇచ్చారు.

కేవలం 2% ఓట్లతో ఓబీసీని సీఎం ఎలా చేస్తారు?

'తెలంగాణలో బీజేపీ లీడర్లు భుజాలు ఎగిరేసి తిరిగేటోళ్లు. కాంగ్రెస్ పార్టీ వాళ్ల గ్యాస్ తీసేసింది. కారు నాలుగు టైర్లను పంక్చర్ చేసింది. రాష్ట్రంలో ఓబీసీ వ్యక్తిని ముఖ్యమంత్రిని చేస్తామని బీజేపీ చెబుతోంది. కేవలం 2 శాతం ఓట్లతో సీఎంని ఎలా చేస్తారు. మోదీ అమెరికా వెళ్లి ఓబీసీని ప్రెసిడెంట్ చేస్తామని చెప్పినట్టుగా ఉంది. అమెరికాలో ఓబీసీ ప్రెసిడెంట్‌ను, ఇక్కడ మీరు.. సీఎంను ఏర్పాటు చేయలేరు..' అని రాహుల్ ఎద్దేవా చేశారు.

మార్పు కావాలంటే కాంగ్రెస్ రావాలి: రేవంత్

రాష్ట్రంలో అభివృద్ధితో పాటు మార్పు కావాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. రూ.లక్ష కోట్లు మింగి కాళేశ్వరం ప్రాజెక్టు సరిగా కట్టలేకపోయారని ఆరోపించారు. మొన్న మేడిగడ్డ కుంగితే, నిన్న సుందిళ్ల పగుళ్లు బారిందని అన్నారు. పని మంతుడు పందిరేస్తే, కుక్క తోక తగిలి కూలిపోయినట్టుగా సీఎం కేసీఆర్ పనితీరు ఉందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులు నిర్మించి లక్షలాది ఎకరాలకు నీరందించింది కాంగ్రెస్సేనని చెప్పారు.

జన గణనతోనే బీసీల అభివృద్ధి: భట్టి

నీళ్లు, నిధులు, నియామకాల కోసం కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు కన్నీళ్లే మిగిలాయని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. బీసీల జనగణన జరిగితేనే బలహీన వర్గాలకు మేలు జరుగుతుందని చెప్పారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను ప్రతి ఇంటికీ చేర్చాలని, భూసంస్కరణలు తీసుకొచ్చి పేదలకు భూములు పంచిన కాంగ్రెస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. సభల్లో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి, ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మల్లురవి, పార్టీ అభ్యర్థులు కసిరెడ్డి నారాయణరెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ, అనిరుధ్‌రెడ్డి, జి. మధుసూదన్‌రెడ్డి, వీర్లశంకర్ తదితరులు పాల్గొన్నారు. ఇలా వుండగా అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యకు పాల్పడిన కల్వకుర్తి మండలం జిల్లెలకి చెందిన రైతు చంద్రయ్య కుటుంబసభ్యులను రాహుల్ పరామర్శించారు. చంద్రయ్య భార్య తిరుపతమ్మ, కొడుకు నితిన్‌తో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందంటూ ధైర్యం చెప్పారు.

రాహుల్‌తో నేతల భేటీ

బుధవారం ఉదయం శంషాబాద్ ఎయిర్‌పోర్టులోని నోవాటెల్ హోటల్‌లో కాంగ్రెస్ కీలక నేతలు పలువురు రాహుల్‌తో సమావేశమయ్యారు. రేవంత్, భట్టితో పాటు ఎమ్మెల్యే జగ్గారెడ్డి, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీ రాజయ్య, షబ్బీర్ అలీ తదితరులు వీరిలో ఉన్నారు. కొడంగల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్‌కు చెందిన సుమారు రెండొందల మంది కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు.

నేడు రాహుల్ మేడిగడ్డ సందర్శన

సాక్షి, హైదరాబాద్/భూపాలపల్లి: రాహుల్ గురువారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ (లక్ష్మీ బ్యారేజీ)ను సందర్శించనున్నారు. ఉదయం 8 గంటలకు హెలికాప్టర్‌లో అంబట్‌పల్లికి చేరుకుంటారు. మేడిగడ్డకు వెళ్లి ఏడో బ్లాక్‌లో రెండు పియర్లు కుంగిన ప్రాంతాన్ని పరిశీలించనున్నారు. రేవంత్‌రెడ్డి, ఇతర నేతలతో కలిసి, ఉదయం 11 గంటల వరకు దాదాపు మూడు గంటల పాటు ఆయన అక్కడ ఉంటారని సమాచారం. పియర్లు కుంగడానికి నిర్మాణ లోపమా.? డిజైన్ లోపమా? అన్న అంశాలపై నిపుణులతో చర్చించే అవకాశం ఉందని తెలిసింది. మరోవైపు అంబట్‌పల్లిలో 5 వేల మంది మహిళలతో మహిళా సాధికారతపై రాహుల్ సభ నిర్వహించనున్నారు. కాగా ఇక్కడ హెలికాప్టర్ ల్యాండింగ్ కోసం కాంగ్రెస్ చేసిన విజ్ఞప్తి మేరకు జిల్లా కలెక్టర్ అనుమతి ఇచ్చారు. ఇప్పటివరకు మేడిగడ్డ వైపు వెళ్లడానికి ఎవరినీ అధికారులు అనుమతించని సంగతి తెలిసిందే. రాహుల్ నెలరోజుల వ్యవధిలో రెండోసారి భూపాలపల్లి జిల్లాలో పర్యటిస్తున్నారు.

కాంగ్రెస్‌లోకి వివేక్... బీజేపీకి గుడ్ బై

- వివేక్, ఆయన కుమారుడు వంశీకృష్ణలకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన రాహుల్
- వివేక్ ఫ్యామిలీ చేరికతో కాంగ్రెస్‌కు వెయ్యి ఏనుగుల బలం: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి
- కేసీఆర్ కుటుంబ, రాక్షస పాలన అంతమే లక్ష్యంగా కాంగ్రెస్‌లో చేరాను: వివేక్ వెంకటస్వామి

సాక్షి, హైదరాబాద్: బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మేనిఫెస్టో కమిటీ చైర్మన్ వివేక్ వెంకటస్వామి ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీజేపీకి బరు వైన హృదయంతో రాజీనామా చేస్తున్నట్టు, పార్టీలో ఉన్నప్పుడు అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డికి రాజీనామా లేఖ పంపించారు. బుధవారం నోవాటెల్ హోటల్‌లో వివేక్, ఆయన కుమారుడు వంశీకృష్ణకు కండువా కప్పి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పార్టీలోకి ఆహ్వానించారు. అంతకు ముందు ఉదయం తన కుటుంబసభ్యులతో హోటల్‌కు చేరుకున్న వివేక్.. రాహుల్‌గాంధీతో సమావేశమయ్యారు. ఆ తర్వాత బయటకు వచ్చి మీడియాతో మాట్లాడారు. ఆయన వెంట ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఉన్నారు. కాంగ్రెస్‌లో చేరాలంటూ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆహ్వానించడంతో అందుకు అంగీకారం తెలిపినట్లు వివేక్ చెప్పారు. కాగా పలు దఫాలుగా వివేక్‌తో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి. సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చర్చలు జరిపిన దరిమిలా ఈ కీలక పరిణామం చోటు చేసుకున్నట్టు తెలుస్తోంది. వివేక్‌కు, ఆయన కుమారుడు వంశీకృష్ణకు కాంగ్రెస్ పార్టీ ఒక అసెంబ్లీ టికెట్, ఒక లోక్‌సభ సీటు కేటాయించను న్నట్టు ఆ పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో చెన్నూరు నుంచి వివేక్ నిలబడే అవకాశముందని, పెద్దపల్లి లోక్‌సభ స్థానాన్ని ఆయన కుమారుడికి కేటాయించే విషయంపై అంగీకారం కుదిరిందని కాంగ్రెస్ వర్గాల సమాచారం.

కేసీఆర్ కుటుంబపాలన అంతం చేయాలనే లక్ష్యంతోనే చేరా: వివేక్ వెంకటస్వామి

తెలంగాణలో కేసీఆర్ కుటుంబపాలన, బీఆర్‌ఎస్ రాక్షస పాలన అంతం చేయాలనే లక్ష్యంతోనే కాంగ్రెస్ పార్టీలో చేరినట్టు వివేక్ వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీలో చేరాక ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుతమున్న పరిస్థితుల్లో కేసీఆర్‌ను తప్పక గద్దె దించాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. తెలంగాణ సాధనలో అప్పటి ఎంపీల పాత్ర ఎంతో కీలకమని చెప్పారు.ఎన్నికల్లో పోటీ, టికెట్ కేటాయింపు వంటివి అంత ముఖ్యమైనవి కాదన్నారు. తన రాజకీయ భవిష్యత్, చేపట్టే కార్యాచరణను కాంగ్రెస్ అధినాయకత్వం నిర్ణయిస్తుందని వివేక్ చెప్పారు.

వివేక్ చేరిక బలాన్నిస్తుంది: రేవంత్‌రెడ్డి

కాంగ్రెస్ కావాలి.. కాంగ్రెస్ రావాలి అనే ప్రజల ఆకాంక్షకు వివేక్ చేరిక బలాన్నిస్తుందని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అన్నారు. ఆనాడు తెలంగాణ కోసం పోరాడిన ఎంపీల బృందం తిరిగి కాంగ్రెస్‌లో చేరడం శుభసూచకమన్నారు. తెలంగాణలో అధికారమార్పిడి జరగబోతోందని చెప్పారు. శంషాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌ను గద్దె దింపే శక్తి కాంగ్రెస్‌కు ఉందని వివేక్ విశ్వసిస్తున్నారని తెలిపారు. 'గాంధీ కుటుంబంతో వివేక్ కు ఎంతో అనుబంధం ఉంది. వివేక్ తో రాహుల్ గాంధీ ఫోన్ లో మాట్లాడి కాంగ్రెస్ లో చేరాలని కోరారు. వివేక్ తిరిగి కాంగ్రెస్ లో చేరడమంటే ఆయన సొంత కుటుంబంలో చేరినట్లే. ఆయన్ను కాంగ్రెస్‌లోకి సాదరంగా ఆహ్వానిస్తున్నా. వారి చేరిక కాంగ్రెస్‌కు వెయ్యేనుగుల బలాన్ని చేకూర్చింది'అని వ్యాఖ్యానించారు.

అయితే వెయిటింగ్!

- భట్టి విన్నపంతో సీపీఎం ఒక అడుగు వెనక్కు
- నేటి మధ్యాహ్నం 3 గంటల వరకు మరోసారి గడువు
- అప్పటిలోగా తేల్చకుంటే అభ్యర్థుల ప్రకటన ఉంటుందని స్పష్టీకరణ
- కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించే వరకూ వేచి చూడాలని సీపీఐ నిర్ణయం
- సీపీఐ రాష్ట్ర సమితి, సీపీఎం రాష్ట్ర కమిటీల్లో నేతల తర్జనభర్జన

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీతో మంగళవారం కటీఫ్ ప్రకటించిన సీపీఎం బుధవారం ఒక అడుగు వెనక్కు వేసింది. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రానికి కాంగ్రెస్ శాసనసభా పక్ష నాయకుడు భట్టి విక్రమార్క ఫోన్ చేసి విన్నవించడంతో గురువారం మధ్యాహ్నం 3 గంటల వరకు గడువు విధించింది. ఆ సమయంలోగా పొత్తులపై కాంగ్రెస్ పార్టీ స్పష్టత ఇవ్వకుంటే, వెంటనే మీడియా సమావేశం నిర్వహించి తమ అభ్యర్థుల ప్రకటన ఉంటుందని తేల్చిచెప్పింది.

సోనియా అనారోగ్యంతో చర్చలు జరగలేదట

తమ్మినేని వీరభద్రం గత ఆదివారం కాంగ్రెస్‌కు రెండ్రోజుల గడువు విధించారు. గడువు ముగిసినా కాంగ్రెస్ నుంచి స్పందన రాకపోవడంతో ఒంటరి పోరుకే వెళ్లాలని ఆ పార్టీ సూత్రప్రాయంగా నిర్ణయించారు. ఇది మీడియాలో ప్రచారం కావడంతో భట్టి విక్రమార్క తమ్మినేని వీరభద్రానికి ఫోన్ చేసి వేచి చూడమన్నారు. తమ పార్టీ అధిష్టానం పొత్తు విషయంపై చర్చిస్తుందని చెప్పారు. దీంతో తాము మరోసారి గడువు విధించినట్లు సీపీఎం తెలిపింది. బుధవారం జరిగిన ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్నారు. అనంతరం తమ్మినేని వీరభద్రం మీడియాతో మాట్లాడారు. సోనియాగాంధీ అనారోగ్యం రీత్యా వారితో సమావేశం జరగలేదని భట్టి చెప్పారని గురువారం ఉదయానికి కబురు చెప్తామని అన్నారని వెల్లడించారు. అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవడానికే ప్రయత్నం చేస్తున్నట్టు భట్టి తెలిపారన్నారు.

సీపీఐ, సీపీఎంలు కలిసే ఉంటాయి

సీపీఐతో తాము గురువారం ఉదయం మాట్లాడతామని తమ్మినేని తెలిపారు. వైరా, మిర్యాలగూడ కేటాయించకపోతే తాము ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అంచనాలు, సీపీఐ నిర్ణయాలపై తాము వ్యాఖ్యానించబోమన్నారు. అఖిల భారత స్థాయిలో తీసుకుంటున్న నిర్ణయాల మేరకే పొత్తులుంటాయే కానీ, ఎవరి పంచనో చేరడానికి కాదని ఆయన వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌తో పొత్తు ఉన్నా లేకపోయినా సీపీఐ, సీపీఎంలు కలిసే ఉంటాయని, ఒకవేళ సీపీఐతో కాంగ్రెస్ కలిసి వెళ్తే సీపీఎం ఒంటరిపోరు చేస్తుందని తమ్మినేని ప్రకటించారు. అయితే సీపీఐ అభ్యర్థులున్న స్థానాల్లో మాత్రం తాము పోటీ చేయబోమని ఆయన ప్రకటించారు.

కాంగ్రెస్ ప్రకటించే వరకు సీపీఐ ఎదురుచూపు...

మరోవైపు సీపీఐ కూడా బుధవారం రాష్ట్ర సమితి సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశానికి ఆ పార్టీ జాతీయ కార్యదర్శి డి.రాజా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ, తమతో భట్టి విక్రమార్క ఫోన్‌లో మాట్లాడారని తెలిపారు. పొత్తుల విషయంపై సానుకూల నిర్ణయం ఉంటుందని చెప్పారని వివరించారు. కాంగ్రెస్ తుది జాబితా ప్రకటించే వరకు వేచి చూసిన తర్వాతే తమ పార్టీ నిర్ణయం ఉంటుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పొత్తు ధర్మం పాటించకపోయినా తాము పాటిస్తామన్నారు. సీపీఎం వైఖరిపై తామేమీ నిర్ణయం తీసుకోలేదన్నారు. కాంగ్రెస్‌తో అవగాహనలో భాగంగా సీపీఐకి రెండు స్థానాలు ఇస్తామని పేర్కొందనీ, అందులో మార్పులు చేర్పులు ఉంటే తరువాత ఆలోచన చేస్తామన్నారు.



పొత్తు కుదిరినా ఆ స్థానాలు ఇస్తారా?

కాగా, సీపీఐకి కొత్తగూడెం, చెన్నూరు స్థానాలు, సీపీఎంకు మిర్యాలగూడ, వైరా స్థానాలు ఇస్తామని గతంలో కాంగ్రెస్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే సీపీఐ, సీపీఎంకు కేటాయిస్తామన్న ఈ నాలుగు స్థానాల్లో దాదాపు అన్నింటినీ ఇప్పుడు కాంగ్రెస్ ఇచ్చే పరిస్థితి లేదన్న చర్చ జరుగుతోంది. ఒకవేళ పొత్తు కుదిరినా ఈ స్థానాలు ఇస్తారన్న నమ్మకం కూడా లేదు. దీంతో కామ్రేడ్లలో తర్జనభర్జన జరుగుతోంది.

నేతల తీరుపై రెండు పార్టీల్లో గరంగరం...

ఇదిలావుండగా, రెండు పార్టీల రాష్ట్ర సమావేశాల్లో నాయకుల తీరుపై కొందరు పార్టీ సభ్యులు తీవ్రంగా మండిపడినట్టు తెలిసింది. పొత్తులపై ఇదేం పాకులాట అంటూ ఆగ్రహం వ్యక్తంచేసినట్లు తెలిసింది. అప్పుడు బీఆర్‌ఎస్‌తో కలిసి పనిచేసి, ఇప్పుడు కాంగ్రెస్‌తో పొత్తుకు పాకులాడడంపై ప్రజల్లో పలుచన అయిపోతున్నామని, ఇది పార్టీ ప్రతిష్టను దెబ్బతీస్తుందని కొందరు పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు నిలదీసినట్లు తెలిసింది. 2 స్థానాల్లో పోటీ అనడంతో వాటిపైనే దృష్టిపెట్టామని, ఇప్పుడు పొత్తు లేదని, 15 స్థానాల్లో పోటీ చేయాలంటే ఎలా సన్నద్ధం కాగలమని సీపీఎం శ్రేణులు ప్రశ్నించినట్లు సమాచారం.

సీపీఎం పోటీ చేయాలనుకుంటున్న స్థానాలివే

కాంగ్రెస్‌తో పొత్తు కుదరకపోతే సీపీఎం సింగిల్‌గానే బరిలోకి దిగాలని నిర్ణయించింది. ఇందుకోసం ఏయే స్థానాల్లో పోటీ చేయాలి, ఏ నియోజకవర్గంలో బలం ఉందనే వివరాలను బుధవారం నిర్వహించిన రాష్ట్ర కమిటీ సమావేశంలో సేకరించింది. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 15 నుంచి 20 స్థానాల్లో పోటీచేయాలని ప్రాథమికంగా నిర్ణయించినట్టు తెలుస్తోంది. వీటిలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఖమ్మం, పాలేరు, వైరా, సత్తుపల్లి, మధిర, భద్రాచలం, కొత్తగూడెం, అశ్వారావుపేటతోపాటు ఇల్లందులో బరిలోకి దిగాలని భావిస్తోంది. ఉమ్మడి నల్గొండ జిల్లాలో నల్గొండ, నకిరేకల్, మిర్యాలగూడ, సూర్యాపేటతో పాటు మరో స్థానంలో పోటీ చేయాలని నిర్ణయించింది. ఇక రంగారెడ్డి జిల్లాలో ఇబ్రహీంపట్నంతోపాటు మరోస్థానం, హైదరాబాద్‌లో ముషీరాబాద్, కార్వాన్ స్థానాలతోపాటు సంగారెడ్డి, పటాన్ చెరు బరిలో ఉండాలని సమావేశంలో చర్చించినట్టు తెలుస్తోంది. మహబూబ్ నగర్ జిల్లాలో కొల్లాపూర్ సహా మరో రెండు స్థానాల్లో పోటీకి దిగాలని నిర్ణయించినట్టు సమాచారం.

త్వరలో మైనారిటీ డిక్లరేషన్ విడుదల

- రూ.5 వేల కోట్లతో మైనారిటీ సబ్ ప్లాన్
- కాంగ్రెస్ నేత షబ్బీర్ అలీ వెల్లడి
- తానెక్కడ పోటీ చేయాలో సీఈసీ నిర్ణయిస్తుందని వ్యాఖ్య



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ మైనారిటీ డిక్లరేషన్‌ను త్వరలోనే విడుదల చేయనున్నట్లు మాజీ మంత్రి, మైనారిటీ డిక్లరేషన్ డ్రాఫ్ట్ కమిటీ చైర్మన్ షబ్బీర్ అలీ వెల్లడించారు. మైనారిటీ డిక్లరేషన్ కింద మైనారిటీల అభివృద్ధి, సంక్షేమం కోసం మైనారిటీ సబ్ ప్లాన్ అమలు, బడ్జెట్‌లో రూ. 5వేల కోట్లు కేటాయింపు కోసం సిఫార్సు చేసినట్లు తెలిపారు. బుధవారం గాంధీభవన్‌లో షబ్బీర్ అలీ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ముస్లిం రిజర్వేషన్ పెంపు కోసం న్యాయపరంగా ప్రయత్నిస్తూనే , ప్రస్తుతం అమలవుతున్న 4 శాతం రిజర్వేషన్‌కు పూర్తి స్థాయిలో రక్షణ కల్పిస్తామన్నారు. ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పిన సీఎం కేసీఆర్ పదేళ్లుగా ఒక అడుగు కూడా ముందుకు వేయలేదని విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వస్తే ముస్లింల 4 శాతం రిజర్వేషన్ రద్దు చేస్తామని ప్రకటిస్తే నోరు విప్పని బీఆర్‌ఎస్, మజ్లిస్‌లకు ఓట్లు అడిగే నైతిక హక్కు ఎక్కడిదని ప్రశ్నించారు. మైనారిటీ పక్షపాతిగా ప్రకటించుకునే కేసీఆర్‌కు దమ్ముంటే నిత్యం ముస్లింలపై విషం గక్కే గోషామ హల్ రాజాసింగ్‌పై పోటీ చేయాలని సవాల్ విసిరారు. మహ్మద్ ప్రవక్త గౌరవాన్ని భంగం కలిగించే విధంగా వాఖ్యలు చేసిన రాజాసింగ్‌ను ఓడించేందుకు మజ్లిస్ పార్టీకి అభ్యర్థిని పెట్టే దమ్ముందా అని ప్రశ్నించారు. ఒకటి రెండు రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల తుది జాబితా విడుదలవుతుందన్నారు. తానెక్కడ పోటీ చేయాలో కాంగ్రెస్ పార్టీ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ (సీఈసీ) నిర్ణయిస్తుందని షబ్బీర్ చెప్పారు.

తెలంగాణలో యథేచ్ఛగా వనరుల దోపిడీ

- తెలంగాణ యువజన సింహగర్జన సభలో కోదండరాం



ఖమ్మం వన్‌టౌన్: కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో పదేళ్లుగా వనరుల దోపిడీ యథేచ్ఛగా సాగిందని టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం ఆరోపించారు. అలాంటి అవినీతి కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దెదించాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. ఖమ్మంలో బుధవారం జరిగిన తెలంగాణ యువజన సింహ గర్జన మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఏళ్లు గడిచినా ఉద్యోగాలు రావడం లేదనే మనస్తాపంతో ప్రవల్లిక ఆత్మహత్య చేసుకుంటే ప్రేమ వ్యవహారమని చెప్పి, ఆ తల్లిని మరోసారి చంపిన నీచ ప్రభుత్వం కేసీఆర్‌దని దుయ్యబట్టారు. ఉద్యోగాలు రాలేదని 200 మంది నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. నిరుద్యోగులందరూ ఊళ్లలో తిరుగుతూ తమకు జరిగిన అన్యాయాన్ని ప్రజలకు వివరించాలని కోదండరాం పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీని ఖమ్మం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో గెలిపించి నయా రజాకార్ల ప్రభుత్వానికి చరమగీతం పాడాలని కోరారు. ఖమ్మంలో కాల్వ కట్ట వెంట పేదల గుడిసెలను తీయించిన సర్కార్.. ఇక్కడ మంత్రికి మాత్రం వేల గజాలను క్రమబద్ధీకరణ పేరుతో అప్పనంగా ఇచ్చిందని కోదండరాం ఆరోపించారు. కార్యక్రమంలో ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు, ఓయూ జేఏసీ నాయకుడు, సీనియర్ జర్నలిస్ట్ విఠల్ (రఘు), అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్నారం బ్యారేజీకి ప్రమాదమేం లేదు!

- నీటి లీకేజీ అంటూ వస్తున్న ప్రచారాన్ని నమ్మొద్దు: బ్యారేజీ ఈఈ యాదగిరి
- వార్షిక నిర్వహణ, మరమ్మతుల్లో భాగంగా పనులు జరుగుతున్నట్టు వెల్లడి



సీపేజ్ అయిన చోట ఇసుక సంచులు నింపుతున్న ఓఅండ్ఎం సిబ్బంది

కాళేశ్వరం: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన అన్నారం (సరస్వతి) బ్యారేజీలో నీటి లీకేజీ అంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని నమ్మవద్దని బ్యారేజీ ఈఈ యాదగిరి తెలిపారు. బ్యారేజీకి ఎలాంటి ప్రమాదం లేదని, పరిసర ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందవద్దని సూచించారు. భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండల పరిధిలో ఈ బ్యారేజీని నిర్మించిన విషయం తెలిసిందే. దీని నుంచి నీళ్లు లీకవుతున్నట్టుగా బుధవారం ఉదయం నుంచి సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. దీనిపై ఈఈ యాదగిరి వివరణ ఇచ్చారు. బ్యారేజీ వద్ద 1,275 మీటర్లతో పొడవుతో సీపేజ్ ఉంటుందని.. దీనికి వార్షిక నిర్వహణ (ఓఅండ్ఎం)లో భాగంగానే పనులు చేస్తున్నామని తెలిపారు. ఏటా సివిల్, మెకానిక్, ఎలక్ట్రికల్ మెయింటెనెన్స్ ఉంటుందని, సీపేజ్ తగ్గినప్పుడు మెటల్, ఇసుక వేస్తున్నామన్నారు. పూర్తి నిర్వహణ బాధ్యత అఫ్కాన్ సంస్థదేనని తెలిపారు. ప్రాజెక్టును ఇలాంటి సమస్యలను తట్టుకునే విధంగానే డిజైన్ చేశామన్నా రు. అవసరమైతే కెమికల్ గ్రౌటింగ్ కూడా చేస్తామన్నారు. కాగా బ్యారేజీ పూర్తి నిల్వ సామర్థ్యం 10.87 టీఎంసీలుకాగా, ప్రస్తుతం 5.75 టీఎంసీలు నిల్వ ఉన్నాయి.



బ్రహ్మోస్ క్షిపణి పరీక్ష విజయవంతం

సింధియా(విశాఖ పశ్చిమ): భారత నావికాదళంలోని తూర్పు నావికా విభాగం బ్రహ్మోస్ క్షిపణిని బుధవారం విజయవంతంగా పరీక్షించింది. బంగాళాఖాతంలో పరీక్షలో భాగంగా నావికాదళానికి చెందిన విధ్వంసకనౌక నుంచి ఈ క్షిపణిని ప్రయోగించారు. ఈ క్షిపణి నిర్దేశించిన కచ్చిత పరామితులను అందుకుందని ఇండియన్ నేవీ ఒక ప్రకటనలో పేర్కొంది. పరీక్ష తాలూకు ఫొటోను భారత నేవీ సామాజిక మాధ్యమం 'ఎక్స్' ఖాతాలో షేర్ చేసింది.

విపక్ష నేతలందరినీ అరెస్టు చేసే కుట్ర: మమత

కోల్‌కతా: కేంద్రంలో నరేంద్ర మోదీ సారథ్యంలోని బీజేపీ సర్కారుపై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ చీఫ్ మమతా బెనర్జీ బుధవారం తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లోగా విపక్ష నేతలందరినీ కేసుల్లో ఇరికించి జైలుపాలు చేసేందుకు కుట్ర పన్నుతోందని ఆరోపించారు. అలా ప్రత్యర్థులంటూ ఎవరూ లేకుండా చేసుకుని ఎన్నికలకు వెళ్లాలని చూస్తోందని మీడియాతో మాట్లాడుతూ మండిపడ్డారు. ఢిల్లీ సీఎం, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు మద్యం విధానం కుంభకోణం కేసులో గురువారం విచారణకు రావాల్సిందిగా ఈడీ సమన్లివ్వడం తెలిసిందే. ఇలాగే పలు కేసుల్లో పలువురు విపక్ష నేతలు కూడా ఇప్పటికే దర్యాప్తు సంస్థల నోటీసులు అందుకున్నారు. వీటిని ఉద్దేశించి మమత ఈ ఆరోపణలు చేశారు.

అరెస్టు కానున్న నేతలు వీరే: ఆప్

కోల్‌కతా: మమత ఆరోపణలు వాస్తవమేనని ఆప్ పేర్కొంది. లోక్‌సభ ఎన్నికల్లోపు విపక్ష ఇండియా కూటమి నేతలందరినీ ఏదోలా జైలుపాలు చేయాలని మోదీ సర్కారు కుట్ర చేస్తోందని ఆ పార్టీ నేత రాఘవ్ ఛద్దా ఆరోపించారు. తొలుత తమ అధినేత కేజ్రీవాల్‌ను అరెస్టు చేయజూస్తోందన్నారు. 2014 నుంచి దర్యాప్తు సంస్థలు నమోదు చేసిన కేసుల్లో ఏకంగా 95 శాతం విపక్ష నేతలపైనే కావడం మోదీ సర్కారు కక్షపూరిత వైఖరిని అద్దం పడుతోందని ధ్వజమెత్తారు. ''ఇండియా కూటమి ఆవిర్భావంతో బీజేపీ వణికిపోతోంది. అందుకే విపక్ష కూటమిలోని అగ్ర నేతలందరినీ లక్ష్యంగా చేసుకుందని మాకు విశ్వసనీయ వర్గాల నుంచి ఇప్పటికే సమాచారం అందింది. ''కేజ్రీవాల్ తర్వాత జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్, బిహార్ డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్, మమతా బెనర్జీ, ఆమె మేనల్లుడు, టీఎంసీ నేత అభిషేక్ బెనర్జీలను అరెస్టు చేయడం మోదీ సర్కారు లక్ష్యం. వారి తర్వాత జాబితాలో కేరళ సీఎం పినరయ్ విజయన్, తమిళనాడు సీఎం ఎం.కె.స్టాలిన్, శివసేన, ఎన్సీపీల అగ్ర నేతలున్నారు'' అని ఆరోపించారు.

ఉత్తర కొరియా నుంచి రష్యాకు ఆయుధాలు

సియోల్: ఉత్తర కొరియా పెద్ద సంఖ్యలో ఆయుధాలను రష్యాకు సరఫరా చేస్తోందని దక్షిణ కొరియా నిఘా సంస్థ 'నేషనల్ ఇంటెలిజెన్స్ సర్వీస్' బుధవారం వెల్లడించింది. ఈ ఏడాది ఆగస్టు నుంచి ఇప్పటివరకు 10 లక్షలకుపైగా ఆర్టిలరీ షెల్స్‌ను రష్యాకు పంపించిందని పేర్కొంది. ఉక్రెయిన్‌పై యుద్ధంలో ఈ ఫిరంగి గుండ్లను రష్యా ఉపయోగిస్తున్నట్లు అనుమానం వ్యక్తం చేసింది. అమెరికాతోపాటు పశ్చిమ దేశాల నుంచి ఆంక్షలను ఎదుర్కొంటున్న ఉత్తర కొరియా, రష్యా సంబంధాలు నానాటికీ బలపడుతున్నాయి. ఇరు దేశాలు కలిసి పని చేస్తున్నాయి. ఉక్రెయిన్‌పై సుదీర్ఘ యుద్ధం కొనసాగిస్తున్న రష్యా వద్ద ఆయుధ నిల్వలు నిండుకుంటున్నాయి. దాంతో ఉత్తర కొరియా ఆయుధ సాయం అందిస్తోంది. ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్, రష్యా అధ్యక్షుడు పుతిన్ సెప్టెంబర్‌లో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆయుధాల సరఫరా విషయంలో వారిద్దరి మధ్య ఒప్పందం కుదిరినట్లు తెలుస్తోంది.

మరాఠా రిజర్వేషన్లకు ఓకే : ఏక్‌నాథ్ షిండే



ముంబై: విద్యా సంస్థలు, ఉద్యోగాల్లో మరాఠాలకు రిజర్వేషన్లు ఇవ్వడానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ప్రకటించారు. రిజర్వేషన్ల అమ లు విషయంలో చట్టపరిధిలో విధివిధానాలు ఖరారు చేయడానికి కొంత సమయం అవసరమని చెప్పారు. రిజర్వేషన్ల అంశంపై మరాఠా ప్రజలంతా సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి షిండే నేతృత్వంలో బుధవారం అఖిలపక్ష సమావేశం జరిగింది. రిజర్వేషన్ల కోసం మరాఠాలు చేపడుతున్న ఆందోళనలు, జరుగుతున్న హింసాకాండపై చర్చించారు. నిరవధిక దీక్ష విరమించాలని సామాజిక కార్యకర్త మనోజ్ జారంగేని కోరుతూ అఖిలపక్ష భేటీలో ఒక తీర్మానాన్ని ఆమోదించారు. ఈ తీర్మానంపై ముఖ్యమంత్రి షిండే, ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఎన్సీపీ అధినేత శరద్ పవార్, శివసేన(ఉద్ధవ్‌వర్గం) నాయకుడు అనిల్ పారబ్ తదితరులు సంతకాలు చేశారు. అనంతరం సీఎం షిండే మీడియాతో మాట్లాడారు. హింసకు దూరంగా ఉండాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజలను రెచ్చగొట్టేలా వ్యవహరించవద్దని రాజకీయ పార్టీలకు సూచించారు.

రిజర్వేషన్లకు ఇంకా సమయం ఎందుకు?

ముంబై: మరాఠా వర్గానికి రిజర్వేషన్లు కల్పించే విషయంలో జాప్యం చేయడం తగదని ఉద్యమకారుడు మనోజ్ జారంగే చెప్పారు. రిజర్వేషన్లు అమలు చేయడానికి ఇంకా సమయం ఎందుకు కావాలని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఎప్పటి నుంచి రిజర్వేషన్లు అమలు చేస్తారో స్పష్టంగా చెప్పాలని బుధవారం డిమాండ్ చేశారు. మనోజ్ జారంగే జాల్నా జిల్లా అంతర్వాలీ శరతి గ్రామంలో నిరవధిక నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం తనతో చర్చలకు రావాలని ఆయన సూచించారు.

సెల్యులాయిడ్‌పై సిద్ధూ మూసేవాలా జీవితం!

ముంబై: పంజాబ్ యువ గాయకుడు, దివంగత సిద్ధూ మూసేవాలా జీవితగాథ త్వరలో సినిమాగా తెరకెక్కే అవకాశముంది. సిద్ధూ మూసేవాలా తన జీవితంలో చవిచూసిన పేరుప్రఖ్యాతలు, గ్యాంగ్‌స్టర్ల బెదిరింపులు, విషాదం అన్నింటినీ స్పృశిస్తూ జుపిందర్‌జీత్ సింగ్ రాసిన 'హూ కిల్డ్ మూసేవాలా? ది స్పైరలింగ్ స్టోరీ ఆఫ్ వాయలెన్స్ ఇన్ పంజాబ్' పుస్తకంపై హక్కులను చిత్ర నిర్మాణరంగ సంస్థ మ్యాచ్‌బాక్స్ షాట్స్ కొనుగోలుచేసింది. మూసేవాలా జీవితాన్ని వెబ్ సిరీస్‌గా లేదంటే సినిమాగా తెరకెక్కించే అవకాశముంది. 'శుభ్‌దీప్ సింగ్ సిద్ధూ.. సిద్ధూ మూసేవాలాగా ఎదిగిన క్రమాన్ని ఈ పుస్తకం అద్భుతంగా ఆవిష్కరించింది. పంజాబ్‌లో గ్యాంగ్‌స్టర్ల ఆధిపత్యం, వారి మధ్య మనస్పర్థలు, మాదకద్రవ్యాల వినియోగం, పంజాబ్‌లో సంగీత ప్రపంచం వెనుక దాగి ఉన్న చీకటి కోణాలనూ ఈ పుస్తకం చూపించింది' అని మ్యాచ్‌బాక్స్ సంస్థ ఒక ప్రకటనలో పేర్కొంది.

50 శాతం కమీషన్ల పాలన: కమల్‌నాథ్

నర్సింగాపూర్: మధ్యప్రదేశ్‌లో శివరాజ్‌సింగ్ చౌహాన్ పాలనలో 50 శాతం కమీషన్ల రాజ్యం నడుస్తోందంటూ పీసీసీ అధ్యక్షుడు కమల్‌నాథ్ ఆరోపించారు. చౌహాన్ అవినీతి పాలన రాష్ట్ర భవిష్యత్తును అంధకారమయం చేసిందన్నారు. బుధవారం నర్సింగాపూర్ జిల్లాలో ఎన్నికల ర్యాలీలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో యువత, రైతులు, అన్ని సామాజిక వర్గాల భవిష్యత్తును బీజేపీ పాలన సర్వనాశనం చేసిందన్నారు. కేవలం బీజేపీ నేతలు, అధికార పెద్దలు మాత్రమే అభివృద్ధి చెందారని ఆరోపించారు. 18 ఏళ్ల బీజేపీ పాలనలో రాష్ట్రంలో విద్య, వైద్యం, ఉపాధి వ్యవస్థ వంటివన్నీ పూర్తిగా పట్టాలు తప్పాయన్నారు. అబద్ధపు పథకాలను ప్రకటించనిదే చౌహాన్‌కు నిద్ర పట్టదని ఎద్దేవా చేశారు.

గాజా రక్తసిక్తం

ఇజ్రాయెల్ సైన్యం భీకర దాడులు

- జబాలియా శరణార్థి శిబిరంపై నిప్పుల వాన
- నేలమట్టమైన భవనాలు
- 50 మందికిపైగా మృతి.. వందలాది మందికి గాయాలు
- గాజా నుంచి వెళ్లిపోవడానికి విదేశీయులకు అనుమతి
- క్షతగాత్రులకు ఈజిప్టులో చికిత్స





జబాలియా శిబిర శిథిలాల్లో చిక్కుకున్న బాలికను బయటకు తీసి ప్రథమ చికిత్స చేశాక ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యాలు

ఖాన్ యూనిస్/రఫా/జెరూసలేం: గాజాపై ఇజ్రాయెల్ సైన్యం భీకర స్థాయిలో దాడులు కొనసాగిస్తోంది. భూతల దాడులతోపాటు వైమానిక దళం బాంబులు ప్రయోగిస్తోంది. గాజా రక్తసిక్తంగా మారుతోంది. హమాస్ మిలిటెంట్లతోపాటు వందలాది మంది సాధారణ ప్రజలు మృత్యువాత పడుతున్నారు. మృతుల సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. గాజా సిటీ సమీపంలో జబాలియా శరణార్థి శిబిరంలోని అపార్టుమెంట్లపై ఇజ్రాయెల్ సైన్యం రెండో రోజు బుధవారం కూడా దాడులు సాగించింది. పలు భవనాలు నేలమట్టమయ్యాయి. క్షతగాత్రులుగా మారి రక్తమోడుతున్న మహిళలను, చిన్నపిల్లలను శిథిలాల నుంచి బయటకు తీసుకొస్తున్న దృశ్యాలు కనిపించాయి. జబాలియాలో సాధారణ నివాస గృహాల మధ్య ఏర్పాటు చేసిన హమాస్ కమాండ్ సెంటర్‌ను, మిలిటెంట్ల సొరంగాలను ధ్వంసం చేశామని ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది. ఇక్కడ హమాస్ కీలక కమాండర్‌తోపాటు చాలామంది మిలిటెంట్లు హతమయ్యారని ప్రకటించింది. సాధారణ ప్రజలు 50 మందికిపైగానే మరణించినట్లు, వందలాది మంది గాయాలపాలైనట్లు తెలుస్తోంది. శరణార్థి శిబిరంలో ఇజ్రాయెల్ వైమానిక దాడులను ఖతార్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ)తోపాటు పాకిస్తాన్ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది.

గాజాలో భారత సంతతి ఇజ్రాయెల్ సైనికుడు మృతి

గాజాలో హమాస్ మిలిటెంట్లతో జరుగుతున్న ఘర్షణలో భారత సంతతి ఇజ్రాయెల్ సైనికుడు హలెల్ సోలోమాన్ (20) బుధవారం మృతిచెందాడు. దక్షిణ ఇజ్రాయెల్‌లోని డిమోనా పట్టణానికి చెందిన సోలోమాన్ హమాస్ మిలిటెంట్లపై వీరోచితంగా పోరాడుతూ ప్రాణాలు కోల్పోయాడు. అతడి మృతిపట్ల డిమోనా మేయర్ సంతాపం ప్రకటించారు. డిమోనా పట్టణాన్ని 'లిటిల్ ఇండియా'గా పిలుస్తుంటారు. భారత్ నుంచి వలస వచ్చిన యూదులు ఇక్కడ స్థిరపడ్డారు. గాజాలో మిలిటెంట్ల దాడుల్లో ఇప్పటివరకు 11 మంది ఇజ్రాయెల్ సైనికులు మృతిచెందారు. బుధవారం ఒక్కరోజే 9 మంది మరణించారు.

హమాస్ చెరలో 240 మంది బందీలు

ఇజ్రాయెల్ సైన్యం–హమాస్ మిలిటెంట్ల మధ్య ఘర్షణ మొదలై మూడు వారాలు దాటింది. ఇజ్రాయెల్ దాడుల్లో గాజాలో ఇప్పటిదాకా 8,700 మందికిపైగా పాలస్తీనియన్లు మరణించారని, 22,000 మంది గాయపడ్డారని గాజా ఆరోగ్య శాఖ బుధవారం ప్రకటించింది. ఇజ్రాయెల్ ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లో 122 మంది పాలస్తీనియన్లు చనిపోయారని వెల్లడించింది. హమాస్ చెరలో దాదాపు 240 మంది బందీలుగా ఉన్నారు. ఇప్పటివరకు నలుగురు బందీలను హమాస్ విడుదల చేసింది. బందీగా ఉన్న ఒక ఇజ్రాయెల్ మహిళా జవాన్‌ను ఇజ్రాయెల్ ప్రత్యేక దళాలు విడిపించాయి.

ఇంటర్నెట్, ఫోన్ సేవలకు అంతరాయం

గాజాలో ఇంటర్నెట్, మొబైల్ ఫోన్ సేవలు బుధవారం కొన్ని గంటలపాటు నిలిచిపోయాయి. సాయంత్రానికల్లా పునరుద్ధరించారు. ఇంటర్నెట్, ఫోన్ల సేవలకు తరచూ అంతరాయం కలుగుతుండడం వల్ల సహాయక చర్యలకు ఆటంకాలు ఎదురవుతున్నాయని స్వచ్ఛంద సంస్థలు చెబుతున్నాయి.

34 మంది జర్నలిస్టులు బలి

ఇజ్రాయెల్–హమాస్ యుద్ధంలో 34 మంది జర్నలిస్టులు మరణించారని 'రిపోర్టర్స్ విత్‌ఔట్ బార్డర్స్' సంస్థ వెల్లడించింది. ఇరు పక్షాలూ యుద్ధ నేరాలకు పాల్పడుతున్నాయని ఆరోపించింది. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. గాజాలో పాలస్తీనియన్ జర్నలిస్టులు దారుణ హత్యలకు గురవుతున్నారని, వీటిపై అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు విచారణ జరపాలని పేర్కొంది. సాధారణ ప్రజలు నివాసం ఉండే ప్రాంతాల్లో హమాస్ మిలిటెంట్లు మకాం వేస్తున్నారని, తద్వారా ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేసింది.

ఇజ్రాయెల్‌కు ఆహారం, ఇంధనం ఎగుమతులు ఆపేయండి



గాజాలో సాధారణ పాలస్తీనియన్ల ప్రాణాలను బలిగొంటున్న ఇజ్రాయెల్‌కు తగిన బుద్ధి చెప్పాలని ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ అన్నారు. ఇజ్రాయెల్‌కు ఆహారం, ఇంధనం ఎగుమతులను తక్షణమే నిలిపివేయాలని బుధవారం ఇస్లామిక్ దేశాలకు పిలుపునిచ్చారు. గాజాలో ఇజ్రాయెల్ సాగిస్తున్న నేరాలకు తక్షణమే అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇజ్రాయెల్‌ను ఏకాకిని చేయాలని, ఆర్థిక సంబంధాలు తెంచుకోవాలని ఇస్లామిక్ దేశాలకు సూచించారు.

విదేశీ పాస్‌పోర్టులు ఉన్నవారికి భారీ ఊరట

ప్రపంచ దేశాల నుంచి వస్తున్న ఒత్తిళ్లతో గాజా–ఈజిప్టు సరిహద్దును ఎట్టకేలకు తెరిచారు. విదేశీ పాస్‌పోర్టులు కలిగి ఉన్న ప్రజలు గాజా నుంచి రఫా క్రాసింగ్ గుండా ఈజిప్టుకు తరలివెళ్తున్నారు. ఇప్పటికే 150 మందికి పైగా జనం గాజా నుంచి బయటకు వెళ్లిపోయారు. అక్టోబర్ 7న ఇజ్రాయెల్ సైన్యం–హమాస్ మధ్య ఘర్షణ మొదలైన తర్వాత గాజా నుంచి విదేశీయులను బయటకు అనుమతిస్తుండడం ఇదే మొదటిసారి. విదేశీ పాస్‌పోర్టులు కలిగిన 400 మందికి బుధవారం అనుమతి ఇచ్చినట్లు పాలస్తీనా అధికార వర్గాలు తెలిపాయి. మరో బ్యాచ్‌లో మరికొంత మందికి అనుమతి ఇస్తామని వెల్లడించాయి. మరోవైపు గాజాలో ఇజ్రాయెల్ దాడుల్లో గాయపడిన 80 మందికిపైగా పాలస్తీనియన్లను చికిత్స కోసం ఈజిప్టుకు తరలించారు. దాదాపు 20 అంబులెన్స్‌లు ఈజిప్టుకు చేరుకున్నాయి. గాయపడిన వారికి చికిత్స అందించడానికి ఈజిప్టు–గాజా సరిహద్దుల్లో తాత్కాలికంగా ఒక ఆసుపత్రిని ఏర్పాటు చేసినట్లు ఈజిప్టు అధికారులు చెప్పారు. చాలామంది క్షతగాత్రులు ఈజిప్టుకు వెళ్లడానికి తమ వంతు కోసం ఎదురు చూస్తున్నారు.



బాంబుదాడులతో దద్దరిల్లుతున్న గాజా స్ట్రిప్ నుంచి రఫా సరిహద్దు గుండా ఈజిప్టులోకి అడుగుపెట్టిన పాలస్తీనియన్లు

పలు సమస్యలున్నాయి!

- ఎన్నికల బాండ్ల పథకంపై సుప్రీం
- బాండ్ల కొనుగోలులో పూర్తి గోప్యత లేదు
- అధికార పార్టీ ప్రతీకారానికి దిగే ఆస్కారం
- సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ వ్యాఖ్య



న్యూఢిల్లీ: ఎన్నికల బాండ్లతో పలు సమస్యలున్నాయంటూ సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. విరాళాలు పొందేందుకు పార్టీలన్నింటికీ అవి సమానావకాశం కల్పించకపోతే వివక్షే అవుతుందని అభిప్రాయపడింది. 'అంతేగాక ఈ పథకంలో అస్పష్టత కూడా దాగుంది. బాండ్లు కొనేవారి వివరాలు ఎవరికీ తెలియకుండా సంపూర్ణ గోప్యత పాటించడమూ వీలు కాదు. వారి వివరాలను సంబంధిత బ్యాంకు (ఎస్‌బీఐ), దర్యాప్తు సంస్థలు తెలుసుకునే వీలుంది' అని అభిప్రాయపడింది. అంతేగాక విపక్షాల బాండ్లను కొనేవారిపై అధికార పక్షాలు ప్రతీకారానికి దిగకుండా ఎటువంటి రక్షణా లేదని సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ ఆందోళన వెలిబుచ్చారు. ''ఏ పార్టీ ఎంత పవిత్రమైనదో తేల్చడం మా ఉద్దేశం కాదు. ఎన్నికల బాండ్ల పథకానికి రాజ్యాంగ బద్ధత ఉందా లేదా అన్నదానిపై మాత్రమే విచారణ జరుపుతున్నాం'' అని స్పష్టం చేశారు. ఎన్నికల బాండ్ల చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన 4 ప్రజాప్రయోజన వ్యాజ్యాలపై సీజేఐ సారథ్యంలోని ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం బుధవారం రోజంతా విచారణ జరిపింది. ''ఎన్నికల ప్రక్రియలో నల్లధన ప్రవాహానికి అడ్డుకట్ట వేయాలన్న ఈ పథకం ఉద్దేశం అభినందనీయమే. కానీ ఈ పథకంలో అతి పెద్ద సమాచార లోపముంది'' అని అభిప్రాయపడింది. ధర్మాసనంలో జస్టిస్ ఖన్నా, జస్టిస్ గవాయ్, జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా కూడా సభ్యులుగా ఉన్నారు.

మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్‌లలో కాంగ్రెస్

- రాజస్తాన్‌లో బీజేపీకి ఆధిక్యం
- తెలంగాణలో బీఆర్ఎస్‌కు మొగ్గు
- టైమ్స్ నౌ–ఈటీజీ సర్వేలో వెల్లడి



న్యూఢిల్లీ: ఐదు రాష్ట్రాల ఎన్నికలకు ముందు టైమ్స్ నౌ ఛానల్– ఈటీజీ రీసెర్చ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఒపీనియన్ పోల్‌లో మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్‌లలో కాంగ్రెస్‌కే ఆధిక్యం ఉన్నట్లు వెల్లడైంది. మధ్యప్రదేశ్‌లో పోటా పోటీ ఉన్నప్పటికీ కాంగ్రెస్‌కు స్వల్ప మొగ్గు కనపడుతోంది. బీజేపీ 43.7 శాతం ఓట్లతో 107–115 స్థానాల్లో నెగ్గే అవకాశాలున్నాయని పేర్కొన్న సర్వే.. కాంగ్రెస్ 44.9 ఓట్లతో 112–122 సీట్లు సాధిస్తుందని తేల్చింది. ఇతరులు కేవలం 1–3 స్థానాలకే పరిమితమవుతారని పేర్కొంది. మరోవైపు రాజస్తాన్‌లో బీజేపీ స్పష్టమైన ఆధిక్యంలో ఉందని టైమ్స్ నౌ సర్వే వెల్లడించింది. 43.8 శాతం ఓట్లతో బీజేపీ 114–124 స్థానాల్లో గెలవనుందని పేర్కొంది. కాంగ్రెస్ 41.9 శాతం ఓట్లతో 68 నుంచి 78 స్థానాలకు పరిమితం కానుందని తెలిపింది. చత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ 51–59 స్థానాలతో స్పష్టమైన ఆధిక్యం సాధిస్తుందని, బీజేపీ 27 నుంచి 35 స్థానాలకు పరిమితమవుతుందని సర్వే వెల్లడించింది. పైన పేర్కొన్న మూడు రాష్ట్రాల్లో ప్రస్తుతం రాజస్తాన్, చత్తీస్‌గఢ్‌లలో కాంగ్రెస్, మధ్యప్రదేశ్‌లో బీజేపీ అధికారంలో ఉన్న విషయం తెలిసిందే. ఇక తెలంగాణ విషయానికి వస్తే సర్వే వివరాలు పూర్తిగా అందనప్పటికీ ప్రాథమిక సమాచారాన్ని బట్టి అధికార బీఆర్ఎస్‌కే మొగ్గు కనపడుతోందని టైమ్స్ నౌ సర్వే పేర్కొంది.

మధ్యప్రదేశ్ (మొత్తం స్థానాలు 230)

పార్టీ	గెలుపు	ఓట్ల శాతం
కాంగ్రెస్	112-122	44.9
బీజేపీ	107-115	43.7
ఇతరులు	1-3	11.4

రాజస్తాన్ (మొత్తం స్థానాలు 200)

పార్టీ	గెలుపు	ఓట్ల శాతం
బీజేపీ	114-124	43.8
కాంగ్రెస్	68-78	41.9
ఇతరులు	6-10	14.3

చత్తీస్‌గఢ్ (మొత్తం స్థానాలు 90)

పార్టీ	గెలుపు	ఓట్ల శాతం
కాంగ్రెస్	51-59	42.3
బీజేపీ	27-35	39.3
ఇతరులు	2-6	18.4

పార్లమెంటరీ 'చర్చ' జరగాల్సిందే

- తమ సభ్యుల ఐఫోన్ల 'హ్యాకింగ్' ఉదంతంపై విపక్షాల పట్టు
- యాక్సెస్ నౌ నివేదిక వెనుక విపక్షాల హస్తముందన్న బీజేపీ

న్యూఢిల్లీ: విపక్ష సభ్యుల ఐఫోన్లపైకి ప్రభుత్వ ప్రాయోజిత హ్యాకర్లు దాడికి తెగబడ్డారన్న ఆరోపణలను విపక్షాలు తీవ్రతరం చేశాయి. ఈ అంశంపై పార్లమెంటరీ స్థాయి సంఘంలో చర్చించాల్సిందేనని పట్టుబట్టాయి. ఈ మేరకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అంశంపై ఏర్పాటైన పార్లమెంటరీ స్థాయి సంఘానికి కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం, సీపీఎం ఎంపీ జాన్ బ్రిట్టస్‌లు లేఖ రాశారు. స్టాండింగ్ కమిటీని అత్యవసరంగా సమావేశపరిచి హెచ్చరిక అలర్ట్‌లు అందుకున్న ఎంపీలతోపాటు ఐఫోన్ తయారీదారు యాపిల్ సంస్థ ప్రతినిధులనూ చర్చకు పిలవాలని లేఖలో డిమాండ్‌చేశారు. స్థాయి సంఘంలో చర్చకు అధికార బీజేపీ ససేమిరా అంటోంది. 'యాపిల్ సబ్‌స్క్రైబర్లకు సంబంధించిన ఈ అంశం కేంద్ర ప్రభుత్వ పరిధిలోనిది. హ్యాకింగ్ దాడిని ఎదుర్కొన్నాయంటున్న ఐఫోన్లను చెక్ చేయాల్సిన బాధ్యత రాష్ట్ర పోలీసులది. ఈ అంశాన్ని స్థాయీ సంఘంలో చర్చించాల్సిన అవసరమే లేదు' అని బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే వ్యాఖ్యానించారు.

అందుకే కేంద్రాన్ని వేలెత్తిచూపుతున్నారు: చిదంబరం

గతంలో పెగసస్ సాఫ్ట్‌వేర్ సాయంతో దేశంలో పలు రంగాల వ్యక్తులపై కేంద్రప్రభుత్వం నిఘా పెట్టిందన్న ఆరోపణల నడుమ ఐఫోన్ల హ్యాకింగ్ వెలుగుచూడటంతో అందరూ సహజంగానే కేంద్రప్రభుత్వం వైపే వేలెత్తిచూపుతారని కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం వ్యాఖ్యానించారు. '2019లో పలువురు సామాజిక కార్యకర్తలు, విపక్ష సభ్యులు, ప్రముఖ పాత్రికేయులు, జడ్జీల ఫోన్లపై పెగసస్ సాఫ్ట్‌వేర్‌తో కేంద్రం నిఘా పెట్టిందని దేశమంతటా కలకలం రేగడం తెల్సిందే. ఇప్పుడు వందలాది విపక్ష నేతలకు యాపిల్ ఐఫోన్ హ్యాకింగ్ అలర్ట్‌లు వచ్చాయనేది వాస్తవం. కేవలం విపక్ష నేతలకు మాత్రమే ఎందుకొచ్చాయి? హ్యాకింగ్ వల్ల భారీ ప్రయోజనం ఒనగూరేది ఎవరికి ?. ఈ ప్రశ్నలు తలెత్తినపుడు అందరూ అనుమానంతో కేంద్ర నిఘా సంస్థల వైపే వేలు చూపిస్తారు. ఎందుకంటే అనుమానించదగ్గ సంస్థలు అవి మాత్రమే' అని చిదంబరం ఆరోపించారు.

రక్షణ కల్పించండి: లోక్‌సభ స్పీకర్‌కు మొయిత్రా లేఖ

ప్రభుత్వ ఆధ్వర్యంలో పనిచేసే హ్యాకర్ల దాడుల నుంచి విపక్ష ఎంపీలను రక్షించాలని లోక్‌సభ స్పీకర్ బిర్లాను తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా కోరారు. ఈ మేరకు బిర్లాకు ఆమె లేఖ రాశారు.

నిఘాకు రూ.1,000 కోట్లు!

'అంతర్జాతీయ సంస్థలైన యాక్సెస్ నౌ, సిటిజెన్ ల్యాబ్ వంటి సంస్థలు సెప్టెంబర్‌లోనే ఇలాంటి యాపిల్ సంస్థ జారీచేసే హెచ్చరిక నోటిఫికేషన్ల విశ్వసనీయతను నిర్ధారించాయి. ఇంటెలెక్సా అలయెన్స్ వంటి సంస్థలతో కలిసి నిఘా కాంట్రాక్ట్‌లను కుదుర్చుకునేందుకు భారత ప్రభుత్వం తన బడ్జెట్ కేటాయింపులను పెంచుకుంటోందని ఇటీవలే 'ది ప్రిడేటర్ ఫైల్స్' పేరిట ఫైనాన్షియల్ టైమ్స్ ఒక పరిశోధనాత్మక సమగ్ర కథనాన్ని వెలువరించింది. ఈ నిఘా ఒప్పందాల విలువ దాదాపు 1,000 కోట్లు ఉంటుందని అంచనావేసింది' అని మొయిత్రా తన లేఖలో పేర్కొన్నారు. 2014 తర్వాత ఏదైనా నిఘా సాఫ్ట్‌వేర్‌ను కొన్నదీ లేనిదీ కేంద్రం బయటపెట్టాల్సిందేనని స్వతంత్ర రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ డిమాండ్‌చేశారు. కాగా, అలర్ట్ ఘటనపై వివరణ కోరుతూ యాపిల్ సంస్థకు సమన్లు జారీ చేయాలని పార్లమెంటరీ కమిటీ యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

భారత్, బంగ్లా సంయుక్తంగా..
పలు ప్రాజెక్టులకు శ్రీకారం



ఢాకా/అగర్తలా: భారత్, బంగ్లాదేశ్ ప్రధానులు నరేంద్ర మోదీ, షేక్ హసీనాలు బుధవారం సంయుక్తంగా పలు ప్రాజెక్టులను ప్రారంభించారు. త్రిపురలోని నిశ్చింతపూర్, గంగాసాగర్‌ను బంగ్లాదేశ్‌తో కలుపుతూ 65 కిలోమీటర్ల ఖుల్నా–మోంగ్లా పోర్ట్ రైల్వే లైన్, బంగ్లాలోని రామ్‌పూర్‌లో ఉన్న మైత్రీ సూపర్ థర్మల్ పవర్ ప్లాంట్ ప్రాజెక్టులను నేతలు వర్చువల్ విధానంలో ప్రారంభించారు. అగర్తలా నుంచి బంగ్లాలోని అఖౌరా వరకు నిర్మించిన రైలు మార్గం ఇరుదేశాల వాణిజ్యాన్ని పెంచుతుందని ఆశిస్తున్నారు. రైలులో అగర్తలా నుంచి ఢాకా మీదుగా కోల్‌కతా వెళ్లే వారికి ప్రయాణ సమయం భారీగా తగ్గనుంది. 'ఈశాన్య భారతం, బంగ్లాల మధ్య తొలి రైలు మార్గం అగర్తలా–అఖౌరా క్రాస్‌బోర్డర్ రైల్వేలింక్‌ను ప్రారంభించడం చరిత్రాత్మకం' అని ప్రారంభోత్సవం సందర్భంగా మోదీ వ్యాఖ్యానించారు. 12.24 కిలోమీటర్ల పొడవైన ఈ మార్గంలో రైలు 5.46 కి.మీ.లు త్రిపురలో మిగతా 6.78 కిలోమీటర్లు బంగ్లాదేశ్‌లో ప్రయాణిస్తుంది. 'రెండు దేశాల పరస్పర సహకార విజయాన్ని సంబరంగా జరుపుకునేందుకు మళ్లీ కలిశాం. గత దశాబ్దాల్లో రెండు దేశాల్లో జరగని అభివృద్ధిని ఈ 9 ఏళ్లలో సాధించాం. మన దేశాల పటిష్ట మైత్రీ బంధానికి ఈ ప్రాజెక్టులే సంకేతం' అని హసీనాతో వీడియో కాన్ఫరెన్స్ సందర్భంగా మోదీ వ్యాఖ్యానించారు. అగర్తలా–అఖౌరా రైలు మార్గం నిర్మాణం కోసం బంగ్లాకు భారత్ రూ.392.52 కోట్ల ఆర్థికసాయం అందజేసింది. కొత్త రైల్వే లైన్ అందుబాటులోకి రావడంతో ఈశాన్య రాష్ట్రాల్లో వాణిజ్యం, పర్యాటకం, అనుసంధానత ఊపందుకోనుంది. ఢాకా మీదుగా ఈ రైలు మార్గంలో అగర్తలా నుంచి కోల్‌కతాకు చాలా త్వరగా చేరుకోవచ్చు. ఈ మార్గం అందుబాటులోకి రావడంతో గతంలో ఉన్న 1,600 కిలోమీటర్ల దూరం ఏకంగా 500 కి.మీ.లకు తగ్గతోందని కార్యక్రమంలో పాల్గొన్న త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సాహా చెప్పారు.

అనుకున్నదొక్కటి.. అయినదొక్కటీ..

గాసిప్ టైమ్

అనుకున్నదొకటి... అయినదొక్కటీ...అన్నట్టుగా ఉందట భారతీయ జనతా పార్టీ పరిస్థితి.. ఇతర పార్టీల్లో నుంచి బీజేపీలో చేరిన నాయకులు ఒక్కొక్కరు బయటకు వెళ్లిపోతున్నారు. వెళ్లిపోవడానికి ముందు వరకు తాము పార్టీని వీడే సమస్య లేదని, ప్రాణం ఉన్నంత వరకు పార్టీలోనే ఉంటామని అధినేతలకు నమ్మబలుకుతున్నారు. దీనిని నమ్మిన పార్టీలో ముందు నుంచి ఉన్న నేతలు తమవారు పార్టీని విడిచే ప్రసక్తే లేదంటూ ఓపెన్‌గానే చెబుతున్నారు. అందుకు తాజా ఉదాహరణ పార్టీ మేనిఫెస్టో కమిటీ చైర్మన్ వివేక్ వెంకటస్వామి... ఆయన పార్టీ మారుతారని గత కొంతకాలంగా విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. దీన్ని ఆయన స్వయంగా ఖండించారు. అంతెందుకు ఆయన స్వయంగా బీజేపీ రాష్ట్ర పార్టీకి మేనిఫెస్టో రూపొందించి గతనెల చివర్లో రాష్ట్ర పర్యటనకు వచ్చిన అమిత్‌షాకు చూపించారట. ఆయన బాగానే ఉందని కితాబు ఇచ్చారు. ఇక ఆయన పార్టీ మారడని పార్టీలో అత్యున్నత నిర్ణాయక మండలి పార్టీ సభ్యుడు ఒకరు వివేక్ పార్టీ మారే ప్రసక్తే లేదంటూ ఆయన కుండబద్దలు కొట్టారు. తీరా మూడో జాబితా రూపొందించడానికి కీలక నేతలంతా ఢిల్లీలో సమావేశమైన తరుణంలో వివేక్ వెంకటస్వామి హస్తం పార్టీలో చేరిపోయారు. దీనితో ఎవరి నమ్మాలో ఎవరిని అనుమానించాలో తెలియని పరిస్థితి బీజేపీ నేతలకు ఏర్పడడంతో తలలు పట్టుకుంటున్నారట.

మేమేనండీ..

చందానగర్ పాపిరెడ్డికాలనీ వాంబే ఇళ్లవాసులం..
మేముండేది ఇక్కడే..
ఒకటి కాదు.. రెండు కాదు.. 1,100 కుటుంబాలు బతుకులు వెళ్లదీస్తోంది ఈ చెత్తాచెదారం మధ్యనే.
నాయకుల్లాగే వాళ్లూ ఎన్నికల హడావుడిలో ఉన్నారో ఏమిటో.. జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ 21 అధికారులు చెత్త తీయాలన్న సంగతే మరిచిపోయారు.. దీంతో ఈ చెత్త కారణంగా రోగాలు మమ్మల్ని చుట్టుముడుతున్నాయి.
ఈ ఎన్నికలు రాష్ట్ర ముఖచిత్రాన్నే మార్చేస్తాయట.
మరి ఇవే ఎన్నికలు మారుస్తాయా మా ఈ బతుకు చిత్రాన్ని..

- హఫీజ్‌పేట్



ఓటేస్తాం.. సీన్ మారుస్తారా?

జంగ్ తెలంగాణ

కట్ చేస్తే.. ఓటేస్తారా!

జెడ్పీ సెంటర్ (మహబూబ్‌నగర్): ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మహబూబ్‌నగర్‌లోని బోయపల్లిగేట్ సమీపంలోని ఓ మటన్ దుకాణంలో మటన్ కొట్టారు. సీఎం కేసీఆర్ కులవృత్తులను ప్రోత్సహిస్తున్నారని, మీ ఓటు కారు గుర్తుకు వేయాలని కోరారు.





'కళ'క్టర్

మధిర: ఓటర్లు ఓటింగ్‌లో పాల్గొనేలా చైతన్యపరిచేందుకు ఖమ్మం జిల్లా యంత్రాంగం కార్యాలయాల ప్రహరీలపై ఎన్నికల నినాదాలు, ఓటుహక్కు ఆవశ్యకతపై పెయింటింగ్‌లు వేయిస్తోంది. అయితే.. వీటిని విద్యార్థులతో వేయిస్తూ.. వారికి, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని నిర్ణయించింది. ఈమేరకు బుధవారం మధిరలో విద్యార్థులతో పెయింటింగ్‌లు వేయించగా కలెక్టర్ వీపీ గౌతమ్ పరిశీలించి తాను కూడా కాసేపు కుంచె పట్టి ప్రోత్సహించారు.

సూపర్ 'డూప్'ర్

మంచిర్యాల టౌన్: మంచిర్యాల నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావుకు మద్దతుగా డూప్ కేసీఆర్ ప్రచారం నిర్వహిస్తున్నాడు. భద్రాద్రి కొత్తగూడెంకు చెందిన రాజారమేశ్ కేసీఆర్ కళాకారుడిగా గుర్తింపు పొందారు. కేసీఆర్ గెటప్‌తో హావభావాలను పలికిస్తూ ఓటర్లను ఆకట్టుకుంటున్నారు. దీంతో స్థానికులు అతనితో ఫొటోలు దిగేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.



అభ్యర్థులు వారే.. గుర్తులు వేరే!

మారని ప్రత్యర్థులు.. మారిన రాజకీయ పార్టీలు

ఎన్నికల ప్రచారంలో గుర్తుకూ ప్రాధాన్యం

లేకపోతే అసలుకే ఎసరొస్తుందని అభ్యర్థుల భావన

నాడు స్వతంత్రులే.. నేడు ప్రధాన పార్టీల నుంచి బరిలోకి..


సాక్షి, హైదరాబాద్: రాజకీయాల్లో శాశ్వత మిత్రులు..శాశ్వత శత్రువులు ఉండరంటారు. ఇది అక్షర సత్యం. నిండు శాసనసభలో అధ్యక్షా అనాలనే వారి చిరకాలవాంఛ తీర్చుకునేందుకు ఎన్ని ఎత్తుగడలైనా వేస్తారు..ఎన్నిసార్లయినా గోడ దూకుతారు. తాజాగా తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో జరుగుతోందిదే. గత ఎన్నికల్లో గెలిచిన మళ్లీ టికెట్ దక్కిందన్న ధీమాగా ఉన్న నేతలు ఒకవైపు ఉండగా, మరోవైపు ఓడినా పార్టీ కోసం పనిచేస్తున్నాం కాబట్టి మళ్లీ అదృష్టం వరిస్తుందనే ఆశలో కొందరు నేతలున్నారు. ఇక టికెట్లు దక్కవని మరికొందరు నేతలు పక్క పార్టీల వైపు చూపులు చూస్తున్నారు. ఈ పరిస్థితుల్లో కొన్ని నియోజకవర్గాల్లో గత ఎన్నికల సమయంలో బండ బూతులు తిట్టిన పార్టీ నుంచే ఈసారి టికెట్ దక్కించుకున్న నేతలున్నారు. ఆయా సెగ్మెంట్లలో ప్రత్యర్థులు వాళ్లే, కానీ పార్టీలే మారాయి! కాకపోతే గతంలో పోటీ చేసిన గుర్తుతో కాకుండా మరో గుర్తుతో పోటీ చేయాల్సి వస్తుండటంతో.. ప్రచారంలో తమ పార్టీ గుర్తుకు కూడా అంతే ప్రాధాన్యం ఇస్తున్నారు.

కాంగ్రెస్ టు కాంగ్రెస్ వయా బీజేపీ..

2018లో మునుగోడు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ టికెట్‌తో పోటీ చేసి నెగ్గిన రాజగోపాల్‌రెడ్డి.. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరారు. ఆ తర్వాత జరిగిన ఉప ఎన్నికలో బీఆర్‌ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు. తాజాగా బీజేపీకి పార్టీని వీడి మళ్లీ కాంగ్రెస్‌లో చేరారు. ఇప్పుడు మునుగోడు హస్తం అభ్యర్థి ఈయనే. మాజీ ఎంపీ అయిన రమేష్ రాథోడ్ ఖానాపూర్ నుంచి, సోయం బాపురావు బోథ్ నుంచి గత ఎన్నికల్లో చేయి ఎత్తగా.. ఇప్పుడు కమలం తరపున తమ అదృష్టం పరీక్షించుకుంటున్నారు. 2014, 2018ల్లో వరుసగా రెండుసార్లు టీడీపీ టికెట్‌తో సత్తుపల్లి నుంచి గెలుపొందిన సండ్ర వెంకటవీరయ్య.. ఆ తర్వాత కారెక్కి అదే పార్టీ నుంచి బరిలో దిగారు.

నాడు స్వతంత్రంగా, ప్రధాన పార్టీ నుంచి..

గతంలో వికారాబాద్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన చంద్రశేఖర్ తాజాగా హస్తం గుర్తుతో జహీరాబాద్ నుంచి, గతంలో బాల్కొండలో బీఎస్‌పీ టికెట్‌తో పోటీ చేసిన ముత్యాల సునీల్ కుమార్.. తాజాగా కాంగ్రెస్ నుంచి రంగంలోకి దిగుతున్నారు. గత ఎన్నికల్లో నిర్మల్ నుంచి చేయి గుర్తుతో పోటీ చేసిన మహేశ్వర్ రెడ్డి ఇప్పుడు బీజేపీ టికెట్‌తో, 2018లో ఆర్మూర్ నుంచి, బీజేపీ టికెట్‌తో పోటీ చేసిన పొద్దుటూరి వినయ్‌కుమార్ రెడ్డి ఇప్పుడు కాంగ్రెస్ నుంచి, 2014, 2018ల్లో వరుసగా రెండుసార్లు నర్సాపూర్‌లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన సునీతా లక్ష్మారెడ్డి.. తాజాగా బీఆర్‌ఎస్ నుంచి పోటీలో దిగుతున్నారు.



గ్రేటర్‌లో..

- 2018లో కాంగ్రెస్ టికెట్‌తో మహేశ్వరం నియోజకవర్గం నుంచి పోటీ చేసిన సబిత.. ఇప్పుడు బీఆర్‌ఎస్ అభ్యర్థి.
- ఎల్బీనగర్, తాండూరు నుంచి 2018లో కాంగ్రెస్ అభ్యర్థులుగా గెలిచిన సుధీర్‌రెడ్డి, పైలెట్ రోహిత్‌రెడ్డి ఇప్పుడు కారులో ఉన్నారు.
- 2009 ఎన్నికల్లో కుత్బుల్లాపూర్ నుంచి స్వతంత్రంగా, 2014, 2018ల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన కూన శ్రీశైలంగౌడ్.. తాజాగా బీజేపీ నుంచి దిగుతున్నారు.
- 2018లో మల్కాజ్‌గిరి అభ్యర్థిగా బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసి గెలిచిన మైనంపల్లి.. ఈ సారి హస్తం గుర్తుతో రంగంలోకి దిగారు.
- 2018లో టీడీపీ టికెట్‌తో ఇబ్రహీంపట్నం నుంచి పోటీ చేసిన సామరంగారెడ్డి.. ఇప్పుడు బీజేపీ టికెట్‌తో ఎల్బీ నగర్ నుంచి పోటీకి ప్రయత్నం చేస్తున్నారు. గతంలో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన మర్రి శశిధర్ రెడ్డి.. ఇప్పుడు బీజేపీ నుంచి పోటీ దాదాపు ఖరారైంది.
- 2014లో కాంగ్రెస్ టికెట్‌తో మహేశ్వరం నుంచి, 2018లో బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్‌పీ) టికెట్‌తో ఇబ్రహీంపట్నం నుంచి పోటీ చేసి ఓడిపోయిన మల్‌రెడ్డి .. తాజాగా మళ్లీ కాంగ్రెస్ టికెట్‌తో ఇబ్రహీంపట్నం నుంచి అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. వీరేగాకుండా గత ఎన్నికల్లో వేర్వేరు పార్టీల చిహ్నాలపై గెలిచి/ఓడి... ఇప్పుడు మరో పార్టీ తరపున బరిలో నిలిచిన వారు అనేకమంది ఉన్నారు. మునుపెన్నడూలేని రీతిలో రాష్ట్ర రాజకీయాల్లో వేర్వేరు కండువాలు మార్చుకున్నవారి సంఖ్య ఈసారే ఎక్కువగా ఉండడం గమనార్హం.

నియోజకవర్గం	అభ్యర్థి	పార్టీ 2018	పార్టీ 2023
నకిరేకల్	చిరుమర్తి లింగయ్య	కాంగ్రెస్	బీఆర్‌ఎస్
	వేముల వీరేశం	టీఆర్‌ఎస్	కాంగ్రెస్
కొల్లాపూర్	బీరం హర్షవర్ధన్‌రెడ్డి	కాంగ్రెస్	బీఆర్‌ఎస్
	జూపల్లి కృష్ణారెడ్డి	టీఆర్‌ఎస్	కాంగ్రెస్
ఇల్లెందు	కనకయ్య	టీఆర్‌ఎస్	కాంగ్రెస్
	బానోతు హరిప్రియ	కాంగ్రెస్	బీఆర్‌ఎస్
పాలేరు	ఉపేందర్ రెడ్డి	కాంగ్రెస్	బీఆర్‌ఎస్
హుజూరాబాద్	ఈటల రాజేందర్	టీఆర్‌ఎస్	బీజేపీ
	పాడి కౌశిక్ రెడ్డి	కాంగ్రెస్	బీఆర్‌ఎస్
బోథ్	సోయం బాపూరావు	కాంగ్రెస్	బీజేపీ
	అనిల్ జాదవ్	స్వతంత్ర	బీఆర్‌ఎస్
సిర్పూర్	డా.పాల్వాయి హరీశ్	కాంగ్రెస్	బీజేపీ
	రావి శ్రీనివాస్	బీఎస్‌పీ	కాంగ్రెస్

సహజ వనరుల బ్యాలెన్స్‌షీట్స్ ఏవీ?

కె. రాహుల్

Interview



ప్రముఖ పర్యావరణవేత్త
ప్రొఫెసర్ కె. పురుషోత్తంరెడ్డి

చట్టసభల్లో వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ముందే సహజ వనరులకు సంబంధించిన బ్యాలెన్స్ ప్రకటించాల్సి ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రముఖ పర్యావరణ వేత్త, సామాజిక కార్యకర్త ప్రొ.కె.పురుషోత్తం రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థి సంఘం నేతగా వ్యవహరించిన ఆయన ఆ తర్వాత అదే వర్సిటీలో పొలిటికల్ సైన్స్ ప్రొఫెసర్‌గా, హెచ్‌ఓడీగా, చైర్మన్ బోర్డ్‌ఆఫ్ స్టడీస్‌గా, ఓయూ సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ డైరెక్టర్‌గా సేవలందించారు. 1990కు ముందు నుంచే వివిధరూపాల్లో పెరుగుతున్న వాయు, నీరు, వాతావరణ కాలుష్యాలపై గొంతెత్తి పోరాడారు. నల్లమల అడవుల్లో యురే నియం నిక్షేపాలను వెలికితీసే ప్రభుత్వ ప్రయత్నాలకు వ్యతిరేకంగా ఇతర సంస్థలతో కలిసి పోరాడి విజయం సాధించారు. పర్యావరణ అంశాలతో పాటు వర్తమాన రాజకీయ పరిస్థితులపై సాక్షి ఇంటర్వ్యూలో తనదైన శైలిలో సూటిగా అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

పబ్లిక్ డొమైన్‌లో ఆ వివరాలు ఎక్కడ ?

ప్రతీ ఏడాది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వార్షిక బడ్జెట్‌లను ప్రవేశపెట్టే ముందు పార్లమెంట్‌కు సహజ వనరుల బ్యాలన్స్ షీట్‌ను ప్రకటించాల్సి ఉంటుంది. అయితే ఇప్పటివరకు ఏ ప్రభుత్వం ప్రవేశపెట్టలేదు.పబ్లిక్ డొమైన్‌లో ఈ వివరాలు పెట్టాల్సి ఉన్నా ఎక్కడా ఆ సమాచారం లేదు. ప్రజలకు ఈ వివరాలు తెలిస్తేనే కదా.. ఆయా అంశాలపై అవగాహన ఏర్పడి చర్చల్లో పాల్గొనే అవకాశం ఉంటుంది. దేశంలోని సహజవనరులు, ఎక్కడెక్కడ ఉన్నాయి వాటి పరిస్థితి ఏమిటని తెలుసుకోకుండా రాష్ట్ర ప్రభుత్వాలు, లోకాయుక్తలు ఏ విధంగా పని చేయగలుగుతాయి. పేరుకు మాత్రమే నీతి ఆయోగ్ (గతంలో ప్రణాళికా సంఘం) వంటివి ఉన్నా... సహజ వనరుల తరుగుదల ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా దేశాభివృద్ధిని, పురోగతిని ఎలా అంచనా వేస్తాయి? రైతులకు అందజేయాల్సిన ఆధునిక సాంకేతికత, దాని ద్వారా సుస్థిర వ్యవసాయ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలను అస్సలు పట్టించుకోవడం లేదు. సేంద్రియ వ్యవసాయం, సహజ వ్యవసాయ పద్ధతులు, సహజవనరుల పరిరక్షణపై ఎలాంటి దిశానిర్దేశం లేకుండా పోయింది.

ఇసుక రవాణా తీవ్రమైన పర్యావరణ సమస్య...

అన్ని రాష్ట్రాల్లో సహజవనరు ఇసుక యథేచ్ఛగా దోపిడీకి గురవుతోంది. ఇసుక, గుట్ట లు, కొండలు, అడవి, ఇతర సహజవన రులు దేశప్రజల ఉమ్మడి ఆస్తి. అధికారంలో ఉన్న పార్టీ ఇష్టారీతిన తవ్వి అమ్ముకోడానికి కాదు. వాగుల్లో ఇసుక లేక పోతే నీరు రీచార్జ్ కాదు. గుట్టలు తొలగిస్తే దాని ప్రభా వం కూడా పర్యావరణ వ్యవస్థపై పడుతుంది. అధికార పార్టీ నేతలకు ఆర్థికంగా ప్రయోజనం కలిగించే చర్యలు పేదల పాలిట శాపాలుగా మారుతున్నాయి.

స్థానిక ప్రభుత్వాలకు స్వయం ప్రతిపత్తి

ప్రస్తుతం రాజకీయపరమైన అధికారాలన్నీ కూడా అధికారంలో ఉన్న పార్టీల వద్ద కేంద్రీకృతమై ఉన్నాయి. రాజ్యాంగపరంగా గ్రామీణ స్థానిక సంస్థలు, పట్టణ స్థానిక సంస్థల వంటి స్థానిక ప్రభుత్వాలకు కొన్ని అధికారాలు కేటాయించారు. వాటిపై రాష్ట్ర ప్రభుత్వాలు ఆధిపత్యం చెలాయించకుండా హక్కుల రక్షణకు రాష్ట్ర ఎన్నికల సంఘాలు (ఎస్‌ఈసీ) ఏర్పాటు చేశారు. ఆ క్రమంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ బాధ్యతలను ఎస్‌ఈసీలకు అప్పగించినా..అవి రాష్ట్ర ప్రభుత్వాలను ఎదిరించి, స్వతంత్రంగా పనిచేసే స్థాయికి ఎదగలేదు. తమ పరిధిలో నిష్పక్షపాత నిర్ణయాలు కూడా తీసుకోలేని స్థితిలో వున్నాయి. అవి రాష్ట్ర ప్రభుత్వ అధీనంలో పనిచేసే శాఖలుగా మారిపోవడం విషాదకరం.

రాజ్యాంగానికి అనుగుణంగా కాకుండా ఇష్టారాజ్యంగా ప్రభుత్వాలు

లోకాయుక్త, మానవహక్కుల కమిషన్ వంటివి కేవలం ఆకారపుష్టిగానే మిగిలిపోయాయి. ఇక సమాచారహక్కు కమిషనర్ల నియామకమే జరగడం లేదు. రాజ్యాంగానికి అనుగుణంగా కాకుండా రాష్ట్రప్రభుత్వాలు ఇష్టారాజ్యంగా పనిచేస్తున్నాయి. ఎన్నికలప్పుడు ఇలాంటి ముఖ్యమైన అంశాలు చర్చకు రావడం లేదు. కులం,మతం, ప్రాంతం వంటి విషయాలకు అధిక ప్రాధాన్యతనిచ్చి చర్చను పక్కదోవ పట్టిస్తున్నారు. గతంతో పోల్చితే ఇప్పుడు ప్రజాసమస్యలనేవి ఏమాత్రం ప్రధానచర్చకు రావడం లేదు.

ఎన్నికల్లో సామాన్యుడు పోటీ చేసే పరిస్థితి ఉందా ?

ఎన్నికలనేవి ఎమ్మెల్యేల అభ్యర్థులకు వ్యాపారంగా మారిపోవడం విషాదకరం. రాజకీయపార్టీలు కూడా సిగ్గులేకుండా ఎన్నికోట్లు ఖర్చుచేస్తారనే దాని ప్రాతిపదికన అభ్యర్థులకు టికెట్లు కేటాయిస్తున్నాయి. ఎన్నికల్లో డబ్బు పాత్ర విపరీతంగా పెరిగిపోవడంతో సామాన్యులు అసలు పోటీ చేయాలని కనీసం ఆలోచన చేసే, సాహసించే పరిస్థితులే లేకుండా పోయాయి.

సుస్థిర అభివృద్ధిపై హామీ ఏదీ?

అటు కేంద్ర, ఇటు రాష్ట్రప్రభుత్వాలు దేశ, రాష్ట్రాల సుస్థిర అభివృద్ధి గురించి స్పష్టమైన హామీలు ఇవ్వకపోతే ఎలా? సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు సంబంధించిన ప్యారిస్ అగ్రిమెంట్‌లో సంతకం పెట్టి భారత్ భాగస్వామి అయినా...వాటిని సాధించే దిశలో మాత్రం అడుగులు వేయకపోవడం విచారకరం. ఈ విషయంలో మన దేశం వ్యవహారశైలి తీసికట్టుగా ఉంది.

పర్యావరణ అంశాలపై ..

దేశంలో ప్రవహించే ప్రతీ నదిలో ప్రవహించే నీరు విషతుల్యంగా మారుతోంది. వాయు కాలుష్యం తీవ్రస్థాయికి చేరుకోవడంతో... వాయునాణ్యత తీసికట్టుగా మారి దేశవ్యాప్తంగా పీల్చే గాలి విషంగా మారుతోంది. జీవవైవిధ్యమే పూర్తిస్థాయిలో దెబ్బతింటోంది. దీంతో మొత్తం దేశమే ఓ గ్యాస్ చాంబర్‌గా మారుతోంది. ఈ అంశాలేవి కూడా అటు లోక్‌సభ ఎన్నికల్లో, ఇటు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఎక్కడా చర్చనీయాంశం కావడం లేదు. అసలు ఈ సమస్యలకు ప్రాధాన్యత లేదన్నట్టుగా రాజకీయపార్టీలు పట్టించుకోవడం లేదు.

5 అంత వీజీ కాదు!

గౌటే దేవేందర్

రాష్ట్రంలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో సగటున ఓటర్ల సంఖ్య 2.5లక్షల నుంచి 3 లక్షల వరకు ఉంటుంది. ఆ మేరకు ఓటర్లున్న చోట గెలిచేందుకు అభ్యర్థులు అన్నిరకాల ప్రయత్నాలు చేస్తుంటారు. కానీ రాష్ట్రంలోని ఓ ఐదు నియోజకవర్గాల్లో మాత్రం అభ్యర్థులు అందరికన్నా ఎక్కువగా తంటాలు పడక తప్పని పరిస్థితి. ఎందుకంటే అవి రాష్ట్రంలోనే ఎక్కువ మంది ఓటర్లున్న సెగ్మెంట్లు. వీటిలో ఓటర్ల సంఖ్య 5 లక్షలపైనే. ఇందులోనూ రెండింటిలో అయితే ఆరు లక్షలపైనే ఓటర్లు ఉన్నారు. అంటే రెండు, మూడు సాధారణ నియోజకవర్గాలతో సమానం అన్నమాట. ఇవన్నీ హైదరాబాద్ నగరం, శివారు ప్రాంతాల్లో విస్తరించి ఉన్నవే. వీటిలో శేరిలింగంపల్లి (6.98 లక్షలు), కుత్బుల్లాపూర్ (6.69 లక్షలు), ఎల్బీనగర్ (5.66 లక్షలు), రాజేంద్రనగర్ (5.52 లక్షలు), మహేశ్వరం (5.17 లక్షలు) ఉన్నాయి. ఇవన్నీ నియోజకవర్గాల పునర్విభజనతో 2009లో కొత్తగా ఏర్పడినవే కావడం గమనార్హం. ఎక్కువ మంది ఓటర్లేకాదు.. బస్తీల నుంచి గేటెడ్ కమ్యూనిటీల దాకా, అత్యంత సంపన్నుల నుంచి కూలీపని చేసుకునేవారి దాకా విభిన్న వర్గాలు, కులాలు, వివిధ మతాల ప్రజలు వీటిలో ఉన్నారు. వీరందరినీ ఆకట్టుకుని ఓట్లుగా మలచుకోవడం ఆషామాషీ కాదు. ఖర్చు కూడా ఎక్కువగా పెట్టాల్సిన పరిస్థితి. ఈ నియోజకవర్గాల గురించి ఒక్కసారి తెలుసుకుందామా..

శేరిలింగంపల్లి టాప్

రాష్ట్రంలో ఎక్కువ ఓటర్లున్న నియోజకవర్గం శేరిలింగంపల్లి. ఇక్కడ 6,98,133 మంది ఓటర్లు ఉన్నారు. ఇక్కడ 2009లో కాంగ్రెస్ నుంచి పోటీచేసిన బీసీ నేత భిక్షపతియాదవ్.. టీడీపీ అభ్యర్థి మొవ్వ సత్యనారాయణపై 1,327 ఓట్ల తేడాతో గెలిచారు. 2014లో టీడీపీ, బీజేపీ కూటమి తరఫున కమ్మ సామాజికవర్గ నేత అరికపూడి గాంధీ.. బీఆర్ఎస్ అభ్యర్థి శంకర్‌గౌడ్‌పై 75,904 ఓట్ల మెజారిటీతో గెలిచారు. 2018 ఎన్నికల్లో అరికపూడి గాంధీ బీఆర్ఎస్ తరఫున బరిలోకి దిగి.. టీడీపీ అభ్యర్థిపై భవ్య ఆనంద్‌పై 44,194 ఓట్ల తేడాతో విజయం సాధించారు.

కుత్బుల్లాపూర్ బీసీ నేతలదే..

ఓటర్ల సంఖ్యలో రెండో స్థానంలో ఉన్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో 6,69,361 మంది ఓటర్లు ఉన్నారు. ఇక్కడి జనం తొలి నుంచీ బీసీ నేతలకు మద్దతుగా నిలుస్తున్నారు. 2009లో బీఆర్ఎస్ అభ్యర్థి కేపీ వివేకానందగౌడ్‌పై స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసిన కూన శ్రీశైలంగౌడ్ 23,219 ఓట్లతో గెలిచారు. 2014లో బీఆర్ఎస్ నేత కె.హన్మంతరెడ్డిపై టీడీపీ తరఫున బరిలోకి దిగిన కేపీ వివేకానందగౌడ్ 39,021 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. తర్వాత బీఆర్ఎస్‌లో చేరిన వివేకానంద.. 2018 ఎన్నికల్లో ఆ పార్టీ తరఫున పోటీ చేసి, కాంగ్రెస్ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్‌పై 41,500 ఓట్ల తేడాతో గెలిచారు.

ఐదో స్థానంలోని మహేశ్వరంలో..

మహేశ్వరం నియోజకవర్గం ఎక్కువ ఓటర్ల జాబితాలో ఐదో స్థానంలో ఉంది. 2009లో టీడీపీ అభ్యర్థి తీగల కృష్ణారెడ్డిపై కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన పి.సబితా ఇంద్రారెడ్డి 7,833 ఓట్లతో గెలిచారు. ఉమ్మడి ఏపీ చరిత్రలో తొలి మహిళా హోంమంత్రిగా వైఎస్సార్ కేబినెట్‌లో బాధ్యతలు చేపట్టారు. ఇక 2014లో ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి ఎం.రంగారెడ్డిపై టీడీపీ అభ్యర్థి తీగల కృష్ణారెడ్డి 30,784 ఓట్ల తేడాతో విజయం సాధించారు. తర్వాత బీఆర్ఎస్‌లో చేరిన కృష్ణారెడ్డి 2018లో ఆ పార్టీ తరఫున బరిలోకి దిగగా.. ఆయనపై కాంగ్రెస్ నుంచి బరిలో ఉన్న సబితా ఇంద్రారెడ్డి 9,227 ఓట్లతో గెలిచారు. తర్వాత ఆమె బీఆర్ఎస్‌లో చేరి విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

ఎల్బీనగర్‌లో ఖాతా తెరవని బీఆర్ఎస్

ఎక్కువ మంది ఓటర్లున్న నియోజకవర్గాల్లో మూడోదైన ఎల్బీనగర్‌లో 5,66,866 మంది ఓటర్లు ఉన్నారు. 2009లో టీడీపీ అభ్యర్థి ఎస్వీ కృష్ణప్రసాద్‌పై కాంగ్రెస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి 13,142 ఓట్ల మెజారిటీతో గెలిచారు. 2014లో బీఆర్ఎస్ అభ్యర్థి రామ్మోహన్‌గౌడ్‌పై టీడీపీ అభ్యర్థి ఆర్.కృష్ణయ్య 12,525 ఓట్లతో విజయం సాధించారు. 2018లో బీఆర్ఎస్ అభ్యర్థి రామ్మోహన్‌పై కాంగ్రెస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి 17,251 ఓట్లతో గెలిచారు. తర్వాత కొద్దిరోజులకే ఆయన బీఆర్ఎస్‌లో చేరారు.

బీసీలకే రాజేంద్రనగర్ మద్దతు

ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉన్న సెగ్మెంట్లలో నాలుగో స్థానంలోని రాజేంద్రనగర్‌లో 5,52,455 మంది ఓటర్లు ఉన్నారు. 2009లో ఏర్పాటైనప్పటి నుంచీ బీసీ నేత ప్రకాశ్‌గౌడ్ వరుసగా గెలుస్తూ వస్తున్నారు. 2009, 2014 ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేసిన ప్రకాశ్‌గౌడ్.. కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన జ్ఞానేశ్వర్‌పై విజయం సాధించారు. తర్వాత ఆయన బీఆర్ఎస్‌లో చేరారు. 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున పోటీ చేసిన ప్రకాశ్‌గౌడ్.. టీడీపీ అభ్యర్థి గణేశ్‌పై 57,331 ఓట్లతో భారీ మెజారిటీతో గెలిచారు. ఈ ఎన్నికల్లో మూడో స్థానంలో నిలిచిన ఎంఐఎం అభ్యర్థి మీర్జా రహమత్‌కు 46 వేలకు పైగా ఓట్లు రావడం గమనార్హం.

రాష్ట్రంలో అతి తక్కువ ఓటర్లున్న ఐదు అసెంబ్లీ స్థానాలివీ..

నియోజకవర్గం	భద్రాచలం	అశ్వారావుపేట	బెల్లంపల్లి	చెన్నూరు	వైరా
ఓటర్లు	1,46,016 మంది	1,53,808 మంది	1,69,759 మంది	1,84,250 మంది	1,90,950 మంది

పొలిటికల్ పోకిరి!



షుగర్ & పెప్పర్
..:: యాసీన్

"ఓటరంటే ఎవడ్రా ఇక్కడా?.. ఎవడికక్కడ ఓటరు?" యమ జబర్దస్తీగా అడిగారు అనుభవం లేని అహంకార పార్టీలవాళ్లు కొందరు.

"ఓటరు కావాలా భయ్యా! ధబ్..ఎవ్వడు ఓటుతో కొడితే..ఎరుపూ, పింకూ, మూడ్రంగులూ, ఆకుపచ్చ–కాషాయమూ ఒకేసారి కనిపించి..దిమ్మ దిరిగి, మైండు బ్లాంకవుతుందో వాడే ఓటరు గాడు. అంటే నేనే. ఏమిటి సంగతి?" అడిగాడు ఓటరు.

"పోలింగ్ డే కదా.. ఎలక్షన్ కమిషన్ వాళ్లు కాస్త పోలింగ్‌బూతు దాకా రమ్మంటున్నార్ సార్" అప్పటికే కళ్లు బైర్లుగమ్మడంతో ఓటరు–హీరో పవర్ తెలుసుకొని, కాస్త మర్యాదకు దిగారు.

లోకల్ ఎంఎంటీఎస్ రైల్వేస్టేషన్‌లో కూర్చుని హీరోయిన్లలాంటి రకరకాల పార్టీలను చూస్తూ ఓటర్–హీరో కామెంట్ చేస్తున్నాడు.

"ఒకళ్లు ఇరవైనాలుగ్గంటలూ కరెంటనీ, నాల్గొందలకే సిలిండరనీ, మరొకరు ఆరు గ్యారంటీలనీ, ఇంకెవరో ఇంకోటనీ..బాక్సులకు బాక్సులు వాగ్దానాలతో కూరి, ఉప్మాల్లా ఊరిస్తున్నారుగానీ..ఎవరన్నా ఎప్పుడన్నా ఏమన్నా పెట్టారా? మీ పార్టీల ఫ్యామిలీ ఫ్యామిలీ అంతా ఈ ప్రామిసులుప్మానే తింటున్నారా?" కొంటెగా అడిగాడు ఓటరు.

"రుచి చూడు... మా మేనిఫెస్టో తినేయ్. తర్వాత అన్ని పార్టీల వాళ్లవీ గుటకేయ్"

మరో సందర్భంలో వివిధ పార్టీలు హీరోయిన్లలా మాట్లాడుతున్నప్పుడు...

"ఏయ్ ఓటర్... ఎక్కడున్నావ్?"

"ఇక్కడే పోస్టాఫీస్‌లో"

"వాట్సాప్, ఈ–మెయిళ్ల జమానాలో పోస్టాఫీస్‌కా? అసలీరోజుల్లో వెళుతున్నారా ఎవరైనా? పోస్టాఫీసుకు వెళ్లే ముఖమేనా నువ్వు? నీ చూపులు నా వీపును తాకుతున్నాయ్. కానీ..నీ వేలు తాకాల్సింది..ఈవీఎంలో నా గుర్తుపైన"

"ఇంతకూ ఆ అమ్మాయి ఎవరు?" (అక్కడే ఉన్న మరో ప్రత్యర్థి పార్టీవాళ్లను చూస్తూ)

"ఫ్రెండు"

"ఫ్రెండా?" కాస్త అసూయగా.

"అబ్బా..వెళ్లిపొమ్మని చెప్పండ్రా. ఈళ్ల ప్రచారాలతో చస్తున్నా"

ట్రైను ఫైటులాంటి క్రితం ఎన్నికలు ముగిశాక.. హీరోయిన్ అన్న మాటలేమిటంటే..

"ఎందుకో నిన్ను చూస్తుంటే మా ప్రత్యర్థుల కంటే ఎక్కువ భయమేస్తోంది. కానీ.. నువ్వంటేనే చాలా ఇష్టం పెరిగిపోతోంది. ఐ లవ్ యూ"

ఓటరెప్పుడూ పోకిరే. పొలిటికల్‌గా తుంటరే. అభ్యర్థులందరూ కథానాయికల్లాంటి వాళ్లయితే..ఆ పోకిరి చిలిపి కిరికిరి చేస్తుంటాడు వాళ్లతో.

పోలింగ్ రోజు దాకా అలాంటి కలరే ఇస్తూ..అల్లరి చిల్లరిగా తిరిగేస్తూ కనిపిస్తాడా..సడన్‌గా బ్యాలెట్‌బాక్సులు/ఈవీఎంల ఓపెనింగ్ టైమ్‌లో మాంచి పవర్‌ఫుల్ స్థాయి ఆఫీసర్‌లా సస్పెన్స్ ఎంట్రీ ఇస్తుంటాడు.

ఈ పోకిరీ..ఈసారి ఎవరికి పవర్ చూపనున్నాడో?

ఎవర్ని పవర్‌లోకి తేనున్నాడో?!

ఇద్దరూ ఒకేసారి శాసనసభ పక్ష నేతలుగా...

'చెన్నమనేని' బ్రదర్స్ పేరిట అరుదైన రికార్డు


రాజేశ్వర్‌రావు


విద్యాసాగర్‌రావు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: చెన్నమనేని రాజేశ్వర్‌రావు, చెన్నమనేని విద్యాసాగర్‌రావులు అరుదైన రికార్డు సొంతం చేసుకున్నారు. వారిద్దరూ ఉమ్మడి శాసనసభలో కరీంనగర్ జిల్లాలో వేర్వేరు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఎన్నికవ్వడం, భిన్న ధ్రువాలు, విభిన్న సిద్ధాంతాలతో సీపీఐ, బీజేపీల నుంచి ప్రాతినిధ్యం వహించడం, శాసనసభలో సభాపక్ష నేతలుగా ఉండటం ఎప్పటికీ ఓ రికార్డే.

- చెన్నమనేని రాజేశ్వర్‌రావు 1957లో చొప్పదండి నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. సిరిసిల్ల నియోజక వర్గం నుంచి 1967, 1978, 1985, 1994 ఎన్నికల్లో సీపీఐ నుంచి, 2004లో టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు.
- ఆయన సోదరుడైన చెన్నమనేని విద్యాసాగర్‌రావు 1985,1989,1994 ఎన్నికల్లో బీజేపీ నుంచి మెట్‌పల్లి ఎమ్మెల్యేగా గెలుపొందారు. కరీంనగర్ ఎంపీగా 1998, 1999 ఎన్నికల్లో రెండుమార్లు ఎంపికై కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా పనిచేశారు. ఆనంతరం మహారాష్ట్ర గవర్నర్‌గా నియమితులయ్యారు.
- 1994 నుంచి 1999 మధ్యకాలంలో ఉమ్మడి శాసనసభలో బీజేపీ శాసనసభ పక్షనేతగా సీహెచ్ విద్యాసాగర్‌రావు, సీపీఐ శాసనసభ పక్షనేతగా సీహెచ్ రాజేశ్వర్‌రావు ఉన్నారు. అసెంబ్లీలో కాషాయదళపతిగా విద్యాసాగర్‌రావు, ఎరుపుదళానికి నాయకుడిగా రాజేశ్వర్‌రావు తమ పార్టీల వాణిని ఆయా సందర్భాల్లో బలంగా వినిపించారు. ఒకరి విధానాలను మరొకరు ఖండించి ఎండగట్టారు. ఎదుట నిలుచుంది సోదర బంధం, రక్త సంబంధమైనా విధానాలపరంగా ఒకరినొకరు విరుద్ధ వేదికలపై నిలిచారు. విధానాలపరంగా పరస్పరం ఎదుటి పార్టీలో ఉన్న సోదరుడిని నిలదీసేందుకు, ప్రశ్నించేందుకు ఏనాడూ వెనకడుగు వేయని అరుదైన సందర్భాలు వీరిద్దరి హయాంలో అనేకమున్నాయి.

పాప్‌కార్న్

రేపే ఎన్నికల నోటిఫికేషన్ జారీ

ఆ వెంటనే నామినేషన్ల ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ సాధారణ ఎన్నికల నోటిఫికేషన్ శుక్రవారం జారీ కానుంది. ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్ వెల్లడి కానుంది. ఆ వెంటనే రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుంది. నవంబర్ 3 నుంచి 10వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు.

నవంబర్ 13: నామినేషన్ల పరిశీలన

నవంబర్ 15: ఉపసంహరణ గడువు ముగింపు

నవంబర్ 30: పోలింగ్

డిసెంబర్ 3: ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన



మిజోరంలో శాంతి కోసం మాకే ఓటేయండి



ఓటర్లకు సోనియా గాంధీ విజ్ఞప్తి

న్యూఢిల్లీ: మిజోరం రాష్ట్రంలో మరో ఐదు రోజుల్లో పోలింగ్ జరగనున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ వీడియో సందేశం పంపించారు. 'బీజేపీ పక్ష పార్టీలకు ఓటు వేసి ప్రయోగాలు చేయాల్సిన సమయం కాదిది. రాష్ట్రంలో శాంతి సామరస్యాలు వెల్లివిరియాలంటే కాంగ్రెస్‌కు ఓటేయండి. మేం అధికారంలోకి వస్తే రాష్ట్రాభివృద్ధికి కృషిచేస్తాం. దశాబ్దాల పాలనా అనుభవం కాంగ్రెస్ సొంతం. రాష్ట్రం మా పాలనలో భద్రంగా ఉంటుంది. రాష్ట్ర అభివృద్ధికి, ప్రజల సాధికారతకు, సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ మాత్రమే భరోసా ఇవ్వగలదు. ఎన్నికలప్పుడు మేం ఇచ్చిన హామీలను ఎలా నెరవేర్చామో కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్, హిమాచల్ ప్రదేశ్‌లను చూస్తే ఇట్టే మీకు అవగతమవుతుంది' అని అన్నారు. మూడు నిమిషాల నిడివి గల ఈ వీడియోలో మిజోరం రాష్ట్రంతో తనకు ఉన్న ప్రత్యేక అనుబంధాన్నీ ఆమె గుర్తుచేసుకున్నారు. ' రాష్ట్రానికి నా భర్త, దివంగత ప్రధాని రాజీవ్ గాంధీతో కలిసి విచ్చేసిన ఘటన నాకింకా గుర్తు. నా హృదయంలో ఈ ప్రాంతానికి ప్రత్యేక స్థానం ఉంది. ఇన్నేళ్లలో ఎన్నోసార్లు రాష్ట్రానికొచ్చా. ఇక్కడి సంప్రదాయాలు, సంస్కృతి, ప్రకృతి అందాలు నా మదిని దోచుకున్నాయి. ఇక్కడి వారు చూపించే ప్రేమాభిమానాలు ఎన్నటికీ మరువలేను. 1986 జూన్ 30న చారిత్రక మిజో శాంతి ఒప్పందం కుదిరాక కుటుంబం మొత్తం ఇక్కడికొచ్చాం. ఆ సందర్భాన్ని ఇప్పటికీ 'రేమ్నా నీ(శాంతి దినం)గా జరుపుకుంటున్నాం' అని సోనియా అన్నారు.

ఆ రెండూ ఒక్కటే

' తాము స్వతంత్రంగా పనిచేస్తామని మిజో నేషనల్ ఫ్రంట్(ఎంఎన్ఎఫ్), జోరం పీపుల్స్ మూమెంట్(జెడ్‌పీఎం) చెబుతుంటాయి. అదంతా అబద్ధం. రెండూ బీజేపీ తొత్తులే. ఎంఎన్ఎఫ్, జెడ్‌పీఎంలు కమల దళం కోసమే పనిచేస్తుంటాయి. రాష్ట్రంలో బీజేపీ ఆటలు సాగనివ్వం. యువత, మహిళలకు చెప్పేదొక్కటే. కాంగ్రెస్‌కు ఓటేయండి' అని సోనియా విజ్ఞప్తిచేశారు.

బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లతో ముప్పు

' మిజోరంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ కారణంగా ప్రజాస్వామ్యానికి ముప్పు వాటిల్లుతోంది. వైవిధ్యాన్ని, ప్రజాస్వామ్యాన్ని, సంప్రదాయాలకు మోదీ సర్కార్ ఏమాత్రం విలువ ఇవ్వదు. అటవీ భూములపై గిరిజనుల హక్కులను తగ్గించే చట్టాలను బీజేపీ బలవంతంగా రుద్దుతోంది. దీనిపై పార్లమెంట్‌లో మిజోరం ఎంపీలను ప్రభుత్వం కనీసం మాట్లాడనివ్వలేదు. మణిపూర్ రాష్ట్రంలో వాళ్లేం చేశారో చూశాం. జాతుల మధ్య చిచ్చుపెట్టి అశాంతిని రగిల్చారు. ఇంతజరిగినా మణిపూర్‌కు ఒక్కసారైనా వెళ్లొద్దామన్న స్పృహ ప్రధాని మోదీకి లేకపోవడం దారుణం' అని సోనియా ఆగ్రహం వ్యక్తంచేశారు. వీడియోను సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో షేర్‌చేశారు. మిజోరంలో ఈనెల ఏడో తేదీన పోలింగ్, డిసెంబర్ మూడో తేదీన ఓట్ల లెక్కింపు జరగనుంది.

తీవ్రమైన కేసుల్ని పేర్కొనలేదు

ఇండోర్: మధ్యప్రదేశ్‌లోని ఇండోర్–1 శాసనసభ నియోజకవర్గంలో పోటీకి దిగిన బీజేపీ జాతీయ కార్యదర్శి కైలాశ్ విజయ్ వర్గీయ ఉద్దేశపూర్వకంగా రెండు తీవ్రమైన కేసులను నామినేషన్ పత్రాల్లో పేర్కొనలేదని కాంగ్రెస్ ఆరోపించింది. ఆయన అభ్యర్థిత్వంపై చట్టప్రకారం పోరాడేందుకు సుప్రీంకోర్టుదాక అయినా వెళ్తామని కాంగ్రెస్ అధికార ప్రతినిధి చరణ్ సాప్రా వ్యాఖ్యానించారు. '1999లో దుర్గ్ కోర్టులో కైలాశ్‌పై ఛత్తీస్‌గఢ్ మాజీ అడ్వొకేట్ జనరల్ తివారీ పరువునష్టం దావా వేశారు. కోర్టుకు హాజరుకావాలని ఎన్నిసార్లు సమన్లు జారీచేసినా కైలాశ్ రాలేదు. దీంతో ఆయనను తప్పించుకుని తిరుగుతున్న వ్యక్తిగా కోర్టు 2019లో ప్రకటించింది. ఈ కేసు వివరాలను కైలాశ్ తన ఎన్నికల నామినేషన్ పత్రాల్లో పేర్కొనలేదు' అని చరణ్ వెల్లడించారు. 'తనను రేప్ చేశారంటూ కైలాశ్‌పై ఒకావిడ వేసిన కేసు పశ్చిమబెంగాల్‌లోని అలీపూర్ కోర్టులో పెండింగ్‌లో ఉంది. ఈ కేసు వివరాలను కేలాశ్ పేర్కొనలేదు. ఈ వివరాలను ఇండోర్–1 కాంగ్రెస్ అభ్యర్థి సంజయ్ శుక్లా.. వెంటనే జిల్లా ఎన్నికల అధికారికి అందజేశారు. అయినా ఆయన బీజేపీ ఒత్తిడికి తలొగ్గి అభ్యర్థనను తోసిపుచ్చారు' అని చెప్పారు.

ఎస్సీ, ఎస్టీలు గనుకనే... కోవింద్, ముర్ములను పిలవలేదు

మోదీపై ఖర్గే ధ్వజం • పేదలకు అధికారం ప్రధానికి నచ్చదు • ఛత్తీస్‌గఢ్ ప్రచారంలో కాంగ్రెస్ చీఫ్

సుక్మా: దేశంలోని నిరుపేదలకు అధికారం అందడం ప్రధాని నరేంద్ర మోదీకి సుతరామూ ఇష్టముండదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మాలో బుధవారం ప్రచార ర్యాలీలో ఆయన ప్రసంగించారు. జల్, జంగిల్, జమీన్ ఆశయాల సాధనకు గిరిజనులు చేసే ప్రయత్నాల్లో కాంగ్రెస్ ఎన్నడూ వారికి దన్నుగా నిలిచిందని చెప్పారు. "పార్లమెంటు నూతన భవనం శంకుస్థాపన కార్యక్రమానికి నాటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను మోదీ ఆహ్వానించలేదు. ఆయన అంటరానివాడు (దళితుడు) కావడమే అందుకు కారణం. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము గిరిజన సామాజిక వర్గం కనుకనే పార్లమెంటు భవన ప్రారంభ కార్యక్రమానికి ఆమెను ఆహ్వానించలేదు" అని తీవ్ర ఆరోపణలు చేశారు. "కేవలం మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాత్రమే ఇలాంటి పనులు చేయగలరు. ఎస్సీ, ఎస్టీలను రాష్ట్రపతులుగా ఎన్నుకున్నా, ఇలాంటి అధికారిక శుభ కార్యక్రమాల్లో వారికి అవకాశమే ఇవ్వకపోవడం ద్వారా తమ అసలు రంగును బయటపెట్టుకున్నారు" అంటూ దుయ్యబట్టారు.

మీరు చేసిందేమిటి?

గత 60 ఏళ్లలో కాంగ్రెస్ ఏం చేసిందన్న బీజేపీ విమర్శలపై ఖర్గే మండిపడ్డారు. కాంగ్రెస్‌ను విమర్శించడం తప్ప బీజేపీ కూడా ఇన్నేళ్లలో చేసిందంటూ ఏమీ లేదని ఎద్దేవా చేశారు. "నేనిక్కడికి కేవలం ఓట్లడిగేందుకు, రాష్ట్రంలో అధికారాన్ని నిలబెట్టుకునేందుకు రాలేదు. గిరిజన సామాజిక వర్గాన్ని, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, మొత్తంగా దేశాన్నే కాపాడుకోవాలన్నది మా ప్రయత్నం" అని చెప్పుకొచ్చారు. 90 స్థానాలున్న ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీకి నవంబర్ 7న తొలి దశలో 20 సీట్లకు, 17న మిగతా 70 సీట్లకు పోలింగ్ జరగనుంది.

ఇటు స్థానిక, అటు జాతీయ నేతల ముమ్మర ప్రచారంతో మధ్యప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికల వేడి తారస్థాయికి చేరింది. అయితే పోలింగ్ తేదీ సమీపిస్తున్న వేళ ప్రధాన పార్టీలు బీజేపీ, కాంగ్రెస్ రెండూ రెబెల్స్ బెడదతో సతమతమవుతున్నాయి. టికెట్లు రాని ఎంతోమంది నేతల అసంతృప్తి స్వరాలు తిరుగుబాట్లుగా మారుతున్నాయి. స్వతంత్రులుగా రంగంలోకి దిగి సొంత పార్టీలకే వారు సవాలు విసురుతున్నారు. వాళ్లను బుజ్జగించలేక రెండు పార్టీలూ సతమతమవుతున్నాయి. అసలే హోరాహోరీ పోరు నేపథ్యంలో ఈ తిరుగుబాట్లు ఎక్కడ పుట్టి ముంచుతాయోనని ఆందోళన చెందుతున్నాయి...

ఇరు పార్టీలకూ రె'బెల్స్'!

మధ్యప్రదేశ్‌లో ప్రధాన పార్టీలకు తలనొప్పి

అనునయించలేక కాంగ్రెస్, బీజేపీ ఆపసోపాలు



అమీర్ అకిల్, జితేంద్ర దాగా, కమలేశ్వర్ దేవలియా, కె.కె.శ్రీవాత్సవ, కమలేశ్ అగర్వాల్, శైలేంద్ర చౌధరి, జైకాంత్ సింగ్, రాజేంద్ర సింగ్ సోలంకి, కౌశల్య గోటియా, నందరాం కుశ్వాహా, హర్షవర్ధన్. వీళ్లంతా ఎవరో తెలుసా? మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్, బీజేపీలపై అలిగి రెబెల్స్‌గా ఎన్నికల బరిలో దిగుతున్న నేతల్లో కొందరు! ఈ తిరుగుబాట్ల దెబ్బకు ప్రస్తుతం రెండు పార్టీలకూ గుండెల్లో అక్షరాలా రైళ్లు పరిగెత్తుతున్నాయి. అసలే పోలింగ్‌కు మూడు వారాలు కూడా లేని ఈ సమయంలో వీరు పెద్ద సమస్యగా మారారు. దాంతో రెబెల్స్‌ను ఎలాగోలా సముదాయించేందుకు బీజేపీ నుంచి సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో పాటు కేంద్ర మంత్రులు నరేంద్రసింగ్ తోమర్, ప్రహ్లాద్ పటేల్, కైలాశ్ విజయ్ వర్గీయ తదితరులు రంగంలోకి దిగారు. కాంగ్రెస్ తరఫున పీసీసీ చీఫ్ కమల్‌నాథ్, మాజీ సీఎం దిగ్విజయ్‌సింగ్, రాష్ట్ర ఇన్‌చార్జి రణ్‌దీప్ సుర్జేవాలా తదితరులు రెబెల్స్‌ను బుజ్జగించే పనిలో తలమునకలుగా ఉన్నారు! కానీ వారిలో చాలామంది పట్టువీడకపోవడంతో తలపట్టుకుంటున్నారు.

బీజేపీకి తలపోట్లు


బీజేపీ రాష్ట్రవ్యాప్తంగా పలు అసెంబ్లీ స్థానాల్లో తిరుగుబాటు బెడదను ఎదుర్కొంటోంది. బుర్హాన్‌పూర్‌లో ఎంపీగా, రాష్ట్ర బీజేపీ చీఫ్‌గా చేసిన దివంగత నేత నందకుమార్ సింగ్ చౌహాన్ కుమారుడు హర్షవర్ధన్ స్థానికంగా పట్టున్న నేత. గత లోక్‌సభ ఉప ఎన్నిక సమయంలోనే టికెట్ ఆశించి భంగపడ్డారు. తాజాగా అసెంబ్లీ టికెటిస్తారని భావించినా మాజీ మంత్రి అర్చనా చిట్నిస్‌కు ఇవ్వడంతో భగ్గుమన్నారు. స్వతంత్రునిగా బరిలో దిగారు. కీలక నేతలెందరు బుజ్జగించినా తప్పుకునేందుకు ససేమిరా అంటున్నారు. ఇక 2021లో బీఎస్పీ నుంచి బీజేపీలో చేరిన నందరాం కుశ్వాహాదీ ఇదే పరిస్థితి. తనకు పట్టున్న నివారీ స్థానంలో రెంసార్లు ఎమ్మెల్యేగా నెగ్గిన అనిల్‌జైన్‌కు టికెట్ దక్కడంతో ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తున్నారు. ఆయనతో పాటు జిల్లా బీజేపీ మాజీ చీఫ్ కమలేశ్వర్ దేవలియా కూడా బరిలో ఉండటం పార్టీని మరింత ఆందోళనకు గురిచేస్తోంది. కీలకమైన తికంగఢ్ నుంచి కె.కె.శ్రీవాత్సవ, జబల్‌పూర్ నార్త్–సెంట్రల్‌లో సీనియర్ బీజేపీ నేత కమలేశ్ అగర్వాల్ కూడా టికెట్ ఆశించి భంగపడి స్వతంత్రునిగా రంగంలోకి దిగారు.

కాంగ్రెస్‌కూ కష్టాలే...

కాంగ్రెస్ కూడా రెబెల్స్ బెడదతో ఇక్కట్లలో పడింది. భోపాల్ నార్త్‌లో ఆరుసార్లు ఎమ్మెల్యేగా నెగ్గిన సీనియర్ నేత ఆరిఫ్ అకిల్ స్థానంలో కుమారుడు అతీఫ్‌కు పార్టీ అవకాశమిచ్చింది. టికెట్ ఆశించిన ఆరిఫ్ సోదరుడు అమీర్ స్వతంత్రునిగా దిగారు. హుజూర్ స్థానంలో మాజీ ఎమ్మెల్యే జితేంద్ర దాగా కూడా స్వతంత్రునిగా బరిలో దిగారు. గోటేగావ్‌లో శైలేంద్ర చౌధరికి కాంగ్రెస్ తొలి జాబితాలో టికెటిచ్చి రెండో జాబితాలో వెనక్కు తీసుకుంది. దీన్ని తీవ్ర అవమానంగా భావించిన ఆయన స్వతంత్రునిగా పోటీ చేస్తున్నారు. బద్‌నగర్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యే మురళీ మొర్వాల్‌కు తొలి జాబితాలో ఇచ్చిన టికెట్‌ను రెండో జాబితాలో రాజేంద్రసింగ్ సోలంకీకి మార్చింది. మొర్వాల్ కూడా బెదిరింపులకు దిగడంతో సోలంకీని కాదని మళ్లీ ఆయనకే టికెటిచ్చింది. దాంతో సోలంకీ రెబెల్‌గా మారారు! సిరోహాలో మాజీ మంత్రి కౌసల్య గోటియా, జమునా మరావీ ఇద్దరూ తిరుగుబాటు అభ్యర్థులుగా రంగంలో ఉన్నారు! బార్గీ స్థానంలో కూడా మాజీ ఎమ్మెల్యే సా్ర్బాన్‌సింగ్ కుమారుడు జైకాంత్ రెబెల్‌గా బరిలో ఉన్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

సాక్షి
హైదరాబాద్
గురువారం । 2 । నవంబర్ । 2023



- ఖరారు కానున్న మజ్లిస్ అభ్యర్థులు
- ఇద్దరు సిట్టింగులకు టికెట్లు డౌటే
- ఒకరికి స్థాన చలనం..
- మూడో తరం రాజకీయ అరంగ్రేటం

నేడు ఉత్కంఠకు తెర!

ఎట్టకేలకు మజ్లిస్‌లో ఉత్కంఠకు తెర పడనుంది. గురువారం అసెంబ్లీ సెగ్మెంట్ల అభ్యర్థులు ఖరారు కానున్నారు. ఆ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ తొలి జాబితాలో పాత బస్తీలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల అభ్యర్థిత్వాలను ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే.. ఇద్దరు సీనియర్ ఎమ్మెల్యేలకు తిరిగి సీటు దక్కడం అనుమానమే. ఇప్పటికే వారిని రిటైర్మెంట్ తీసుకోవాలని పార్టీ ప్రతిపాదించింది.

– సాక్షి, సిటీబ్యూరో

నలుగురి స్థానాలు పదిలం

పాతబస్తీలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో నలుగురు సిట్టింగుల సీట్లు పదిలంగా కనిపిస్తోంది. మరో సిట్టింగ్‌కు స్థాన చలనం ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. చాంద్రాయణ గుట్ట స్థానానికి మరోమారు అక్బరుద్దీన్ ఒవైసీ, కార్వాన్‌కు సిట్టింగ్ ఎమ్మెల్యే కౌసర్ మొయిద్దీన్, మలక్‌పేటకు సిట్టింగ్ ఎమ్మెల్యే అహ్మద్ బలాల, బహదూర్ పురాకు సిట్టింగ్ ఎమ్మెల్యే మౌజం ఖాన్ అభ్యర్థిత్వాలు ఖరారైనట్లు తెలుస్తోంది. నాంపల్లి సిట్టింగ్ ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అభ్యర్థిత్వం యాకుత్‌పురా స్థానానికి, నాంపల్లి స్థానానికి మాజీ మేయర్ మాజీద్ హుస్సేన్ అభ్యర్థిత్వం ఖరారు కానున్నట్లు సమాచారం. యాకుత్‌పురా ఎమ్మెల్యే పాషాఖాద్రీ మాత్రం పూర్తిగా రిటైర్మెంట్ తీసుకోనున్నారు.

చార్మినార్‌కు మూడో తరం

ఒవైసీ కుటుంబానికి చెందిన మూడో తరం ఈసారి అసెంబ్లీ ఎన్నికలతో రాజకీయ అరంగ్రేటం చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. పార్టీ ద్వితీయ అగ్రనేత అక్బరుద్దీన్ ఒవైసీ కుమారుడు డాక్టర్ నూరుద్దీన్ చార్మినార్ అసెంబ్లీ స్థానానికి బరిలో దింపేందుకు రంగం సిద్ధమైంది. ఇక్కడ ప్రాతినిధ్యం వహిస్తున్న సిట్టింగ్ ఎమ్మెల్యే ముంతాజ్ ఖాన్‌కు రిటైర్మెంట్ ఇచ్చి ఆయన స్థానంలో నూరుద్దీన్ అభ్యర్థిత్వం ఖరారు చేసినట్లు తెలిసింది. ఈ స్థానం నుంచి పార్టీ దివంగత నేత సలావుద్దీన్ ఒవైసీ, ఆయన కుమారుడు అసదుద్దీన్ ఒవైసీలు ప్రాతినిధ్యం వహించగా... ఈసారి మూడో తరానికి చెందిన నూరుద్దీన్ ఒవైసీ రంగంలోకి దిగనున్నారు.

తిరుగుబాటు బాటలో ముంతాజ్‌ఖాన్

చార్మినార్ ఎమ్మెల్యే ముంతాజ్ ఖాన్ తనకు సీటు దక్కని పరిస్థితుల్లో తిరుగుబాటు బావుటా ఎగరవేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే పార్టీ అగ్రనేత అక్బరుద్దీన్ ఒవైసీ చర్చలు జరపగా రిటైర్మెంట్‌కు సిద్ధమంటూనే తన కుమారుడికి సీటు ఇవ్వాలని ముంతాజ్ ఖాన్ మెలిక పెట్టినట్లు తెలిసింది. అయితే.. సీటు నిరాకరించినా బరిలో దిగడం ఖాయమని పార్టీకి అల్టిమేటం ఇచ్చినట్లు సమాచారం. మరోవైపు కాంగెస్ పార్టీ ఆయనతో సంప్రదింపులు చేయడం పాతబస్తీ రాజకీయాల్లో చర్చనీయాంశమైంది.



పతంగిని పట్టేద్దాం

మజ్లిస్ కట్టడికి కాంగ్రెస్ వ్యూహం

- పాతబస్తీలో గట్టి పోటీకి యత్నం
- నాంపల్లి, మలక్‌పేట, చార్మినార్‌లపై దృష్టి
- రంగంలోకి జాతీయస్థాయి మైనారిటీ నేతలు



సాక్షి, సిటీబ్యూరో: కాంగ్రెస్ పార్టీ మజ్లిస్ స్థానాలపై దృష్టి సారించింది. ఆ పార్టీ కంచు కోట అయిన పాతబస్తీలో దెబ్బ తీసేందుకు పావులు కదుపుతోంది. అధికార బీఆర్ఎస్‌తో దోస్తీ కట్టి కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా మైనారిటీ ఓట్లను గండికొట్టే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా హలత్-ఏ-హజరా పేరుతో మజ్లిస్ సభలకు శ్రీకారం చుట్టడాన్ని కాంగ్రెస్ తీవ్రంగా పరిగణిస్తోంది. ఇప్పటికే మజ్లిస్ తీరుపై గుర్రుగా ఉన్న కాంగ్రెస్ అధిష్టానం ఏకంగా పాతబస్తీపై ప్రత్యేక వ్యూహానికి సిద్ధమైంది. మజ్లిస్ సిట్టింగ్ స్థానాల్లో గట్టి పోటీతో ఉక్కిరిబిక్కిరి చేసి అగ్రనేతలు పాతబస్తీ దాటకుండా కట్టడి చేయాలన్నదే కాంగ్రెస్ ప్రణాళికగా కనిపిస్తోంది. ఇందులో భాగంగా అన్ని స్థానాలపై కాకుండా కొన్నింటిపై మాత్రమే దృష్టి సారించింది. వాస్తవంగా పాతబస్తీలో తలపడేందుకు అధికార పక్షంతో పాటు మిగతా పక్షాలు సైతం మొక్కుబడిగా అభ్యర్థులను బరిలో దింపడం ఆనవాయితీ. అయితే.. ఈసారి కాంగ్రెస్ పార్టీ కూడా చార్మినార్ మినహా అభ్యర్థులను ప్రకటించింది.

మూడింటిపైనే ఆశలు..

కాంగ్రెస్‌పార్టీ పార్టీ పాతబస్తీలో పూర్వ వైభవం కోసం మూడు అసెంబ్లీ సెగ్మెంట్లలో బలమైన అభ్యర్థులను దింపుతోంది. ఇప్పటికే నాంపల్లి, మలక్‌పేట స్థానాలకు అభ్యర్థులకు ప్రకటించగా. చార్మినార్ సెగ్మెంట్‌కు ప్రకటించాల్సి ఉంది. నాంపల్లి స్థానం నుంచి వరుసగా మూడుసార్లు మజ్లిస్ అభ్యర్థులతో నువ్వా నేనా అనే విధంగా తలపడి పరాజయం పాలైన ఫిరోజ్ ఖాన్‌ను ఈసారి కూడా కాంగ్రెస్ పార్టీ బరిలో దింపుతోంది. కాంగ్రెస్‌కు ఓటు బ్యాంకుతో పాటు సానుభూతి కూడా కలిసి వచ్చి బయటపడే అవకాశం ఉందని భావిస్తోంది. మజ్లిస్ కూడా సిట్టింగ్ ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్‌ను యాకుత్‌పురా స్థానానికి మార్చి జీహెచ్ఎంసీ మాజీ మేయర్ మాజీద్ హుస్సేన్‌ను బరిలో దింపాలని యోచిస్తోంది.

- కాంగ్రెస్ పార్టీ చార్మినార్ అసెంబ్లీ స్థానం అభ్యర్థిత్వం ప్రకటించలేదు. పాతబస్తీలో ముస్లిం సామాజిక వర్గంలో గట్టి పట్టు ఉన్న అలీ మస్కతి అభ్యర్థిత్వం వైపు మొగ్గు చూపుతోంది. ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సైతం చార్మినార్ స్థానం నుంచి అలీ మస్కతిని పోటీ చేయాలని కోరామని వెల్లడించారు. మరోవైపు మజ్లిస్ పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యే ముంతాజ్ ఖాన్‌కు తిరిగి సీటు ఇచ్చేందుకు నిరాకరిస్తుండటంతో ఆయనతో సంప్రదింపులు ప్రారంభించింది. అవసరమైతే కాంగ్రెస్ పక్షాన ఆయనను బరిలో దింపాలని ఒక ఆప్షన్‌గా పెట్టుకొని వేచి చూస్తోంది.
- మలక్‌పేట స్థానంపై సైతం గట్టి పోటీకి సిద్ధమైంది. అక్కడి నుంచి స్థిరాస్తి వ్యాపారి షేక్ అక్బర్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసింది. మరోవైపు అక్కడి నుంచి గతంలో టీడీపీ నుంచి రెండు పర్యాయాలు పోటీ చేసి మజ్లిస్‌కు గట్టి పోటి ఇచ్చిన మాజీ కార్పొరేటర్ ముజఫర్ అలీ ఖాన్‌ని పార్టీలో చేర్చుకుంది. కాంగ్రెస్ పక్షాన ఒకసారి పోటీ చేసి పార్టీకి దూరమైన మందడి విజయ సింహారెడ్డిని సైతం పార్టీ కండువా కప్పింది. చాప కింద నీరులా పాగా వేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మూడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ప్రచారానికి పార్టీ జాతీయ మైనారిటీ నేతలను సైతం రంగంలో దింపాలని యోచిస్తోంది.



దీవించండి సామీ!

మీ దీవెనలు ఉండాలి సామీ అంటూ బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్ బుధవారం తన ఇంటి వద్దకు శివుడు, దేవ దేవుడి వేషధారణలో వచ్చిన వారికి నమస్కరిస్తూ అడిగారు. గెలుపు మీదే అంటూ వారు చెప్పడంతో.. ప్రజల దేవుడు కేసీఆర్ చేసిన సంక్షేమ పథకాలపై ప్రచారం చేయాలంటూ ఆయన వారికి చెబుతూ ముందుకెళ్లారు.

– బంజారాహిల్స్

ఒకేసారి నాలుగు సెట్లు వేయొచ్చా?

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి నాలుగు నామినేషన్ సెట్లను వేసుకోవచ్చు. అంతకు మించి నామినేషన్లను అధికారులు స్వీకరించరు. నోటిఫికేషన్ వెలువడిన రోజు నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ముగిసే రోజు వరకు వీటిని దాఖలు చేసుకోవచ్చు. అయితే నాలుగు సెట్లను ఒకేరోజు వేయడానికి వీలుండదు. నామినేషన్ ఎప్పుడు వేసినా రోజుకు ఒకటి చొప్పున మాత్రమే రిటర్నింగ్ అధికారికి సమర్పించాల్సి ఉంటుంది. నామినేషన్ వేయదల్చుకున్న అభ్యర్థి ముందుగా రిటర్నింగ్ అధికారి వద్ద ఉండే రిజిస్టర్‌లో తన పేరును నమోదు చేసుకుని దరఖాస్తును తీసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తు తీసుకున్న అభ్యర్థి అత్యధిక సెట్లు నామినేషన్ వేయదలిస్తే కావాల్సిన సెట్లను జిరాక్స్ తీసుకుని ఖాళీలను పూరించాల్సి ఉంటుంది. అలా పూరించిన దరఖాస్తుతో పాటుగా ఎన్నికల కమీషన్ నిర్దేశించిన డిపాజిట్ సొమ్మును అభ్యర్థి చెల్లించాల్సి ఉంటుంది. డిపాజిట్ జత చేయని దరఖాస్తును ఎట్టి పరిస్థితిలో ఆర్‌ఓ స్వీకరించరు. ఒకే డిపాజిట్ సొమ్ముతో నాలుగు సెట్లు నామినేషన్ పత్రాలను సమర్పించవచ్చు.

– నాంపల్లి



అల కాళేశ్వరం.. ఇలా ప్రత్యక్షం

ముషీరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు పిల్లర్స్ ఇటీవల కుంగిపోవడంతో అందులో భారీస్థాయిలో అవినీతి జరిగిందనేది చూపించేందుకు బుధవారం ఆర్టీసీ క్రాస్ రోడ్‌లో ముషీరాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, మాజీ ఎంపీ ఎం.అంజన్‌కుమార్ యాదవ్ వినూత్న నిరసన చేపట్టారు. కాళేశ్వరం ఏటీఎం పేరుతో ఒక ఏటీఎంను తయారు చేసుకొచ్చి ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో పెట్టారు. దానిపై ఈ శతాబ్దపు భారీ కుంభకోణం అంటూ కేసీఆర్ నోటి నుంచి డబ్బులు వచ్చేలా ఈ ఏటీఎంను తయారు చేశారు. ఏటీఎంను అంజన్‌కుమార్ యాదవ్ సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడు అనిల్ కుమార్ యాదవ్‌తో కలిసి ప్రారంభించారు.

- ఓటర్లకు ఫోన్ కాల్స్, వాయిస్ మెసేజ్‌లు
- మేనిఫెస్టోను వివరిస్తూ ఓటు వేయాలని అభ్యర్థన
- కాల్ సెంటర్లతో అభ్యర్థుల ఒప్పందం

ఇస్మార్ట్ లీడర్స్!



సాక్షి, సిటీబ్యూరో: స్మార్ట్‌ఫోన్ల యుగంలో ఎన్నికల ప్రచారం కొత్త పుంతలు తొక్కుతుంది. ఎన్నికలేవైనా కామన్‌గా జరిగే ఇంటింటి ప్రచారం కాస్త ఇప్పుడు నెట్టింటి ప్రచారంగా మారిపోయింది. రాష్ట్రంలో శాసనసభ ఎన్నికలకు నెల రోజుల గడువు మాత్రమే ఉండటంతో వివిధ రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు ప్రచారం జోరు పెంచారు. తక్కువ సమయంలో ఎక్కువ మంది ఓటర్లకు చేరుకునేందుకు స్మార్ట్ బాటపట్టారు. ఓటర్లకు నేరుగా ఫోన్లు, వాయిస్ మెసేజ్‌లు పంపిస్తూ ప్రచారం చేస్తున్నారు. ఇందుకోసం కాల్ సెంటర్లతో అభ్యర్థులు ఒప్పందం చేసుకుంటున్నారు.

మీ ఎమ్మెల్యే పనితీరు ఎలా ఉంది?

కాల్ సెంటర్ల నిర్వాహకులు అధికార, ప్రతిపక్షాల అభ్యర్థుల తరఫున ప్రచారం చేస్తున్నారు. ఆన్‌లైన్, ఇతరత్రా మాధ్యమాల ద్వారా ఓటర్ల పేరు, ఫోన్ నంబర్లు తదితర వివరాలను కాల్ సెంటర్లు సేకరిస్తున్నాయి. నియోజకవర్గంలోని ఓటర్ల సమగ్ర సమాచారంతో సేవలను అందిస్తున్నాయి. దీని పరిధిలో ప్రత్యేకంగా క్యాంపులను ఏర్పాటు చేసుకుంటున్నాయి. అధికార పార్టీ అభ్యర్థులు కష్టమర్లయితే సంక్షేమ పథకాల గురించి వివరించి సదరు అభ్యర్థికే ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. ప్రతిపక్ష, ఇతర అభ్యర్థులు కస్టమర్లయితే మేనిఫెస్టోలోని అంశాలను వివరిస్తూ ఓటర్లను ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఓటర్లకు ఫోన్ చేసి మీ నియోజకవర్గంలో అభివృద్ధి ఎలా ఉంది? స్థానిక సమస్యలను పరిష్కరించడంలో ఎవరు ముందుంటారు? ప్రస్తుత ఎమ్మెల్యే పనితీరు ఎలా ఉంది? ఈసారి మీ ఓటు ఎవరికి? అంటూ అడుగుతున్నారు.

యువతకు ఉపాధి మార్గం..

ఈ తరహా వల్ల స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. హిందీ, ఇంగ్లిష్, తెలుగు స్పష్టంగా మాట్లాడే మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగులను తాత్కాలిక ప్రాతిపదికన కాల్ సెంటర్లు, ఏజెన్సీలు నియమించుకుంటున్నాయి. ఇంగ్లిష్ వచ్చిన వారికి అధిక ప్రాధాన్యమిస్తున్నాయి. రోజు లెక్కన, కాల్స్ వారీగా జీతభత్యాలను అందిస్తున్నాయి. ఒక్కో కాల్ సెంటర్ అవసరాన్ని బట్టి రూ.50–100 మందిని నియమించుకుటున్నాయి.

అలా వెళ్లి.. ఇలా వచ్చి!

- సొంత గూటికి రాంమోహన్ గౌడ్ దంపతులు
- బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మంత్రి హరీష్‌రావు


నాడు


నేడు

ఎల్‌బీనగర్: కేసీఆర్ అంటే ముద్దగోని రాంమోహన్ గౌడ్‌కు ఎనలేని ప్రేమ. అందుకే తిరిగి బీఆర్ఎస్ పార్టీలో చేరిన ఆయనకు సముచిత స్థానం కల్పిస్తామని మంత్రి హరీష్‌రావు అన్నారు. బుధవారం బీఎన్‌రెడ్డి నగర్‌లోని రాంమోహన్ గౌడ్ నివాసంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో హరీష్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాంమోహన్ గౌడ్ దంపతులను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించి పార్టీ కండువా కప్పారు. గత నెల 12న పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన రాంమోహన్ గౌడ్ దంపతులు బుధవారం తిరిగి సొంత గూటికి చేరుకున్న సందర్భంగా హరీష్‌రావు మాట్లాడారు. 2026లో నియోజకవర్గాల పునర్విభజన జరగనుందని, ఎల్‌బీనగర్ నియోజకవర్గం రెండు లేదా మూడు నియోజవర్గాలుగా ఏర్పడుతుందని తెలిపారు. గతంలో రెండుసార్లు ఇక్కడి నుంచి పోటీ చేసి స్వల్ప మెజార్టీతో ఓటమి చెందారని, పెద్ద మనసుతో తిరిగి పార్టీలోకి వచ్చినందుకు రాంమోహన్ గౌడ్‌ను ఆయన అభినందించారు. కాంగ్రెస్ అంటేనే గెలిచేదే లేదని, పార్టీ హై కమాండ్ ఢిల్లీలో ఉంటుందని మంత్రి హరీష్‌రావు పేర్కొన్నారు. రాష్ట్రంలో తిరిగి అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ పార్టీయేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాంమోహన్‌గౌడ్‌కు కాంగ్రెస్ టికెట్ ఇస్తామని ఆశ చూపి పార్టీలో చేర్పించుకున్నారని, అనంతరం మొండి చేయి చూపించారని అన్నారు.



ఓటు హక్కు.. బాలవాక్కు

ఎల్బీనగర్ ఆక్స్‌ఫర్డ్ స్కూల్ ఆధ్వర్యంలో 'చైల్డ్ డెవలప్‌మెంట్ పెడగాగి' కార్యక్రమంలో భాగంగా ఓటు వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎస్‌ఐ దయాకర్ విద్యార్థులకు ఓటుపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. –సాక్షి, సిటీబ్యూరో

వ్యయ పరిశీలకులు వీరే..

నవంబర్ 3న హైదరాబాద్ జిల్లాకు రాక



సాక్షి, సిటీబ్యూరో: భారత ఎన్నికల సంఘం వివిధ రాష్ట్రాలలో పనిచేస్తున్న ఐఆర్ఎస్ అధికారులను హైదరాబాద్ జిల్లాలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాలకు వ్యయ పరిశీలకులుగా నియమించిందని జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్‌రాస్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.

- ముషీరాబాద్ – నాంపల్లి అసెంబ్లీ నియోజకవర్గాలకు వ్యయ పరిశీలకుడిగా సుబోధ్‌సింగ్‌ను నియమించారు. ఆయన లైజనింగ్ ఆఫీసర్‌గా దశరథ్ (98493 98121)ను నియమించారు.
- మలక్ పేట్ – అంబర్ పేట్ నియోజకవర్గాలకు వ్యయ పరిశీలకుడిగా లక్ష్మీకాంత దాసప్ప. లైజనింగ్ ఆఫీసర్ లక్ష్మీ గణేష్ (97013 65503).
- ఖైరతాబాద్ నియోజకవర్గానికి మహేష్ జిజివాడి. లైజనింగ్ ఆఫీసర్ విశాల్ (79950 20428).
- జూబ్లీహిల్స్ – సనత్ నగర్ నియోజకవర్గాలకు డా.మీతు అగర్వాల్. లైజనింగ్ ఆఫీసర్ పుష్ప ఠాకూర్ (90006 01035).
- కార్వాన్ – గోషామహల్ నియోజకవర్గాలకు కుందన్ యాదవ్. లైజనింగ్ ఆఫీసర్ ముఖేష్ సింగ్ (9704456438).
- చార్మినార్ – చాంద్రాయణ గుట్ట నియోజకవర్గాలకు మృణాల్‌కుమార్ దాస్. లైజనింగ్ ఆఫీసర్ మాజీద్ (8639580589).
- యాకుత్‌పురా – బహదూర్‌పురా నియోజకవర్గాలకు అర్జున్ మాణిక్. లైజనింగ్ ఆఫీసర్ నరేష్ (7702564699).
- సికింద్రాబాద్ – సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గాలకు వ్యయ పరిశీలకులుగా వి.జస్టిన్ నియమిలయ్యారు. లైజనింగ్ ఆఫీసర్‌గా రాకేష్ (97044 04924)ను నియమించారు. వీరు నవంబర్ 3వ తేదీన నగరానికి రానున్నారని రోనాల్డ్ రాస్ పేర్కొన్నారు.

బీజేపీలో జనసేన కుంపటి

- సిటీలో మూడు సీట్ల కోసం పట్టు
- శేరిలింగంపల్లిపై కొండా అల్టిమేటం
- కూకట్‌పల్లిలో రాజీనామాల బాట
- మిగతా సీట్లను నేడు ప్రకటించే అవకాశం



సాక్షి, సిటీబ్యూరో: కాషాయ పార్టీలో జనసేనతో పొత్తు చిచ్చు రేపుతోంది. నగరంలో మూడు సీట్ల కోసం జనసేన పార్టీ పట్టుబడుతోంది. కమలం పార్టీ నేతలు మాత్రం అవి వదులుకోవడానికి ససేమిరా అంటున్నారు. శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, మల్కాజిగిరి స్థానాలు పొత్తులో భాగంగా తమకు వదిలేయాలని జనసేన ఒత్తిడి చేస్తోంది. శేరిలింగంపల్లి నుంచి బీజేపీ అభ్యర్థిగా రవి యాదవ్‌ను రంగంలోకి దింపాలని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి నేరుగా అధిష్టానం పెద్దలను డిమాండ్ చేశారు. ఒకవైపు బీజేపీ మ్యానిఫెస్టో కమిటీ చైర్మన్ వివేక్ పార్టీకి రాజీనామా చేయడం.. అదే సమయంలో కొండా అధిష్టానం పెద్దలకు అల్టిమేటం జారీ చేయడం ఉత్కంఠకు కారణమవుతోంది.

- చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో తాను చెప్పిన వారికే టికెట్లు ఇవ్వాలని కొండా పట్టుబడుతున్నారు. చివరకు శేరిలింగంపల్లి బీజేపీ అభ్యర్థిని మూడో జాబితాలో అయినా ప్రకటిస్తారా? మరికొన్ని రోజులు పెండింగ్‌లోనే ఉంచుతారా? అన్నది ఆసక్తికరంగా మారింది. కూకట్‌పల్లి సీటుపై జనసేన భారీ ఆశలు పెట్టుకుంది. ఈ స్థానం ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలేది లేదని బీజేపీ స్థానిక నేతలు రాష్ట్ర కార్యాలయంలో ఆందోళన చేశారు. జనసేన పొత్తులో భాగంగా ఈ స్థానాన్ని బీజేపీ వదిలేస్తుందన్న సమాచారంతో వడ్డేపల్లి రాజేశ్వరరావు, మాధవరం కాంతారావు ఆ పార్టీకి రాజీనామా చేశారు. లోకల్ కేడర్ ఒత్తిడికి అధినాయకత్వం తలోగ్గుతుందా? లేదా? అన్నది తేలాల్సి ఉంది.
- మల్కాజిగిరి అసెంబ్లీ స్థానంలో గతంలో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన మాజీ ఎమ్మెల్సీ రామచందర్ రావు ఈసారి పోటీ నుంచి తప్పుకున్నారు. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు భానుప్రకాష్, మాజీ ఎమ్మెల్యే ఆకుల రాజేందర్ తదితరులు బీజేపీ నుంచి టికెట్ కోసం ఆశిస్తున్నారు. బీజేపీ మాత్రం మల్కాజిగిరి సీటు జనసేనకు పొత్తులో వదిలేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

మిగతా సీట్లపై క్లారిటీ?

- హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో అసెంబ్లీ స్థానాలపై మూడో జాబితాలో క్లారిటీ రానుంది. ఇప్పటికే బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశం తెలంగాణ మూడో జాబితాకు ఆమోద ముద్ర వేసింది. పార్టీ రాష్ట్ర సారథి కిషన్ రెడ్డి సీఈసీ ఆమోదించిన అభ్యర్థులకు ఫోన్ చేసి అభినందనలు తెలుపుతున్నారు. ముషీరాబాద్‌కు హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ తనయ బండారు విజయలక్ష్మి, అంబర్ పేటకు గౌతమ్ రావు పేర్లు ఖరారైనట్లు తెలిసింది.
- జూబ్లీహిల్స్ టిక్కెట్ కోసం కీర్తి రెడ్డి, విక్రమ్ గౌడ్, దీపక్ రెడ్డి పోటీ పడుతున్నారు. సికింద్రాబాద్‌కు బండ కార్తీక రెడ్డి, కంటోన్మెంట్‌కు మాజీ మంత్రి శంకర్ రావు కుమార్తె సుస్మిత పేర్లను వివేక్ ప్రతిపాదించారు. వివేక్ పార్టీ వీడటంతో కంటోన్మెంట్ స్థానానికి తులసీ విజయ రాం పేరు తెర మీదకు వచ్చింది. రాజేంద్రనగర్ అసెంబ్లీ స్థానం తోకల శ్రీనివాస్ రెడ్డి పేరు ఖరారు చేశారు. ఎల్బీనగర్ సీటు తనకే ఇవ్వాలని సామ రంగారెడ్డి పట్టుబడుతున్నారు. గ్రేటర్ పరిధిలో మెజార్టీ సీట్లు మూడో జాబితాలో వెలువడే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.



ఓటేద్దాం రండి

మణికొండ: ప్రజల భద్రతకు మేము ఉన్నామని, వారంతా నిర్భయంగా రాబోయే ఎన్నికల్లో ఓటుహక్కును వినియోగించుకోవాలని మాదాపూర్ ఏసీపీ శ్రీనివాస్‌రావు అన్నారు. బుధవారం రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని మణికొండ పంచవటీ కాలనీలో కేంద్ర సాయుధ బలగాలు, పోలీసులతో కలిసి ఫ్లాగ్‌మార్చ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో ఓటు అనేది సామాన్యులతో పాటు ప్రతి ఒక్కరికి ఆయుధమన్నారు. ఓటును వినియోగించుకుని ఉత్తమ నాయకులను ఎన్నుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. పోలింగ్ రోజు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పెద్దఎత్తున బలగాలతో తాము భద్రత కల్పిస్తామన్నారు. రాయదుర్గం సీఐ మహేష్, ఎస్సైలు, సిబ్బంది, సీఆర్పీఎఫ్ బలగాలు పాల్గొన్నాయి.

ఓటు పాట్లు

కోకిలమ్మ పెళ్లికి 'కూన'ంతా సందడి!



ఎన్నికల ప్రచారం చేస్తూనే గాజులరామారంలో ఓ వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదిస్తున్న కుత్బుల్లాపూర్ బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలం గౌడ్. - కుత్బుల్లాపూర్

ఓటరు మనసును 'దోశ'య్యాలని!



ఫిరోజ్‌గూడలో ప్రచారంలో భాగంగా టిఫిన్ సెంటర్‌లో దోశ వేస్తున్న కూకట్‌పల్లి కాంగ్రెస్ అభ్యర్థి బండి రమేశ్. - కూకట్‌పల్లి

ఇస్త్రీ చేస్తా.. బస్తీ బాధలు తీరుస్తా



ఖైరతాబాద్ బీజేపీ అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డి బుధవారం ఓ ఇంటి వద్ద దుస్తులు ఇస్త్రీ చేస్తూ ఓటర్లను ఆకట్టుకున్నారు.- హిమాయత్‌నగర్

16వ అంతస్తు పైనుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య


గాంధీలాల్‌ (ఫైల్‌)

మణికొండ: భార్యతో విభేదాలు, అనారోగ్యం, మానసిక ఇబ్బందులతో ఓ వ్యక్తి తాను నివాసం ఉంటున్న అపార్టుమెంటు 16వ అంతస్తుపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని పీరంచెరువు, పీబీఈఎల్‌ సిటీ గేటెడ్‌ కమ్యూనిటీలో బుధవారం ఉదయం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మిర్యాలగూడకు చెందిన బర్మావత్‌ గాంధీలాల్‌(45) తన భార్య స్వర్ణతో కలిసి చేవెళ్లలో ఉంటూ వ్యాపారం చేసేవాడు. భార్య ఒత్తిడి మేరకు ఇటీవల పీబీఈఎల్‌ సిటీలోని 16వ అంతస్తులో ఫ్లాట్‌ అద్దెకు తీసుకుని ఉంటున్నారు. గాంధీలాల్‌ అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతూ చికిత్స పొందుతున్నాడు. బుధవారం అకస్మాత్తుగా పైనుంచి దూకేయడంతో తీవ్రంగా గాయపడి మృతిచెందాడు. కాగా గాంధీలాల్‌ ఆత్మహత్యకు భార్య స్వర్ణతో పాటు ఆమె సోదరుడు కుమార్‌లే కారణమని మృతుని సోదరుడు బర్మావత్‌ శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు పేర్కొన్నారు.

రూ.24.50 లక్షల హవాలా సొమ్ము స్వాధీనం


హవాలా డబ్బును చూపిస్తున్న చార్మినార్‌ ఏసీపీ రుద్రభాస్కర్‌

దూద్‌బౌలి: దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్‌ పోలీసులతో కలిసి చార్మినార్‌ పోలీసులు బుధవారం హైకోర్టు రోడ్డులో వాహనాల తనిఖీల సందర్భంగా ఎలాంటి లెక్కా పత్రాలు లేని రూ.24.50 లక్షల హవాల డబ్బును స్వాధీనం చేసుకున్నారు. బుధవారం చార్మినార్‌ ఏసీపీ రుద్రభాస్కర్‌ తెలిపిన వివరాల ప్రకారం..శివరాంపల్లికి చెందిన మహ్మద్‌ జహీరుద్దీన్‌ ట్రాన్స్‌పోర్టు వ్యాపారం చేస్తుంటాడు. ఇతని వద్ద జహనుమాకు చెందిన మహ్మద్‌ ఆజం, చింతల్‌మెట్‌కు చెందిన మహ్మద్‌ ఫహీం తదితరులు పని చేస్తుంటారు. వీరిరువురు మహ్మద్‌ జహీరుద్దీన్‌ ఆదేశాల మేరకు ద్విచక్ర వాహనంపై ఎలాంటి రశీదులు లేకుండా రూ.24.50 లక్షల హవాలా డబ్బును తరలిస్తుండగా పోలీసుల తనిఖీలలో పట్టుబడ్డారు. ఈ డబ్బును స్వాధీనం చేసుకుని సంబంధిత చార్మినార్‌ రిటర్నింగ్‌ అధికారికి అప్పగించారు. విలేకరుల సమావేశంలో చార్మినార్‌ ఇన్‌స్పెక్టర్‌ చంద్రశేఖర్‌ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారంతో మొదలై మోసాలతో ముగింపు!

విజయవాడ కేంద్రంగా చాక్లెట్ల వ్యాపారం చేసిన కృష్ణంరాజు

- తన స్నేహితుడు రాంబాబుతో కలిసి మల్టీ లెవల్‌ మార్కెటింగ్‌
- తెలుగు రాష్ట్రాల్లో బాధితుల నుంచి రూ.520 కోట్లు వసూలు
- చెల్లింపులు కష్టం కావడంతో బిజినెస్‌ వదిలి చీటింగ్స్‌ షురూ
- ఇరువురు నిందితుల అరెస్టు, 2.5 కేజీల బంగారం స్వాధీనం


పోలీసుల అదుపులో నిందితులు


వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: విజయవాడ కేంద్రంగా చాక్లెట్ల వ్యాపారం ప్రారంభించిన ఓ వ్యక్తి లాభాలు పొందాడు. తన స్నేహితుడితో కలిసి హైదరాబాద్‌కు మకాం మార్చి ఫాస్ట్‌ మూవింగ్‌ కన్సూమర్‌ గూడ్స్‌ (ఎఫ్‌ఎంసీజీ) దందా మొదలెట్టాడు. దీని ముసుగులో మల్టీ లెవల్‌ మార్కెటింగ్‌కు పాల్పడి దాదాపు 200 మంది నుంచి రూ.520 కోట్లు వసూలు చేశాడు. చివరకు చెల్లింపులు చేయలేక ఇరువురూ చేతులెత్తేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న సీసీఎస్‌ పోలీసులు ఇద్దరు నిందితుల్ని అరెస్టు చేసినట్లు సంయుక్త సీపీ డాక్టర్‌ గజరావ్‌ భూపాల్‌ తెలిపారు. డీసీపీ కె.శిల్పవల్లితో కలిసి బుధవారం బషీర్‌బాగ్‌లోని ఓల్డ్‌ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పూర్తి వివరాలు వెల్లడించారు.

చాక్లెట్ల దందా సక్సెస్‌తో విస్తరణ...

ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడకు చెందిన గుధే రాంబాబు కొన్నేళ్ల క్రితం అక్కడే చాక్లెట్ల వ్యాపారం ప్రారంభించాడు. ఇందులో ఊహించిన దాని కంటే ఎక్కువ లాభాలు రావడంతో భీమవరానికి చెందిన తన స్నేహితుడు పెనుమత్స కృష్ణం రాజుతో కలిసి వ్యాపారాన్ని విస్తరించాలని భావించారు. మాదాపూర్‌కు మకాం మార్చిన ఈ ద్వయం ఎఫ్‌ఎంసీజీ రంగంలోకి దిగారు. నిత్యావసర వస్తువులైన సబ్బులు, షాంపూలు, చాక్లెట్లు తదితరాలను గోల్కొకలోన హోల్‌సేల్‌ డిస్ట్రిబ్యూటర్ల నుంచి ఖరీదు చేసి వినియోగదారులకు తక్కువ రేటుకు విక్రయించడం మొదలెట్టారు. దీనికోసం రెండు రాష్ట్రాల్లో దాదాపు 160 ఏజెన్సీలు ఏర్పాటు చేసి 200 మందిని ఉద్యోగులుగా నియమించుకున్నారు. ఈ వ్యాపారం కోసం కృష్ణంరాజు తొలి పెట్టుబడిని రాంబాబు నుంచే తీసుకున్నాడు. బిజినెస్‌ లాభసాటిగా ఉండటంతో మరికొంత మంది నుంచి పెట్టుబడులు తీసుకుని మరింత విస్తరించాలని, బంగారం క్రయవిక్రయాల్లోకి అడుగుపెట్టాలని ఈ ఇద్దరూ భావించారు.

చెల్లించలేని స్థితికి చేరడంతో...

దీంతో తమ ఎఫ్‌ఎంసీజీ వ్యాపార విస్తరణ కోసం పెట్టుబడి పెట్టాలంటూ బంధువులు, స్నేహితులతో పాటు పరిచయస్తులకూ ఎర వేశారు. ఇలా ఇన్వెస్టిమెంట్‌ చేసిన వాళ్లకు నెలకు ఆరు శాతం లాభాలు ఇస్తామని, నిర్ణీత సమయం తర్వాత ఆరు నుంచి 13 శాతం వడ్డీతో తిరిగి ఇచ్చేస్తానని నమ్మబలికాడు. వీరి మాటలు నమ్మిన 200 మంది బాధితులు రూ.540 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టారు. ఓ దశలో వ్యాపారంలో వచ్చే లాభాలు పంచడానికి, వడ్డీలు చెల్లించడానికి సరిపోలేదు. దీంతో తమ వద్ద కొత్తగా పెట్టుబడి పెట్టే వారి సొమ్మును పాత ఇన్వెస్టర్లకు చెల్లించడం మొదలెట్టారు. ఇలా వ్యాపారానికి స్వస్తి చెప్పి పెట్టుబడుల పేరుతో మోసాలు చేయడం మొదలెట్టారు. ఈ ఏడాది ఆగస్టు నాటికి ఇన్వెస్ట్‌ చేసే వాళ్ళు కరువు కాగా..తమ డబ్బు, వడ్డీ, లాభాలు ఇవ్వాలంటూ ఒత్తిడి చేసే వారి సంఖ్య బాగా పెరిగిపోయింది. ఈ ఒత్తిళ్ల నేపథ్యంలో ఇరువురూ తమ ఇల్లు ఖాళీ చేసి అజ్ఞాతంలోకి వెళ్ళిపోయారు.

జీతాలు, కమీషన్లకే రూ.62 కోట్లు...

వీరిద్దరూ 2020 నుంచి ఈ ఏడాది ఆగస్టు వరకు ఈ దందా చేసినప్పటికీ కార్యాలయాల నిర్వహణ, సిబ్బంది జీతాల కోసం రూ.50 కోట్లు ఖర్చు చేశారు. నిత్యావసరాలు, బంగారం వర్తకులకు రూ.12 కోట్లకు పైగా కమీషన్లుగా చెల్లించారు. వీటికి తోడు రూ.40 కోట్లు ఇద్దరూ కలిసి పక్కదారి పట్టించారు. మరోపక్క తమకు వచ్చిన లాభాలతో కలిపి రూ.427 కోట్లు ఇన్వెస్టర్లకు పంచారు. చివరకు చేతులెత్తేసి అజ్ఞాతంలోకి వెళ్ళిపోయారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకు ఏసీపీ టీఎస్‌ ఉమామహేశ్వరరావు నేతృత్వంలోని బృందం రంగంలోకి దిగింది. బుధవారం ఇరువురినీ గచ్చిబౌలి వద్ద గుర్తించి అరెస్టు చేసింది. వీరి నుంచి హైదరాబాద్‌, భీమవరంలో ఖరీదు చేసి రూ.40 కోట్ల విలువైన స్థిరాస్తుల పత్రాలు, రూ.4 లక్షల నగదుతో పాటు 2.5 కేజీల బంగారం స్వాధీనం చేసుకున్నారు. విచారణ నేపథ్యంలో మరో వ్యక్తి ప్రమేయం ఉన్నట్లు తేలడంతో అతడి కోసం గాలిస్తున్నారు.

గో ఆధారిత ప్రమిదలతో పర్యావరణ పరిరక్షణ


ఆవుపేడతో చేసిన ప్రమిదలను ప్రదర్శిస్తున్న మహేష్‌ అగర్వాల్‌ తదితరులు

కాచిగూడ: ప్రపంచీకరణతో దెబ్బతింటున్న పర్యావరణాన్ని పరిరక్షించేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలని తెలంగాణ గోశాల ఫెడరేషన్‌ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేష్‌ అగర్వాల్‌ పిలుపునిచ్చారు. కాచిగూడలోని గోశాల ఫెడరేషన్‌ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దీపావళి పండుగను దృష్టిలో పెట్టుకొని పర్యావరణ పరిరక్షణ కోసం ఆవుపేడ(గో ఆధారిత)తో తయారు చేసిన లక్ష ప్రమిదలను ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ గోశాలల్లో ఆవుపేడతో ప్రమిదలను తయారు చేస్తున్నారని, వాటిని అతి తక్కువ ధరకు ప్రజలకు అందజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించి దీపావళికి ఆవుపేడతో తయారు చేసిన ప్రమిదలు వాడాలని ఆయన కోరారు.

నగరంలో నేటి నుంచి జపనీస్‌ ఫిల్మ్‌ ఫెస్టివల్‌

సాక్షి, సిటీబ్యూరో: దక్షిణాది ప్రేక్షకుల్లో విదేశీ భాషా చిత్రాలపై పెరుగుతున్న ఆదరణను దృష్టిలో ఉంచుకుని జపాన్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో నగరంలో జపనీస్‌ ఫిల్మ్‌ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని ఫౌండేషన్‌ ప్రతినిధులు తెలిపారు. పంజగుట్టలోని పివిఆర్‌ నెక్ట్స్‌ గెలేరియా మాల్‌లో గురువారం ఈ సినిమా పండుగ ప్రారంభం అవుతుందని, 4 రోజుల పాటు కొనసాగుతుందని వివరించారు. ఈ ఫిల్మ్‌ ఫెస్ట్‌లో భాగంగా ఎ మ్యాన్‌, అనిమె సుప్రిమసీ, ఇంటాలరెన్స్‌, మండేస్‌, సీ యూ దిస్‌ వీక్‌, ఫాదర్‌ ఆఫ్‌ ది మిల్కీ వే...తదితర ప్రసిద్ధ, అవార్డులు దక్కించుకున్న జపనీస్‌ చిత్రాలు ప్రదర్శితమవుతాయన్నారు.

‘పవర్‌ గ్రిడ్‌’ ఆధ్వర్యంలో వాకథాన్‌


వాకథాన్‌లో పాల్గొన్న పవర్‌ గ్రిడ్‌ ఉద్యోగులు

లక్డీకాపూల్‌: అవినీతిని నిర్మూలించడమే లక్ష్యంగా పవర్‌ గ్రిడ్‌ కార్పొరేషన్‌ వ్యవహరిస్తుందని చీఫ్‌ జనరల్‌ మేనేజర్‌ (విజిలెన్స్‌) జీఎస్‌ఆర్‌ రావు పేర్కొన్నారు. బుధవారం నెక్లెస్‌ రోడ్‌లోని సంజీవయ్య పార్క్‌లో విజిలెన్స్‌ అవేర్‌నెస్‌ వీక్‌లో భాగంగా వాకథాన్‌ నిర్వహించారు. పవర్‌ గ్రిడ్‌ సదరన్‌ రీజియన్‌–1 ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న జీఎస్‌ఆర్‌ రావు మాట్లాడుతూ..అవినీతిని ఎలా నిర్మూలించాలనే దానిపై ఉద్యోగులకే కాకుండా సాధారణ ప్రజలకు కూడా అవగాహన కల్పించేందుకు ప్రతి ఏటా విజిలెన్స్‌ అవేర్‌నెస్‌ వీక్‌ను జరుపుకొంటున్నామన్నారు. గత నెల 30 నుంచి ఈ నెల 5వ తేదీ వరకు ‘అవినీతికి నో చెప్పండి.. దేశానికి కట్టుబడి ఉండండి’ అనే థీమ్‌తో అవగాహన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ క్రమంలో ప్రతి వ్యక్తికి మెరుగైన దేశం కోసం అవినీతికి వ్యతిరేకంగా పోరాడాల్సిన బాధ్యత ఉందన్నారు. వ్యవస్థలోని అవినీతిపై పోరాడేందుకు ప్రజలకు అందుబాటులో ఉన్న వివిధ అవకాశాలను ఆయన నొక్కి చెప్పారు. కార్యక్రమంలో పవర్‌ గ్రిడ్‌ చీఫ్‌ జనరల్‌ మేనేజర్‌ (అసెట్‌ మేనేజ్‌మెంట్‌) అలోక్‌ కుమార్‌ శర్మ, సీజీఎం(ఫైనాన్స్‌ అండ్‌ అకౌంట్స్‌) వెంకట్‌ ఎస్వీ, సీజీఎం(ప్రాజెక్ట్స్‌) సంజయ్‌ కుమార్‌ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి కావడం లేదని యువకుడి ఆత్మహత్య!


గోవర్ధన్‌చారి (ఫైల్‌)

బంజారాహిల్స్‌: ఇంకా వివాహం కావడం లేదని, వ్యసనాలకు బానిసై జీవితంపై విరక్తి చెంది ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఫిలింనగర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ఫిలింనగర్‌లోని ఎంజీనగర్‌లో నివసించే గోవర్ధన్‌ చారి(32) ప్రైవేట్‌ ఉద్యోగం చేస్తున్నాడు. బుధవారం తెల్లవారుజామున తన గదిలో ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించడంతో చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీస్తున్నారని పోలీసులు తెలిపారు. నల్లగొండ జిల్లా చండూరు మండలం ముషిపల్లి గ్రామానికి చెందిన గోవర్ధన్‌ చారి గత కొంత కాలంగా బస్తీలో ఉంటున్నాడని స్థానికులు తెలిపారు. ఫిలింనగర్‌ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో మహిళలకు వేధింపులు

అల్వాల్‌: అల్వాల్‌ పట్టణ పరిధిలోని ఓల్డ్‌ అల్వాల్‌లో రోడ్డుపై వెళ్లే మహిళల పట్ల ఓ వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో ఆ వ్యక్తిని చెట్టుకు కట్టేసి స్థానికులు చితకబాదారు. కాగా దీనిపై బాధితురాలు, స్థానికులు 100కు డయల్‌ చేసి పోలీసులకు సమాచారం అందించినా స్పందన రాలేదు. సదరు వ్యక్తి ఫుల్లుగా మద్యం తాగి రోడ్డుపై వెళ్లే మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం జరిగిందని స్థానికులు తెలిపారు. పోలీసులు రాకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈరూట్లో మందుబాబుల ఆగడాలు ఎక్కువయ్యాయని, పోలీసులు స్పందించి వారిని అదుపుచేసి..మహిళలకు రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

విపత్తులనుంచి గుణపాఠం నేర్చుకోవాలి

కీసర: ప్రపంచవ్యాప్తంగా అనారోగ్య మహమ్మారిని ఎదుర్కోవడంలో సమస్త మానవాళికి సహాయం చేయడానికి ప్రతి ఒక్కరూ చేసిన సమష్టి కృషి అభినందనీయమని సెంటర్‌ ఫర్‌ టెలీకమ్యూనికేషన్స్‌ అండ్‌ మీడియా స్టడీస్‌ వ్యవస్థాపకుడు పద్మశ్రీ డాక్టర్‌ త్రిపురనేని హనుమాన్‌ చౌదరి అన్నారు. బుధవారం రాంపల్లిదాయర పరిధిలోని బాలవికాస సెంటర్‌లో నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. చరిత్రను పరిశీలిస్తే ప్రతి విపత్తు ఏదైనా మంచి చేయడానికి అవకాశంగా ఉటుందన్నారు.దాని నుంచి గుణపాఠం నేర్చుకోవాలన్నారు. సదస్సులో ప్రపంచవ్యాప్తంగా ఉన్నవిద్యావేత్తలు, సామాజిక కార్యకర్తలు, అభివృద్ధి నిపుణులు, మనస్తత్వవేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు. సదస్సులో కోవిడ్‌ తరువాత సామాజిక మార్పు, సమాజ పునరుద్ధరణ, ఆశాజనక భవిష్యత్తుకు దోహదపడే వివిధ అంశాలను చర్చించారు. ఆస్ట్రేలియా మాజీ అధ్యక్షుడు రిచర్డ్‌ హిల్‌, యూఎస్‌ఏలో సోషన్‌ వర్క్‌ డిపార్ట్‌మెంట్‌ ప్రొపెసర్‌ డాక్టర్‌ సుదర్శన్‌ తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్‌లో త్రిపుర గవర్నర్‌కు వైద్య పరీక్షలు


నిమ్స్‌ను సందర్శించిన త్రిపుర గవర్నర్‌ ఇంద్రసేనారెడ్డితో డైరెక్టర్‌ బీరప్ప

లక్డీకాపూల్‌: నిమ్స్‌లో త్రిపుర గవర్నర్‌ ఎస్‌.ఇంద్రసేనారెడ్డికి వైద్య పరీక్షలు జరిగాయి. బుధవారం ఆస్పత్రిని సందర్శించిన గవర్నర్‌కు డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ నగరి బీరప్ప సాదరంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో నిరుపేదలకు అందుతున్న వైద్య చికిత్సలను ఆయన గవర్నర్‌ ఇంద్రసేనారెడ్డికి వివరించారు.

తొలుత నిమ్స్‌ వెల్‌నెస్‌ సెంటర్‌లో గవర్నర్‌కు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్డియాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్‌ శ్రీనివాస్‌, డాక్టర్‌ సతీష్‌ రావులు గుండె సంబంధిత వైద్య పరీక్షలు చేశారు. కాగా సాధారణ వైద్య పరీక్షల కోసమే గవర్నర్‌ వచ్చారని..ఆయన గతంలో కూడా ఆస్పత్రిని సందర్శించి చికిత్స చేయించుకున్నట్టు వైద్యులు పేర్కొన్నారు.

ఎన్నికల బరిలో డీబీపీ

హిమాయత్‌నగర్‌: దళిత బహుజన పార్టీ (డీబీపీ) రానున్న ఎన్నికలలో పలు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఆ పార్టీ అభ్యర్థులను ప్రకటించింది. మంచిర్యాల జిల్లాలో మూడు అసెంబ్లీ నియోజకవర్గాలకు డీబీపీ తరుపున అభ్యర్థులు పోటీ చేయనున్నారని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు, సుప్రీం కోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్‌ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గాల నుండి పోటీ చేసే అభ్యర్థులను ఖరారు చేశామన్నారు.

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ‘మరాఠా పార్టీ’ పోటీ

హిమాయత్‌నగర్‌: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో 119 స్థానాల్లో తొలిసారిగా పోటీ చేస్తున్నామని రాష్ట్రీయ మరాఠా పార్టీ ప్రకటించింది. ఈ మేరకు బుధవారం బషీర్‌బాగ్‌ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు అంకుష్‌ శివాజీరావ్‌ పాటిల్‌ మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 10 లక్షల మంది మరాఠా ప్రజలు ఉన్నారని, పలు నియోజకవర్గాల్లో అభ్యర్థుల గెలుపు ఓటములను నిర్ణయించే స్థాయిలో మరాఠాలు ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా నాంపల్లి నియోజకవర్గం అభ్యర్థిగా శివాజీరావ్‌ బెల్కోని, గోషామహల్‌ అభ్యర్థిగా నందకుమార్‌ తాంబేలే పోటీ చేస్తారని, ఈ నెల 8వ తేదీన మిగతా నియోజకవర్గాల అభ్యర్థులను ప్రకటిస్తామన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు సూర్యకాంత్‌ సయాద్రి మహారాజ్‌, అమర్‌ జాదవ్‌ పాల్గొన్నారు.

యువతను మోసం చేసిన బీఆర్‌ఎస్‌ను ఓడించాలి: ఏఐవైఎఫ్‌



మాట్లాడుతున్న ఏఐవైఎఫ్‌ నాయకులు

హిమాయత్‌నగర్‌: రాష్ట్రంలో ఉద్యోగాలు భర్తీ చేయకుండా మోసం చేసిన బీఆర్‌ఎస్‌ పార్టీని ఓడించేందుకు యువత సిద్ధంగా ఉన్నారని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్‌) రాష్ట్ర అధ్యక్షుడు వలీ ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర అన్నారు. ఈ మేరకు బుధవారం హిమాయత్‌నగర్‌ రాజ్‌ బహదూర్‌ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ హయాంలో నిరుద్యోగం పెరిగిందన్నారు. ప్రభుత్వ అనాలోచిత విధానాల కారణంగా ఉద్యోగాల కల్పనలో రాష్ట్రం దిగజారిపోయిందని విమర్శించారు. గత తొమ్మిదేళ్ల కాలంలో నిరుద్యోగం రేటు పెరిగిందని, యువతకు ఉపాధి కల్పన కల్పించకుండా అన్ని విధాలుగా మోసం చేశారని చెప్పారు. ఇతర రాష్ట్రాలతో పోల్చితే తెలంగాణలో నిరుద్యోగ రేటు అత్యధికంగా 36.2 శాతంగా ఉందని అన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ఓడించడానికి రాష్ట్ర యువత సిద్ధంగా ఉన్నారని వారు స్పష్టం చేశారు. ఏఐవైఎఫ్‌ కార్యనిర్వాహక అధ్యక్షుడు నేర్లకంటి శ్రీకాంత్‌, రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.సత్య ప్రసాద్‌లు పాల్గొన్నారు.

అండగా నిలబడండి

- మంత్రి సబితారెడ్డి

తుక్కుగూడ: మహిళలు సాటి మహిళనైన తనకు అండగా ఉండి ఈ ఎన్నికలో ఆశీర్వదించాలని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి అన్నారు. తుక్కుగూడలో బీఆర్‌ఎస్‌ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం మహిళ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌ పార్టీ అధికారంలోకి రాగానే రూ.1000 ఉన్న గ్యాస్‌ ధరను రూ.400కు ఇస్తామన్నారు. దీంతో పాటు ఆసరా పింఛన్లు పెంచుతామన్నారు. ఇప్పటికే నియోజకవర్గాన్ని రూ.వేల కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. మరోసారి అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలన్నారు. అనంతరం మున్సిపల్‌ పరిధిలోని ఇమామ్‌గూడ గ్రామానికి చెందిన బంటు రమేష్‌ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌ పార్టీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ మున్సిపల్‌ అధ్యక్షుడు జల్లాల లక్ష్మయ్య యాదవ్‌, వైస్‌ చైర్మన్‌ బి.వెంకట్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు పద్మ, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పార్టీలతో సంబంధం లేకుండా బీసీ అభ్యర్థులను గెలిపించాలి

ముషీరాబాద్‌: పార్టీలతో సంబంధం లేకుండా బీసీ అభ్యర్థులను గెలిపించాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ బీసీలు, ప్రగతిశీల శక్తులకు విజ్ఞప్తి చేశారు. బుధవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ కుల జనగణన, చట్టసభలలో బీసీ రిజర్వేషన్లు, మహిళా రిజర్వేషన్లలో బీసీ కోటా, దరఖాస్తు చేసిన వారందరికి ఫీజు రీయింబర్స్‌మెంట్‌, విదేశీ విద్యానిధి వంటి తమ డిమాండ్లను మేనిఫెస్టోలలో పెట్టే పార్టీలకే బీసీలు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కేసీఆర్‌ ప్రభుత్వం అవినీతిపై అధికారంలోకి వచ్చాక విచారణ చేయిస్తామని చెప్పే పార్టీలను ఆదరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ కన్వీనర్‌ గుజ్జ కృష్ణ, అనంతయ్య, నందగోపాల్‌, పగిళ్ల సతీష్‌, ఉదయ్‌ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎర్ర సత్యనారాయణ

నామినేషన్ల ప్రక్రియకు ఏర్పాట్లు పూర్తి


అబిడ్స్‌ మున్సిపల్‌ కార్యాలయంలో నామినేషన్ల ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్‌ అనుదీప్‌ దురిశెట్టి

అబిడ్స్‌: ఈ నెల 3 నుంచి అసెంబ్లీ ఎన్నికల నామినేషన్‌ ప్రక్రియకు దాదాపు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని హైదరాబాద్‌ జిల్లా కలెక్టర్‌ అనుదీప్‌ దురిశెట్టి పేర్కొన్నారు. బుధవారం అబిడ్స్‌ మున్సిపల్‌ కాంప్లెక్స్‌లోని గోషామహల్‌ నియోజకవర్గ రిటర్నింగ్‌ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు ప్రశాంతంగా, శాంతియుతంగా జరిగేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఓటింగ్‌ శాతాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రతిరోజు గోషామహల్‌తో పాటు అన్ని ఆర్‌ఓ కార్యాలయాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తామన్నారు. నామినేషన్ల ప్రక్రియను పారదర్శకంగా చేపట్టేందుకు సీసీ కెమెరాలతో పాటు వీడియో కెమెరాలతో చిత్రీకరిస్తున్నామన్నారు. ఆర్‌ఓ కార్యాలయం బయట, లోపల కూడా సమయ నిబంధనల కోసం ఎలక్ట్రానిక్‌ వాచ్‌లను కూడా ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల్లో పాల్గొనే సిబ్బంది కోసం పోలింగ్‌ బ్యాలెట్‌ పేపర్లను పంపిణీ చేస్తున్న తెలిపారు. పోలింగ్‌స్టేషన్లు రెండు కిలోమీటర్ల లోపు స్థానికులకు ఉండే విధంగా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఓ విక్టర్‌, ఏఆర్‌ఓలు మన్నె ప్రేమ్‌కుమార్‌, సయ్యద్‌ సైదుద్దీన్‌, శైలజ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు న్యాయం

ఖైరతాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి విజయారెడ్డి



విజయారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

పంజగుట్ట: దశాబ్దకాలంగా గ్యాస్‌పై ఒక్క రూపాయి కూడా తగ్గించని బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రూ. 500కు గ్యాస్ ఇస్తామంటే వారు రూ. 400కే ఇస్తామని ప్రకటించడం విడ్డూరంగా ఉందని ఖైరతాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పి.విజయారెడ్డి ఎద్దేవాచేశారు. బుధవారం బీఎస్ మక్తాలో కాంగ్రెస్ పార్టీ సమావేశం ఏర్పాటు చేశారు. పెద్దసంఖ్యలో జనం సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన యువకులు, నాయకులు విజయారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

రానున్నది బీజేపీ ప్రభుత్వమే: చింతల



ఉదయ్‌నగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న చింతల రామచంద్రారెడ్డి

బంజారాహిల్స్: రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని ఖైరతాబాద్ బీజేపీ అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం బంజారాహిల్స్ డివిజన్ పరిధిలోని ఉదయ్‌నగర్, రోడ్ నెం.11 ప్రాంతాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రచారానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తున్నదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించడంతో పాటు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్నామని ఆయన అన్నారు.

సమతారాజ్య స్థాపనకే పోటీ



అభ్యర్థులకు బీ ఫాంలు అందజేస్తున్న కృష్ణస్వరూప్

లిబర్టీ: అంబేద్కర్ ఆశయ సాధన కోసం రాజకీయ ఎన్నికల పోరాటం చేస్తామని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ వెల్లడించారు. దళిత బహుజన సమతా రాజ్యాన్ని నిర్మించేందుకే ఎన్నికల్లో పోటీ చేస్తున్నామని పేర్కొన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... దళిత బహుజన పార్టీ అభ్యర్థులను చట్టసభల్లోకి పంపిస్తే రాజ్యాంగం సంపూర్ణంగా అమలు చేసుకోగలుగుతామన్నారు. వివిధ నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులకు బీ ఫాంలు అందజేశారు. కార్యక్రమంలో ఎలక్షన్ విభాగం చైర్మన్ డాక్టర్ వి.ఎల్.రాజు పాల్గొన్నారు.

యూసుఫ్‌గూడలో మాగంటి ప్రచారం



వృద్ధురాలిని ఓటు అడుగుతున్న మాగంటి

వెంగళరావునగర్: జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశానని, మరోసారి తనకు అవకాశం కల్పిస్తే మరింతగా అభివృద్ధిని చేసి చూపుతానని బీఆర్‌ఎస్ జూబ్లీహిల్స్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్ అన్నారు. యూసుఫ్‌గూడ చౌరస్తా, యూసుఫ్‌గూడ బస్తీ, శ్రీకృష్ణానగర్ తదితర ప్రాంతాల్లో బుధవారం ఆయన పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు అందిస్తూ తనను గెలిపించాలని కోరారు. కార్పొరేటర్ రాజ్‌కుమార్, బీఆర్‌ఎస్ సీనియర్ నేతలు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిగూడలో బీజేపీ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ పద్మ వీరపనేని, జూటూరు కీర్తిరెడ్డి

శ్రీనగర్‌కాలనీ: బీజేపీ తెలంగాణలో బీసీ సీఎంను ప్రకటించడం పట్ల బీజేపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాకి ధన్యవాదాలు తెలుపుతూ ర్యాలీలు నిర్వహించారు. సోమవారం బీజేపీ సీనియర్ నేతలు డాక్టర్ పద్మ వీరపనేని, జూటూరు కీర్తిరెడ్డిలతో పాటు నేతలు, కార్యకర్తలు ఎల్లారెడ్డిగూడ హనుమాన్ ఆలయం నుంచి హర్షాన్ని వ్యక్తం చేస్తూ ర్యాలీని నిర్వహించారు. నేతలు హరీష్‌యాదవ్, శాంతికుమార్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నేతల ఆందోళన



ఆందోళనలో పాల్గొన్న కార్పొరేటర్ సంగీత యాదవ్

పంజగుట్ట: ఓటమి భయంతోనే కాంగ్రెస్ పార్టీ హత్యా రాజకీయాలకు పాల్పడుతున్నదని సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీత యాదవ్ ఆరోపించారు. ఎంపీ, దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డిపై హత్యాయత్నానికి నిరసనగా బుధవారం సోమాజిగూడలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

పోలింగ్‌కు 90 నిమిషాల ముందు.. మాక్ పోల్ నిర్వహించాలి

ఖైరతాబాద్ అసెంబ్లీ ఓపీవోలకు పూర్తయిన శిక్షణ

- ఎన్నికల నిర్వహణలో ఓపీవోల పాత్ర కీలకం
- ఖైరతాబాద్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి వెంకటేష్ దోత్రే



ఓపీవోలకు శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రైనర్

బంజారాహిల్స్: ఎన్నికల నిర్వహణలో పోలింగ్ అధికారుల పాత్రే కీలకమని పీవో, ఏపీవో, ఓపీవోలు సమన్వయంతో ఎన్నికల విధులు నిర్వహించాలని ఖైరతాబాద్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి వెంకటేష్ దోత్రే సూచించారు. బుధవారం బంజారాహిల్స్‌లోని ముఫకంజా ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో అదర్ ప్రొసిడింగ్ అధికారులు(ఓపీవో)కు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు చేయాల్సిన విధులపై ఇప్పటికే మాస్టర్ ట్రైనర్స్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం పూర్తయింది. తాజాగా ఓపీవోలకు ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల నిర్వహణ సజావుగా సాగేందుకు పోలింగ్ అధికారులు కీలక పాత్ర పోషించాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు.

పోలింగ్‌కు ఒక్కరోజు ముందు పోలింగ్ రోజు అధికారులు తీసుకోవాల్సిన చర్యలు, విధులపై స్పష్టంగా ఉండాలన్నారు. పోలింగ్ ప్రారంభానికి 90 నిమిషాల ముందు అన్ని పార్టీల ఏజెంట్ల సమక్షంలో మాక్ పోల్ నిర్వహించాలన్నారు. ఓటరు జాబితాలో పోస్టల్ బ్యాలెట్, చనిపోయిన వారి వివరాలు మార్క్ చేయబడి ఉంటాయని ఓటు వేసేందుకు వచ్చే ఓటరు వద్ద మొదటి ప్రాధాన్యతగా ఓటరు గుర్తింపు కార్డులను పరిశీలించాలని వాటితో పాటు 12 రకాల ఇతర ప్రభుత్వ గుర్తింపు పొందిన కార్డులను వినియోగించుకోవచ్చన్నారు. పోలింగ్‌కు ఒక రోజు ముందు పోలింగ్ సామాగ్రి తీసుకున్న తర్వాత పోలింగ్ కేంద్రానికి కావాల్సిన ఏర్పాట్లను పూర్తి చేసుకొని సిద్ధంగా ఉండాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో 800 మంది ఓపీవోలు పాల్గొన్నారు.

నామినేషన్ ప్రక్రియకు ఏర్పాట్లు...

ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే నామినేషన్ ప్రక్రియపై సమావేశాలు పూర్తి చేశారు. ఈ నెల 3న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అవతుందని 10వ తేదీ వరకు అభ్యర్థుల నుంచి నామినేషన్ స్వీకరించడం జరుగుతుందని అన్నారు. నామినేషన్ ఫారాలు ఆన్‌లైన్‌లో, ఆర్వో కార్యాలయంలో అందుబాటులో ఉంటాయని అభ్యర్థి తాజా ఫొటోతో పాటు అఫిడవిట్ నామినేషన్ పత్రాలు సమర్పించాల్సి ఉంటుందన్నారు. నామినేషన్ వేసిన సమయంలో అఫిడవిట్‌లో ఏదైనా కాలం పూర్తిచేయకుంటే సంబంధిత అభ్యర్థికి నోటీసులు జారీ చేయాలని అలాగే అభ్యర్థి తన పూర్తి వివరాలు సమర్పించాల్సి ఉంటుందన్నారు. క్రిమినల్ కేసులు ఉన్న అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరణ ముగిసిన తర్వాత నాలుగు రోజుల్లోపు ఒకసారి, అయిదు నుంచి ఎనిమిది రోజుల మధ్య ఒకసారి ప్రచారానికి చివరి తేదీలోపు మరొకసారి క్రిమినల్ కేసులపై పత్రికా ప్రకటనలు జారీ చేయాల్సి ఉంటుందన్నారు.

అందుబాటులో ఉంటా.. ఆశీర్వదించండి

- క్రికెట్ జట్టును విజయపథంలో నడిపా
- అలాగే నియోజకవర్గాన్నీ ప్రగతిబాట పట్టిస్తా
- జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి మహమ్మద్ అజహరుద్దీన్



వెంగళరావునగర్: ఎన్నికల అనంతరం ప్రజలను పట్టించుకోకుండా వదిలేసి వెళ్లే వ్యక్తిని కాదని, ఐదేళ్లపాటు ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటానని జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి మహమ్మద్ అజహరుద్దీన్ అన్నారు. యూసుఫ్‌గూడ మహమూద్ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశం జరిగింది.

ముఖ్యఅతిథిగా హాజరైన అజహరుద్దీన్ మాట్లాడుతూ... తొమ్మిదేళ్ల కాలంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిందేమీ లేదని, అయితే అభివృద్ధి చేశామంటూ పాలకులు మాయమాటలు చెబుతూ ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. దళిత బంధు, బీసీ బంధు అంటూ తమ బంధువులకు కమిషన్ బంధువుగా మార్చారని, దీనిని ప్రజలు గ్రహిస్తున్నారన్నారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ఆరు గ్యారంటీ హామీలను ఈ నియోజకవర్గంలో తప్పకుండా అమలు చేసి చూపుతానని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే గూండాయిజం నడిపారని, అయితే తనను గెలిపిస్తే ఒక సోదరునిలా కులమతాలకు అతీతంగా పనిచేస్తానన్నారు. క్రికెట్‌లో కెప్టెన్‌గా టీంను ఎలా ముందుకు నడిపించాలో తనకు తెలుసని, అక్కడ కేవలం 11 మంది మాత్రమేనని, ఇక్కడ నియోజకవర్గ ప్రజలందరికీ సామాన్య కార్యకర్తగా తాను విధులు నిర్వహిస్తానన్నారు. మహిళలు కాంగ్రెస్‌ను ముందుండి నడిపించాలని, మీ సోదరుడికి ఘన విజయాన్ని చేకూర్చాలని కోరారు. డీసీసీ అధ్యక్షుడు అనిల్‌కుమార్ యాదవ్, కాంగ్రెస్ సీనియర్ నేతలు భవానీశంకర్, ఉపేందర్‌రెడ్డి, మురళీగౌడ్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, పెద్ద శ్రీశైలం యాదవ్, కిరణ్‌కుమార్, ప్రీతి, రవిగౌడ్, మనోజ్ యాదవ్, మోసిన్, సుల్తాన్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

‘ఈవీఎంలలో కారు గుర్తులు నిండాలి’

- బీఆర్‌ఎస్ ఖైరతాబాద్ అభ్యర్థి దానం నాగేందర్



మాట్లాడుతున్న దానం నాగేందర్

బంజారాహిల్స్: సమావేశాలు పెట్టుకున్నప్పుడు హాళ్లు నిండితే సరిపోదని ఈవీఎంలలో కారు గుర్తులు అదే స్ఫూర్తితో నిండాల్సిన అవసరం ఉందని ఖైరతాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి దానం నాగేందర్ సూచించారు. బంజారాహిల్స్ డివిజన్ ముఖ్య కార్యకర్తల సమావేశం బంజారాహిల్స్‌లోని లేక్‌వ్యూ బంజారా ఫంక్షన్ హాల్‌లో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నాగేందర్ మాట్లాడుతూ... ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు బంజారాహిల్స్ డివిజన్ పరిధిలో వేలల్లో ఉన్నాయని వీరంతా గుండుగుత్తగా ఓట్లు వేస్తే మెజార్టీ ఆ స్థాయిలోనే ఉంటుందని వెల్లడించారు. డివిజన్‌లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు 400 మందికి వచ్చాయని ఆసరా పింఛన్లు 1500 మంది అందుకుంటున్నారని గృహలక్ష్మి కింద 3400 మందికి చెక్కులు సిద్ధంగా ఉన్నాయని సీఎం రిలీఫ్‌ఫండ్ 475 మందికి ఇవ్వడం జరిగిందని ఇక కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులు మరో 900 మంది ఉన్నారని ఇన్ని పథకాల్లో లబ్ధిదారులు ఉండగా వీరందరి మద్దతు ఉంటే గెలవడంపై ఎలాంటి అనుమానం లేదన్నారు. మహిళలపైనే తాము పూర్తిగా నమ్మకం పెట్టుకున్నామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలను ఆపాలని చూస్తున్నదని ప్రచారానికి వస్తే వారిని నిలదీయాలని అన్నారు.

విభేదాలు పక్కనపెట్టండి: మేయర్ విజయలక్ష్మి

ఎన్నికల సమయంలో అభిప్రాయభేదాలు మంచిది కాదని అందరం ఒక్కతాటిపైకి వచ్చి సీఎం కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎంగా చూడాలని ఖైరతాబాద్‌లో దానం నాగేందర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సూచించారు. ఇతర పార్టీలు వస్తే అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఎక్కడికక్కడ నిలిచిపోతాయని పేర్కొన్నారు.

తహసీల్దార్‌కు బీఆర్‌ఎస్ నేతల వినతి



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న జూబ్లీహిల్స్ బీఆర్‌ఎస్ నేతలు

బంజారాహిల్స్: దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కాంగ్రెస్ నాయకుల దాడిని ఖండిస్తున్నామని ఈ ఘటనకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ బీఆర్‌ఎస్ పార్టీ జూబ్లీహిల్స్ డివిజన్ నేతలు బుధవారం షేక్‌పేట మండల తహసీల్దార్ అనితారెడ్డికి వినతి పత్రం అందజేశారు. హత్యారాజకీయాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ నేతలపై చర్యలు తీసుకోవాలన్నారు. జూబ్లీహిల్స్ డివిజన్ బీఆర్‌ఎస్ నేత మామిడి నర్సింగ్‌రావు తదితరులు ఉన్నారు.

సికింద్రాబాద్ ఆర్డీఓకు...

వెంగళరావునగర్: కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని పలువురు కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు సికింద్రాబాద్ ఆర్డీఓ, జూబ్లీహిల్స్ నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ రవికి బుధవారం కార్పొరేటర్లు వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో వెంగళరావునగర్, రహమత్‌నగర్, యూసుఫ్‌గూడ కార్పొరేటర్లు దేదీప్య విజయ్, సి.ఎన్.రెడ్డి, రాజ్‌కుమార్ పటేల్ పాల్గొన్నారు.

‘బీఆర్‌ఎస్‌కు అత్యధిక మెజార్టీనిస్తాం’

వెంకటేశ్వరకాలనీ: ఖైరతాబాద్ నియోజకవర్గంలోనే బీఆర్‌ఎస్ పార్టీకి అత్యధిక మెజార్టీ వెంకటేశ్వరకాలనీ డివిజన్ నుంచి ఇస్తామని కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి స్పష్టం చేశారు. ఖైరతాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు మద్దతుగా డివిజన్ ముఖ్య నాయకులతో కలిసి బుధవారం ఆమె నాగేందర్‌తో సమావేశం అయ్యారు. తాను రెండుసార్లు కార్పొరేటర్‌గా భారీ మెజార్టీతో గెలుపొందానని నవంబర్ 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో అంతకుమించి మెజార్టీని కట్టబెడతామన్నారు. కార్యకర్తలు, నేతలు ఎన్నికల్లో ఉత్సాహంగా పాల్గొనేందుకు సిద్ధంగా ఉండాలని వెల్లడించారు. డివిజన్ బూత్ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం అయిపోయిన తర్వాత ప్రచారానికి సంబంధించిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుంటామన్నారు. సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ సాధించేందుకు ఖైరతాబాద్‌లో రెండోసారి గులాబీ జెండా ఎగిరేసేందుకు తామంతా కంకణబద్ధులై ఉన్నామన్నారు. కార్యకర్తలు, నేతలు సమన్వయంతో కృషి చేయాలని నాగేందర్ సూచించారు.

కాంగ్రెస్ ఆరు గ్యారంటీలపై అవగాహన

ఖైరతాబాద్: కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో పొందుపరిచిన ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకువెళ్తూ బుధవారం సాయంత్రం ఎంఎస్ మక్తాలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పి.విజయారెడ్డి అవగాహన కల్పించారు. రెండు సంవత్సరాలుగా బీఆర్‌ఎస్ పార్టీ పేద ప్రజలకు ఎన్ని రేషన్ కార్డులు ఇచ్చిందో తెలియజేయాలని, పెన్షన్ల కోసం వచ్చిన దరఖాస్తులు ఎన్నో తెలియజేయాలన్నారు. ఎన్నికలు వచ్చియని ఓట్ల కోసం మరోసారి ప్రజలను మోసం చేయడానికి వస్తున్నారని, ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించాలని విజయారెడ్డి తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న రూ. 5 లక్షలు పట్టివేత

బంజారాహిల్స్: ఎన్నికలు సమీపిస్తుండటంతో మద్యం, నగదు అక్రమ రవాణాపై పోలీసులు దృష్టి పెట్టారు. ఈ మేరకు అడుగడుగునా వాహనాలు తనిఖీ చేస్తున్నారు సరైన పత్రాలు లేకుండా, నగదు తీసుకెళ్తున్న వారిని అదుపులోకి తీసుకుంటూ డబ్బులు సీజ్ చేస్తున్నారు. బుధవారం ఫిలింనగర్ పోలీసులు టోలిచౌకి ఫ్లైఓవర్ సమీపంలో నిర్వహించిన తనిఖీల్లో ఓ మహిళ రూ. లక్ష నగదును తీసుకెళ్తుండగా సీజ్ చేశారు. ఇందుకు సంబంధించి ఆమె ఎలాంటి పత్రాలు చూపలేదు. అలాగే ఫ్లయింగ్ స్క్వాడ్‌తో కలిసి టోలిచౌకి గెలాక్సీ థియేటర్ వద్ద ఓ వ్యక్తి రూ. 4 లక్షలు లెక్కలు పత్రాలు లేని నగదు తీసుకెళ్తుండగా స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలపై కేసులు కూడా నమోదు చేశారు...

ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల పెంపు...

ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గానికి ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌లను తొలుత కేటాయించినప్పటికీ అదనంగా ఇప్పుడు మరో మూడు బృందాలను అధికారులు కేటాయించారు. దీంతో జూబ్లీహిల్స్, ఖైరతాబాద్ నియోజక వర్గాల్లో తొమ్మిది చొప్పున ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఆయా ప్రాంతాల్లో తనిఖీలు చేస్తున్నాయి.



బీఆర్‌ఎస్ బూటకపు హామీలను నమ్మొద్దు: బీజేపీ

హిమాయత్‌నగర్: బీఆర్‌ఎస్ నాయకులు గత ఎన్నికల్లో దొంగ హామీలు ఇచ్చి ఓట్లు వేయించుకున్నారని ఖైరతాబాద్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి చింతల రాంచంధర్‌రెడ్డి ఆరోపించారు. హిమాయత్‌నగర్ డివిజన్‌లో గడపగడపకూ బీజేపీ కార్యక్రమంలో భాగంగా గోవా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ సదానంద్ తాన్వాడెతో కలిసి చింతల బుధవారం ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు కార్యకర్తలతో కలిసి పలు బస్తీలలో పాదయాత్ర చేశారు. ఓ ఇంటి వద్ద బట్టలు ఇస్త్రీ చేస్తూ వారి సమస్యలు అడిగి తెలుసుకొని చింతల ఓటర్లను ఆకట్టుకున్నారు. బీజేపీకి ఓటు వేసి ఆశీర్వదించి, తనను గెలిపించాలని చింతల అభ్యర్థించారు. పార్టీ డివిజన్ అధ్యక్షుడు నర్సింగ్ ముదిరాజ్, నగర ఉపాధ్యక్షులు పందిళ్ల ప్రసాద్, నగర ఓబీసీ ప్రధాన కార్యదర్శి కేశబోయిన శ్రీధర్, మాధవి, విజయ సతి, అనిల్‌కుమార్ జైన్ పాల్గొన్నారు.

బీసీలకు న్యాయం చేయాలి

లిబర్టీ: జనాభా ప్రాతిపదికన బీసీలకు అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు టికెట్లు కేటాయించి వారికి తగిన న్యాయం చేయాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు డి.కుమారస్వామి డిమాండ్ చేశారు. జనాభాకు అనుగుణంగా టికెట్లు ఇవ్వని పార్టీలను ఓడించి తీరుతామని హెచ్చరించారు. బీసీ దళ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం దళ్ కార్యాలయంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్, బీజేపీ ఇతర రాజకీయ పార్టీలు బీసీల జనాభాకు అనుగుణంగా 70 శాతం టికెట్లు కేటాయించాలన్నారు.

పీజీ విద్యార్థినుల హాస్టల్ ప్రారంభం

బంజారాహిల్స్: యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైఫాబాద్ సైన్స్ కాలేజీలో పీజీ బాలికల హాస్టల్‌ను బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జె.లక్ష్మణ్ నాయక్ ప్రారంభించారు. ఈ హాస్టల్‌లో పీజీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఇప్పటి వరకు ఇక్కడ చదువుతున్న విద్యార్థినులు అంతా ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్ నుంచి వచ్చేవారని తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని వైస్ చాన్సిలర్ రవీందర్ గుర్తించి ప్రత్యేక చొరవ చూపి రూ. 4 కోట్లు మంజూరు చేయించి నూతన హాస్టల్ బిల్డింగ్‌ను కట్టించారన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి పీజీ, డిగ్రీలో కొత్త కోర్సులను ప్రారంభించడం జరిగిందని ఎన్నో సెమినార్లు, కాన్ఫరెన్స్‌లు, వర్క్‌షాప్‌లను నిర్వహించామన్నారు. విద్యార్థులకు మౌలిక సదుపాయాలు అందించడంలో తమ కళాశాల ముందున్నదన్నారు. ఈ హాస్టల్‌లో 200 మంది విద్యార్థినులకు వసతి కల్పించనున్నట్లు ఆయన వెల్లడించారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత

రహమత్‌నగర్: ఎస్పీఆర్‌హిల్స్‌లోని మహాత్మానగర్‌లోని అక్రమ నిర్మాణాన్ని ఖైరతాబాద్ మండల రెవెన్యూ సిబ్బంది తొలగించారు. యాదమ్మ అనే మహిళ అక్రమ నిర్మాణం చేపడుతోందనే సమాచారంతో బుధవారం మండల ఆర్‌ఐలు విజయ్, రాహుల్‌నాయక్ తమ సిబ్బందితో కలిసి బస్తీకి చేరుకుని నిర్మాణాన్ని కూల్చివేశారు. అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తులు

బంజారాహిల్స్: ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు రిటర్నింగ్ అధికారికి దరఖాస్తులను అందజేశారు. ఆ దరఖాస్తులను ఖైరతాబాద్ నియోజకవర్గం ఎన్నికల అధికారులు ఎప్పటికప్పుడు కంప్యూటర్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. వారి దరఖాస్తులోని నియోజకవర్గాల వారీగా అడ్రస్‌లకు పోస్టల్ బ్యాలెట్‌ను పోస్టు ద్వారా పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గం ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సుమారు 2 వేల మంది వరకు వివిధ హోదాల్లో పని చేస్తున్న ఉద్యోగులు ఇప్పటి వరకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం.

సాహిత్యం కెరటం దేవులపల్లి కృష్ణశాస్త్రి

లిబర్టీ: భావ కవిత్వాన్ని ఒక ఉద్యమంలా మలిచి సామాన్య లోకపు సరిహద్దులను దాటించి గొప్ప రచయిత దేవులపల్లి కృష్ణశాస్త్రి అని అభ్యుదయ రచయితల సంఘం హైదరాబాద్ మహానగర కన్వీనర్ గడ్డమీది చంద్రమోహన్‌గౌడ్ అన్నారు. మధురమైన ఆవేశాన్ని తగిలించి లలితమైన ఉద్వేగాన్ని రేకెత్తించి కవిత్వాన్ని అందించిన కృష్ణశాస్త్రీ తెలుగు ప్రజల సాహితీ ప్రియుల హృదయాల్లో నిలిచిపోతారన్నారు. దేవులపల్లి కృష్ణశాస్త్రి జయంతి పురస్కరించుకొని బుధవారం ఏర్పాటు చేసిన జయంతి వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సాహిత్య సామ్రాజ్య సింహాసనం అధిష్ఠించి కృష్ణపక్షం కావ్యం తెలుగు సాహిత్యంలో సాహిత్య రంగంలో ఒక మైలురాయలుగా నిలిచిందన్నారు. సమావేశంలో అటుకుల రాజు, వినీత్‌గౌడ్ పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప స్వామి మహా కుంభాభిషేకం



వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో కొలువుదీరిన శ్రీ అయ్యప్ప స్వామి ద్వితీయ పుష్కర మహా కుంభాభిషేకం వేడుకలు బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభం అయ్యాయి. ఈ నెల 1 నుంచి 5వ తేదీ వరకు జరగనున్న వేడుకల్లో భాగంగా బుధవారం ఉదయం మహాగణపతి హోమం, యాగశాల ప్రవేశం, ధ్వజారోహణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. రాత్రి జరిగిన హరివరాసనంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వేడుకల్లో ఆలయ చైర్మన్ సి.హెచ్.రామయ్య, ఈవో ఎస్.లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ప్రజలకు ప్రధాని శుభాకాంక్షలు

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు బుధవారం 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. 'ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవ శుభసందర్భంగా చైతన్యవంతులైన రాష్ట్ర ప్రజలకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. ఏపీ ప్రజలు అసాధారణ ప్రతిభ, అచంచలమైన సంకల్పం, దృఢమైన పట్టుదలతో విభిన్న రంగాల్లో తమదైన ముద్ర వేశారు. వారి శ్రేయస్సు, విజయం కోసం ప్రార్థిస్తున్నా'అని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు.

సమున్నత లక్ష్యంతో ముందుకు..

- ఏపీ అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రజలకు సీఎం జగన్ శుభాకాంక్షలు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ సీఎం జగన్ బుధవారం ట్వీట్ చేశారు. 'అమరజీవి శ్రీ పొట్టిశ్రీరాములు త్యాగ ఫలం, ఎంతో మంది పోరాట ఫలితంగా తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం ఏర్పడింది. నేడు వారి స్ఫూర్తితో రాష్ట్రంలోని ప్రతి కుటుంబంలో సంక్షేమం, అభివృద్ధి అందించాలన్న సమున్నత లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం. ఆంధ్ర రాష్ట్ర ప్రజలుగా మనం బలపడుతూ ఈ దేశాన్ని మరింత బలపరిచేందుకు ఎన్నో అడుగులు ముందుకు వేస్తున్నాం. దేశాభివృద్ధిలో మనవంతు పాత్ర పోషిస్తూ ముందుకు సాగుతున్నాం. నేడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ శుభాకాంక్షలు. అలాగే వైఎస్సార్ అచీవ్‌మెంట్, వైఎస్సార్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులు అందుకున్న అందరికీ అభినందనలు'తెలుపుతూ సీఎం జగన్ ట్వీట్ చేశారు. అంతకుముందు సీఎం జగన్ తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన రాష్ట్ర అవతరణ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి.. అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పించారు.

రూ.90 లక్షలు పట్టివేత

రామచంద్రాపురం(పటాన్‌చెరు): సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఓ వ్యక్తి నుంచి రూ.90 లక్షలను బుధవారం రాత్రి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఉస్మాన్‌నగర్ సమీపాన కొల్లూర్ పోలీసులు, నియోజకవర్గ ఎలక్షన్ ఫ్లయింగ్ స్క్వాడ్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా.. బైక్‌పై వెళ్తున్న ఒక వ్యక్తిని ఆపి తనిఖీ చేశారు. సరైన పత్రాలు చూపని కారణంగా అతని నుంచి రూ.90 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు కొల్లూరు సీఐ సంజయ్ కుమార్ తెలిపారు.



వైఎస్సార్ అవార్డు గ్రహీతలతో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, సీఎం మాతృమూర్తి వైఎస్ విజయమ్మ

ఉద్యోగాలు వచ్చేశాయ్!

ఏపీలో ఈ నెలలో వరుసగా 23 నోటిఫికేషన్లకు ఏపీపీఎస్సీ ఏర్పాట్లు

900 గ్రూప్-2 పోస్టులతోపాటు 100 గ్రూప్-1 ఖాళీలు భర్తీ

- వందల సంఖ్యలో డిగ్రీ లెక్చరర్ల పోస్టుల భర్తీకి సన్నద్ధం
- డిసెంబర్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల పరీక్షల నిర్వహణ
- పూర్తి పారదర్శకంగా పరీక్షల ప్రక్రియ: ఏపీపీఎస్సీ చైర్మన్



సాక్షి, అమరావతి: ప్రభుత్వ శాఖల్లో పలు పోస్టుల భర్తీకి ఈ నెలలో వరుసగా నోటిఫికేషన్లు జారీ చేయనున్నట్లు ఏపీపీఎస్సీ చైర్మన్ గౌతమ్ సవాంగ్ వెల్లడించారు. వీటిల్లో 900 వరకు గ్రూప్-2 పోస్టులుండగా వందకుపైగా గ్రూప్-1 పోస్టులున్నాయి. డిగ్రీ, పాలిటెక్నిక్, జూనియర్ కాలేజీ లెక్చరర్ల పోస్టులతో కలిపి మొత్తం 23 నోటిఫికేషన్లను విడుదల చేయనున్నట్టు తెలిపారు. ఇప్పటికే నోటిఫికేషన్ వెలువడిన యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి డిసెంబర్‌లో సర్వీస్ కమిషన్ ద్వారా పరీక్షలు నిర్వహించనున్నట్టు చెప్పారు. గతేడాది ఎలాంటి వివాదాలకు తావు లేకుండా గ్రూప్-1 నోటిఫికేషన్ జారీ చేసి 11 నెలల వ్యవధిలో పారదర్శకంగా మెయిన్స్ ఇంటర్వ్యూలు కూడా పూర్తి చేసినట్లు గుర్తు చేశారు. ఏఈ నియామకాలను కూడా అతి తక్కువ సమయంలోనే పూర్తి చేశామన్నారు. గత నాలుగేళ్లల్లో న్యాయపరమైన పలు వివాదాలను అధిగమించి సంస్కరణలు తీసుకొచ్చినట్లు ఏపీపీఎస్సీ చైర్మన్ తెలిపారు. గ్రూప్-1 పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం, సమర్థంగా ఎంపిక, హేతుబద్ధంగా అభ్యర్థుల వాస్తవిక నైపుణ్యాలను అంచనా వేసేందుకు కొత్త విధానాన్ని రూపొందించినట్లు వివరించారు. ఇందుకోసం దేశంలోనే అత్యున్నత విద్యా సంస్థలైన ఐఐటీ, హెచ్‌సీయూతో పాటు రాష్ట్రంలోని పలు వర్సిటీల్లోని నిపుణులతో చర్చించి సిలబస్‌లో సమూల మార్పులు తెస్తున్నట్లు చెప్పారు.

తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు

ఓ వర్గం మీడియా ప్రభుత్వంపై, కమిషన్‌పై తప్పుడు కథనాలను ప్రచురిస్తూ నిరుద్యోగ యువతలో ఆందోళన రేకెత్తించేందుకు ప్రయత్నించటాన్ని ఏపీపీఎస్సీ ఓ ప్రకటనలో ఖండించింది. గ్రూప్ 2 విషయంలో ఇప్పటికే దాదాపు 900 ఖాళీల భర్తీకి ఆర్థికశాఖ నుంచి అనుమతులు లభించాయని, 54 శాఖల నుంచి జోన్ల వారీగా జీవో నం.77కు అనుగుణంగా సమాచారం రావడం ఆలస్యమైందని పేర్కొంది. ఈ అంశంపై కసరత్తు దాదాపు పూర్తయిందని, ఈ నెలలోనే నోటిఫికేషన్ ఇవ్వనున్నట్టు ప్రకటించింది. కొన్ని పత్రికలు ఉద్దేశపూర్వకంగా సర్వీస్ కమిషన్‌పై తప్పుడు కథనాలను వెలువరిస్తూ నిరుద్యోగులను ఆందోళనకు గురి చేస్తున్నాయని పేర్కొంది. అసిస్టెంట్ ప్రొఫెసర్లు, గ్రూప్-1, గ్రూప్-2 నోటిఫికేషన్ల జారీపై తప్పుడు వార్తలు ప్రచురించడాన్ని ఖండించింది. సాధారణంగా ఏపీపీఎస్సీ పరిధిలోని నియామకాలకు మాత్రమే ప్రభుత్వం కేటాయించిన బడ్జెట్ వినియోగిస్తామని, శాసనసభ ప్రత్యేక చట్టం ద్వారా కమిషన్ పరిధిలోకి రాని పోస్టుల నియామక బాధ్యతలను తమకు అప్పగించినప్పుడు వాటి భర్తీ ఖర్చును ఆయా శాఖలే భరిస్తాయని తెలిపింది. 2018లో కూడా ఏపీపీఎస్సీ నిర్వహించిన అసిస్టెంట్ ప్రొఫెసర్ల పరీక్షల ఖర్చును ఆయా విద్యాసంస్థలే భరించాయని గుర్తు చేసింది. ఇప్పుడు కూడా అదే విధానాన్ని అనుసరించి పరీక్ష నిర్వహణ ఖర్చు అంచనాలను ఉన్నత విద్యా మండలికి పంపించామని తెలిపింది. ఈ లేఖను వక్రీకరిస్తూ కథనాలు ప్రచురించడం బాధాకరమని, వీటిని నమ్మవద్దని సూచించింది. ఈ నెలలోనే 23 నోటిఫికేషన్లు వెలువడనున్నట్లు వెల్లడించింది.

ఈ నెలలో నోటిఫికేషన్లు	పోస్టుల సంఖ్య
గ్రూప్-2	900
గ్రూప్-1	89+ (క్యారీ ఫార్వర్డ్ పోస్టులు కలిపి మొత్తం 100 వరకు)
లైబ్రేరియన్స్ ఇన్ ఏపీ కాలేజ్ ఎడ్యుకేషన్	23
డిగ్రీ కాలేజ్ లెక్చరర్స్	267
ఏపీ రెసిడెన్షియల్ కాలేజ్ జేఎల్స్	10
ఏపీ రెసిడెన్షియల్ కాలేజ్ డీఎల్స్	05
టీటీడీ డీఎల్స్, జేఎల్స్	78
ఇంగ్లిష్ రిపోర్టర్స్(ఏపీ లెజిస్లేచర్ సర్వీస్)	10
జూనియర్ లెక్చరర్స్ (లిమిటెడ్)	47
అసిస్టెంట్ కెమిస్ట్ ఇన్ గ్రౌండ్ వాటర్ సర్వీస్	01
జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్స్	06
అసిస్టెంట్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్స్	03
అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్స్	01
టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ డైరెక్టర్స్	04
సంక్షేమశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్స్	02
జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్స్(కేటగిరి-2)	01
సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్స్(కేటగిరి-3)	04
జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్స్(కేటగిరి-4)	06
డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్స్	38
ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్స్	04
జూనియర్ అసిస్టెంట్స్ (జైళ్లు)	01
పాలిటెక్నిక్ లెక్చరర్స్	99
లైబ్రేరియన్స్ ఇన్ మెడికల్ ఎడ్యుకేషన్	02
పురపాలకశాఖ అకౌంట్స్ విభాగంలోనూ పోస్టుల భర్తీ చేపడతారు.	

అసామాన్యులకు సత్కారం

వేడుకగా వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డులు-2023 ప్రదానోత్సవం

ముఖ్య అతిథిగా గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, విశిష్ట అతిథిగా వైఎస్ విజయమ్మ

- 23 మందికి లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్, నలుగురికి అచీవ్‌మెంట్ పురస్కారాలు
- వరుసగా మూడో ఏడాది 7 రంగాల్లో 27 మందికి ప్రదానం
- గొప్ప దార్శనికుడు డాక్టర్ వైఎస్సార్: గవర్నర్
- సమాజాన్ని ప్రభావితం చేస్తున్న అసామాన్యులకు ఇస్తున్న అవార్డులివి: సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి దేశ చరిత్రలో చెరగని ముద్ర వేశారని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ కొనియాడారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో ఆయన వేసిన బాటను ఎన్నో రాష్ట్రాలు అనుసరించాయన్నారు. ఇంత గొప్ప దార్శనికుడి పేరిట అవార్డులు ప్రదానం చేయడం ఆనందంగా ఉందని చెప్పారు. తెలుగులో తన ప్రసంగాన్ని ప్రారంభించిన ఆయన తొలుత రాష్ట్ర ప్రజలకు ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డులు – వైఎస్సార్ అచీవ్‌మెంట్ అవార్డులు-2023 ప్రదానోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విజయవాడలో వేడుకగా నిర్వహించింది. ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్, విశిష్ట అతిథిగా వైఎస్ విజయమ్మ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయం, కళలు-సంస్కృతి, సాహిత్యం, క్రీడలు, వైద్యం, మీడియా, సామాజిక సేవ రంగాలలో విశిష్ట సేవలు అందించిన 27 మంది ప్రముఖులకు అవార్డులను ప్రదానం చేశారు.



వీరిలో 23 మందిని లైఫ్ టైం అచీవ్‌మెంట్, నలుగురిని అచీవ్‌మెంట్ పురస్కారాలతో సత్కరించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. దివంగత వైఎస్సార్ తన సంక్షేమ పథకాల ద్వారా తెలుగు ప్రజల హృదయాలను గెలుచుకున్నారని, ఆయన ప్రవేశపెట్టిన అనేక పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పేదలకు 78 లక్షల ఇళ్లను కట్టించారని, ఆయన ప్రారంభించిన 108 అంబులెన్సు సేవలను దేశంలో 15 రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాలు అమలు చేయడం గొప్ప విషయం అని అన్నారు. తెలంగాణ, రాయలసీమ, కోస్తా ఆంధ్ర ప్రాంతాల్లో కోటి ఎకరాలకు సాగు నీరందించి, రైతాంగాన్ని వ్యవసాయ సంక్షోభం నుంచి కాపాడేందుకు 30 భారీ నీటి పారుదల ప్రాజెక్టులు, 18 మధ్యతరహా ప్రాజెక్టుల నిర్మాణం కోసం జలయజ్ఞం ప్రారంభించిన ఘనత ఆయనదేనని కొనియాడారు. అదే బాటలో సీఎం వైఎస్ జగన్ సాగుతున్నారన్నారని అభినందించారు. ఆంధ్రప్రదేశ్ మూడు ప్రధాన రంగాలలో గణనీయమైన వృద్ధిని సాధించిందని గవర్నర్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాలు, పరిశ్రమలు, సేవల రంగాల్లో అద్భుతమైన పని తీరుతో 2022–23 సంవత్సరానికి 16.22 శాతం వృద్ధి రేటుతో ఏపీ గొప్ప పురోగతి సాధించిందన్నారు. 2021–22లో తలసరి ఆదాయం 14.02 శాతంతో ఆకట్టుకునే వృద్ధి రేటు నమోదు చేసిందని, సంవత్సరానికి జీఎస్‌డీపీ వృద్ధి రేటు 11.43 శాతంగా ఉందన్నారు. ఇది అన్ని రాష్ట్రాలతో పోలిస్తే అత్యధికం అని తెలిపారు

పురస్కార గ్రహీతలు మన జాతి సంపద: సీఎం జగన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ అవతరించి నేటికి 67 సంవత్సరాలైందని, వరుసగా మూడో సంవత్సరం ఈ అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. మన రాష్ట్రంలో వివిధ రంగాల్లో రాణిస్తున్న మహనీయులను గౌరవిస్తూ వైఎస్సార్ అవార్డులతో మూడేళ్లుగా సత్కరించుకునే సంప్రదాయం పాటిస్తున్నామని తెలిపారు. మన సమాజాన్ని ఎంతగానో ప్రభావితం చేస్తూ వివిధ రంగాల్లో ఆకాశమంత ఎదిగినా సామాన్యులుగానే ఒదిగి ఉన్న అసామాన్యులకు ఇస్తున్న అవార్డులని తెలిపారు. ఈ ఏడాది 27 మందిని వైఎస్సార్ అవార్డులతో సత్కరిస్తున్నామని, 23 మందికి లైఫ్ టైం అచీవ్‌మెంట్, నలుగురికి అచీవ్‌మెంట్ అవార్డులు ప్రదానం చేస్తున్నామన్నారు. 'తెలుగుదనానికి, తెలుగు మాటకు, తెలుగువాడి గుండె ధైర్యానికి మన పల్లెలు, మన పేదలు, మన రైతుల మీద మమకారానికి, మన సంస్కృతి, సంప్రదాయాలకు నిలువెత్తు రూపం డాక్టర్ వైఎస్సార్. ఆ మహనీయుని పేరిట ఏటా రాష్ట్ర ప్రభుత్వం అత్యున్నత అవార్డులు ప్రదానం చేస్తోంది. డాక్టర్ వైఎస్సార్ హయాంలో వ్యవసాయం, విద్య, వైద్యం, గృహ నిర్మాణం.. ఇలా ఏ రంగం తీసుకున్నా అంతకు ముందున్న చరిత్ర గతిని మారుస్తూ ఎన్నో ముందడుగులు పడిన విషయం మనమంతా చూశాం. మన వ్యవసాయం, చేనేత, తప్పెటగుళ్లు, జానపదం, రంగస్థలంలో రాణిస్తున్న వారికి, అభ్యుదయ.. హేతువాదం, సాటి మనుషులకు విశిష్ట సేవలందిస్తున్న గొప్ప వ్యక్తులకు ఈ ఏడాది అవార్డుల్లో చోటు దక్కింది'అని సీఎం జగన్ తెలిపారు. కాగా, వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు కింద రూ.10 లక్షలు, మెమెంటో, ప్రశంసా పత్రం.. వైఎస్సార్ అచీవ్‌మెంట్ అవార్డు కింద రూ.5 లక్షలు, మెమెంటో, ప్రశంసా పత్రం అందజేశారు. పుల్లెల గోపీచంద్ తరఫున ఆయన సతీమణి లక్ష్మి.. రావు బాలసర్వతి తరఫున ఆమె కుమారుడు అవార్డులు అందుకున్నారు. మిగతా వారంతా స్వయంగా అవార్డు స్వీకరించారు.

అవార్డు గ్రహీతలు వీరే..

వైఎస్సార్ అచీవ్‌మెంట్ అవార్డులు పొందినవారు

• పాంగి వినీత, మహిళా రైతు, అల్లూరి సీతారామరాజు జిల్లా (వ్యవసాయం) • ఎండీ ఖదీర్‌బాబు, రచయిత, నెల్లూరు (సాహిత్యం) • మహజబీన్, నెల్లూరు (సాహిత్యం) • కుసుమ శ్యాంమోహన్ రావు, డా.బి.ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా (సామాజిక సేవ)

వైఎస్సార్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు గ్రహీతలు

• డాక్టర్ వైవీ మల్లారెడ్డి, అనంతపురం (వ్యవసాయం) • యడ్ల గోపాలరావు, రంగస్థల కళాకారుడు, శ్రీకాకుళం (కళలు-సంస్కృతి) • తలిశెట్టి మోహన్, శ్రీకాళహస్తి కలంకారీ కళాకారుడు, తిరుపతి (కళలు-సంస్కృతి) • కోట సచ్చిదానంద శాస్త్రి, హరికథ, బాపట్ల (కళలు-సంస్కృతి) • కోన సన్యాసి, తప్పెటగుళ్లు, శ్రీకాకుళం (కళలు-సంస్కృతి) • ఉప్పాడ హ్యాండ్లూమ్ వీవర్స్ కో ఆపరేటివ్ సొసైటీ, కాకినాడ (కళలు-సంస్కృతి) • ఎస్వీ రామారావు, అంతర్జాతీయ చిత్రకారుడు, కృష్ణా (కళలు-సంస్కృతి) • రావు బాల సరస్వతి, తొలితరం నేపథ్య గాయని, నెల్లూరు (కళలు-సంస్కృతి) • తల్లావఝుల శివాజీ, చిత్రకారుడు, రచయిత, పాత్రికేయుడు, ప్రకాశం (కళలు-సంస్కృతి) • డాక్టర్ చిగిచెర్ల కృష్ణారెడ్డి, జానపద కళలు, అనంతపురం (కళలు-సంస్కృతి) • కలీషాబీ మహబూబ్- షేక్ మహబూబ్ సుబానీ దంపతులు, నాదస్వరం, ప్రకాశం (కళలు-సంస్కృతి) • ప్రొఫెసర్ బేతవోలు రామబ్రహ్మం, పశ్చిమ గోదావరి (సాహిత్యం) • నామిని సుబ్రహ్మణ్యం నాయుడు, చిత్తూరు (సాహిత్యం) • అట్టాడ అప్పలనాయుడు, శ్రీకాకుళం (సాహిత్యం) • పుల్లెల గోపీచంద్, బ్యాడ్మింటన్, గుంటూరు (క్రీడా విభాగం) • కరణం మల్లీశ్వరి, వెయిట్ లిఫ్టింగ్, శ్రీకాకుళం (క్రీడా విభాగం) • డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి, మానసిక వైద్య నిపుణుడు, రచయిత, ఎన్టీఆర్ జిల్లా (వైద్య రంగం) • డాక్టర్ ఈసీ వినయ్ కుమార్, స్వచ్ఛంద సేవా సంస్థ, డాక్టర్ వైఎస్సార్ జిల్లా (వైద్య రంగం) • గోవిందరాజు చక్రధర్, సీనియర్ జర్నలిస్ట్, కృష్ణా జిల్లా (మీడియా రంగం) • కె.హనుమంతరెడ్డి (హెచ్‌ఆర్కే), ఆధునిక, సంస్కరణవాద కవిత్వం, కర్నూలు (మీడియా రంగం) • బెజవాడ విల్సన్, ఎన్టీఆర్ జిల్లా (సామాజిక సేవ) • నిర్మల హృదయ భవన్, ఎన్టీఆర్ జిల్లా (సామాజిక సేవ) • డాక్టర్ జి.సమరం, ఎన్టీఆర్ జిల్లా (సామాజిక సేవ)

అభ్యర్థుల ఖాతాకు 'జప్తుల' జమ

- ఆధారాలుంటే సంబంధిత అభ్యర్థుల ఎన్నికల వ్యయంలో కలపాలి
- కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశం



సమావేశంలో ధర్మేంద్ర శర్మ, వికాస్‌రాజ్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నిర్వహిస్తున్న తనిఖీల్లో పట్టుబడుతున్న వస్తువులు, ఇతర కానుకల విలువను లెక్కగట్టి నామినేషన్ల ప్రక్రియ పూర్తయిన తర్వాత సంబంధిత అభ్యర్థుల ఎన్నికల వ్యయంలో కలపాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. పట్టుబడిన నగదు విషయంలో తగిన సాక్ష్యాధారాలుంటే ఉదాసీనంగా వ్యవహరించరాదని స్పష్టం చేసింది. శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న నామినేషన్ల ప్రక్రియకు సన్నద్ధతను పరిశీలించేందుకు రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేంద్ర ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ ధర్మేంద్ర శర్మ నేతృత్వంలోని బృందం బుధవారం బీఆర్‌కేఆర్ భవన్‌లో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) వికాస్ రాజ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ అంజనీకుమార్‌తో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలతో వేర్వేరుగా సమావేశమై పలు కీలక సూచనలు చేసింది. అక్రమ మద్యం, మాదక ద్రవ్యాల తరలింపును నియంత్రించడానికి మూస పద్ధతులు కాకుండా కొత్తగా ఆలోచించాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలకు కేంద్ర ఎన్నికల సంఘం బృందం సూచించింది. ఓటర్ల తుది జాబితా ప్రకటన తర్వాత పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారం, ఓటరు గుర్తింపు కార్డులు, ఓటర్ల సమాచార స్లిప్‌ల పంపిణీలో పురోగతిని అడిగి తెలుసుకుంది. మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) ఆధ్వర్యంలో రోజువారీగా సర్టిఫికెట్లను జారీ చేయాలని ఆదేశించింది. కీలక పోలింగ్ కేంద్రాల్లో నిఘా కెమెరాల ఏర్పాటులో పురోగతిని అడిగి తెలుసుకుంది. ఇంటి వద్ద నుంచే ఓటు వేయాలనుకునే వయోజన, దివ్యాంగ ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్ కోసం నిర్దేశిత ఫారాలను ముందుగానే అందజేయాలని కోరింది.

ఫైబర్‌నెట్ కేసులో వేగం పెంచిన సీఐడీ

చంద్రబాబు సన్నిహితుల స్థిరాస్తుల అటాచ్‌మెంట్‌కు నిర్ణయం

సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ఫైబర్‌నెట్ కుంభకోణం కేసు దర్యాప్తులో సీఐడీ వేగం పెంచింది. నిబంధనలకు విరుద్ధంగా టెరాసాఫ్ట్ కంపెనీకి ఫైబర్ నెట్ టెండర్లను కట్టబెట్టిన ఆ కేసులో తదుపరి చర్యలకు ఉపక్రమించింది. అప్పటి సీఎం చంద్రబాబు సన్నిహితుడు వేమూరి హరికృష్ణకు చెందిన టెరాసాఫ్ట్ కంపెనీతోపాటు ఈ కేసులో కీలకపాత్ర పోషించిన చంద్రబాబు సన్నిహితుల ఆస్తులను అటాచ్ చేయాలని నిర్ణయించింది. టెరాసాఫ్ట్ కంపెనీ, చంద్రబాబు సన్నిహితులకు చెందిన ఏడు స్థిరాస్తులను అటాచ్ చేయాలన్న సీఐడీ ప్రతిపాదనకు రాష్ట్ర హోంశాఖ ఆమోదిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అటాచ్ ఆస్తుల్లో గుంటూరులో ఇంటి స్థలం, విశాఖపట్నంలో ఓ ఫ్లాట్, హైదరాబాద్‌లోని నాలుగు ఫ్లాట్లు, తెలంగాణలోని రంగారెడ్డి జిల్లాలో వ్యవసాయ భూమి ఉన్నాయి. హోంశాఖ ఉత్తర్వుల నేపథ్యంలో ఆ స్థిరాస్తుల అటాచ్‌మెంట్‌కు అనుమతించాలని కోరుతూ సీఐడీ విజయవాడ ఏసీబీ న్యాయస్థానంలో పిటిషన్‌ను దాఖలు చేయనుంది. కోర్టు అనుమతి అనంతరం ఆ ఆస్తుల అటాచ్‌మెంట్ ప్రక్రియను చేపడుతుంది. రూ. 330 కోట్లతో చేపట్టిన ఫైబర్‌నెట్ మొదటి దశ ప్రాజెక్ట్ కాంట్రాక్టును టెరాసాఫ్ట్ కంపెనీకి చంద్రబాబు అడ్డగోలుగా కట్టబెట్టేసిన విషయం తెలిసిందే. బ్లాక్ లిస్టులో ఉన్న ఆ కంపెనీపై నిషేధం తొలగించి ఏకపక్షంగా టెండరు ఖరారు చేశారు. వేమూరి హరికృష్ణకు చెందిన టెరాసాఫ్ట్ కంపెనీయే టెండర్లలో పాల్గొంది. అంటే పరస్పర ప్రయోజనాల నిరోధక చట్టాన్ని ఉల్లంఘించి మరీ కథ నడిపించారు. ఈ వ్యవహారంలో రూ. 144.53 కోట్లు ముడుపుల రూపంలో కొల్లగొట్టినట్టు సీఐడీ దర్యాప్తులో వెల్లడైంది.

ఫైబర్‌నెట్ కేసులో అటాచ్‌కు నిర్ణయించిన ఆస్తులు

- ఈ కేసులో నిందితుడు కనుమూరి కోటేశ్వరరావు పేరిట గుంటూరులో ఉన్న 797 చ.అడుగుల విస్తీర్ణం గల ఇంటి స్థలం
- నిందితుడు కనుమూరి కోటేశ్వరరావు డైరెక్టర్‌గా ఉన్న నెప్‌టాప్స్ ఫైబర్ సొల్యూషన్స్‌కు చెందిన విశాఖపట్నం కిర్లంపూడి లేఅవుట్‌లోని ఓ ఫ్లాట్
- టెరాసాఫ్ట్ కంపెనీ ఎండీ టి.గోపీచంద్ పేరిట హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ఉన్న ఫ్లాట్
- టెరాసాఫ్ట్ కంపెనీ ఎండీ టి.గోపీచంద్ పేరిట హైదరాబాద్ శ్రీనగర్ కాలనీలో ఉన్న ఫ్లాట్‌తో పాటు మరికొన్ని ఉన్నాయి.

హైదరాబాద్‌లోనూ బాబు 'ఉల్లంఘనలు'

కేసు నమోదుకు నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో అరెస్టయి, అనారోగ్య కారణాలు చూపించి తాత్కాలిక బెయిలుపై జైలు నుంచి బయటకు వచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబు హైదరాబాద్ వాసులకూ నరకం చూపించారు. అనుమతుల్లేకుండా, నిబంధనలు ఉల్లంఘించి ప్రధాన రోడ్లపై అడ్డదిడ్డంగా భారీ ర్యాలీ చేయడమే కాకుండా, టీడీపీ శ్రేణులు మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ కూడా ఉల్లంఘించారు. ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్న హైదరాబాద్ నగర పోలీసులు సుమోటో కేసు నమోదు చేయాలని నిర్ణయించారు. మంగళవారం రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి విడుదలైన చంద్రబాబు బుధవారం ప్రత్యేక విమానంలో హైదరాబాద్ చేరుకున్నారు. బాబుకు మద్దతు కోరుతూ అందరూ రావాలంటూ నాయకులు సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేశారు. దీంతో దాదాపు రెండు వేల మంది టీడీపీ కార్యకర్తలు అక్కడకు వచ్చారు. సాయంత్రం విమానాశ్రయం నుంచి బయటకు వచ్చిన బాబు కాన్వాయ్‌ను అనుసరిస్తూ పార్టీ జెండాలు, ప్లకార్డులతో ముందుకు కదిలారు. బేగంపేట నుంచి జూబ్లీహిల్స్‌లోని చంద్రబాబు నివాసానికి చేరుకోవడానికి దాదాపు మూడున్నర గంటలు పట్టింది.

ర్యాలీపై కేసు నమోదుకు నిర్ణయం

హైదరాబాద్‌లో సాధారణ సమయాల్లోనే ర్యాలీలు, నిరసనలు, ప్రదర్శనలకు ముందస్తు అనుమతి తప్పనిసరి. పైగా, ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉంది. దీని ప్రకారం టీడీపీ తెలంగాణలో పోటీ చేయకపోయినా రాజకీయ పార్టీ కావడంతో రిటర్నింగ్ అధికారి నుంచి ర్యాలీకి అనుమతి పొందాలి. దీనికోసం 48 గంటల ముందు దరఖాస్తు చేసుకోవాలి. ఈ ఉల్లంఘనకు పాల్పడటంతో పాటు ర్యాలీలో వాహనాలను అడ్డదిడ్డంగా నడిపి, అంబులెన్స్‌లకు సైతం దారి ఇవ్వకపోవడంతో టీడీపీ శ్రేణులపై కేసు నమోదు చేయాలని హైదరాబాద్ పోలీసులు నిర్ణయించారు.

తెలంగాణలో 19 శాతం.. ఏపీలో 11 శాతం వృద్ధి

రికార్డు స్థాయిలో జీఎస్టీ వసూళ్లు

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో వస్తు సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లలో దూకుడు కొనసాగుతోంది. గడిచిన అక్టోబర్ నెలలో జీఎస్టీ వసూళ్లు రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. అక్టోబర్‌లో జీఎస్టీ వసూళ్లు రూ.1.72 లక్షల కోట్లుగా ఉందని కేంద్ర ఆర్థిక శాఖ బుధవారం ప్రకటించింది. ఇది గత ఏడాది ఇదే నెలతో పోలిస్తే 13 శాతం ఎక్కువగా ఉందని తెలిపింది. ఈ ఏడాదిలో ఏప్రిల్ నెలలో రూ.1.87 లక్షల కోట్లు నమోదుకాగా, ఆ స్థాయి వసూళ్లలో ఇది రెండో అత్యధికం. అక్టోబర్ నెల వసూళ్లలో సీజీఎస్టీ రూపంలో రూ.30,062 కోట్లు, ఎస్‌జీఎస్టీ రూపంలో రూ.38,171 కోట్లు, ఐజీఎస్టీ ద్వారా రూ.91,315 కోట్లు, సెస్సుల ద్వారా రూ.12,456 కోట్లు సమకూరాయని ఆర్థిక శాఖ ప్రకటించింది. తెలుగు రాష్ట్రాల్లోనూ వసూళ్లు గణనీయంగా పెరిగాయని ఆర్థిక శాఖ పేర్కొంది. తెలంగాణలో గత ఏడాది జీఎస్టీ వసూళ్లు రూ.9,538 కోట్లు ఉంటే అది 19 శాతం మేర పెరిగి రూ.11,377 కోట్లకు చేరాయని తెలిపింది. సెటిల్‌మెంట్ అనంతరం రూ.23,478 కోట్ల ఆదాయం వచ్చిందని పేర్కొంది. ఇక ఏపీలో వసూళ్లు గత ఏడాది రూ.7,347 కోట్లుగా ఉంటే ఈ ఏడాది అది 11 శాతం మేర పెరిగి రూ.8,127 కోట్లకు చేరిందని వెల్లడించింది. సెటిల్‌మెంట్ అనంతరం రూ.18,488 కోట్లు ఆదాయం సమకూరిందని వెల్లడించింది.

బాబుకు అనారోగ్యం సాకు మాత్రమే

- తాత్కాలిక బెయిల్‌పై బయటకు వచ్చిన వెంటనే కోర్టు ఆదేశాలను ఉల్లంఘించారు
- రాజకీయ ర్యాలీ ప్రారంభించారు.. మీడియాతో మాట్లాడారు
- ఆయన ఇలా చేస్తారనే మేం అదనపు షరతులు కోరుతున్నాం
- ఆయన ఉల్లంఘనలను పెన్‌డ్రైవ్‌లో ఉంచాం పరిశీలించండి
- హైకోర్టుకు నివేదించిన అదనపు ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి
- చంద్రబాబు షరతులను ఉల్లంఘించలేదన్న ఆయన తరఫు న్యాయవాది
- 3న నిర్ణయం వెలువరిస్తానని చెప్పిన జస్టిస్ మల్లికార్జునరావు

సాక్షి, అమరావతి: కంటి శస్త్ర చికిత్స కోసం తాత్కాలిక బెయిల్ పొందిన మాజీ సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు హైకోర్టు విధించిన బెయిల్ షరతులను అప్పుడే ఉల్లంఘించడం మొదలు పెట్టారని సీఐడీ తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి హైకోర్టుకు నివేదించారు. అనారోగ్యం సాకుతో బయటకు వచ్చిన చంద్రబాబు ఆ వెంటనే రాజకీయ ర్యాలీ ప్రారంభించారని, జైలు బయటే మీడియాతో కూడా మాట్లాడారని తెలిపారు. హైకోర్టు చంద్రబాబుకు పలు షరతులతో మంగళవారం తాత్కాలిక బెయిల్ మంజూరు చేసింది. వీటికి అదనంగా మరిన్ని షరతులు విధించాలంటూ సీఐడీ అనుబంధ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు.. చంద్రబాబు మీడియాతో మాట్లాడటం, ర్యాలీల్లో పాల్గొనడం, కేసు గురించి మాట్లాడటం, ఇంటర్వ్యూలు ఇవ్వడం వంటివి చేయడానికి వీల్లేదంటూ ఆదేశించింది. సీఐడీ అనుబంధ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ మల్లికార్జునరావు బుధవారం మరోసారి విచారణ జరిపారు. ఈ సందర్భంగా ఏఏజీ సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన విషయం తెలిసి కూడా చంద్రబాబు వాటికి విరుద్ధంగా వ్యవహరించారన్నారు. తాము అదనపు షరతులు విధించాలని ఎందుకు మొత్తుకుంటున్నామో దీనినిబట్టి అర్థం చేసుకోవాలని కోర్టును కోరారు. కోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తూ చంద్రబాబు చేపట్టిన కార్యక్రమాలతో కూడిన పెన్‌డ్రైవ్‌ను కోర్టుకు సమర్పించి, దానిని పరిశీలించాలని కోరారు. చంద్రబాబు కోర్టు షరతులకు లోబడి వ్యవహరిస్తున్నారో లేదో పర్యవేక్షించేందుకు ఇద్దరు డీఎస్పీ స్థాయి అధికారులను ఆయన వెంట ఉండేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఆ అధికారులు చంద్రబాబు స్వేచ్ఛకు ఏ రకంగానూ భంగం కలగనివ్వబోరని, ఇది తాము ఇస్తున్న హామీ అని నివేదించారు. మధ్యంతర బెయిల్ కోసం దాఖలు చేసిన పిటిషన్‌లో కోర్టు ఎలాంటి షరతులు విధించినా వాటికి కట్టుబడి ఉంటామని చంద్రబాబు తెలిపారని సుధాకర్‌రెడ్డి గుర్తు చేశారు. ఈ సమయంలో న్యాయమూర్తి జస్టిస్ మల్లికార్జునరావు జోక్యం చేసుకుంటూ.. మీ వద్ద ఇంటెలిజెన్స్ ఉందిగా.. దాని సాయంతో చంద్రబాబుపై నిఘా పెట్టొచ్చుగా అని వ్యాఖ్యానించారు. నిఘా వేరు, ఓ వ్యక్తి వెంట వెళ్లడం వేరని, నిఘా అనేది వ్యక్తికి తెలియకుండా చేసేదని సుధాకర్‌రెడ్డి వివరించారు. అనంతరం చంద్రబాబు తరఫున సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. సీఐడీ కోరుతున్న అదనపు షరతులు దర్యాప్తు కోసం కాదని, ఇతర కారణాలున్నాయని అన్నారు. సీఐడీ కోరుతున్న షరతులు చంద్రబాబు ప్రాథమిక హక్కులకు భంగం కలిగించేలా ఉన్నాయని తెలిపారు. దర్యాప్తు ప్రభావితం కాకుండా ఉండేందుకే బెయిల్ మంజూరు సమయంలో న్యాయస్థానాలు షరతులు విధిస్తాయన్నారు. చంద్రబాబు జైలు నుంచి బయటకు వచ్చినా కోర్టు షరతులను ఉల్లంఘించలేదని, ర్యాలీలో పాల్గొనలేదన్నారు. ఆయనకు మద్దతు, సంఘీభావం తెలిపేందుకు ఆయన వద్దకే ప్రజలు వచ్చారన్నారు. న్యాయస్థానం షరతులను ఉల్లంఘిస్తే బెయిల్ రద్దును కోరే స్వేచ్ఛ సీఐడీకి ఉందని, అందువల్ల సీఐడీ కోరుతున్న విధంగా షరతులు విధించాల్సిన అవసరం లేదన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ మల్లికార్జునరావు అదనపు షరతుల విషయంలో శుక్రవారం తన నిర్ణయాన్ని వెలువరిస్తానని తెలిపారు.

క్లుప్తంగా...

అయోధ్య రామయ్య పాదుకలకు భద్రాద్రిలో పూజలు



భద్రాచలం: అయోధ్య రామయ్యకు చేయించిన బంగారు పూత పాదుకలకు భద్రాచలం శ్రీ సీతా రామచంద్రస్వామి దేవస్థానంలో విశాఖ శ్రీ సౌభాగ్య భువనేశ్వరీ పీఠాధిపతి శ్రీ రామానంద భారతీస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. 75 రోజుల్లో అయోధ్యకు చేరుకునేందుకు చేపట్టిన పాదయాత్ర బుధవారం భద్రాచలం చేరుకుంది. హైదరాబాద్‌లోని భాగ్యనగర్ సీతారామ ఫౌండేషన్ చైర్మన్ చల్లా శ్రీనివాస శాస్త్రి ఆధ్వర్యంలో అయోధ్య రామయ్యకు 9 కేజీల సువర్ణ పూత వెండి పాదుకలను తయారు చేయించారు. వీటిని అయోధ్యకు తరలించేందుకు గత నెల 28న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో పాదయాత్ర ప్రారంభించారు. భద్రాద్రిలో పూజల అనంతరం శ్రీ రామానంద భారతీ స్వామి మాట్లాడుతూ.. శ్రీనివాస శాస్త్రి ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర నాసిక్, త్రయంబకేశ్వరం, చిత్రకూట్, ప్రయాగ మీదుగా 2 వేల కిలోమీటర్లు సాగి అయోధ్య చేరుకుంటుందని చెప్పారు. జనవరి 15న అయోధ్య చేరుకుని, 22న అయోధ్య ఆలయంలో ప్రాణ ప్రతిష్ట జరగనుందని తెలిపారు. అయోధ్య రామయ్యకు పాదుకా సేవ చేయడం శ్రీనివాసశాస్త్రి పూర్వజన్మ సుకృతమని అన్నారు. టీటీడీ ఎస్వీబీసీ అడ్వైజర్ అడపా దుర్గ వారికి స్వాగతం పలికారు.

స్లీపర్ సెల్స్‌గా కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు

బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి జాఫర్ ఇస్లాం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు ఒక దానికొకటి స్లీపర్ సెల్స్‌గా వ్యవహరిస్తున్నాయని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి జాఫర్ ఇస్లాం ఎద్దేవా చేశారు. ఈ రెండు పార్టీలు ఓ అవగాహన కుదుర్చుకుని రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలను మరోసారి మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచందర్‌రావు, పార్లమెంట్ కార్యాలయ మాజీ సెక్రటరీ బాలసుబ్రహ్మణ్యం, రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్‌లతో కలిసి జాఫర్ ఇస్లాం బుధవారం మీడియాతో మాట్లాడారు. టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత వ్యాపార భాగస్వాములేనని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి ఓటుకు కోట్లు కేసుపై సీఎం కేసీఆర్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో ఎమ్మెల్యే అభ్యర్థులకు ఎవ్వరికి టికెట్ ఇవ్వాలో కేసీఆర్ నిర్ణయిస్తున్నారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత కూడా బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కలిసిపోతాయన్నారు. ఈ రెండు పార్టీల నాటకాలను, రాజకీయ ఒప్పందాలను ప్రజలు గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

బీజేపీకి రాకేశ్‌రెడ్డి రాజీనామా

బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించిన కడియం



హనుమకొండ: బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేశ్ రెడ్డి పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. బుధవారం హనుమకొండలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ...తనకు పార్టీని వీడాలని లేదని, పార్టీ నాయకులే తనను పార్టీలో నుంచి వెళ్లిపోయే పరిస్థితులు కల్పించారని అన్నారు. సర్వేలన్నీ తనకు అను కూలంగా ఉన్నాయని, పార్టీ సర్వే చేయించిన సంస్థ 1,100 పేజీల నివేదికలోనూ తన పేరు నే సూచించిందని, హైదరాబాద్‌లో తన పేరు తొలగించి వేరే పేరు చేర్చి ఢిల్లీకి పంపింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. కాగా, రాకేశ్‌రెడ్డి సాయంత్రం స్టేషన్‌ఘన్‌పూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరిని కలిశారు. ఈ సందర్భంలో పార్టీలోకి రావాలని కడియం ఆహ్వానించారు. త్వరలోనే ఆలోచించి తన కార్యాచరణ ప్రకటిస్తానని రాకేశ్‌రెడ్డి తెలిపారు.

ఒకేషనల్ విద్యార్థుల పాతపరీక్ష విధానానికి ఆఖరి చాన్స్

సాక్షి, హైదరాబాద్: ఒకేషనల్ కోర్సులు చదివే విద్యార్థులకు పాత పరీక్ష విధానం ఇదే ఆఖరి సారి అని ఇంటర్మీడియెట్ బోర్డు తెలిపింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి అందరికీ ఒకే విధానం అమలు చేస్తామంది. మారిన విధానాన్ని గతంలో ఫెయిల్ అయిన వారూ అనుసరించాలని స్పష్టంచేసింది. వీరికి 2024లో జరిగే పరీక్షల వరకే పాత పద్ధతి అమల్లో ఉంటుందని తెలిపింది. 2012–13 నుంచి ఒకేషనల్ థియరీ పరీక్ష విధానంలో మార్పులొచ్చాయి. ఇంగ్లిష్, జనరల్ ఫౌండేషన్ కోర్సుల ప్రశ్నపత్రం 75కు బదులు 50 మార్కులకు మార్చారు. ఆన్ ద జాబ్ ట్రైనింగ్ (ఓజేటీ) ప్రశ్నపత్రాన్ని 50కి బదులు 100 మార్కులకు మార్చారు. అయితే, 2012కు ముందు ఒకేషనల్ కోర్సు చేసి, కొన్ని సబ్జెక్టులు బ్యాక్‌లాగ్ ఉన్న విద్యార్థులు పాత విధానంలోనే పరీక్షలు రాస్తున్నారు. వీరికి కొత్త విధానంలో నిర్ణయించిన మార్కులకు లెక్కగట్టి మెమో ఇస్తున్నారు. ఉదాహరణకు ఇంగ్లిష్‌లో 75 మార్కులకు బదులు 50 మార్కులకు ఉంటే, వచ్చిన మార్కులను 50 మార్కులకు విభజిస్తారు. ఇలాంటి వాళ్లు వచ్చే ఏడాది నుంచి మారిన విధానాన్ని విధిగా అనుసరించాలని బోర్డు స్పష్టంచేసింది.

చినుకు చుక్క రాలలేదు!

అక్టోబర్‌లో తీవ్ర వర్షాభావం

- నైరుతి నిష్క్రమణ సమయంలో పడని వర్షాలు
- హైదరాబాద్‌లో సున్నా వర్షపాతం
- రాష్ట్రంలో 8.8 సెం.మీ.లకు పడింది 0.53 సెం.మీ. వర్షమే
- నవంబర్‌లోనూ అవే పరిస్థితులు: ఐఎండీ



సాక్షి, హైదరాబాద్: నైరుతి రుతుపవనాల సీజన్ సెప్టెంబర్‌తో ముగిసినప్పటికీ.. రుతుపవనాల నిష్క్రమణ సమయమైన అక్టోబర్‌లో వర్షాల నమోదుకు బాగానే అవకాశాలుంటాయి. గత పదేళ్ల గణాంకాలు పరిశీలిస్తే అక్టోబర్‌లో సాధారణం నుంచి రెట్టింపు స్థాయిలో వర్షాలు కురవగా.. ప్రస్తుత అక్టోబర్‌లో మాత్రం తీవ్ర వర్షాభావం నెలకొంది. 8.8 సెంటీమీటర్ల సాధారణ వర్షపాతానికి గాను, నెల పూర్తయ్యే నాటికి కేవలం 0.53 సెంటీమీటర్ల వర్షపాతమే నమోదైంది. హైదరాబాద్‌లో అయితే.. వర్షం పడనేలేదు. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది సాధారణం కంటే తక్కువగా వర్షాలు నమోదవుతాయని నిపుణులు ముందుగానే హెచ్చరించారు. నైరుతి రుతుపవనాల సీజన్‌లో సాధారణ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించగా, సాధారణానికి కాస్త ఎక్కువగానే సగటు వర్షపాతం నమోదైంది. నైరుతి సీజన్‌లో రాష్ట్ర సగటు 73.8 సెంటీమీటర్లు ఉండగా ఈసారి 86.1 సెంటీమీటర్ల వర్షం కురిసింది. కానీ మండలాలను యూనిట్‌గా తీసుకుంటే మాత్రం చాలాచోట్ల లోటు వర్షపాతమే నమోదైంది. అక్టోబర్‌లో నైరుతి నిష్క్రమణతో పాటు ఈశాన్య రుతుపవనాల ప్రవేశం ఉంటుంది. ఈ సమయంలో నెలకొనే వాతావరణ పరిస్థితులతో సాధారణంగా ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయి. కానీ ఇందుకు భిన్నంగా తీవ్ర వర్షాభావమే నమోదయ్యింది.

'ఈశాన్య'సీజన్ మొదలైనా..

ప్రస్తుతం ఈశాన్య రుతుపవనాల సీజన్ కొనసాగుతోంది. రాష్ట్రంలో నైరుతి, ఈశాన్య సీజన్‌లో జూన్ నెల నుంచి అక్టోబర్ నెలాఖరు వరకు 82.92 సెంటీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. ఇప్పటివరకు 86.76 సెంటీమీటర్ల వర్షం కురిసింది. సాధారణం కంటే 5 శాతం అధిక వర్షపాతం నమోదైనప్పటికీ పలు జిల్లాల్లో లోటు వర్షపాతం ఉంది. జోగుళాంబ గద్వాల, నాగర్‌కర్నూల్, నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో లోటు వర్షపాతం ఉండగా..మరో 21 జిల్లాల్లో సాధారణం, 7 జిల్లాల్లో అధిక వర్షపాతం నమోదైంది. ఇక నవంబర్ నెలలోనూ అక్టోబర్ మాదిరి వర్షాభావ పరిస్థితులే ఉంటాయని ఐఎండీ తాజాగా వెల్లడించింది. ఈ నెలలో కేవలం ఉత్తర భారతదేశంలోని కొన్ని రాష్ట్రాల్లో మాత్రమే భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండగా.. దక్షిణాదిన కేరళ మినహా మిగతా రాష్ట్రాల్లో సాధారణం కంటే తక్కువ వర్షాలు కురుస్తాయని స్పష్టం చేసింది. నవంబర్‌లో రాష్ట్రంలో 2 సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదు కావాల్సి ఉంది. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు పతనమై చలి తీవ్రత పెరగాల్సి ఉండగా.. పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి. దీంతో రాత్రిపూట కూడా ఆ ప్రభావం కనిపిస్తోంది.

రాములమ్మ దారెటు?

- నా పోరాటం ఒక కుటుంబ దోపిడీ, బీఆర్‌ఎస్ నేతల రాజకీయ అరాచకత్వంపైనే.. నాతో కలిసి పోరాడిన బీఆర్‌ఎస్ కార్యకర్తలపై కాదంటూ తాజా ట్వీట్...
- 'సాక్షి' ప్రశ్నలకు వాట్సాప్ ద్వారా స్పందించిన విజయశాంతి
- ఈసారి తాను అసెంబ్లీకి పోటీ చేయడం లేదంటూ స్పష్టీకరణ
- అదే దారిలో డీకే అరుణ కూడా పోటీకి దూరం



సాక్షి, హైదరాబాద్: బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు, పార్టీ ఉద్యమ కమిటీ నేత విజయశాంతి ప్రస్తుతం ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమవుతోంది. తాను ఈసారి అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలబడటం లేదని 'సాక్షి'కి ఆమె పంపించిన వాట్సాప్ మెసేజ్‌లో స్పష్టం చేశారు. ఈ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ టికెట్‌పై ఆమె పోటీ చేస్తారా? కొన్నిరోజులుగా పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనకపోవడం, బీజేపీలో కొనసాగుతారా లేదా అన్న ప్రశ్నలతో 'సాక్షి'వాట్సాప్, ఎస్‌ఎంఎస్‌ల రూపంలో విజయశాంతికి ఓ సందేశం పంపించింది. దీనిపై తాను అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేయడం లేదని మాత్రమే స్పష్టం చేయడం గమనార్హం. రాష్ట్ర బీజేపీలో అసంతృప్త నేతలుగా ముద్రపడిన వారు కొన్ని రోజుల క్రితం ఫామ్‌హౌస్, నేతల నివాసాల్లో వరుస భేటీలు నిర్వహించి, పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకత్వాలకు కొన్ని ప్రశ్నలు సంధించిన విషయం తెలిసిందే. వీరిలో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, జి.వివేక్ వెంకటస్వామి, ఏనుగు రవీందర్ రెడ్డి ఇప్పటికే పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఈ భేటీల్లో పాల్గొని బీఆర్‌ఎస్ సర్కార్‌పై బీజేపీ నాయకత్వం మెతక ధోరణి అవలంబిస్తోందనే వాదనకు బలం చేకూర్చేలా మాట్లాడిన వారిలో ఇతర నేతలతో పాటు విజయశాంతి కూడా ఉన్నట్టుగా పార్టీ నాయకులు చెబుతున్నారు. రాజగోపాల్‌రెడ్డి, వివేక్‌లు బీజేపీకి రాజీనామా చేసిన నేపథ్యంలో విజయశాంతి ఎలాంటి వైఖరిని అనుసరించబోతున్నారనేది ఆసక్తికరంగా మారింది. తాజాగా ఆమె ఎక్స్ (ట్విట్టర్)లో ...తన 25 ఏళ్ల రాజకీయ ప్రయాణం సంఘర్షణలతో కూడుకున్నదని పేర్కొంటూ...తన పోరాటం ఒక కుటుంబ దోపిడీ, కొందరు బీఆర్‌ఎస్ నేతల అరాచకత్వంపై తప్ప, తనతో కలిసి తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలొడ్డి పనిచేసిన బీఆర్‌ఎస్ కార్యకర్తలపై మాత్రం కాదని ట్వీట్ చేశారు. రాజకీయంగా విభేదించినా, అన్ని పార్టీల్లోని మొత్తం తెలంగాణ బిడ్డలు సంతోషంగా, సగౌరవంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకోవడం మీ రాములమ్మ ఉద్దేశం..అంటూ విజయశాంతి ట్వీట్ ముగించారు. ఈ ట్వీట్‌ను చూశాక దీని భావమేమిటీ, అసలు ఆమె తీసుకునే ఎలాంటి నిర్ణయానికి ఇది సంకేతమనే చర్చ బీజేపీ వర్గాల్లో సాగుతోంది. ఇదిలా ఉంటే...బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ కూడా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉంటానని ప్రకటించారు. ఎన్నికల్లో ప్రచారానికే తాను పరిమితమవుతానని చెప్పారు. మాజీ ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, చాడ సురేశ్‌రెడ్డి, డా.బూర నర్సయ్యగౌడ్ శాసనసభ బరిలో నిలిచేందుకు సుముఖంగా లేనట్టు పార్టీ వర్గాల సమాచారం.

లీకుల పాలకులను పాతరేద్దాం

- సిరిసిల్ల సింహగర్జన సభలో బీఎస్పీ నేత ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్



సిరిసిల్ల: రాష్ట్రంలో మొలిచిన కల్వకుంట్ల కలుపుమొక్కల్ని పీకేద్దామని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. 'ఓడిపోతే.. రెస్ట్ తీసుకుంటా'..అని ముఖ్యమంత్రి కేసీఆర్ అంటున్నారని, ఆయన్ని విశ్రాంతి తీసుకోనివ్వమని, ఎర్రవల్లి ఫామ్‌హౌస్ నుంచి చర్లపల్లి జైలుకు రోడ్డువేసి జైలుకు పంపుతామని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ మింగిన అవినీతి సొమ్మును బయటకు కక్కిస్తామన్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలో బుధవారం రాత్రి సిరిసిల్ల సింహగర్జన సభలో ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ...మేడిగడ్డ లీకు, సరస్వతీ బ్యారేజీ లీకు, గ్రూప్‌వన్ లీకు..ఈ లీకుల పాలకులను పాతరేద్దామని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ పార్టీ సభలను బహుజనులు బహిష్కరించాలని కోరారు.

అందరి తెలంగాణ కావాలి

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఆత్మగౌరవంతో బతకాలని ప్రవీణ్‌కుమార్ సూచించారు. రాష్ట్రంలో అత్యధికంగా బీసీలకు టికెట్‌లు ఇచ్చిన పార్టీ బీఎస్పీనే అన్నారు. బీసీ బిడ్డల వద్ద డబ్బులు లేవని, ఎన్నికల్లో వారిని రాజకీయంగా చంపొద్దని కోరారు. ఎదుటి పార్టీ వాళ్లు ఎన్ని డబ్బులు ఇచ్చినా..దాచుకుని ఓట్లు మాత్రం పేదబిడ్డలైన బీఎస్పీ అభ్యర్థులకే వేయాలని కోరారు. అంతకుముందు సిరిసిల్ల పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

వివరాలు సంక్షిప్తంగా అందజేయండి

- ఐఏఎస్, ఐపీఎస్‌ల కేడర్ వివాదంపై హైకోర్టు
- విచారణ ఈ నెల 15వ తేదీకి వాయిదా

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర పునర్విభజన సమయంలో కేటాయింపుల కారణంగా ఏర్పడిన ఏఐఎస్ ఉద్యోగుల కేడర్ వివాదంలో సంక్షిప్త వివరాలు అందజేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హైకోర్టు ఆదేశించింది. విచారణను ఈ నెల 15కు వాయిదా వేసింది. 2014లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన నేపథ్యంలో కేంద్రం నియమించిన ప్రత్యూష్ సిన్హా కమిటీ నివేదిక ప్రకారం అఖిల భారత సర్వీసు (ఏఐఎస్) ఉద్యోగుల విభజన జరిగింది. పలువురు అధికారులను ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించారు. అయితే వీరిలో కొందరు ఈ కేటాయింపులపై కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ (క్యాట్)ను ఆశ్రయించి తెలంగాణలో విధులు నిర్వహించేలా ఉత్తర్వులు పొందారు. క్యాట్ ఉత్తర్వులను కేంద్ర ప్రభుత్వం తప్పుబడుతూ తెలంగాణ హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలు చేసింది. ఈ క్రమంలోనే గత జనవరిలో తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ ఏపీకి వెళ్లాల్సిందేనంటూ సీజే ధర్మాసనం తీర్పునిచ్చింది. అయితే కేడర్, సర్వీస్ సహా ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉన్న దృష్ట్యా తమ పిటిషన్లను విడివిడిగా విచారణ జరపాలని డీజీపీ అంజనీకుమార్ సహా ఇతర అధికారులు కోరడంతో విచారణను సీజే ధర్మాసనం మరో బెంచ్‌కు బదిలీ చేసింది.

తాజాగా బుధవారం జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలీ, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ కేసులో అడ్వొకేట్ జనరల్ వాదనలు వినిపిస్తారని, ఆయన అందుబాటులో లేని కారణంగా విచారణను వాయిదా వేయాలని రాష్ట్ర ప్రభుత్వం తరఫు న్యాయవాది విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో ధర్మాసనం వివాదంపై వివరాలు సంక్షిప్తంగా అందజేయాలని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

హస్తం గుప్పిట్లో కమలం గుట్టు?

- కీలక నేతల రాజీనామాలతో బీజేపీ రాష్ట్ర నేతలకు కొత్త తంటా!
- పార్టీ అంతర్గత విషయాలు, మేనిఫెస్టో కూర్పు బహిర్గతమయినట్లేనా?
- సరిగ్గా ఎన్నికలకు ముందు వివేక్ వెంకటస్వామి, రాజగోపాల్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి..
- గతంలో మునుగోడు ఉప ఎన్నికప్పుడూ పలువురు పార్టీకి గుడ్‌బై
- ఆ సమయంలోనూ ఇలాంటి అనుమానాలు

సాక్షి, హైదరాబాద్: బీజేపీ రాష్ట్రనేతలకు పెద్ద తంటా వచ్చి పడింది. సరిగ్గా అసెంబ్లీ ఎన్నికలకు ముందు... అదికూడా పార్టీ అభ్యర్థులు నామినేషన్లు వేయాల్సిన సందర్భంలో ఈ ఎన్నికల్లో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న నేతలు పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. బుధవారం జాతీయ కార్యవర్గ సభ్యుడు, మేనిఫెస్టో కమిటీ చైర్మన్ వివేక్ వెంకటస్వామి రాజీనామా ఓ పెద్ద షాక్‌లా తగిలింది. కొన్నిరోజుల ముందు జాతీయ కార్యవర్గ సభ్యుడు, అభ్యర్థుల స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. దీంతో పార్టీ తరఫున పోటీచేసే అభ్యర్థుల వివరాలు, ఎన్నికల మేనిఫెస్టోను ప్రకటించడానికి ముందే ఏయే అంశాలపై బీజేపీ దృష్టి కేంద్రీకరిస్తోంది, తదితర ఎన్నికలకు సంబంధించి అంతర్గత విషయాలు, అదేవిధంగా బీజేపీ అగ్రనాయకత్వం భేటీల్లో వెల్లడించిన అంశాలు, ఆయా అంశాలపై వారి అభిప్రాయాలు, ఇతర ప్రాధాన్యత సంతరించుకున్న విషయాలపై అంతర్గత సమాచారం వంటివి ప్రత్యర్థి పార్టీలకు తెలిసే అవకాశాలు ఏర్పడ్డాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు పశ్చిమబెంగాల్‌లో చోటుచేసుకున్న పరిణామాలే తెలంగాణలోనూ రిపీట్ అవుతున్నాయా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బెంగాల్‌లో బీజేపీ గెలిచేంతస్థాయిలో పుంజుకున్నా, టీఎంసీ నుంచి చేరిన ఎంపీ, ఇతర కీలక నేతలు ఎన్నికలకు ముందు పార్టీని వీడటంతో కోలుకోలేని దెబ్బ



తగిలిందని ముఖ్యనేతలు అభిప్రాయపడ్డారు.

బెంగాల్ తరహాలోనేనా...

2019 లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ ఒంటరిగా పోటీచేసి 4 ఎంపీ సీట్లను గెలుపొందింది. దీంతో తెలంగాణలో పార్టీ గ్రాఫ్ పెరుగుతోందన్న అంచనాల మధ్య తమ రాజకీయ భవిష్యత్‌ను పరీక్షించుకునేందుకు విడతల వారీగా ప్రస్తుత ఎన్నికలకు కొంతకాలం ముందుదాకా బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌ల నుంచి పలువురు మాజీ ఎంపీలు ఇతర నేతలు బీజేపీలో చేరారు. కొంతకాలం వరకు బాగానే ఉన్నా, రాష్ట్ర అధ్యక్షుడిగా బండి సంజయ్ మార్పుతో ముఖ్యంగా ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతల అసంతృప్త స్వరాలు ఒక్కసారిగా పెరిగాయి. పార్టీ జాతీయ నాయకత్వాన్ని ఇబ్బంది పెట్టేలా వరుసగా కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, వివేక్, ఏనుగు రవీందర్‌రెడ్డి, విజయశాంతి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి వంటి అసంతృప్త నేతలు భేటీలు నిర్వహించారు. ఢిల్లీ మద్యం కుంభకోణంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను అరెస్ట్ చేయాలని, కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించాలని, తమకు పార్టీలో తగిన గుర్తింపు, ప్రాధాన్యత లేదంటూ వివిధ అంశాలపై నేరుగా ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమాధానం చెప్పాలంటూ డిమాండ్లు చేశారు. ఆ తర్వాత వారి లో రాజగోపాల్‌రెడ్డికి స్క్రీనింగ్ కమిటీ చైర్మన్‌గా, వివేక్‌కు మేనిఫెస్టో కమిటీ చైర్మన్‌గా, విజయశాంతికి ఉద్యమ కమిటీలో ప్రాధాన్యత కల్పించారు.

సరిగ్గా ఎన్నికలకు ముందు...

అయినప్పటికీ చివరకు సరిగ్గా ఎన్నికలు జరగడానికి నెలరోజుల ముందు బీజేపీలో జాతీయ కార్యవర్గ సభ్యులుగా, ఎన్నికలకు సంబంధించి కీలక బాధ్యతల్లో ఉన్న రాజగోపాల్‌రెడ్డి, ఆ తర్వాత వివేక్ పార్టీని వీడటంతో నాయకుల్లో గందరగోళం నెలకొంది. ఇంకా కొందరు కూడా బీజేపీని విడిచిపెట్టే అవకాశాలున్నాయని ప్రచారం జరుగుతోంది. గతంలోనూ మునుగోడు ఉప ఎన్నికల సందర్భంగా కూడా...ఆయా ముఖ్యమైన బాధ్యతలు అప్పగించిన నేతలు చివరి నిమిషంలో పార్టీకి రాజీనామా చేసి అధికార బీఆర్‌ఎస్‌లో చేరడం కలకలం సృష్టించింది. పార్టీకి సంబంధించిన కీలకమైన అంశాలు, పోల్ మేనేజ్‌మెంట్, ఇతర ముఖ్య సమాచారం వారి ద్వారా ప్రత్యర్థి పార్టీలకు చేరి ఉంటుందనే అనుమానాలు కూడా అప్పట్లోనే వ్యక్తమయ్యాయి. తాజాగా అభ్యర్థుల స్క్రీనింగ్ కమిటీ, మేనిఫెస్టో కమిటీల చైర్మన్లు పార్టీకి గుడ్‌బై చెప్పడం రాజకీయంగా బీజేపీకి ఏ మేరకు నష్టాన్ని కలిగిస్తుందనేది వేచిచూడాల్సి ఉందంటున్నారు.



మూసీ ప్రాజెక్టు గేటు ఎత్తడంతో దిగువకు పోతున్న వరదనీరు

మూసీ ప్రాజెక్టుకు వరద తాకిడి

- ఒక క్రస్ట్ గేటు ఎత్తివేత
- ఎగువ నుంచి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

కేతేపల్లి: నల్లగొండ జిల్లాలోని మూసీ ప్రాజెక్టుకు బుధవారం ఎగువ ప్రాంతాల నుంచి వరదనీటి రాక పెరగడంతో అధికారులు ఒక క్రస్ట్ గేటును పైకెత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మూసీ ఎగువ ప్రాంతాలలో అక్కడక్కడ కురుస్తున్న వర్షాలతో మూసీ రిజర్వాయర్‌కు 680 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. 645 అడుగుల గరిష్ట నీటిమట్టం గల మూసీ రిజర్వాయర్‌లో ప్రస్తుత నీటిమట్టం 644.92 అడుగుల వద్ద ఉంది. అధికారులు బుధవారం ప్రాజెక్టు ఒక క్రస్టు గేటును అర అడుగు పైకెత్తి.. 335 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మూసీ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం 4.44 టీఎంసీల నీరు నిల్వ ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

నేడో రేపో బీజేపీ మలి జాబితా

పార్టీ సీఈసీ ఆమోదం

- 66 స్థానాల్లో గెలుపు గుర్రాలకే సీట్లు.. మలి జాబితాలోనూ బీసీలు, మహిళలకు ప్రాధాన్యం
- సీఈసీ భేటీకి హాజరైన ప్రధాని మోదీ, నడ్డా, అమిత్ షా, రాజ్‌నాథ్, లక్ష్మణ్
- తెలంగాణ నుంచి హాజరైన కిషన్‌రెడ్డి, సంజయ్, డీకే అరుణ, ఈటల
- ఢిల్లీలో బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ భేటీలో సమీక్ష



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల మలిజాబితాకు బీజేపీ అధిష్టానం ఆమోద ముద్ర వేసింది. తొలి జాబితా మాదిరిగా గెలుపు గుర్రాలే లక్ష్యంగా రాష్ట్ర నాయకత్వం తయారు చేసిన మలి జాబితాలోని అన్ని స్థానాలపై బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ కూలంకషంగా సమీక్ష చేసింది. అనంతరం మిగిలిన 66 స్థానాల్లో బీజేపీ పోటీ చేయనున్న స్థానాలకు పచ్చజెండా ఊపింది. అయితే పొత్తు నేపథ్యంలో జనసేనకు కేటాయించే సీట్లను మినహాయించి మిగతా అభ్యర్థులతో బీజేపీ మలిజాబితా విడుదల కానుంది. సీట్ల కేటాయింపులో తొలి జాబితా మాదిరిగా మలి జాబితాలోనూ బీసీలు, మహిళలకు ప్రాధాన్యత ఇచ్చేలా బీజేపీ అధిష్టానం ప్రత్యేక దృష్టి సారించింది.

చర్చల్లో మోదీ, నడ్డా, అమిత్ షా

బుధవారం రాత్రి ఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన సీఈసీ సమావేశంలో తెలంగాణ అభ్యర్థుల ఎంపికపై ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్రమంత్రులు అమిత్ షా, రాజనాథ్‌సింగ్, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత వ్యవహారాలు) బీఎల్ సంతోష్, పార్టీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా.కె.లక్ష్మణ్ సహా పలువురు కేంద్ర ఎన్నికల కమిటీ సభ్యులు సుమారు గంట పాటు కసరత్తు చేశారు. వీరితో పాటు తెలంగాణ నుంచి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శులు బండి సంజయ్ కుమార్, తరుణ్ ఛుగ్, సునీల్ భన్సల్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల సహ ఇన్‌చార్జ్ అరవింద్ మీనన్, పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, ఈటల రాజేందర్, ఎన్నికల ఇంచార్జ్ ప్రకాశ్ జవదేకర్ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. కాగా తెలంగాణతో పాటు రాజస్తాన్ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియపై విడివిడిగా ఆయా రాష్ట్రాల నాయకులతో కలిసి కేంద్ర ఎన్నికల కమిటీ చర్చించి ఆమోద ముద్ర వేసింది.

పూర్తిస్థాయిలో కసరత్తు

తెలంగాణకు సంబంధించి బీజేపీ తొలి జాబితా విడుదల తర్వాత కొన్నిచోట్ల అసంతృప్త స్వరాలు బయటపడడం, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, వివేక్ వెంకటస్వామి సహా పలువురు నేతలు పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల్లో చేరిన పరిణామాల నేపథ్యంలో మలిజాబితాపై రాష్ట్ర నాయకత్వం పూర్తిస్థాయిలో కసరత్తు నిర్వహించింది.

బీసీలకే పెద్దపీట: కాగా తొలి జాబితాలో ఏవిధంగా అయితే బీసీలు, మహిళలకు అధిక ప్రాధాన్యత ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారో.. మలి జాబితాలోనూ బీసీలు, మహిళలకు సముచిత స్థానం దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ ముఖ్యమంత్రి అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇటీవల తెలంగాణ పర్యటనలో ప్రకటించిన నేపథ్యంలో బీసీలకు పెద్దపీట వేసే అవకాశాలున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

ఏ క్షణమైనా జాబితా

కాగా పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశంలో ఆమోదం పొందిన బీజేపీ అభ్యర్థుల మలిజాబితాను ఢిల్లీ నుంచి పార్టీ కేంద్ర కార్యాలయం ఏ క్షణమైనా విడుదల చేసే అవకాశాలున్నాయి. గతంలో తొలి జాబితా విడుదల సమయంలో కేంద్ర ఎన్నికల కమిటీ భేటీ అక్టోబర్ 20వ తేదీన జరుగగా, 52 మంది సభ్యుల జాబితాను అక్టోబర్ 22 న విడుదల చేశారు. ఈసారి కూడా అదే తరహాలో ఒకటి రెండు రోజుల తర్వాత మలి జాబితాను విడుదల చేస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి.

అవినీతిపరులకే బీఆర్‌ఎస్ టికెట్లు

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ధ్వజం
- 'తెలంగాణ ఎలక్షన్ ట్యాక్స్' పేరుతో కర్ణాటకలో కాంగ్రెస్ సర్కార్ వసూళ్లు
- 3 నుంచి రాష్ట్రంలో ఎన్నికల ప్రచారాన్ని ఉధృతం చేస్తాం
- బీజేపీలో చేరిన బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు
- కాషాయ కండువా కప్పుకున్న కాంగ్రెస్ నేతలు కృష్ణారెడ్డి, సుభాష్‌రెడ్డి



ఢిల్లీలో కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరిన ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు

సాక్షి, న్యూఢిల్లీ: అవినీతిపరులు, లిక్కర్ మాఫియాకు సంబంధించినవారికే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ టికెట్లు ఇచ్చిందని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ఆరోపించారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత ఉందని, ఈ నేపథ్యంలో ప్రజలంతా ప్రత్యామ్నాయంగా బీజేపీ వైపే చూస్తు న్నారని అభిప్రాయపడ్డారు. బుధవారం ఢిల్లీలో ఆయన నివాసంలో జరిగిన ఒక కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావుతో పాటు మునుగోడు నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చెల్లమల్ల కృష్ణారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సుభాష్‌రెడ్డి, ఇతర కాంగ్రెస్ నేతలు సురిగి నరసింహ, బిట్టు సత్యనారాయణలు బీజేపీలో చేరారు. వీరికి కిషన్‌రెడ్డి, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్, పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్‌లు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, ఈనెల 3 నుంచి రాష్ట్రంలో ఎన్నికల ప్రచారాన్ని ఉధృతం చేస్తున్నామన్నారు. కర్ణాటకలో మోసపూరిత హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ గురించి అక్కడి రైతులు తెలంగాణలో పర్యటించి తమ పరిస్థితులను వివరిస్తున్నట్లు తెలిపారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం 'తెలంగాణ ఎలక్షన్ టాక్స్'పేరుతో వసూళ్లకు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. కేసీఆర్ పూజల ద్వారా ఎన్నికల్లో గెలవాలని ప్రయత్నిస్తున్నారన్నారని బండి సంజయ్ విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు తన ఆలోచన ఫలితమే అని ఘనంగా చెప్పుకున్న కేసీఆర్.. ఇప్పుడు మేడిగడ్డ బ్రిడ్జి కుంగిపోతే ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. తాజాగా అన్నారం బ్యారేజీకి కూడా పగుళ్లు ఏర్పడుతున్నట్టుగా వస్తున్న వార్తలతో ప్రజల్లో ఆందోళన నెలకొందని.. దీనిపై కేసీఆర్, కేటీఆర్ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

విలువలు కలిగిన రాజకీయాలకు ప్రాధాన్యం..

ఎంపీ లక్ష్మణ్ మాట్లాడుతూ.. దేశంలో విలువలు కలిగిన రాజకీయాలకు ప్రాధాన్యం ఇచ్చే బీజేపీ వైపు ప్రజలు ఆకర్షితులవుతున్నారని అన్నారు. త్వరలోనే బీజేపీ మేనిఫెస్టోను విడుదల చేస్తామని తెలిపారు. ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో రోజురోజుకూ కేసీఆర్‌పై వ్యతిరేకత పెరిగిపోతోందని, చంద్రబాబును అడ్డుపెట్టుకుని కాంగ్రెస్ పార్టీ గెలవాలనుకుంటోందని.. అయితే తెలంగాణ ప్రజలు దీనిని తిప్పికొడతారని విమర్శించారు. నీతి, నిబద్ధత కలిగిన బీజేపీ పట్ల ప్రజల్లో సానుకూల స్పందన ఉందని డీకే అరుణ అన్నారు. ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు మాట్లాడుతూ.. రెండుసార్లు గెలిచిన తనను, కొందరు కక్షగట్టి మూడోసారి ఎమ్మెల్యే టికెట్ రాకుండా చేశారని మండిపడ్డారు. దీనిపై మాట్లాడేందుకు ప్రయత్నిస్తే.. ముఖ్యమంత్రి కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

బీసీలను రాహుల్ అవమానించారు

అధికారంలోకి వస్తే బీసీని సీఎం చేస్తామన్న బీజేపీ నినాదంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యంగ్యంగా మాట్లాడి తెలంగాణ బీసీలను అవమానించారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రమపైనే ఆధారపడి జీవించే వెనుకబడిన వర్గాల ఆకాంక్షలను అవమానించేలా రాహుల్ అహంకారపూరిత వైఖరి ఉందని నిందించారు. బుధవారం ఈ మేరకు కిషన్‌రెడ్డి మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు.



సబలెంకాకు షాక్

మహిళల టెన్నిస్ సీజన్ ముగింపు టోర్నీ డబ్ల్యూటీఏ ఫైనల్స్‌లో టాప్ సీడ్, ప్రపంచ నంబర్‌వన్ సబలెంకా (బెలారస్)కు రెండో లీగ్ మ్యాచ్‌లో ఓటమి ఎదురైంది. మెక్సికోలోని కాన్‌కున్ నగరంలో జరుగుతున్న ఈ టోర్నీలో అమెరికా ప్లేయర్ జెస్సికా పెగూలా 6-4, 6-3తో సబలెంకాను ఓడించి సెమీఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. 88 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో పెగూలా ఐదు ఏస్‌లు సంధించడంతోపాటు సబలెంకా సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది. సబలెంకా, రిబాకినా (కజకిస్తాన్) మధ్య జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో గెలిచిన ప్లేయర్‌కు రెండో సెమీఫైనల్ బెర్త్ లభిస్తుంది.

వ్రితి అగర్వాల్‌కు మూడో పతకం



గోవాలో జరుగుతున్న జాతీయ క్రీడల్లో తెలంగాణ ఖాతాలో 12వ పతకం చేరింది. మహిళల స్విమ్మింగ్ 200 మీటర్ల బటర్‌ఫ్లయ్ ఈవెంట్‌లో వ్రితి అగర్వాల్ (2ని:22.28 సెకన్లు) కాంస్య పతకం నెగ్గి ఈ క్రీడల్లో మూడో పతకం సాధించింది. ఓవరాల్‌గా తెలంగాణ 2 స్వర్ణాలు, 3 రజతాలు, 7 కాంస్యాలతో కలిపి 12 పతకాలతో 22వ స్థానంలో ఉంది. ఆంధ్రప్రదేశ్ 4 స్వర్ణాలు, 2 రజతాలు, 9 కాంస్యాలతో కలిపి 15 పతకాలతో 17వ స్థానంలో ఉంది.



రోహిత్ శర్మ

సెమీఫైనల్ లక్ష్యంగా...

- ప్రపంచకప్‌లో నేడు శ్రీలంకతో తలపడనున్న టీమిండియా
- జోరు మీదున్న రోహిత్ బృందం
- మ. 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

ముంబై: ఎదురులేని ఆటతో వరల్డ్‌కప్‌లో వరుసగా ఆరు మ్యాచ్‌లు గెలిచి దూసుకుపోతున్న భారత జట్టు ఇప్పుడు మరో గెలుపుపై దృష్టి పెట్టింది. గురువారం జరిగే పోరులో మాజీ విశ్వవిజేత శ్రీలంకతో భారత్ ఆడుతుంది. ఈ మ్యాచ్‌లో టీమిండియా గెలిస్తే సెమీఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంటుంది. ఒకవైపు భారత్ అజేయంగా చెలరేగుతుండగా, మరోవైపు శ్రీలంక పరిస్థితి ఇబ్బందికరంగా ఉంది. క్వాలిఫయింగ్ టోర్నీ ద్వారా ఈ మెగా ఈవెంట్‌కు అర్హత సాధించిన ఆ జట్టు ప్రస్థానం పడుతూ లేస్తూ సాగుతోంది. మూడు పరాజయాల తర్వాత రెండు మ్యాచ్‌లు గెలిచిన ఆ జట్టు గత మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్ చేతిలో ఓడటం వారిని తీవ్రంగా నిరాశపర్చింది. ఈ నేపథ్యంలో ఈ మ్యాచ్ కూడా ఏకపక్షంగా ముగియవచ్చు.

మార్పుల్లేకుండా...

భారత జట్టు విషయంలో తుది జట్టులో మార్పులు చేసే అవకాశం, అవసరం కనిపించడం లేదు. హార్దిక్ పాండ్యా ఇంకా పూర్తిగా కోలుకోకపోవడంతో అతను ఈ మ్యాచ్‌లోనూ ఆడటం లేదు. ఇంగ్లండ్‌తో పోరులో జట్టు బ్యాటింగ్ కాస్త తడబడినట్లుగా కనిపించినా... అది పూర్తిగా భిన్నమైన, కఠినమైన పిచ్ కావడం మన బ్యాటర్లకు పరీక్ష పెట్టింది. కానీ అది పునరావృతం కాకుండా మన ఆటగాళ్లు చెలరేగిపోగలరు. అయితే నాలుగో స్థానంలో శ్రేయస్ అయ్యర్ బ్యాటింగ్ మాత్రమే కాస్త సమస్యగా కనిపిస్తోంది. బుమ్రా, షమీల ప్రమాదకరమైన బౌలింగ్... స్పిన్‌లో జడేజా, కుల్దీప్‌ల జోరు భారత్‌ను దుర్బేధ్యంగా మారుస్తున్నాయి.

మాథ్యూస్‌పై ఆశలు...

ఒకవైపు ఆట పేలవంగా ఉండటంతో పాటు మరోవైపు కీలక ఆటగాళ్లకు వరుస గాయాలు శ్రీలంకను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నాయి. దాంతో తుది జట్టులో వరుసగా మార్పులు చేయాల్సి ఉంది. అనూహ్యంగా ప్రపంచకప్ జట్టులోకి వచ్చిన సీనియర్ ఎంజెలో మాథ్యూస్‌కు భారత్‌పై మంచి రికార్డు ఉంది. 54 సగటుతో అతను మూడు సెంచరీలు కూడా సాధించాడు. అదే ఆటను మళ్లీ చూపించాలని లంక కోరుకుంటోంది. బౌలింగ్‌లో అందరూ అంతంతమాత్రమే. రజిత, తీక్షణ, మదుషంకలాంటి జూనియర్లు భారత బ్యాటింగ్ బలగాన్ని నిలువరించడం చాలా కష్టం. మొదటి నుంచి వాంఖెడే మైదానం పిచ్ బ్యాటింగ్‌కు బాగా అనుకూలం. ఈ టోర్నీలో జరిగిన తొలి రెండు మ్యాచ్‌లలో ముందుగా బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా 399, 382 పరుగులు చేసింది. మ్యాచ్‌కు వర్షసూచన లేదు.

ప్రతాప్ సింగ్‌కు పసిడి పతకం



న్యూఢిల్లీ: ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌ను భారత్ స్వర్ణ పతకంతో ముగించింది. పోటీల చివరిరోజు బుధవారం భారత్ ఒక స్వర్ణం, ఒక రజతం, ఒక కాంస్యం సాధించింది. పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ వ్యక్తిగత విభాగంలో ఐశ్వరీ ప్రతాప్ సింగ్ తోమర్ పసిడి పతకం గెలిచాడు. ఫైనల్లో ప్రతాప్ సింగ్ 463.5 పాయింట్లు స్కోరు చేసి విజేతగా నిలిచాడు. ఐశ్వరీ ప్రతాప్ సింగ్, అఖిల్ షెరాన్, స్వప్నిల్ కుసాలేలతో కూడిన భారత బృందం ఇదే విభాగంలో టీమ్ ఈవెంట్‌లో 1764 పాయింట్లతో రజత పతకం కైవసం చేసుకుంది. పురుషుల 25 మీటర్ల సెంటర్ ఫైర్ పిస్టల్ ఈవెంట్ వ్యక్తిగత విభాగంలో ప్రదీప్ సింగ్ షెఖావత్ 582 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సాధించాడు. ఓవరాల్‌గా ఈ టోర్నీలో భారత బృందం 8 స్వర్ణాలు, 10 రజతాలు, 4 కాంస్యాలతో కలిపి 22 పతకాలతో రెండో స్థానంలో నిలిచింది.

'టాప్' ర్యాంక్‌లో షాహీన్ అఫ్రిది



దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) వన్డే బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో పాకిస్తాన్ పేస్ బౌలర్ షాహీన్ షా అఫ్రిది తొలిసారి టాప్ ర్యాంక్‌ను అందుకున్నాడు. బుధవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో షాహీన్ అఫ్రిది 673 పాయింట్లతో ఏడు స్థానాలు ఎగబాకి నంబర్‌వన్ ర్యాంక్‌లో నిలిచాడు. హాజల్‌వుడ్ (ఆ్రస్టేలియా) టాప్ నుంచి రెండో ర్యాంక్‌కు పడిపోయాడు. భారత బౌలర్లు సిరాజ్, కుల్దీప్ యాదవ్ వరుసగా మూడు, ఏడు స్థానాల్లో ఉన్నారు. ప్రస్తుత వన్డే ప్రపంచకప్‌లో షాహీన్ 16 వికెట్లు పడగొట్టి ఆడమ్ జంపా (ఆ్రస్టేలియా), మార్కో జాన్సెన్ (దక్షిణాఫ్రికా)లతో కలిసి సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నాడు. బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో బాబర్ ఆజమ్ తన టాప్ ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు. ఐసీసీ ర్యాంకింగ్స్ ప్రవేశపెట్టాక వన్డే ఫార్మాట్‌లో ఏకకాలంలో బౌలింగ్, బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో పాకిస్తాన్ క్రికెటర్లు నంబర్‌వన్ స్థానంలో ఉండటం ఇదే తొలిసారి.

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
దక్షిణాఫ్రికా	7	6	1	12	2.290
భారత్	6	6	0	12	1.405
ఆ్రస్టేలియా	6	4	2	8	0.970
న్యూజిలాండ్	7	4	3	8	0.484
పాకిస్తాన్	7	3	4	6	-0.024
అఫ్గానిస్తాన్	6	3	3	6	-0.718
శ్రీలంక	6	2	4	4	-0.275
నెదర్లాండ్స్	6	2	4	4	-1.277
బంగ్లాదేశ్	7	1	6	2	-1.446
ఇంగ్లండ్	6	1	5	2	-1.652

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

కివీస్ నెత్తిన సఫారీ పిడుగు!

- 190 పరుగులతో న్యూజిలాండ్ చిత్తు
- దక్షిణాఫ్రికాకు ఆరో విజయం
- డసెన్, డికాక్ సెంచరీలు



డికాక్



డసెన్

పుణే: ప్రపంచకప్‌లో ఆసక్తి రేపిన మ్యాచ్‌లలో ఇదొకటి... ఇరు జట్ల తాజా ప్రదర్శన, బలాబలాలు, గత రికార్డులను బట్టి చూస్తే న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా పోరు హోరాహోరీగా సాగడం ఖాయమనిపించింది. కానీ చివరకు వచ్చేసరికి అంతా సఫారీల హవానే సాగి ఏకపక్ష విజయం దక్కింది. పేలవ బౌలింగ్‌తో భారీగా పరుగులిచ్చిన కివీస్ ఆ తర్వాత బ్యాటింగ్‌లోనూ కుప్పకూలింది. దక్షిణాఫ్రికా వరుసగా నాలుగో విజయంతో అగ్రస్థానానికి చేరగా... టోర్నీ ఆరంభంలో అద్భుతంగా అనిపించిన న్యూజిలాండ్ ఖాతాలో ఇప్పుడు వరుసగా మూడో ఓటమి చేరింది. బుధవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 190 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌పై ఘన విజయం సాధించి సెమీఫైనల్ బెర్త్‌ను దాదాపు ఖాయం చేసుకుంది. టాస్ గెలిచిన కివీస్ ఊహించని విధంగా ప్రత్యర్థికి బ్యాటింగ్ అప్పగించింది. ముందుగా దక్షిణాఫ్రికా 50 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 357 పరుగుల భారీ స్కోరు సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' డసెన్ (118 బంతుల్లో 133; 9 ఫోర్లు, 5 సిక్స్‌లు), డికాక్ (116 బంతుల్లో 114; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీలతో చెలరేగారు. వీరిద్దరు రెండో వికెట్‌కు 200 పరుగులు జోడించగా, ఆఖరి 10 ఓవర్లలో సఫారీ జట్టు 119 పరుగులు సాధించింది. డికాక్‌కు ఈ మెగా టోర్నీలో ఇది నాలుగో శతకం. అనంతరం న్యూజిలాండ్ బ్యాటర్లు విఫలం కావడంతో ఆ జట్టు 35.3 ఓవర్లలో 167 పరుగులకే కుప్పకూలింది.

స్కోరు వివరాలు

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: డికాక్ (సి) ఫిలిప్స్ (బి) సౌతీ 114; బవుమా (సి) మిచెల్ (బి) బౌల్ట్ 24; డసెన్ (బి) సౌతీ 133; మిల్లర్ (సి) మిచెల్ (బి) నీషమ్ 53; క్లాసెన్ (నాటౌట్) 15; మార్క్‌రమ్ (నాటౌట్) 6; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (50 ఓవర్లలో 4 వికెట్లకు)** 357. **వికెట్ల పతనం:** 1-38, 2-238, 3-316, 4-351. **బౌలింగ్:** బౌల్ట్ 10-1-49-1, హెన్రీ 5.3-0-31-0, సౌతీ 10-0-77-2, సాన్‌ట్నర్ 10-0-58-0, ఫిలిప్స్ 7-0-52-0, రచిన్ 2-0-17-0, నీషమ్ 5.3-0-69-1.

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: కాన్వే (సి) మార్క్‌రమ్ (బి) జాన్సెన్ 2; యంగ్ (సి) డికాక్ (బి) కొయెట్జీ 33; రచిన్ (సి) కొయెట్జీ (బి) జాన్సెన్ 9; మిచెల్ (సి) మిల్లర్ (బి) మహరాజ్ 24; లాథమ్ (సి) మహరాజ్ (బి) రబడ 4; ఫిలిప్స్ (సి) రబడ (బి) కొయెట్జీ 60, సాన్‌ట్నర్ (బి) మహరాజ్ 7; సౌతీ (ఎల్బీ) (బి) జాన్సెన్ 7; నీషమ్ (బి) మహరాజ్ 0; బౌల్ట్ (సి) మిల్లర్ (బి) మహరాజ్ 9; హెన్రీ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (35.3 ఓవర్లలో ఆలౌట్)** 167. **వికెట్ల పతనం:** 1-8, 2-45, 3-56, 4-67, 5-90, 6-100, 7-109, 8-110, 9-133, 10-167. **బౌలింగ్:** జాన్సెన్ 8-1-31-3, ఎన్‌గిడి 6-1-28-0, రబడ 6-2-16-1, కొయెట్జీ 6.3-0-41-2, కేశవ్ మహరాజ్ 9-0-46-4.

'బౌలర్లు మరోసారి మెరిపించాలి'

గౌతమ్ గంభీర్

భారత జట్టుకు చెందిన 'బిహైండ్ ద సీన్స్' వీడియోలు అందరూ ఇష్టపడుతున్నారని భావిస్తున్నాను. వ్యక్తిగతంగా ఈ వీడియోలు నాకెంతో నచ్చుతున్నాయి. మ్యాచ్ సందర్భంగా రాణించిన భారత ఫీల్డర్ టీమ్ ఫీల్డింగ్ కోచ్ టి.దిలీప్ చేతుల మీదుగా ఉత్తమ ఫీల్డర్ పతకం అందుకుంటున్నాడు. ఈ అవార్డు ఇచ్చే సమయంలో చిన్న ప్రసంగం, సంబరాలు ఉంటున్నాయి. ఈ తరహా కార్యక్రమాలతో జట్టు సభ్యులందరిలో మరింత ఐక్యత పెరుగుతుంది. ప్రపంచకప్‌లో పాయింట్ల పట్టికలో భారత్ అగ్రస్థానంలో ఉండటం, వరుస విజయాలు లభిస్తుండటంతో జట్టులోనూ అందరూ సంతోషంగా ఉన్నారు. ఇక డ్రెస్సింగ్ రూమ్‌లోనూ ఎవరు కూడా అభద్రతాభావంతో కనిపించడంలేదు. కెప్టెన్ రోహిత్ శర్మ, హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ తమ ఆటగాళ్లకు అవసరమైనన్ని అవకాశాలు ఇస్తున్నారు. టోర్నీ ఆరంభ మ్యాచ్‌ల్లో షమీని ఆడించకపోవడం జట్టు వ్యూహంలో భాగంగా కనిపిస్తోంది. గతంలో కేఎల్ రాహుల్ విఫలమైనా అతనితో మాట్లాడుతూ, తప్పిదాలను సరిచేస్తూ మరిన్ని అవకాశాలు ఇస్తూ ఆత్మవిశ్వాసాన్ని పెంచారు. షార్ట్ బాల్ ఎదుర్కోవడంలో ఇబ్బంది పడుతున్న శ్రేయస్ అయ్యర్‌తో కూడా రోహిత్, ద్రవిడ్ బృందం మాట్లాడే ఉంటుంది. పొరపాటు ఎక్కడ జరుగుతుందో, ఏం చేస్తే ఈ సమస్య నుంచి బయటపడతాడో అయ్యర్‌కు రోహిత్ సూచించే ఉంటాడు. ముంబైలోని వాంఖడే స్టేడియంలోని ఫ్లాట్ పిచ్‌పై ఈరోజు శ్రీలంకతో జరగనున్న మ్యాచ్‌లో పరుగుల వరద పారే అవకాశం కనిపిస్తోంది. భారత బ్యాటర్ల కంటే బౌలర్లు మరోసారి మెరిపించాలని కోరుకుంటున్నాను. ఈ టోర్నీలో శ్రీలంక తడబడుతోంది. పూర్తిస్థాయి ఆటతీరును ఆ జట్టు ఇంకా కనబర్చలేదు. వారి ప్రదర్శనలో ఏదో లోపిస్తోంది. ఒకరిద్దరి వ్యక్తిగత ప్రదర్శనలు మినహా జట్టుగా మెరిపించాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో భారత జట్టు నుంచి మరో భారీ విజయం రావడం ఖాయమనిపిస్తోంది.

సినిమా



రామ్

ముంబైలో డబుల్ ఇస్మార్ట్

హీరో రామ్, దర్శకుడు పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో వచ్చిన 'ఇస్మార్ట్ శంకర్' సూపర్ హిట్టయిన విషయం తెలిసిందే. తాజాగా రామ్, పూరి కాంబినేషన్‌లోనే 'ఇస్మార్ట్ శంకర్'కు సీక్వెల్‌గా 'డబుల్ ఇస్మార్ట్' తెరకెక్కుతోంది. ఇందులో సంజయ్ దత్ కీలక పాత్రధారి. ఈ సినిమా కోసం ముంబైలో రామ్ పాల్గొనగా కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ''స్కంద' కోసం బరువు పెరిగిన రామ్ 'డబుల్ ఇస్మార్ట్' కోసం బరువు తగ్గి, సిక్స్ ప్యాక్‌తో మేకోవర్ అయ్యారు'' అని యూనిట్ పేర్కొంది. పూరి జగన్నాథ్, ఛార్మీ కౌర్ నిర్మిస్తున్న ఈ చిత్రం మార్చి 8న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో రిలీజ్ కానుంది.



నయనతార

ఆ రోజు థియేటర్స్‌లో అన్నపూరణి

అన్నపూరణిగా థియేటర్స్‌లోకి వచ్చేందుకు రెడీ అయ్యారు హీరోయిన్ నయనతార. ఆమె కెరీర్‌లో రూపొందుతున్న 75వ సినిమా 'అన్నపూరణి' (తెలుగులో 'అన్నపూర్ణ' అని అర్థం). 'ది గాడెస్ ఆఫ్ ఫుడ్' అనేది ఉపశీర్షిక. జీ స్టూడియోస్, నాడ్ స్టూడియోస్, ట్రైడెంట్ ఆర్ట్స్ నిర్మాణ భాగస్వామ్యులుగా ఉన్న ఈ సినిమాకు నీలేష్ కృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని డిసెంబరు 1న విడుదల చేస్తున్నట్లుగా వెల్లడించి, ఓ పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ''ఫుడ్.. ఫన్.. ఎమోషన్ నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుంది' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

మూడు ముళ్లు... ఏడడుగులు



'మిస్టర్, అంతరిక్షం' సినిమాల్లో జోడీగా నటించిన వరుణ్ తేజ్, లావణ్యా త్రిపాఠి నిజ జీవితంలో పెళ్లి బంధంతో ఒక్కటయ్యారు. ఇటలీలోని టస్కనీలో బుధవారం రాత్రి వీరి వివాహం ఘనంగా జరిగింది. ఇరు కుటుంబ సభ్యులతో పాటు అత్యంత సన్నిహితులు, స్నేహితుల సమక్షంలో ఈ పెళ్లి వేడుక జరిగింది. చిరంజీవి, రామ్‌చరణ్, అల్లు అర్జున్, సాయిధరమ్ తేజ్, వైష్ణవ్ తేజ్, నితిన్ తదితరులు ఈ వివాహానికి హాజరయ్యారు.

షూటింగ్‌కే రెండేళ్లు పట్టింది

- రక్షిత్ అట్లూరి



''నరకాసుర' చిత్రం ఆంధ్రప్రదేశ్, తమిళనాడు సరిహద్దుల్లోని ఓ కాఫీ ఎస్టేట్ నేపథ్యంలో సాగుతుంది. ఈ సినిమాలో శివ అనే లారీ డ్రైవర్ పాత్ర చేశాను. నా గత సినిమా 'పలాస 1978'లో దళితుల సమస్యలు చూపించినట్లే 'నరకాసుర'లో హిజ్రాలకు సంబంధించిన పాయింట్ ఒకటి తీసుకున్నాం. కథలో ఇదొక అంశం మాత్రమే. మా సినిమా సూపర్ హిట్ అవుతుందనే నమ్మకంతో ఉన్నాం'' అని హీరో రక్షిత్ అట్లూరి అన్నారు. సెబాస్టియన్ నోవా అకోస్టా జూనియర్ దర్శకత్వంలో రక్షిత్ అట్లూరి హీరోగా, అపర్ణా జనార్దన్, సంకీర్తనా విపిన్ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'నరకాసుర'. డా. అజ్జా శ్రీనివాస్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 3న విడుదలవుతోంది. ఈ సందర్భంగా రక్షిత్ అట్లూరి మాట్లాడుతూ– ''2020లో 'నరకాసుర' ప్రారంభించి, ఏడాదిలో పూర్తి చేయాలనుకున్నాం. అయితే రెండుసార్లు కరోనా లాక్‌డౌన్ రావడం, కథపరంగా ఛత్తీస్‌గఢ్, ఒరిస్సా, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో షూటింగ్ చేయడం, ఆర్టిస్టుల డేట్స్, మా డైరెక్టర్ ప్రమాదంలో చేయి కోల్పోవడం... ఇలా పలు కారణాలతో షూటింగ్‌కే రెండున్నరేళ్లు పట్టింది. అయితే కథపై నమ్మకంతో నిర్మాతలు సపోర్ట్ చేశారు. ఇక నేను నటించిన 'శశివదనే', 'ఆపరేషన్ రావణ్' సినిమాలు పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉన్నాయి. మరికొన్ని కథలు వింటున్నాను'' అన్నారు.

అందుకే వాయిదా వేశాం

- నిర్మాత నాగవంశీ



నాగవంశీ, శ్రీకాంత్ ఎన్. రెడ్డి

''ప్రస్తుతం వన్ డే క్రికెట్ ప్రపంచ కప్ జరుగుతోంది. ఈ ప్రభావం సినిమాల వసూళ్లపై పడుతోంది. అందుకే ఈ నెల 10న విడుదల కావాల్సిన మా 'ఆదికేశవ' సినిమాని 24కి వాయిదా వేస్తున్నాం'' అన్నారు నాగవంశీ. వైష్ణవ్ తేజ్, శ్రీలీల జంటగా శ్రీకాంత్ ఎన్. రెడ్డి దర్శకత్వం వహించిన చిత్రం 'ఆదికేశవ'. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్ మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌పై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. బుధవారం విలేకరుల సమావేశంలో నాగవంశీ మాట్లాడుతూ– ''ఇండియా ఫైనల్‌కి వెళ్లి, వరల్డ్ కప్ గెలుస్తుందనే అంచనాలున్నాయి. ఈ టైమ్‌లో విడుదల చేయడం కరెక్ట్ కాదని డిస్ట్రిబ్యూటర్స్ కూడా చెప్పడంతో ఈ నెల 24న విడుదల చేయాలని నిర్ణయించాం'' అన్నారు నాగవంశీ. ''కుటుంబ ప్రేక్షకులతో పాటు యూత్, మాస్ ఆడియన్స్‌ని మా చిత్రం అలరిస్తుంది'' అన్నారు శ్రీకాంత్ ఎన్. రెడ్డి.

తంగలాన్ నాకో కొత్త అనుభవం

- విక్రమ్



బాబీ, సురేందర్ రెడ్డి, కేఈ జ్ఞానవేల్ రాజా, విక్రమ్, పా. రంజిత్

''నేను విదేశాలు వెళ్లినప్పుడు మీరు బాలీవుడ్డా అని అడుగుతుంటారు. నేను కోలీవుడ్, టాలీవుడ్ అని చెబుతుంటాను. అంటే... వారు ఎక్కువగా హిందీ చిత్రాలే చూసేవారు. కొన్నేళ్లుగా సౌత్ సినిమాలు చూస్తున్నారు. 'బాహుబలి', 'ఆర్‌ఆర్‌ఆర్', 'కేజీఎఫ్'..లాంటి సినిమాలు పెద్ద విజయాలు సాధించాయి. దక్షిణాది సినిమాలు ఇప్పుడు ఓ మార్క్‌ని క్రియేట్ చేస్తున్నాయి. రాజమౌళిగారు ఆస్కార్‌ను మనకు తీసుకొచ్చారు. ఆయనతో ఓ సినిమా చేయాలని ఉంది'' అన్నారు విక్రమ్. కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ నేపథ్యంలో రూపొందిన పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'తంగలాన్'. విక్రమ్ హీరోగా పా. రంజిత్ దర్శకత్వం వహించిన చిత్రం ఇది. పా. రంజిత్ నీలమ్ ప్రొడక్షన్స్‌తో కలిసి స్టూడియో గ్రీన్ పతాకంపై కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించారు. పార్వతీ, మాళవికా మోహనన్ హీరోయిన్లుగా నటించారు. ఈ సినిమా జనవరి 26న రిలీజ్ కానుంది. బుధవారం జరిగిన ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌లో విక్రమ్ మాట్లాడుతూ– ''తంగలాన్' ఎమోషనల్ అండ్ రా ఫిల్మ్. రెగ్యులర్ సాంగ్స్, ఫైట్స్.. ఇలాంటి తరహా సినీ గ్లామర్ 'తంగలాన్'లో లేదు. నా పాత్రకు డైలాగ్స్ అంతగా ఉండవు. లైవ్ సౌండింగ్‌లో సినిమా చేశాం. నాకు కొత్త ఎక్స్‌పీరియన్స్. మేకప్‌కు మూడు గంటలు పట్టేది. మీనింగ్‌ఫుల్ సినిమాలు చేస్తుంటారు పా. రంజిత్‌గారు. 'తంగలాన్'తో ప్రేక్షకులు ఓ కొత్త ప్రపంచంలోకి వెళ్తారు. ఇక నేను చేసిన '9 నెలలు' చిత్రానికి సురేందర్‌రెడ్డి, వినయ్‌లు అసిస్టెంట్ డైరెక్టర్స్‌గా చేశారు. ఇప్పుడు సురేందర్ రెడ్డి ఈ ఈవెంట్‌కు వచ్చారు. లైఫ్ సర్కిల్‌లా అనిపిస్తోంది'' అన్నారు. ''విక్రమ్‌గారితో నేను చేసిన తొలి చిత్రమిది. ఆయన అంకితభావం, టైమింగ్ సూపర్. 'తంగలాన్' సినిమా ప్రేక్షకులను మెప్పిస్తుంది'' అన్నారు పా. రంజిత్. ''విక్రమ్ ట్రిమెండస్ యాక్టర్. వరల్డ్ సినిమా లవర్స్‌కు 'తంగలాన్' ఓ గ్రేట్ ట్రీట్‌లా ఉంటుంది'' అన్నారు కేఈ జ్ఞానవేల్ రాజా. ''విక్రమ్ సార్ ఓ నటుడుగా తనను తానే మళ్లీ ఆవిష్కరించుకుంటుంటారు'' అని అతిథిగా పాల్గొన్న సత్యదేవ్ అన్నారు. దర్శకులు వేణు ఊడుగుల, కరుణకుమార్, దర్శక–నిర్మాత మధుర శ్రీధర్ అతిథులుగా పాల్గొన్నారు.

మా ఊరి పొలిమేర 2 నా సినిమా లాంటిది

- హీరో అడివి శేష్



'సత్యం' రాజేశ్, అడివి శేష్, కరుణకుమార్, అనిల్

''నా 'క్షణం' సినిమాకి పని చేసిన టీమ్ అంతా ''మా ఊరి పొలిమేర 2' టీమ్‌లో ఉన్నారు. ముఖ్యంగా దర్శకుడు అనిల్ నాకు మంచి స్నేహితుడు. 'మా ఊరి పొలిమేర' వంటి బ్లాక్‌బస్టర్ సినిమా తీసి, దానికి సీక్వెల్‌గా 'మా ఊరి పొలిమేర 2' తీయడం ఆనందంగా ఉంది. ఇది నా సొంత సినిమా లాంటిది. తప్పకుండా ఘనవిజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది'' అని హీరో అడివి శేష్ అన్నారు. 'సత్యం' రాజేశ్, కామాక్షీ భాస్కర్ల, బాలాదిత్య, రాకేందు మౌళి ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'మా ఊరి పొలిమేర-2'. అనిల్ విశ్వనాథ్ దర్శకత్వంలో గౌరీకృష్ణ నిర్మించిన ఈ చిత్రం రేపు విడుదలవుతోంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకకి ముఖ్య అతిథులుగా అడివి శేష్, నిర్మాత ఎస్‌కేఎన్ హాజరయ్యారు. ఎస్‌కేఎన్ మాట్లాడుతూ– ''ఇప్పుడు చిన్న సినిమా పెద్ద సినిమా అనే తేడా లేదు. ఏదైనా అదే కష్టమే. ప్రేక్షకులకు మంచి సినిమా కావాలి.. అంతే. 'మా ఊరి పొలిమేర-2'కి హిట్ కళ కనిపిస్తోంది'' అన్నారు. ''ఈ చిత్రం ఇంత గ్రాండ్‌గా విడుదల కావడానికి కారణం వంశీ నందిపాటిగారు. మా సినిమా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు 'సత్యం' రాజేశ్, గౌరీకృష్ణ, అనిల్ విశ్వనాథ్. ఈ వేడుకలో కామాక్షీ భాస్కర్ల, గాయకుడు పెంచల్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

ఓ తండ్రి తీర్పు



పునర్వి, వివా

వివా రెడ్డి, పునర్వి జంటగా ప్రతాప్ భీమవరపు దర్శకత్వం వహించిన చిత్రం 'ఓ తండ్రి తీర్పు'. శ్రీరామ్ దత్తి నిర్మించిన ఈ సినిమా రిలీజ్‌కి రెడీగా ఉంది. చిత్ర సమర్పకుడు ఆరిగపూడి విజయ కుమార్ బర్త్‌డే (మంగళవారం) సందర్భంగా ఈ సినిమా ట్రైలర్‌ని నిర్మాత కేఎల్ దామోదర్ ప్రసాద్ విడుదల చేశారు. ''సామాజిక ఇతివృత్తంతో తీసిన ఈ చిత్రం బాగా వచ్చింది'' అన్నారు ఆరిగపూడి విజయ్ కుమార్. ''నా తొలి ప్రయత్నంగా ఇంత మంచి సినిమా చేసినందుకు గర్వపడుతున్నాను'' అన్నారు శ్రీరామ్ దత్తి. ''ఏపీకేగారి ఆశీర్వాదం, శ్రీరామ్ దత్తిగారి సహకారంతో ఇంత మంచి సినిమా తీశా'' అన్నారు ప్రతాప్ భీమవరపు.

బొమ్మాళి డేట్ ఫిక్స్



శివానీ, రాహుల్ విజయ్, శ్రీకాంత్

శ్రీకాంత్ మేకా కీలక పాత్రలో నటించిన చిత్రం 'కోట బొమ్మాళి పీఎస్'. రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్ కీలక పాత్రల్లో, వరలక్ష్మీ శరత్‌కుమార్ ప్రత్యేక పాత్రలో నటించారు. తేజ మార్ని దర్శకత్వంలో 'బన్నీ' వాసు, విద్యా కొప్పినీడి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 24న రిలీజ్ కానుంది. ''ఓ పోలీస్ అధికారికి, రాజకీయ నాయకుడికి మధ్య జరిగే పవర్‌ఫుల్ పొలిటికల్ పవర్ గేమ్‌గా ఈ మూవీ ఉంటుంది. ఈ చిత్రం మోషన్ పోస్టర్‌కు మంచి స్పందన వచ్చింది. అలాగే 'లింగి లింగిడి..' పాట కొన్ని కోట్ల వ్యూస్ సాధించింది'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి కెమెరా: జగదీష్ చీకటి, సంగీతం: రంజిన్ రాజ్, మిధున్ ముకుందన్, సహనిర్మాతలు: భాను ప్రతాప్, రియాజ్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: అజయ్ గద్దె.

సాక్షి బిజినెస్
గురువారం
2-11-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	284	63,591
నిఫ్టీ ▽	90	18,989

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	12,939	△ 88
డోజోన్స్	33,199	△ 66
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,342	△ 21
డాక్స్	14,923	△ 113
షాంఘై	3,023	△ 4
నికాయ్	31,602	△ 743

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	61,012	▽ 358
బంగారం (99.5 స్వచ్ఛత)	60,768	▽ 356
వెండి (కేజీ)	70,984	▽ 118

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		82.52	84.19
£	బ్రిటన్ పౌండ్		99.59	102.89
€	యూరో		86.59	89.67
¥	జపాన్ ఎన్ (100)		54.31	55.98
AUS	ఆస్ట్రేలియా డాలర్		51.78	54.06
S$	సింగపూర్ డాలర్		59.92	61.84
SAR	సౌదీ రియాల్		21.25	22.88
UAE D	యూఏఈ దిర్హామ్		21.78	23.57
¥	చైనా యువాన్		10.26	12.33

జీఎస్‌టీ వసూళ్ల దూకుడు

- అక్టోబర్‌లో రూ.1.72 లక్షల కోట్లు
- 2022 ఇదే నెలతో పోల్చితే 13 శాతం అప్
- రెండో భారీ స్థాయి నిధులు



న్యూఢిల్లీ: వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు అక్టోబర్‌లో భారీగా రూ.1.72 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. గత ఏడాది అక్టోబర్‌లో పోల్చితే ఈ పరిమాణం 13 శాతం అధికంకాగా, 2017 జూలైలో ప్రారంభం తర్వాత ఇవి రెండవ భారీ స్థాయి వసూళ్లు. ఇంతక్రితం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24) ప్రారంభ నెల ఏప్రిల్‌లో రూ.1.87 లక్షల కోట్ల రికార్డు స్థాయి వసూళ్లు జరిగాయి. ఎకానమీ క్రియాశీలత, పన్నుల ఎగవేతలను అడ్డుకునేందుకు కేంద్రం చర్యలు, వసూళ్ల వ్యవస్థలో సామర్థ్యం పెంపు, పండుగల డిమాండ్ తాజా సానుకూల వసూళ్లకు కారణమని అధికార వర్గాలు పేర్కొన్నాయి. రానున్న నెలల్లో సైతం ఇదే ధోరణి కొనసాగుతుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశాయి.

విభాగాల వారీగా...

- మొత్తం వసూళ్లు రూ.1,72,003 కోట్లు.
- ఇందులో సీజీఎస్‌టీ వాటా రూ.30,062 కోట్లు.
- స్టేట్ జీఎస్‌టీ వసూళ్లు రూ.38,171 కోట్లు
- ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ రూ.91,315 కోట్లు (వస్తు దిగుమతులపై రూ.42,127 కోట్లతో సహా)
- సెస్ రూ.12,456 కోట్లు (వస్తు దిగుమతులపై రూ.1,294 కోట్ల వసూళ్లుసహా)

ఆర్థిక సంవత్సరంలో తీరిది...

ఆర్థిక సంవత్సరం తొలి నెల ఏప్రిల్లో చరిత్రాత్మక స్థాయిలో రూ.1.87 లక్షల కోట్ల అత్యధిక వసూళ్లు నమోదయ్యాయి. మే, జూన్ నెలల్లో వరుసగా రూ.1.57 లక్షల కోట్లు, రూ.1.61 లక్షల కోట్లు ఒనగూరాయి. జూలై వసూళ్లు రూ.1.60 లక్షల కోట్లు. ఆగస్టు వసూళ్లు రూ. 1.59 లక్షల కోట్లుకాగా, సెప్టెంబర్‌లో రూ. 1.63 లక్షల కోట్ల జీఎస్‌టీ రాబడి నమోదయ్యింది.

విదేశాల్లో నేరుగా లిస్టింగ్‌కు గ్రీన్ సిగ్నల్..

సెక్షన్ 5ను నోటిఫై చేసిన కేంద్రం



న్యూఢిల్లీ: భారతీయ కంపెనీలు విదేశీ ఎక్స్ఛేంజీల్లో నేరుగా లిస్టయ్యేందుకు మార్గం సుగమం చేస్తూ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకోసం కంపెనీల చట్టంలో సంబంధిత సెక్షన్ 5ని నోటిఫై చేసింది. దీని ప్రకారం నిర్దిష్ట తరగతులకు చెందిన పబ్లిక్ కంపెనీలు .. ఆమోదయోగ్యమైన కొన్ని విదేశీ స్టాక్ ఎక్స్ఛేంజీల్లో తమ షేర్లను లిస్ట్ చేసుకోవచ్చు. అయితే, ఈ సెక్షన్‌కు సంబంధించిన నిబంధనలను ఇంకా నోటిఫై చేయాల్సి ఉంది. విదేశాల్లో లిస్టింగ్ కోసం విదేశీ మారక నిర్వహణ చట్టం మొదలైన వాటిని కూడా సవరించాల్సి ఉంటుందని న్యాయ సేవల సంస్థ సిరిల్ అమర్‌చంద్ మంగళ్‌దాస్ పార్ట్‌నర్ యష్ అషర్ తెలిపారు. తాజా పరిణామంతో పెట్టుబడుల సమీకరణకు దేశీ కంపెనీలకు మరో మాధ్యమం అందుబాటులోకి వచ్చినట్లవుతుందని పేర్కొన్నారు. అయితే, వ్యాల్యుయేషన్లను అంతర్జాతీయ ఇన్వెస్టర్లు లెక్కగట్టే విధానం, విదేశాల్లో లిస్టింగ్ వల్ల వాణిజ్యపరంగా ఒనగూరే ప్రయోజనాలు మొదలైన వాటన్నింటినీ కంపెనీలు మదింపు చేసుకోవాల్సి ఉంటుందన్నారు.

ప్రస్తుతం దేశీ కంపెనీలు అమెరికన్ డిపాజిటరీ రిసీట్స్ (ఏడీఆర్), గ్లోబల్ డిపాజిటరీ రిసీట్స్ (జీడీఆర్) రూపంలో విదేశాల్లో లిస్టవుతున్నాయి. 2020 మే నెలలో కోవిడ్ ఉపశమన ప్యాకేజీలో భాగంగా భారతీయ సంస్థలు విదేశాల్లో నేరుగా లిస్టయ్యేందుకు అనుమతించే ప్రతిపాదనను కేంద్రం తెరపైకి తెచ్చింది. సదరు సంస్థలు ప్రపంచ మార్కెట్ల నుంచి పెట్టుబడులను సమీకరించుకునేందుకు తోడ్పాటు అందించేలా దీనిపై నిర్ణయం తీసుకోనున్నట్లు జూలై 28న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించిన సంగతి తెలిసిందే. పటిష్టమైన మనీలాండరింగ్ నిబంధనలు అమలయ్యే ఎన్‌వైఎస్ఈ, నాస్‌డాక్, ఎల్ఎస్ఈ మొదలైన పది ఎక్స్ఛేంజీలను పరిశీలించవచ్చని మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ప్రతిపాదించింది.

2,000 నోట్లు 97% వెనక్కి వచ్చేశాయ్

వ్యవస్థలో మిగిలింది రూ.10,000 కోట్లే: ఆర్‌బీఐ



ముంబై: చెలామణిలో ఉన్న రూ.2,000 నోట్లలో 97 శాతానికి పైగా తిరిగి బ్యాంకింగ్ వ్యవస్థకు చేరాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తెలిపింది. రూ.10,000 కోట్ల విలువైన నోట్లు మాత్రమే ప్రజల వద్ద ఉన్నాయని పేర్కొంది. ఈ ఏడాది మే 19న ఆర్‌బీఐ రూ.2,000 డినామినేషన్ నోట్లను చెలామణి నుంచి ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించింది. ''మే 19వ తేదీ బిజినెస్ ముగింపు సమయానికి వ్యవస్థలో రూ.3.56 లక్షల కోట్ల విలువైన రూ.2,000 బ్యాంక్ నోట్లు చెలామణిలో ఉన్నాయి. అక్టోబర్ 31వ తేదీ బిజినెస్ ముగింపు సమయానికి ఈ విలువ రూ.10,000 కోట్లకు తగ్గింది'' అని ఒక అధికారిక ప్రకటనలో వెల్లడించింది.

ప్రాంతీయ కార్యాలయాల్లో బారులు..

దేశంలోని 19 ఆర్‌బీఐ కార్యాలయాల్లో ప్రజలు రూ. 2,000 నోట్లను డిపాజిట్ చేయవచ్చు లేదా మార్చుకోవచ్చు. రాష్ట్ర రాజధానుల్లో ఆర్‌బీఐ కార్యాలయాలు ఉన్నందున, ఎవరైనా ఈ కార్యాలయాలకు వెళ్లలేని పక్షంలో పోస్టల్ శాఖ సేవలను పొందవచ్చని ఆర్‌బీఐ సూచించింది. కాగా, రూ.2,000 నోట్ల మార్పిడి లేదా డిపాజిట్ కోసం ఆర్‌బీఐ కార్యాలయాల వద్ద పని వేళల్లో పొడవైన క్యూలు కనిపిస్తున్నాయి. రూ.2 వేల నోట్ల డిపాజిట్ లేదా మార్పిడి సేవలను బ్యాంకు శాఖలు అక్టోబర్ 7 వరకు అందించాయి. అక్టోబర్ 8 నుంచి ఈ సేవలను 19 ఆర్‌బీఐ కార్యాలయాలకు మారాయి. ఆర్‌బీఐ కార్యాలయాల వద్ద వ్యక్తులు, కంపెనీలు తమ వద్ద ఉన్న రూ.2 వేల నోట్లను ఒకసారి రూ.20,000 వరకు మార్చుకోవచ్చు. డిపాజిట్‌కు మాత్రం ఎటువంటి పరిమితి లేదు. 2016 నవంబరులో రూ.500, రూ.1,000 నోట్ల రద్దు తర్వాత ఆర్‌బీఐ రూ.2,000 నోట్లతోపాటు కొత్త రూ.500 నోట్లను పరిచయం చేసింది.

టాటా స్టీల్ నష్టాలు రూ. 6,511 కోట్లు



న్యూఢిల్లీ: టాటా స్టీల్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో రూ. 6,511 కోట్ల నష్టం ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం క్యూ2లో కంపెనీ రూ. 1,297 కోట్ల లాభం నమోదు చేసింది. సమీక్షాకాలంలో ఆదాయం రూ. 60,207 కోట్ల నుంచి రూ. 55,910 కోట్లకు, ఖర్చులు రూ. 57,684 కోట్ల నుంచి రూ. 55,853 కోట్లకు తగ్గాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

02-11-2023	
విశాఖ	540-00
చిత్తూరు	573-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	536-00
విజయవాడ	536-00
రిటైల్ ధర (డజను)	72.00
01-11-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	524-00
వరంగల్	526-00
రిటైల్ ధర	5.85

వాహన అమ్మకాలు.. ఆల్‌టైం 'హై'!

కలిసొచ్చిన పండుగ డిమాండ్



ముంబై: పండుగ సీజన్ డిమాండ్ కలిసిరావడంతో దేశీయ ఆటో పరిశ్రమ అక్టోబర్‌లో రికార్డు స్థాయిలో అత్యధిక వాహనాలు అమ్ముడయ్యాయి. మొత్తం 3,91,472 యూనిట్ల విక్రయాలు జరిగాయి. గతేడాది ఇదే నెలలో అమ్ముడైన 3,36,679 వాహనాలతో పోలిస్తే ఇవి 16% అధికం. సెమీ కండక్టర్ల కొరత ప్రభావం తగ్గడం, దసరా సందర్భంగా నెల కొన్న కొనుగోళ్లు గత నెలలో రికార్డు అమ్మకాల వృద్ధికి తోడ్పడ్డాయని మారుతీ సుజుకీ ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శశాంక్ శ్రీవాస్తవ తెలిపారు. ఈ ఏడాది తొలి 3 నెలలు మినహా ప్రతి నెలా అమ్మకాల వృద్ధి జరగడం పరిశ్రమకు సానుకూల సంకేతమన్నారు. క్షేత్ర స్థాయిలో డీలర్ల వద్ద నిల్వల స్థాయి ఇంకా అధికంగా ఉంది. ఈ నవంబర్ తొలి 15 రోజుల్లో రిటైల్ అమ్మకాలకు అనుగుణంగా రానున్న రోజుల్లో హోల్‌సేల్ అమ్మకాలు జరగొచ్చన్నారు.

కంపెనీ	అక్టోబర్-2023	అక్టోబర్-2022	(%లో)
మారుతీ సుజుకీ	1,99,217	1,67,520	(+)19
హ్యుందాయ్ మోటార్స్	68,728	58,006	(+)18
టాటా మోటార్స్	82,954	76,537	(+)6
ఎండ్‌అండ్‌ఎం	80,679	61,114	(+)32
హోండా కార్స్	13,083	11,221	(+)17
ఎంజీ మోటార్స్	5,108	4366	(+)17
టయోటా కిర్లోస్కర్	21,879	13,143	(+)66
కియా మోటార్స్	24,351	23,323	(+)4
ద్విచక్ర వాహనాలు			
బజాజ్ ఆటో	4,71,188	3,95,238	(+)19
హీరో మోటోకార్ప్	5,74,930	4,54,582	(+)26
టీవీఎస్ మోటార్స్	4,34,714	3,60,288	(+)4
సుజుకీ మోటార్‌సైకిల్	1,00,507	88150	(+)14
రాయల్ ఎన్‌ఫీల్డ్	84,435	80,958	(+)6
వాణిజ్య వాహనాలు			
వోల్వో ఐషర్	7,486	6,038	(+)24
అశోక్ లేలాండ్	16,864	14,864	(+)13
ట్రాక్టర్లు			
ఎస్కార్ట్స్	12,642	13,843	(-)9
మహీంద్రా ట్రాక్టర్స్	50,460	51,994	(-)3

19 వేల దిగువకు నిఫ్టీ

- విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాల ప్రభావం
- ఫెడ్ పాలసీ వెల్లడికి ముందు అప్రమత్తత



ముంబై: విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలు కొనసాగడంతో దేశీయ స్టాక్ సూచీలు వరుసగా రెండోరోజూ నష్టాలు చవిచూశాయి. దేశీయ తయారీ రంగ పీఎంఐ, మౌలిక వృద్ధి గణాంకాలు నిరాశపరిచాయి. ఫెడ్ రిజర్వ్ పాలసీ వెల్లడికి ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించారు. ఫలితంగా మెటల్, పవర్, ఆటో, బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడంతో సెన్సెక్స్ 284 పాయింట్లు పతనమైన 63,591 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 90 పాయింట్లు క్షీణించి 18,989 వద్ద నిలిచింది. ఉదయం స్వల్ప నష్టాలతో మొదలైన సూచీలు బలహీన సెంటిమెంట్ ప్రభావంతో నష్టాల్లోకి జారుకున్నాయి. ఒక దశలో సెన్సెక్స్ 324 పాయింట్లు క్షీణించి 63,550 వద్ద, నిఫ్టీ 106 పాయింట్లు దిగివచ్చి 18974 వద్ద ఇంట్రాడే కనిష్టాలను నమోదు చేశాయి. మరోవైపు మీడియా, ఫార్మా, రియల్టీ, ఇంధన రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది.

అక్టోబర్‌లో తయారీ రంగం డీలా

- ఎస్అండ్‌పీ గ్లోబల్ ఇండియా పీఎంఐ 55.5కు డౌన్
- ఎనిమిది నెలల కనిష్ట స్థాయి



న్యూఢిల్లీ: భారత్ మొత్తం పారిశ్రామిక ఉత్పత్తిలో అత్యధిక వెయిటేజ్ కలిగిన తయారీ రంగం అక్టోబర్‌లో బలహీన ధోరణి నమోదుచేసుకుంది. ఎస్అండ్‌పీ గ్లోబల్ ఇండియా మ్యానుఫ్యాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) సెప్టెంబర్‌లో 57.5 వద్ద ఉంటే, తాజా సమీక్షా నెల అక్టోబర్లో 55.5కు జారింది. ఈ ఏడాది ఫిబ్రవరి తర్వాత ఈ స్థాయికి సూచీ పడిపోవడం ఇదే తొలిసారి. ఈ సూచీ 50 పైన ఉంటే వృద్ధిగా, ఆ దిగువకు పడిపోతే క్షీణతగా పరిగణిస్తారు. ఈ ప్రాతిపదికన సూచీ వరుసగా 28 నెలల నుంచి వృద్ధి బాటలోనే కొనసాగుతోంది.

భవిత

ఇకపై ఈ ప్రముఖ సాక్షి ఎడ్యుకేషన్ వాట్సప్ చానల్‌లో.. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాల సమాచారం, ప్రవేశ పరీక్షలు, ఎడ్యుకేషన్ న్యూస్, టిప్స్, ఇంటర్ సమాచారం.. ఇలా ఎన్నో.. తాజా అప్‌డేట్స్ కోసం ఈ చానల్ ఫాలో అవ్వండి. ఇంకెందుకు ఆలస్యం ఇప్పుడే.. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.. చానల్ ఫాలో అవ్వండి. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

పోటీ పరీక్షల ప్రత్యేకం: తెలంగాణ హిస్టరీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

సశస్త్ర సీమబల్‌లో 272 కానిస్టేబుల్ పోస్టులు

న్యూఢిల్లీలోని కేంద్రహోంమంత్రిత్వ శాఖకు చెందిన డైరెక్టరేట్ జనరల్, సశస్త్ర సీమ బల్(ఎస్ఎస్‌బీ).. 2023 సంవత్సరానికి సంబంధించి స్పోర్ట్స్ కోటాలో కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 272
» **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి. నిర్దేశించిన క్రీడా ఈవెంట్లలో పాల్గొని ఉండాలి.
» **క్రీడలు:** ఆర్చరీ, అథ్లెటిక్స్, బాక్సింగ్, బాడీ బిల్డింగ్, బాస్కెట్‌బాల్, సైక్లింగ్, ఈక్వెస్ట్రియన్, ఫెన్సింగ్, జిమ్నాస్టిక్స్, హాకీ, జూడో, కబడ్డీ, కరాటే, పెన్‌కాక్ సిలాట్, పవర్‌లిఫ్టింగ్, షూటింగ్ స్పోర్ట్స్, స్విమ్మింగ్, తైక్వాండో, వాలీబాల్, రెజ్లింగ్, ఉషూ, వాటర్ స్పోర్ట్స్, వెయిట్ లిఫ్టింగ్.
» **వయసు:** 18 నుంచి 23 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.21,700 నుంచి రూ.69,100.
» **ఎంపిక విధానం:** క్రీడా విజయాలు, రాతపరీక్ష, ఫీల్డ్ ట్రయల్, స్కిల్ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, డిటైల్డ్ మెడికల్ ఎగ్జామినేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు. ఎంపికైన అభ్యర్థులు దేశంలో లేదా భారత భూభాగం వెలుపల సేవలు అందించాల్సి ఉంటుంది.
» **దరఖాస్తులకు చివరితేది:** ఎంప్లాయ్‌మెంట్ న్యూస్‌లో ఈ ప్రకటన వెలువడిన తేదీ నుంచి 30 రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలి.
» **వెబ్‌సైట్:** www.ssbrectt.gov.in

ఎయిమ్స్ భోపాల్‌లో 357 నాన్ ఫ్యాకల్టీ పోస్టులు

భోపాల్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్).. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన నాన్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 357
» **పోస్టుల వివరాలు:** హాస్పిటల్ అటెండెంట్ గ్రేడ్ 3(నర్సింగ్ ఆర్డర్లీ)-106, ల్యాబ్ అటెండెంట్ గ్రేడ్3-41, మెడికల్ రికార్డ్ టెక్నీషియన్-38, ఫార్మసిస్ట్ గ్రేడ్2-27, వైర్‌మ్యాన్-20, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గ్రేడ్3-18, ప్లంబర్-15, ఆర్టిస్ట్(మోడలర్)-14, క్యాషియర్-13, ఆపరేటర్/లిఫ్ట్ ఆపరేటర్-12, జూనియర్ మెడికల్ రికార్డ్ ఆఫీసర్(రిసెప్షనిస్ట్)-05, మానిఫోల్డ్ టెక్నీషియన్(గ్యాస్ స్టీవార్ట్)/గ్యాస్ కీపర్-06, ఎలక్ట్రీషియన్-06, మెకానిక్(ఏసీ)-06, డార్క్‌రూమ్ అసిస్టెంట్ గ్రేడ్2-05, అసిస్టెంట్ లాండ్రీ సూపర్‌వైజర్-04, డిస్పెన్సింగ్ అటెండెంట్-04, మెకానిక్(ఇ-ఎం)-04, లైబ్రరీ అటెండెంట్ గ్రేడ్2-03, గ్యాస్/పంప్ మెకానిక్-02, లైన్‌మ్యాన్ (ఎలక్ట్రికల్)-02, టైలర్ గ్రేడ్3-02, ల్యాబ్ టెక్నీషియన్-01, ఫార్మా కెమిస్ట్/కెమికల్ ఎగ్జామినర్-01, కోడింగ్ క్లర్క్-01, మానిఫోల్డ్ రూమ్ అటెండెంట్-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, 10+2, డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులవ్వాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, స్కిల్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.11.2023.
» **వెబ్‌సైట్:** www.aiimsbhopal.edu.in

కాళోజీ హెల్త్ యూనివర్సిటీలో బీపీటీ, బీఎస్సీ అనుబంధ హెల్త్ సైన్సెస్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు

వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్.. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి బీపీటీ, బీఎస్సీ అనుబంధ హెల్త్ సైన్సెస్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

కోర్సుల వివరాలు

» బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ కోర్సు(బీపీటీ).
» బీఎస్సీ(మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ).
» **బీఎస్సీ(అలైడ్ హెల్త్ సైన్సెస్) కోర్సులు:** బీఎస్సీ అనెస్తీషియా టెక్నాలజీ, బీఎస్సీ ఆపరేషన్ థియేటర్ టెక్నాలజీ, బీఎస్సీ కార్డియాక్ అండ్ కార్డియో వాస్కులర్ టెక్నాలజీ, బీఎస్సీ రీనల్ డయాలసిస్ టెక్నాలజీ, బీఎస్సీ ఆప్టోమెట్రీ, బీఎస్సీ రెస్పిరేటరీ థెరపీ టెక్నాలజీ, బీఎస్సీ న్యూరో సైన్స్ టెక్నాలజీ, బీఎస్సీ క్రిటికల్ కేర్ టెక్నాలజీ, బీఎస్సీ రేడియాలజీ అండ్ ఇమేజింగ్ టెక్నాలజీ, బీఎస్సీ ఆడియాలజీ అండ్ స్పీచ్ థెరపీ టెక్నాలజీ, బీఎస్సీ మెడికల్ రికార్డ్స్ సైన్సెస్, బీఎస్సీ న్యూక్లియర్ మెడిసిన్, బీఎస్సీ రేడియో థెరపీ టెక్నాలజీ.
» **కోర్సు వ్యవధి:** బీఎస్సీ కోర్సుకు నాలుగేళ్లు, ఏడాది ఇంటర్న్‌షిప్; బీపీటీకి నాలుగేళ్లు, ఆరు నెలల ఇంటర్న్‌షిప్.
» **అర్హత:** ఇంటర్మీడియట్(ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ) లేదా ఇంటర్ ఒకేషనల్ బ్రిడ్జ్ కోర్సు/సార్వత్రిక విద్యలో ఇంటర్(ఫిజికల్ సైన్సెస్/బయోలాజికల్ సైన్సెస్) ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** అభ్యర్థులు 31.12.2023 నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి.
» **ఎంపిక విధానం:** ఇంటర్ మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 02.11.2023.
» **వెబ్‌సైట్:** www.knruhs.telangana.gov.in

ఎయిర్‌పోర్ట్స్ అథారిటీలో కొలువుల పిలుపు

» 496 జూనియర్ ఎగ్జిక్యూటివ్ పోస్ట్‌ల భర్తీకి ఏఏఐ నోటిఫికేషన్
» రాత పరీక్ష, సైకలాజికల్ టెస్టుల్లో ప్రతిభ ఆధారంగా ఎంపిక
» ఎంపికైతే రూ.13 లక్షల వరకు వార్షిక వేతనం
» బీఎస్సీ, బీటెక్ అర్హతతో పోటీ పడే అవకాశం



బీఎస్సీ, బీటెక్ అభ్యర్థులకు చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది! ప్రభుత్వ రంగ సంస్థ ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ).. 496 జూనియర్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది! రాత పరీక్ష, సైకలాజికల్ టెస్టుల్లో ప్రతిభ ఆధారంగా ఎంపిక జరుగుతుంది. ఎంపికైతే నెలకు రూ.లక్షకు పైగా వేతనం అందుకునే అవకాశముంది. ఈ నేపథ్యంలో.. ఏఏఐ భర్తీ చేసే పోస్టులు, అర్హతలు, ఎంపిక విధానం తదితర వివరాలు..

ఎయిర్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా.. సంక్షిప్తంగా ఏఏఐ. కేటగిరి-1 ప్రభుత్వ రంగ సంస్థగా గుర్తింపు పొందిన ఏఏఐ.. పౌర విమానయాన రంగంలో ఎంతో ప్రాధాన్యం సంతరించుకుంటోంది. గ్రౌండ్, ఎయిర్ ట్రాఫిక్‌లకు సంబంధించి మౌలిక సదుపాయాల రూపకల్పన, నిర్వహణలో కీలకంగా నిలుస్తోంది. నిపుణులైన మానవ వనరుల నియామకాలను చేపడుతోంది. ఆ క్రమంలోనే తాజాగా ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ విభాగంలో జూనియర్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభించింది.

మొత్తం 496 పోస్ట్‌లు

ఏఏఐ.. తాజా నోటిఫికేషన్ ద్వారా మొత్తం 496 జూనియర్ ఎగ్జిక్యూటివ్ (ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్) పోస్ట్‌ల భర్తీ చేపట్టనుంది. ఇందులో ఎస్సీలకు 75, ఎస్టీలకు 33, ఓబీసీ (నాన్-క్రీమీ లేయర్) వర్గాలకు 140, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు 49 పోస్ట్‌లను రిజర్వ్ చేసింది. ఓపెన్ కేటగిరీలో 139 పోస్ట్‌లు అందుబాటులో ఉన్నాయి.

విద్యార్హతలు

నవంబర్ 30, 2023 నాటికి బీఎస్సీ(మ్యాథమెటిక్స్, ఫిజిక్స్ సబ్జెక్ట్‌లతో) లేదా బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థులకు ఇంగ్లిష్‌లో రిటెన్, స్పోకెన్ నైపుణ్యం తప్పనిసరి. 10వ తరగతి లేదా 12 తరగతిలో ఇంగ్లిష్‌ను ఒక సబ్జెక్ట్‌గా చదివుండాలి.

వయసు

నవంబర్ 30, 2023 నాటికి గరిష్ట వయోపరిమితి 27 ఏళ్లు ఉండాలి (ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు, ఓబీసీ వర్గాల వారికి మూడేళ్లు చొప్పున గరిష్ట వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది).

ఎంపిక ఇలా

జూనియర్ ఎగ్జిక్యూటివ్ పోస్ట్‌ల భర్తీకి రాత పరీక్ష, మానసిక ద్రుఢత్వ పరీక్షలను నిర్వహిస్తారు. వీటిలో చూపిన ప్రతిభ ఆధారంగా తుది విజేతలను ఖరారు చేస్తారు.

150 మార్కులకు రాత పరీక్ష

ఎంపిక ప్రక్రియలో తొలి దశ రాత పరీక్షను 150 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో నాలుగు విభాగాలు ఉంటాయి. ఇంగ్లిష్ కాంప్రహెన్షన్ 35 ప్రశ్నలు-35 మార్కులు, జనరల్ ఇంటెలిజెన్స్/రీజనింగ్ 40 ప్రశ్నలు-40 మార్కులు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 40 ప్రశ్నలు-40 మార్కులు, జనరల్ అవేర్‌నెస్ 35 ప్రశ్నలు-35 మార్కులకు పరీక్ష జరుగుతుంది. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ విధానంలోనే ఉంటాయి. పరీక్షను ఆన్‌లైన్‌లో విధానంలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌గా నిర్వహిస్తారు. పరీక్షకు కేటాయించిన సమయం రెండు గంటలు.

తదుపరి దశలో పలు టెస్టులు

రాత పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా నిర్దేశిత కటాఫ్‌లను పరిగణనలోకి తీసుకుని మెరిట్ జాబితా రూపొందిస్తారు. ఈ జాబితాలో చోటు సంపాదించిన వారికి తదుపరి దశలో అప్లికేషన్ వెరిఫికేషన్, వాయిస్ టెస్ట్, సైకోయాక్టివ్ సబ్‌స్టాన్సెస్ టెస్ట్, సైకలాజికల్ అసెస్‌మెంట్ టెస్ట్, మెడికల్ టెస్ట్‌లు నిర్వహిస్తారు. వీటిలో సైకో యాక్టివ్ సబ్‌స్టాన్సెస్ టెస్ట్ అభ్యర్థుల ఆరోగ్య పరమైన అంశాలకు సంబంధించింది. కాగా.. వాయిస్ టెస్ట్, సైకలాజికల్ అసెస్‌మెంట్ టెస్ట్‌లు అభ్యర్థుల నైపుణ్యాన్ని పరీక్షించే విధంగా ఉంటాయి.

వాయిస్ టెస్ట్

వాయిస్ టెస్ట్‌లో భాగంగా అభ్యర్థుల ఇంగ్లిష్ భాష నైపుణ్యాలను పరిశీలిస్తారు. నాలుగు లేదా అయిదుగురు అభ్యర్థులను ఒక్కో బృందంగా ఏర్పాటు చేస్తారు. వారికి ఏదైనా ఒక ప్యాసేజ్ ఇచ్చి చదవమని అడుగుతారు. ప్యాసేజ్‌లోని వాక్యాలు.. విమాన పైలట్లు,ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ విభాగాల మధ్య జరిగే సంభాషణలతో కూడినవిగా ఉంటాయి. ఆయా పదాలు,వాక్యాల ఉచ్చారణ సరిగా ఉందా? లేదా? అనే అంశాన్ని ప్రధానంగా పరీక్షిస్తారు.

సైకలాజికల్ అసెస్‌మెంట్

ఎంపిక ప్రక్రియలో వాయిస్ టెస్ట్ తర్వాత దశలో నిర్వహించే పరీక్ష.. సైకలాజికల్ అసెస్‌మెంట్ టెస్ట్. ఎయిర్ పోర్ట్స్ విభాగంలో విధులు నిర్వర్తించడానికి అవసరమైన మానసిక ద్రుఢత్వాన్ని పరిశీలించేలా అభ్యర్థులకు సిట్యుయేషన్ టెస్ట్, పర్సెప్షన్ టెస్ట్‌లను నిర్వహిస్తారు.

రూ.13 లక్షలు వేతనం

అన్ని దశల్లోనూ ప్రతిభ చూపి తుది విజేతల జాబితాలో నిలిచిన వారికి.. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ విభాగంలో జూనియర్ ఎగ్జిక్యూటివ్ గ్రూప్-బి హోదాలో కొలువు ఖరారు చేస్తారు. ఈ హోదాలో ఈ-1 లెవల్‌లో రూ.40,000-రూ.1,40,000 మధ్యలో వేతన శ్రేణి ఉంటుంది. స్థూలంగా ఏడాదికి దాదాపు రూ.13 లక్షల వార్షిక వేతనం అందుకునే అవకాశముంది.

ట్రైనింగ్, సర్వీస్ బాండ్

ఏఏఐ జేఈగా ఎంపికైన వారికి నిర్దిష్ట వ్యవధిలో శిక్షణ ఇస్తారు. సర్వీస్ బాండ్ కూడా ఇవ్వాల్సి ఉంటుంది. ట్రైనింగ్ వ్యవధి తర్వాత మూడేళ్ల పాటు ఎయిర్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాలోనే విధులు నిర్వర్తిస్తామని హామీ ఇస్తూ.. రూ.ఏడు లక్షల సర్వీస్ అగ్రిమెంట్ ఇవ్వడం తప్పనిసరి.

జీఎం స్థాయికి చేరుకోవచ్చు

ఎయిర్ పోర్ట్స్ అథారిటీలో ఎయిర్ ట్రాఫిక్ విభాగంలో జూనియర్ ఎగ్జిక్యూటివ్‌గా నియమితులైన వారు భవిష్యత్తులో జనరల్ మేనేజర్ స్థాయికి చేరుకునే అవకాశం ఉంది. సర్వీసు నిబంధనలను అనుసరించి.. అసిస్టెంట్ మేనేజర్, మేనేజర్, సీనియర్ మేనేజర్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్, డిప్యూటీ జనరల్ మేనేజర్, జాయింట్ జనరల్ మేనేజర్, జనరల్ మేనేజర్ హోదాలు లభిస్తాయి. పనితీరుతో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ స్థాయికి కూడా చేరే అవకాశం ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** నవంబర్ 30, 2023
- **ఆన్‌లైన్ పరీక్ష తేదీ:** 2024 జనవరిలో నిర్వహించే అవకాశం
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.aai.aero

రాత పరీక్షలో రాణించేలా

ఇంగ్లిష్ కాంప్రహెన్షన్

అభ్యర్థులు బేసిక్ గ్రామర్‌పై అవగాహన పెంచుకోవాలి. దీంతోపాటు ఫిల్ ఇన్ ది బ్లాంక్స్, రీడింగ్ కాంప్రహెన్షన్, యాంటానిమ్స్, సినానిమ్స్, స్పాటింగ్ ద ఎర్రర్స్‌పై పట్టు సాధించాలి. అదేవిధంగా స్పెల్లింగ్స్, కరెక్షన్ ఆఫ్ సెంటెన్సెస్, టెన్సెస్, ప్రిపోజిషన్స్, యాక్టివ్ అండ్ ప్యాసివ్ వాయిస్, వొకాబ్యులరీ, రీ రైటింగ్ ద సెంటెన్స్, సెంటెన్స్ రీ-అరేంజ్‌మెంట్, ఆల్ఫాబెటికల్ ఆర్డర్, ప్రెసిస్ రైటింగ్, బేసిక్ ఇంగ్లిష్ గ్రామర్‌పై అవగాహన ఏర్పరచుకోవాలి. టెన్సెస్, సెంటెన్స్ ఫార్మేషన్, యాక్టివ్-ప్యాసివ్ వాయిస్, కాంప్లెక్స్ సెంటెన్సెస్ వంటి ముఖ్యాంశాలపై ఎక్కువ దృష్టి సారించాలి. రీడింగ్ కాంప్రహెన్షన్, వొకాబ్యులరీల్లోనూ పూర్తి స్థాయిలో నైపుణ్యం పొందాలి.

జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్

విశ్లేషణ నైపుణ్యాలను పరీక్షించే ఈ సబ్జెక్ట్‌లో రాణించాలంటే..కోడింగ్, డీ-కోడింగ్, అనలిటికల్ పజిల్స్, క్రిటికల్ రీజనింగ్ బాగా ప్రాక్టీస్ చేయాలి. ఇంగ్లిష్ అక్షర క్రమాన్ని ముందు నుంచి వెనుకకు, వెనుక నుంచి ముందుకు ప్రాక్టీస్ చేయాలి. దీంతోపాటు ఏ అక్షరం ఎన్నో స్థానంలో ఉందో సులువుగా గుర్తించాలి. అదే విధంగా అనలిటికల్ రీజనింగ్, సిలాజిజమ్స్, ఇనీక్వాలిటీస్, ఇన్‌పుట్ అవుట్‌పుట్, డేటా సఫిషియెన్సీ విభాగాలపై పట్టు సాధించాలి.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

హైస్కూల్ స్థాయి మ్యాథమెటిక్స్‌లోని అంశాలపై పట్టు సాధించాలి. అర్థమెటిక్‌కు సంబంధించి పర్సంటేజ్, యావరేజెస్, రేషియో-ప్రపోర్షన్, ప్రాఫిట్-లాస్, సింపుల్-కాంపౌండ్ ఇంట్రెస్ట్, టైమ్-వర్క్, టైమ్-డిస్టెన్స్, పర్ముటేషన్స్-కాంబినేషన్స్, ప్రాబబిలిటీ, మిక్చర్ అండ్ అలిగేషన్స్, పార్టనర్ షిప్‌పై దృష్టిపెట్టాలి. భాగహారాలు, కూడికలు, తీసివేతలు వంటి ప్రాథమిక అంశాలను నోటితో గణించే విధంగా ప్రాక్టీస్ చేయాలి. సంఖ్యల వర్గాలు, ఘనాలు గుర్తించుకోవాలి.

జనరల్ అవేర్‌నెస్

జనరల్ అవేర్‌నెస్/జనరల్ స్టడీస్‌లో స్కోర్ కోసం హిస్టరీ, జాగ్రఫీ, ఎకానమీ, సైన్స్ అండ్ టెక్నాలజీ, కరెంట్ అఫైర్స్ అంశాలపై పట్టు సాధించాలి.



మధుమేహానికి నోటి ద్వారా ఇన్సులిన్

- ఇంజెక్షన్ బదులు స్ప్రే ద్వారా తీసుకునే వెసులుబాటు
- 2025–26 నాటికి మార్కెట్లోకి..
- నీడిల్‌ఫ్రీ టెక్నాలజీస్ సంస్థ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: మధుమేహంతో బాధపడుతున్న వారు తరచూ ఇన్సులిన్ ఇంజెక్షన్‌ను తీసుకోవాల్సి ఉంటుంది. ఇది ఇబ్బందికరం. ఈ బాధకు చెక్ పెడుతూ నోటి ద్వారా ఇన్సులిన్ తీసుకోగలిగే కొత్త విధానం అందుబాటులోకి రానుంది. దీనికి సంబంధించి హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో నీడిల్‌ఫ్రీ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్లు డాక్టర్ కె.కోటేశ్వర్‌రావు, సీఏ విశ్వనాథ్ తోషినివాల్, డాక్టర్ జితేంద్ర అంబుల్జ్ వివరాలు వెల్లడించారు. ప్రపంచంలో ఓరల్ ఇన్సులిన్ మందుపై అనేక పరిశోధనలు జరిగినా ఎక్కడా సఫలం కాలేదని, తాము మాత్రం సఫలం కాగలిగామని తెలిపారు. 2025–26 నాటికి ఓరల్ ఇన్సులిన్ మందును మార్కెట్లోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్టు చెప్పారు. త్వరలోనే మనుషులపై క్లినికల్ ట్రయల్స్ ప్రారంభిస్తున్నామన్నారు. ఈ ఔషధానికి పేటెంట్ హక్కులు తీసుకున్నామని, ఇండియాలో అనుమతి కోసం దరఖాస్తు చేశామని వివరించారు. ట్రాన్స్‌జీన్ బయోటెక్ లిమిటెడ్‌కు అనుబంధంగా ఏర్పడిన నీడిల్‌ఫ్రీ టెక్నాలజీస్ సంస్థ మధుమేహం, కేన్సర్, బోలు ఎముకల వ్యాధి, అల్జీమర్స్ వంటి వివిధ రకాల వైద్య చికిత్సలకు అందించే ఇంజెక్షన్లను ముక్కు లేదా నోటి నుంచి తీసుకోగల స్ప్రేల రూపంలో అభివృద్ధి చేస్తోందని తెలిపారు.

‘రెరా’ చట్టానికి లోబడే నిర్మాణాలుండాలి

- ఇష్టానుసారం రియల్ ప్రాజెక్టుల ప్లాన్ల మార్పు కుదరదు
- నిర్మాణ లోపాలకు బిల్డర్లదే బాధ్యత
- ‘రెరా’చైర్మన్ సత్యనారాయణ

సాక్షి, హైదరాబాద్: స్థిరాస్తి వ్యాపారులు ‘రెరా’చట్టానికి లోబడే నిర్మాణాలు జరపాలని, వినియోగదారులతో పారదర్శకంగా వ్యవహరించాలని రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) చైర్మన్ ఎన్.సత్యనారాయణ స్పష్టం చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఏజెంట్లు అందరూ విధిగా ‘రెరా’లో రిజిష్టర్ కావాలన్నారు. బుధవారం ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రియల్ ఎస్టేట్, హైదరాబాద్ రియల్టర్స్ అసోసియేషన్ ఫిలింనగర్‌లో ఏర్పాటు చేసిన ‘రెరా కాంక్లేవ్’కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సత్యనారాయణ మాట్లాడుతూ, రెరా’లో రిజిష్టర్ చేయించి తమ ఇష్టానుసారంగా నిర్మాణాలు జరిపి చేతులు దులుపుకుంటే ఎంతమాత్రం కుదరదని హెచ్చరించారు. నిర్మాణ లోపాలుంటే బిల్డరే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. వినియోగదారుల అనుమతి లేనిదే ప్రాజెక్టు ప్లానును తమ ఇష్టానుసారం మార్చడానికి వీలు లేదని స్పష్టం చేశారు. రెరాలో రిజిష్టర్ కాకుండా ప్రకటనలు జారీచేస్తూ వ్యాపార కార్యకలాపాలు జరిపే ఏజెంట్లు, బిల్డర్లు చట్ట ప్రకారం శిక్షార్హులని హెచ్చరించారు. ‘రెరా’ చట్టంపై హైదరాబాద్ రియల్టర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన ‘రెరా కియాస్క్’ను చైర్మన్ పరిశీలించి నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో నారెడ్కో నేషనల్ ప్రెసిడెంట్ జి.హరిబాబు, తెలంగాణ నారెడ్కో ప్రెసిడెంట్ సునీల్ చంద్రారెడ్డి, సెక్రటరీ విజయసాయి తదితరులు పాల్గొన్నారు.







Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.